భారతి

మాస పత్రిక

*

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

*

ఆగస్టు 1977

సంపుటము : 54 సంచిక : 8

విడిపత్రిక వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

ఆగస్టు 1977

"చైత్రయాత్ర"

శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ

నేనూ చిలకలూకలిసి ఆగ్రాకు తీర్థయాత్ర వెళ్ళినప్పుడు ఆంధ్రదేశంలో వసంతం అడుగు పెట్టింది; అక్కడి పూలు నన్ను జ్ఞాపకం చేసుకుంటాయి నా స్మృతుల అడుగులమీద వాటి పరిమళాలు కుమ్మరిస్తాయి —

గ్రీష్మంవచ్చి నాలో పూల దీపాల్ని ఆర్పివేసినా మళ్ళీ వసంత పుష్పాలు వచ్చి ఎప్పుడూ నాలోపలి కాలాన్ని నిద్ర లేపుతుంటాయి. అంతవరకూ నీళ్ళలో మునిగి తామరపువ్వు వెనక దాక్కుని ఉంటా

నేను ఋషినికాదు కోకిల గొంతు వినబడితే ఉలిక్కిపడ్డానికి — మా ఊరి మట్టితో చేసిన కండలు నా దేహానివి — వసంతంలో నా భూమి పువ్వుల్లో అంతర్ధానమైపోతుంది అప్పుడు, నాకు ఆకాశమే మిగులుతుంది; నా ఆకాశం డేగల ధార్ష్ట్యం కాదు అది నా ఊహల ఊదాలోయ

పచ్చగా పంచమంలో పాడే మామిడిచెట్టు నడవడం ఒక్కటి తప్ప చైత్రంకోసం ఏమైనా చేస్తానంటుంది; వసంతంలో చెట్లు ఒక దానితో ఒకటి ఆడుకుంటూ ఎగరగొట్టిన తెల్లటి ఉల్లుబంతి ఆకాశంలో చంద్రుడు —

వసంతం అంటే కోకిలల పాఠశాల పక్షుల సంగీత అకాడమీ — ఒక్కోపక్షి వెయ్యేసి పాటలుగా రూపాంతరాలు పొందే ఋతువు

వసంతాన్నిగురించి నాకెవడు బోధించ గలడు! ఆకురాలే ఋతువు రహస్యాలుంటే ఉపదేశించు అధ్యయనం చేస్తా

ఆకాశంలో నక్షత్రాలుకూడా రద్దయిపోతాయి ఉషస్సుదాడికి; ఒకప్పుడు గుండెలో ప్రణయ జ్వాలలు రేపిన చంద్రుడే ఇప్పుడు ఒక గుడ్డిలాంతరులా పడిఉన్నాడు — ఎన్నిసార్లు గుండె పగలాలో ఒక్కసారి జీవితం తన దర్శనం ఇవ్వడానికి —

బాబూ ! పవిత్రమైన వేణువువైపే
ప్రవహిస్తోంది నా ఆత్మ
అందుకే ఆగ్రాకు నా తీర్థయాత్ర !

ఢిల్లీ పౌరులు

శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ

1

మిల్లులో ఉద్యోగం
గల్లీలో నివాసం
ఢిల్లీ అతని పుట్టిల్లు.

అతని నేస్తం ఒక పాత సైకిలు
అదే అతనికి పదివేలు
ప్రతిరోజూ అదే అతని నమ్మిన వాహనం
ఒక్కొక్కరోజు ఇంటిల్లిపాదికీ అదే
పుష్పక విమానం.

అతని మరో నేస్తం ఒక మంచం
అదే అతని కుటుంబానికి డైనింగు
టేబిల్
పేకాటకు సైతం పనికివస్తుందది
ఇంకా చెప్పాలంటే
బహుళ ప్రయోజనదాయి ఆ చార్పాయి.

అతని ఆదాయం తక్కువే
అవసరాలూ తక్కువే
అయినా వినిపిస్తుందతనియింట్లో
ఆకాశవాణి కరకర సంగీతం.
అత డొక ఢిల్లీ పౌరుడు
అత డతి సామాన్యుడు !

2

ఉద్యోగం ఆఫీసులో
ఉనికి ఒక గదియింట్లో
అతని స్వరాష్ట్రం పంజాబు.
అతని దుస్తులు నలగవు
అతని తలపులు వాడవు
అతడు నిత్య సంతోషి.

ఉండేది ఒక గది అయినా
అందులోనే అందాలు దిద్దుకుంటాయి
సోఫాసెట్టు, డైనింగు టేబిల్,
కుట్టుమెషీను మొదలైనవి.
అతని పడతి పాకశాస్త్ర ప్రవీణ
అల్లికలో కుట్టుపనిలో ధురీణ
బయటికి వస్తే కడుతుంది చెమ్కీల చీర
లోపల మాత్రం పాత సల్వార్.
అత డొక ఢిల్లీ పౌరుడు
అతడు సామాన్యుడు !

3

అత డొక కాందిశీకుడు
అతనికెంతో ఆస్తి ఉండేదట !
అందరికీ తెలిసిన విషయం కాదిది.
అతని కిప్పుడు రెండు భవనాలు
అవి బంగారు బాతులు
ఒక పెద్ద బట్టల దుకాణం—
అందరికీ తెలిసిన విషయాలివి.
ఇంట్లో టి. వి. యిత్యాదులు
బయట చూడ చక్కని కారు
సంఘంలో జేనెడు మందాన పేరు
అతడూ ఢిల్లీ పౌరుడే
అతడు అసామాన్యుడు !

4

అత డొక ఆఫీసరు
స్వస్థలం మలబారు
నిజమే చెప్పవలసి వస్తే
ఇండియా అతని ఊరు.

మాతృభాష తమిళం
మాట్లాడే భాష సంకరం
కావలసిందతనికి భావప్రకటన
ఆదే అతనికి తెలిసిన భాషాసారం.
ఆడంబరానికి చోటులే దతని యింట్లో
అంకెలకు మాత్రం చోటుంది
అక్కౌంట్లో

సినిమాలకు పోడు
మరెక్కడికీ రమ్మన్నా రాడు
సంగీత సభలకు పోకుండా వుండలేడు.

ఆఫీసులో చండశాసనుడు
ఇంట్లో భార్యా విధేయుడు
పౌరాణికులకు ప్రాణసఖుడు
పురప్రముఖులకు స్మితవదనుడు.
అతడూ ఢిల్లీ పౌరుడే
అతడు సామాన్యుడు కాదు !

5

అతడు గడించిన డిగ్రీలు బోలెడు
వందలు దాటి వేలు దాటని ఉద్యోగస్థుడు
పశ్చిమ గోదావరి ప్రాంతీయుడు
అక్షరాలా ఆంధ్రుడు.

అయిదు సభ్యుల అతని సంసారనౌక
రెండు గదుల జలధిలో పయనిస్తుంది
సాఫీగా
నౌక అప్పుడప్పుడూ ఒరిగినప్పుడు
గ్రామంలోని తండ్రి పైకి లేపుతూ
వుంటాడు.

అతడు ఎక్కడుంటే అక్కడ
ఆవిర్భవిస్తుంది ఒక సాహితీసంస్థ
అతడే దానికి కార్యదర్శిగా కొనసాగితే
అది పెరిగి పెద్దదవుతుందని అతని
భావన.

ఆదర్శాలు ఎక్కువ

(మిగతా ప్రక్కపేజీ క్రిందిభాగంలో)

సన్మానం

డాక్టర్ ముదిగొండ శివప్రసాద్

కవి సింహునికి సన్మానం—
సన్మానం మనిషికి కాదు జంతువుకు.
కవిచకోరునికి సత్కారం—
సత్కారం మనిషికి కాదు పక్షికి.
పద్మశేఖరునికి ఊరేగింపు—
ఊరేగింపు మనిషికి కాదు పూలకు.
కవీంద్రునికి గౌరవలాంఛనాలు—
లాంఛనాలు మనిషికి కాదు పరలోకంలోని
వేయికళ్ల అహల్యాజారునికి.

ఊరేగింపులే గౌరవమైతే
శవాలకూ ఊరేగింపులు సాగుతాయి
జనం మూగడమే ఘనతైతే
చీము చుట్టూ ఈగలు—చెరుకుపిప్పిచుట్టూ చీమలు.

యుగ యుగాల జాతీయ జీవన స్రోతస్వినిలో
నేనూ ఒక జల బిందువునై
లీనం కావడమే నాకు సన్మానం
తరతరాల సాంస్కృతిక జ్యోతిస్సులో
మహస్సులో
ఒక కాంతి కిరణం కావడమే
నాకు సత్కారం.

ఈ దేశపు ఆకాశంలో
నేనూ ఒక తారనే
ఈ జాతీయ ప్రభాతారుణ శుభోదయంలో
నేనూ ఒక మధుర మలయ పవనాన్నే!

ఈ మృత్తికలో
నేనూ ఒక రజాన్ని
ఈ భిత్తికపై
నేనూ ఒక వర్ణాన్ని
ఈ విపంచిలో
నేనూ ఒక స్వరాన్ని
ఈ నృత్యంలో
నేనూ ఒక పదాన్ని
ఈ గీతంలో
నేనూ ఒక అక్షరాన్ని
ఈ జాతీయ మహా నిర్మాణ సౌధంలో
శిల్పంలో
నేనూ ఒక పునాది రాయిని.

బిడ్డకు పాలిచ్చే తల్లికి
పబ్లిసిటీ వాంఛ లేదు
జాతి కై కలం పట్టిన కవికీ
హలం పట్టిన రైతుకూ
పతాక శీర్షికలు అక్కరలేదు
నన్ను జంతువులతో
పక్షులతో
చెట్లతో
దయ్యాలతో పోల్చవద్దు.

దేవుడిచ్చిన నరజన్మం నాకు సన్మానం
తల్లిదండ్రులు పెట్టిన పేరే నాకు
పతాకం!!

ఢిల్లీ పౌరులు

(ముందుపేజీ తరువాయి)

నలుగురూ కలిసిరాకపోవడం వల్ల
అవి నలిగిపోతున్నాయని
అతని ఆవేదన.
అతడూ ఢిల్లీ పౌరుడే

అసామాన్యుడు కావాలనుకునే
సామాన్యుడు.

6

ఢిల్లీపౌరులు ఒకరా యిద్దరా
ఎంద రెందరో ఉన్నారు—
విభిన్న భాషలవారు
విభిన్న మతాలవారు.
ఎందరుంటే మాత్రమేం
'ఎవరికి వారే యమునా తీరే'

"అడుక్కోకు"

శ్రీ చాగంటి రామారావు

దేహి అనకు
    ముష్టి అసలే ఎత్తకు
అడుక్కోకు, నీ చేయి
ఎప్పుడూ క్రిందపెట్టకు.
ఆత్మని, దేహాన్ని
మనసుని, గుండెని
మర్చిపోతేమాత్రం అడుక్కో !
వాల్మీకి రామాయణంకోసం
ఎవర్నీ దేహీ అని అడగలేదు
కాళిదాసు మేఘాన్ని కథకోసం దేవురించలేదు
అమలిన హృదయం
మాత్రమే కవితా నిలయం!
ఒక కన్నీటి బొట్టుకోసం
ఒక క్షణం వెచ్చని ఒడికోసం
గుండెల్లో ఒక కవితాచరణంకోసం
అడుక్కోకూడదు కవి.
శాసించాలిగానీ !
శాసించలేనప్పుడు, ఆ అధికారం నీదికానప్పుడు
నువ్వు వ్యర్థం. నీ కవిత్వం శూన్యం. మర్చిపోకు!

శీర్షికలేని కవిత

శ్రీ రవిబాబు

నన్ను పాడమనకండి ఉగాది గీతికలను
  నిన్న మొన్నటిదాకా ఎన్నికల నినాదాలతో
నా గొంతు బొంగురు పోయింది
నన్ను వినమనకండి ఉగాది కవితలను
పార్టీల వాగ్దానాలు విని విని నా చెవులు
చిల్లులు పడిపోయాయ్ !
రోజువారీ మార్కెట్‌లో ధరలు ఆకాశాన్నంటుతుంటే
ఆకాశం దిగివచ్చిందని ఆకాశవాణి అరుస్తుంటే
ఏది నిజమో తెలియని నాకు
నిజమేదో తెలియచేస్తే అదేపండుగ నాకు !
ద్రవ్యోల్బణం అరికట్టామని చంకలు కొట్టుకునేవారు
ప్రజాజీవితంలోవచ్చిన వాపును బలుపని భ్రమిస్తున్నారు
జనసామాన్యపు జీవిత అగాధాలను
పరికించే బాధ్యత ఋషులైన కవులు
స్వీకరించిననాడే
సాహితీ వేత్తలకు నిజమైన పండుగ.
ఆనాటివరకు కృష్ణశాస్త్రికి లాగా
నాకుగాదులు లేవు
నా కుషస్సులు లేవు.

[పింగళ ఉగాది (20–3–77)న రేపల్లెలో జరిగిన కవి సమ్మేళనంలో చదివిన కవితలలో ఒకటి]

పద, నేపథ్యంలోకి......

శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

పండుటాకులకి
వసంతం వస్తోందంటే భయం
తాము రాలిపోవలసి వస్తుందని —
చంద్రుడికి అమావాస్య అంటే భయం;
ఇంద్రుడికి తపస్సు చేసేవాడంటే భయం,
తూలిపోవలసి వస్తుందని —

పండుటాకులముందు
వసంతాన్ని ప్రశంసించకు
సొంతంగా బతకగలిగిన ఎవరినీ
ఇంద్రుడితో, చంద్రుడితో పోల్చకు—

జీవితమంటే రెండు శిశిరాలమధ్య
వ్రేలాడే వసంత తోరణం.
నీ బతుకు నీది; నీ వసంతం నీది;
ఎదుటి పువ్వుల్ని తుంచకు
ఎవరినీ వంచించకు —

*　　*　　*

మాటకీ మౌనానికీ మధ్య
మానస సరోవరంవుంది.
రి తంస ఆ తీరాన సంచరించే
పరమహంస;
ఎగిరే దాని పల్లటీలు ఎన్నని చెప్పేది ?

*　　*　　*

అవసరార్థం దాచుకున్న అనుభూతుల్ని
తొందరగా వాడేసుకోవాలి;
మరీ ఎక్కువకాలం వుండిపోతే
అంతరంగం బరువెక్కిపోతుంది—
అప్పుడు శిశిరం బరువైన తన రెక్క
చల్లగా పరుస్తుంది—

రాగల వసంతం వస్తుంది
రాలే ఆకు రాలిపోతుంది—
ఈలవేసే గాలిలాగ
ఎప్పుడూ ఎగిరే పిట్టలాగ
పరిగెత్తే వాగులాగ
రంగుల్లో నవ్వే పువ్వుల్లాగ
చైతన్యమనేది అనుభూతి మాత్రంగా
మిగిలిపోతుంది —

ఇలాచూడు;
మృత్యుశమీ వృక్షంమీద
పంచప్రాణాల ఆయుధాలనుదాచి,
వేషం మార్చుకోబోయేముందు
ఇది గుర్తుంచుకో; ఈ చైతన్యం ప్రపంచానికి
ఇవేళ ఇచ్చెయ్యి,
రేపు పుచ్చుకో !—

అప్పుడు ఎండుటాకులకి వసంతభయం,
ఇంద్రుడికీ, చంద్రుడికీ, తూలిపోతామనే
భయం, వుండవు !
ఈ దృశ్యాలు చూసేశాక
పద ... నేపథ్యంలోకి —

డాక్టర్ వై. గోపాలరెడ్డి

కాకతీయ యుగము - వర్ణవ్యవస్థ

పశ్చిమ చాళుక్య సామ్రాజ్యమంతమైన తరువాత దక్కనులో ఉద్భవించిన రాజ్యములలో నొకటి కాకతీయ సామ్రాజ్యము. కాకతీయ చక్రవర్తులలో, మొదటి రుద్రుడు, గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు చాల ప్రసిద్ధులు. కాకతీయులు ఆంధ్రదేశమును రమారమి మూడు శతాబ్దములకుపైగా ఏలిరి. ఖిల్జీల, తుగ్లక్‌ల దండయాత్రల ఫలితముగ కాకతీయ సామ్రాజ్యము, కాకతీయ వంశము అంతమాయెను. కాకతీయ యుగమునందలి వర్ణవ్యవస్థను గురించి చర్చించుటయే ఈ వ్యాస ఉద్దేశము.

కాకతీయ యుగమందు చాతుర్వర్ణములు — బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర—ప్రముఖముగ నలరారినవి. చక్రవర్తులు, మహాసామంతులు, సామంతులు, చాతుర్వర్ణములను, వర్ణాశ్రమ ధర్మమును ఎక్కువ మక్కువతో కాపాడినట్లు సారస్వత — శాసనాధారములుగలవు. శ్రీ శిద్ధేశ్వర చరిత్రలో, గణపతిదేవ మహారాజును, 'నానావర్ణవరమాండలిక కరగండ', అని ప్రశంసింపబడి వున్నది.[1] మోటుపల్లి శిలాశాసనమునందు, గణపతిదేవ మహారాజు సామంతుడైన శిద్ధయదేవ మహారాజును, 'చాతుర్వర్ణ సత్త్రశతాగ్రహార ప్రతిష్ఠిత', అని చెప్పబడివున్నది.[2] కరుమాణిక్య పెరుమాది నాయకునికి, గుండప నాయనికి, కాయస్థ అంబదేవునికి, చాతుర్వర్ణ ప్రతిష్టాచార్య', 'చతుర్థకుల కుముదినీ రాజ్యవర్ధనుడు', చాతుర్వర్ణ సముద్ధరణ'అను బిరుదులున్నట్లు శాసనాధారములుగలవు.[3] శక సంవత్సరము 1214 నాటిదగు మరియొక శాసనము, వ్యాపారులను 'చాతుర్వర్ణాశ్రమ ధర్మప్రతిపాలితురు' అని పేర్కొనుచున్నది.[4] గణపతిదేవమహారాజు గురువైన, విశ్వేశ్వర శివాచార్యులు విశ్వేశ్వరగోళకి అను గ్రామమును స్థాపించి అందులో నానావర్ణములకు చెందిన ప్రజలను దేశపు నలుమూలలనుండి రప్పించి రక్షణ కల్పించెనని మాల్కాపురము శాసనమువలన తెలియుచున్నది.[5] దీనినిబట్టి కాకతీయ యుగమందు, రాజులు, మహాసామంతులు, సామంతులు, వ్యాపారులు, రాజగురువులు చాతుర్వర్ణములను, వర్ణధర్మమును సముచితముగ కాపాడినట్లు తెలియుచున్నది.

కాకతీయ శాసనములందు, పురుషసూక్తమందు వర్ణించిన విధముగ, బ్రహ్మముఖ, బాహు, ఊరు, పాదములనుండి, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రు లుద్భవించినట్లు ప్రశంసింపబడి వున్నది. శకసంవత్సరము 1189 నాటిదగు పానుగల్లు శిలాశాసనమునందు ఈ క్రిందివిధముగ నున్నది:[6]

> సంభూయతామ్ నాభి సరోజమధ్యే
> చతుర్‌ముఖో నాకగణం విధాయ
> శ్వ వక్త్రబాహు ఊరు పదాబ్జ యుగ్మ
> చ్ఛకార విప్రాధిప వైశ్య శూద్రాన్.

కాకతీయ యుగమందు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణములు మిక్కిలి శోభతో నలరారినట్లు సారస్వత—శాసనములందు పేర్కొనబడి వున్నది.[7]

చతుర్థ కులజులు రాజ్యములు స్థాపించుట, పాలకులగుట కాకతీయ యుగమం దుద్భవించిన ముఖ్యమార్పు. దీనికి ఉదాహరణము కాకతీయవంశమే. కాకతి మైలమదేవి వేయించిన బయ్యారము చెఱువు శాసనము ప్రకారము, కాకతీయులు 'రట్ట' లేక 'రాష్ట్రకూట' వంశమునకు చెందిన వారని తెలియుచున్నది.[8] లింగాల,[9] మరియు వర్ధమానపురము[10] శాసనములందు కాకతీయులు చతుర్థ కులజులని ప్రశంసింపబడి వున్నది. కాని కొన్ని సారస్వత గ్రంథములందు, శాసనములందు కాకతీయులు క్షత్రియులని చెప్పబడి వున్నది. విద్యానాథ విరచితమైన ప్రతాపరుద్రీయమునందు కాకతీయులు 'అత్యర్కేందు' కులజులని పేర్కొనబడి వున్నది.[11]

> తాదృఙ్మధ్యమలోక భాగ్యవిభవాదింద్రాది బృందారకైః
> క్షోణ్యాం క్రీడితు మిచ్ఛు భిశ్చిరతరం సంప్రార్థితః పద్మభూః
> అత్యర్కేందుకుల ప్రశస్తి మసృజద్యం కాకతీయాన్వయం
> తస్మిన్ సంప్రతి వీరరుద్ర వపుషా జాగర్తి లక్ష్మీపతిః

శ్రీ శిద్ధేశ్వర చరిత్ర[12], ప్రతాప చరిత్రము[13] లందు కాకతీయులు చంద్రవంశ క్షత్రియులని వున్నది. కుల్పాక,[14] ఏకామ్రనాథ[15], గోర్వంకపల్లి,[16], త్రిపురాంతక[17] శాసనములందు కూడ కాకతీయులు క్షత్రియులని ప్రశంసింపబడి వున్నది.

సారస్వత గ్రంథములందు, శాసనములందు కాకతీయులు చతుర్థకులజులని, క్షత్రియులని చెప్పబడి వున్నను, వారు చతుర్థ కులజులనుటలో సందేహము లేదు. ఈ సందర్భమున ముఖ్యముగ గమనించ దగిన విషయమేమన, కాకతీయ గణపతిదేవుడు వెలనాడును జయించిన తరువాత వేయించిన శాసనములందు, ప్రతాపరుద్రుని కాలమునందు మరియు తరువాత రచింపబడిన గ్రంథములందు మాత్రమే కాకతీయులు క్షత్రియులని చెప్పబడివున్నది. దీనిని బట్టి తెలియున దేమన, కాకతీయులు వారి సామ్రాజ్యమును

సాధిపత్యములు తెలిసికొన వీలగును. ప్రోలరౌతు, శివిరి అన్నయ్య, నామదేవ పండిత, పోచిన ప్రెగ్గడు, గణపయ్య, సూచనాయకుడు, దామనామాత్యుడు, లెంకవంటి కోక, భాస్కరదేవుడు, ఖాయప నాయకుడు, గంగయ సాహిణి, ఇందులూరి అన్నయ్య, పెదమల్లయ్య మొదలగువారు తలవరి, కార్యాభరణ, గజ సాహిణి, తురగ సాహిణి, తంత్రపాల, సర్వాధికారి, ప్రధాని, మహాప్రధాని, బాహత్తర నియోగాధిపతి మొదలగు పదవులందుండిరి.[38] ఇందులూరి అన్నయ్య బ్రాహ్మణుడైనను, గణపతిదేవుని కళింగ జైత్రయాత్ర యందు పాల్గొని విజయ లక్ష్మిని వరించిన వ్యక్తి. కొలను మాండలికులను ఓడించినదానికి, గణపతిదేవుడితనికి 'కొలని సోముడని' బిరుదు నిచ్చి సత్కరించినట్లు 'శివయోగ సారము' వలన తెలియుచున్నది.[39] కాశ్యప గోత్రుడు, దోచివంశజుడైన, సామంత భోజుడు కాంచిపై దండయాత్రచేసి విజయమును సాధించెను.[40] కాశ్యప గోత్రుడైన మహాదేవుడు, కాకతి గణపతిదేవునికి మంత్రిగ మరియు సైన్యాధ్యక్షుడుగ నుండెను.[41] బాలసరస్వతి, నామదేవపండితుడు, జగద్దేవుని, గంగయసాహిణి ఆస్థానములందు ప్రధానిగ, సైన్యాధ్యక్షులుగ నుండిరి.[42] వేమాద్రి రెడ్డి, గోవింద నాయకుడు, జగదాల ముమ్మడి, తిక్క, బొప్పదేవుడు, కాల్పప నాయకుడు, కాకతి గణపతి దేవుని సైన్యాధ్యక్షులు.[43] రుద్రమదేవి, ప్రతాపరుద్రుని ఆస్థానములందు, అంగరక్ష, పట్టసాహిణి, రాయసకల సేనాధిపతి, మహాప్రధాని, సర్వాధికారి, మహారాయ గజ సాహిణి, రాయపట్టసాహిణి, పదవులను సోమయాదుల రుద్రదేవుడు, గన్ననాయకుడు, కన్యనాయకుడు, అడిదముమల్లు, పోచిరాజు పెద్దిరాజు, గండయ నాయకుడు, దాడి వీరయనాయకుడు, వేపేటి కామయ్య, పోచులెంక కొలని రుద్రదేవుడు, మాదయరెడ్డి మొదలగువారు అనుభవించినట్లు ఆధారములు గలవు.[44] ముడి మాణిక్యము శిలాశాసనము వలన మల్లిశెట్టి శ్వేత గ్రామమునకు పాలకుడని తెలియుచున్నది.[45] చోడిశెట్టి, కరికాలచోళ గండరాజునకు ప్రధానిగ నుండెను.[46] ఈ చర్చవలన తెలియున దేమన కాకతీయ యుగమందెక్కువగ శూద్రులు, బ్రాహ్మణులు మరియు కొంతవరకు వైశ్యులు పరిపాలనా యంత్రాంగమునందలి కీలకమైన పదవులను అనుభవించినట్లు తేటతెల్లమగుచున్నది. మరియు పై పేర్కొన్న మూడు వర్ణములలోగూడ శూద్రులే ఎక్కువ అధికారమును, పదవులను అనుభవించినట్లుకూడ తెలియుచున్నది.

మనువు 'మానవ ధర్మశాస్త్రము' నందు, యుద్ధములు చేయుట, రాజ్యరక్షణచేయుట క్షత్రియులే చేయవలయునని, అత్యవసర పరిస్థితులలో మాత్రమే ఆ పనులను బ్రాహ్మణులకు, వైశ్యులకు ఒప్పజెప్పవచ్చునని, శూద్రులకు మాత్రము ఆ పనులను ఎటువంటి సమయములోకూడ ఒప్పజెప్పరాదని వ్రాసిరి.[47] కాని కాకతీయ యుగమందు శూద్రులెక్కువగ సైన్యాధ్యక్షులుగ నున్నట్లు మనకు శాసనాధారములు గలవు. వారి తరువాత బ్రాహ్మణులు ఎక్కువగ సైన్యాధ్యక్షులై యుద్ధములలో పాల్గొన్నట్లున్నది. విచిత్రమైన విషయమేమన, క్షత్రియుల ప్రగతి ప్రమేయము క్రమముగ నడుగంట సాగెను.

బ్రాహ్మణులు, ప్రధానులుగ, మహాప్రధానులుగ, సైన్యాధ్యక్షులుగ కొద్దిమంది మాత్రమే వున్నప్పటికి, వారు కాకతీయ యుగమునందు రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సారస్వత రంగములలో నమూల్యమైన పాత్రను నిర్వహించిరి. శాసనములందు వీరిని కుల శీల విద్యా తపస్సంపన్నులని, వేదవిద్యా విశారదులని, యమనియమ తత్పరులని, యాగములు నెఱపిన పుణ్యపురుషులని శ్లాఘించబడి వున్నది.[48] అచింతేంద్రుని తనయుడైన, భారద్వాజ గోత్రుడైన, రామేశ్వర దీక్షితుడు వేదవిద్యలయందు, శ్రౌతక్రియాకర్మలయందు ఆరితేరిన వ్యక్తి.[49] రుద్రదేవుని గురువైన మల్లికార్జునినికి 'త్రిభువనీ విద్యాచక్రవర్తి' అను బిరుదు గలదు.[50] బుదాపురములో దొరకిన నొక శాసనములో (క్రీ. శ. 1272) ఈశ్వరసూరిని 'పాణినీయ వ్యాకరణ విచిత్ర కవిత్వ తత్వజ్ఞుండనియు', 'పదక్రమ యుత యజుర్వేద పారగు'డనియు పేర్కొనబడి యున్నది.[51] క్రీ. శ. 1214 నాటిదగు గణపవర శాసనమునందు రేసికవి ప్రశంసగలదు. ఇతడు భారద్వాజగోత్రుడు. వేణీ ప్రియాభుజంగుడు. సుచరిత నిరతుడు.[52] ఈశ్వరశూరి తనయుండైన, ఆత్రేయ గోత్రుండైన అభినవమయూరశూరిని, లింగాల శాసనమునందు, 'పదవాక్యప్రమాణ విచిత్రకవిత్వ తత్వజ్ఞుండని' పేర్కొనబడి యున్నది.[53] మహబూబ్‌నగర్ జిల్లాలోని ఉమామహేశ్వరమను గ్రామమునందు దొరకిన శాసనమువలన మాయిభట్టోపాధ్యాయునికి, 'పదవాక్య ప్రమాణజ్ఞ'డని బిరుదున్నట్లు తెలియుచున్నది.[54] విశ్వేశ్వరశివాచార్యుడు, ధృవేశ్వరముని, రామేశ్వర పండితుడు కాకతీయులకు రాజగురువులుగ నుండిరి.[55] కాన బ్రాహ్మణులు పండితులుగ, కవులుగ, రాజగురువులుగ, ప్రధానులుగ, మహాప్రధానులుగ, సైన్యాధ్యక్షులుగ కాకతీయ యుగమునందలరారిరని తెలియుచున్నది.

బ్రాహ్మణులకు, దేవాలయములకు, భూములను, గ్రామములను దానముచేయు సంప్రదాయము శాతవాహనుల కాలమునుండి ప్రారంభమాయెను. కాకతీయ యుగమందు రాజులు, రాజబంధువులు, సామంతులు, ధనికులు, వ్యాపారసంస్థలు విరివిగ భూములను, గ్రామములను బ్రాహ్మణులకు దానమొసంగినట్లు ఆధారములున్నవి.[56] కొండనాతవాడి, దొడ్డికంద్రవాడి, కొండపడుమటి విషయ ప్రాంతములందున్న పలు గ్రామములను కోటకేతరాజు బ్రాహ్మణులకు దానమిచ్చెను.[57] కోలవెన్ను తామ్రపట్టికలవలన, గణపతిదేవుడు అమితానందముతో కోలవెన్ను గ్రామమును, వేదవిద్యావిశారదులైన, అన్ని గోత్రములకు చెందిన ద్విజులకు దానమిచ్చినట్లు తెలియుచున్నది.[58] మహాదేవ రాజ తనయయైన కుందాంబ, కుందవరమను గ్రామములో కొంత భాగమును బ్రాహ్మణులకు దానమిచ్చెను.[59] ఇదుపులపాడను గ్రామమును గణపతిదేవుడు, కాణ్వశాఖకు చెందిన బ్రాహ్మణులకు అగ్ర

హారముగ నిచ్చెను.[60] గణపతిదేవుని సామంతుడైన ఇమ్మాది విశ్వనాథుడు, లెంజింట, సూరిపల్లి అను గ్రామములను బ్రాహ్మణులకు అగ్రహారములుగ నిచ్చెను.[61] రాజారుద్రదేవుడు, యల్లనదేవుడు గోర్వంకపల్లి మరియు ఆలపాడు అను గ్రామములను బ్రాహ్మణులకు దానమొసంగెను. ఈ విధముగ భూములను, గ్రామములను బ్రాహ్మణులకు దానమొసంగిన దానశాసనములు కొల్లలుగ గలవు.

ఈ దానశాసనములం దుపయోగించిన, సకల కృషియుతము, సకలప్రాయశ్చిత్తము, సకలాయ సహితము, సకలోపద్రవములు, సన్తతిభోగము, సంపంగు కానికమన్నన, సర్వాభ్యంతరము, సమస్తాయము, సర్వకరపరిహారువు, సర్వకరభరపరిహారము, సర్వనమస్యము, సర్వపరిహారము, సర్వపీడావివర్జితము, సర్వబాధాకర పరిహారము, సర్వబాధా పరిహారము, సర్వాగ్రహారము, సర్వాక్రాంతము, సర్వ వస్తుభోగము, సర్వభోగసామ్యత, అష్టభోగ తేజస్వామ్యము మొదలగు ప్రయోగములు మనకు నమూల్యమైన సమాచారము నందజేయును.[62] దీనినిబట్టి దానమిచ్చిన భూములపై, గ్రామములపై బ్రాహ్మణులకు అన్నివిధములైన అధికార హక్కు లీయబడెనని తెలియుచున్నది. ప్రభుత్వమునకు వారు పన్నులు కట్టనవసరములేదు. పన్నువేసే అధికారము, పన్ను వసూలు చేయు నధికారము, ఆ పన్నుల మూలకముగ వచ్చు సంపదను అనుభవించు హక్కు వారి పరమాయెను. ప్రభుత్వ ఉద్యోగులకు బ్రాహ్మణ అగ్రహారములలో నివసించువారిపై హక్కు వుండదు. భూమిలోపనున్న అష్టనిధులపై, పైనున్నచెట్లు, రాలపై వారికి సంపూర్ణ అధికార మీయబడెను. దానము చేయబడిన భూములపై మరియు గ్రామములపై దానగ్రహీతలైన బ్రాహ్మణులకు వంశపారంపర్యాధికారము కూడ సంక్రమించినట్లు, శాసనముల చివరనున్న వ్యాసగీతమువలన తెలియుచున్నది. భూమినే గాక, భూమినంటిపెట్టుకొనివున్న కర్షకులపైతము దానమొసంగినట్లు త్రిపురాంతక, శాయంపేట శిలాశాసనములవలన తెలియుచున్నది.[63] ఈ చర్చవలన తెలియు ముఖ్యాంశములేమన, బ్రాహ్మణులు భూకామందులగుట, దానముచేసిన గ్రామములపై వారికి పరిపాలనాధికారము సంక్రమించుట, భూమిని సాగుచేయు కృషీవలులు వారికి పాదాక్రాంతులై సాంఘీక ఆర్థిక స్వాతంత్ర్యమును కోల్పోవుట, ప్రభుత్వమునకు అగ్రహారములపై అధికారము నశించుట, బ్రాహ్మణుల ఆర్థికాదాయము పెరిగి ప్రభుత్వ ఆదాయము తరుగుట, భూస్వామ్య విధానము తలెత్తుట, అధికార వికేంద్రీకరణము, కేంద్రప్రభుత్వ పటిష్టత తగ్గుట మొదలైనవి—

కాకతీయ యుగమందలి శాసనములలో 'మహాజనులు' అను పదము తరచుగ కానవచ్చును. ఈ 'మహాజను'లెవరు? వారి అధికారములెవ్వి? వారు దేనిమీద ఆధిపత్యము వహించెడివారు? ఏ. యస్. అల్టేకరు,[64] ఆర్. సి. మజుందారు,[65] జీ. యస్. దీక్షిత్[66], పి. పి. దేశాయి,[67] కె. ఏ. యన్. నీలకంఠశాస్త్రి[68] గారలు పై అంశములను కూలంకషముగ చర్చించిరి. 'మహాజనులు' ఊరి పెద్దలని, వివేకవిద్యాసంపన్నులని, అగ్రహార పాలకులని వ్రాసిరి. వీరు ఎక్కువగ ద్విజులు. కొన్ని శాసనములందు 'మహాజనుల' పదమునకు ముందు సంఖ్యకూడ కనుపించుచున్నది. నూతక్కి[69], పెదముడియము[70] శిలాశాసనములందు, '500 మహాజనులు,' '108 మహాజనులు,' అని ప్రశంసలు గలవు. బహుశ 'మహాజనుల' సంఖ్య తెలుపు సంకేతమై యుండును. బ్రాహ్మణ మహాజనులకు అపారమైన అధికారహక్కు లుండెడివని ఆనాటి శాసనములవలన తెలియుచున్నది. వారు భూకామందులు. భూములను, గ్రామములను వారు దేవాలయములకు, బ్రాహ్మణులకు దానము చేయుచుండిరి. దేవాలయములలో అఖండదీప నైవేద్యములకు దానమొసంగుట, దేవభూములను సాగుచేయించుట, విద్యావ్యాప్తి జేయుట, సన్యాసులకు అన్నదానము చేయుట, స్థానపతులుగనుండి దేవాలయ ఆదాయ వ్యయముల పర్యవేక్షణ చేయుట, సుంకములు వేయుట మరియు వసూలుచేయుట, అగ్రహార పరిపాలనా భాధ్యతను నిర్వహించుట మొదలైన హక్కులను 'మహాజనులు' అనుభవించుచుండిరి.[71] కొన్ని సమయములందు 'మహాజనులు' అధికార దుర్వినియోగము చేసినట్లు, దానిని కాకతి ప్రతాపరుద్రుడు అరికట్టినట్లు నందలూరి శిలాశాసనము వలన తెలియుచున్నది[72]. ఏది ఎట్లున్నను బ్రాహ్మణ మహాజనులు, అగ్రహారపాలకులుగ కాకతీయ యుగమందలరారిరి. అగ్రహార గ్రామమునకు 'బ్రహ్మదేయ'మనియు, 'చతుర్వేది మగంళ' మనియు మారుపేర్లు.

కాకతీయ యుగమందు జరిగిన దౌత్య వివాహముల పరిశీలించిన ఆ నాటి వర్ణవ్యవస్థ స్వరూపము నొకింత తెలిసికొనవీలగును. రెండవ ప్రోలరాజు తనయుడైన రుద్రదేవుడు, ఘూర్య వంశ క్షత్రియుడైన ఉదయచోడుని తనయయైన పద్మను వివాహమాడెను.[72.A] మహాదేవరాజ తనయలైన మైలాంబిక, కుందాంబలను, చతుర్థ కులజుడైన నాతవాడి రుద్రునకిచ్చి వివాహము చేసెను.[73] నాతవాడి రుద్రుని పుత్రికయైన బయ్యలదేవి, చతుర్థ కుల సంజాతుడైన కోట మూడవ కేతరాజు రాణి.[74] గణపతిదేవ మహారాజు, దివిసీమపై దండయాత్ర సలిపి, అయ్యవంశజుల నోడించి, అయ్య పినచోడి కుమార్తెలైన నరాంబ, పేరాంబలను వివాహ మాడెను.[75] వారి సోదరుడైన జాయప సేనానికి గజసాహిణి పదవినిచ్చి సత్కరించెను. ఈ గజసాహిణియే 'నృత్య రత్నావళి' ని రచించిన వ్యక్తి, గణపతిదేవుని కళింగ జైత్రయాత్రలో పాల్గొని విజయలక్ష్మిని వరించిన ధీరుడు. గణపతి దేవునికి ఇరువురు కుమార్తెలు గలరు. వారు రుద్రమదేవి, గణపాంబ. రుద్రమదేవిని క్షత్రియుడైన చాళుక్య వీరభద్రునికి, గణపాంబను చతుర్థ కులజుడైన కోట బేతరాజున కిచ్చి వివాహము చేసెను.[76] ఇందులూరి పెద గన్నయ్య తనయుడు, బ్రాహ్మణుడునైన ఇందులూరి అన్నయ్య, రుద్రమదేవి కుమార్తెయైన రుయ్యమ్మ లేక రుయ్యాంబను వివాహ మాడెను.[77] అన్నయ్య రుద్రమదేవి మహాప్రధాని, సైన్యాధ్యక్షుడు.[78] అలుగడప శిలా శాసనమునందు, యల్లనదేవుడు

రుద్రమదేవి ద్వితీయ తనయను వివాహమాడినట్లున్నది.[79] కాని రుద్రమదేవికున్న ఇద్దరి కుమార్తెలను, పైన పేర్కొన్నట్లు ఇందులూరి అన్నయ్య, కాకతి మహాదేవుడు వివాహ మాడిరి. మరి యల్లనదేవుడు రుద్రమదేవి రెండవ తనయనెట్లు వివాహమాడెనో తెలియకున్నది. బహుశ రుద్రమదేవికి ముగ్గురు కుమార్తెలుండ వచ్చును. అందులో ద్వితీయ తనయను యల్లన దేవుడు వివాహ మాడి వుండవచ్చును. కాని ఈమె పేరు పై నుదహరించిన శిలా శాసనములోగాని, మరి ఏ ఇతర శాసనములలోగాని పేర్కొనబడ లేదు. పై చర్చవలన శూద్రుల మధ్య, శూద్ర–క్షత్రియులమధ్య, శూద్ర–బ్రాహ్మణుల మధ్య కాకతీయయుగమందు వైవాహిక సంబంధము లేర్పడినట్లుతెలియుచున్నది. శూద్రులు, క్షత్రియులతో మరియు బ్రాహ్మణులతో వివాహ సంబంధములు నెరపి కొన్నందున వారి వర్ణమునకు శోభ, విలువచేకూరినది. క్షత్రియులు, బ్రాహ్మణులు శూద్రపాలకుల తనయల చేపట్టి నందున వారికి రాజకీయ, ఆర్థిక, దౌత్య రంగములలో ప్రవేశము కలుగుటయేగాక కీలక పదవులను అనుభవించు అవకాశముకూడ గల్గెను. ఈ వివాహ సంబంధములు పరస్పర మైత్రికి, రాజ్యవ్యాప్తికి ఎంతగానో సహక రించినవి. కాకతీయయుగమందు బహుభార్యాత్వ మున్నట్లు కూడ తెలియుచున్నది.

కాకతీయ యుగ పాలనా వ్యవస్థలో, రాజగురువులు, పురో హితులు, దూతలు, ప్రముఖపాత్ర వహించిరి. ఈ పదవులను ఏ వర్ణమునకు చెందినవారెక్కువగ ననుభవించిరో తెలిసికొనుట ముఖ్యమైన విషయము. రామేశ్వర పండితుడు,[80] గొసగి ఈశ్వర దేవుడు,[81] రామేశ్వర దీక్షితుడు,[82] ధ్రువేశ్వరముని,[83] చంద్ర భూషణ శివాచార్యుడు,[84] విశ్వేశ్వర శివాచార్యులు,[85] కాకతీయుల రాజగురువులు. రాజగురువులురాజులపై, రాజ్యముపై, ప్రజలపై, పరిపాలనా వ్యవస్థపై అపారమైన అధికారమును కలిగి యుండిరి. గణపతిదేవుడుఒకసందర్భమున తాను విశ్వేశ్వరశివాచార్యునితనయుడ నని చెప్పుకొనెను.[86] వీరందరు ద్విజులు. రాజగురువులు, విజయ నగర రాజుల కాలమునందు, కళింగ గజపతుల కాలమునందుకూడ అధికార సంపదలతో తులతూగుచుండినట్లాధారములు గలవు.[87]

ఐతరేయ బ్రాహ్మణము **(VII, 24-26)** శతపథబ్రాహ్మణము **(IV, 4-6)** మానవ ధర్మశాస్త్రము **(VII, 78)** లందు పురోహిత ప్రశంస గలదు. పై గ్రంథముల ప్రకారము పురోహితుడు రాజు శ్రేయస్సును సర్వదా కోరువాడుగ నుండవలయును. యుద్ధ సమ యములలో రాజు విజయమునకై ప్రార్థించవలయును. రాజునకు మత సంబంధమైన విషయములలో సర్వదా సలహా లివ్వవలయును. కాని కాలక్రమేణ పురోహిత పదవి రాజకీయ పదవిగ మారిపోయి నందున పురోహితుడెక్కువగ రాజకీయ విషయములందెక్కువగ పాల్గొనవచ్చెను. వర్ధమానపురము,[88] కొండపర్తి శిలాశాసనము లందు[89] పురోహితునికి మంత్రిమండలిలో ఒక విలువైన స్థాన మున్నట్లు పేర్కొనబడియున్నది. మంచి భట్టోపాధ్యాయుడు, కాకతి గణపతిదేవుని పురోహితుడు. ఇతడు బ్రాహ్మణుడు.[90]

దూత, పరిపాలనా యంత్రాంగమునందు కీలకమైన వ్యక్తి. దూతలనుఅవమాన పరచరాదని, చంపరాదని, హింసింపరాదని ధర్మ శాస్త్రములుచెప్పుచున్నవి. కాకతీయయుగమందుకూడ రాయబారులను హింసించక గౌరవముతో చూచినట్లు 'భాస్కర రామాయణము,' 'పల్నాటివీరచరిత్ర' ల వలన తెలియుచున్నది.[90A] తెలుగుచోళవంశ జుడు, విక్రమసింహపురమును రాజదానిగ, నెల్లూరిమండలము నేలిన మనుమసిద్ధి రాజును, అతనిదాయాదులైన అక్కన, బయ్యనలురాజ్య భ్రష్టునిగ జేసినప్పుడు, అతడు కాకతీయ గణపతి దేవుని సహాయము నర్థించుటకై తిక్కన సోమయాజిని దూతగ వరంగల్లునకు పంపెనని శ్రీసిద్దేశ్వరచరిత్ర, ప్రతాపచరిత్రములందు పేర్కొనబడి యున్నది.[91] కాకతిగణపతిదేవుని సహాయమున మనుమసిద్ధి మరల తన రాజ్యమును సంపాదించుకొనుటయేగాక, వారికి సామంతుడు కూడ నాయెను. పల్నాటి యుద్ధము జరుగుటకుముందు మలిదేవ రాజు, నారాయణభట్టు అనువానిని దూతగ నలగామరాజు నాస్థా నమునకు పంపినట్లు పల్నాటి వీరచరిత్ర యందున్నది.[92] తిక్కన సోమయాజి, నారాయణభట్టు వీరిరువురు బ్రాహ్మణులు. దీనిని బట్టి కాకతీయ యుగమందు బ్రాహ్మణులు దౌత్యరంగమునందు గుత్తాధిపత్యమును వహించినట్లు తెలియుచున్నది.

వైశ్యులను, శాసనములందు కోమట్లని, శెట్లని తరచుగ పేర్కొనబడి యున్నది. బ్రాహ్మణులవలె, వైశ్యులలో కూడ గోత్రములు, శాఖలున్నట్లున్నవి. శాసనములందు తరచుగ కాన వచ్చు గోత్రములు, నాభిల, పెంకికుల, పునశిల, వెంకుల, సూరు కోల, శిలకుల, పుచ్చకుల, యఱ్ఱశెట్టికుల, బొడకుల, వివరిశెట్ల, అప్పనాగకుల, ముఱుకుల, ముద్దికుల, మొదలైనవి.[93] కొన్ని శాసనములందు 'కమ్మకోమట్లని', 'కమ్మవైశ్యులని' ప్రస్తావన గలదు.[94] వీరు బహుశ కమ్మనాటి ప్రాంతమందున్న కోమట్లు లేక వైశ్యులు అయివుండవచ్చును. వైశ్యపురాణమునందు, పెను గొండ, వేంగి, ఘంటసాల, ఆచంట, నగరము, వైశ్యులకు కేంద్ర స్థానములని వున్నది.[95] కాకతీయ యుగమందు వైశ్యులుకూడ ఆర్థిక, రాజకీయ, సైనిక, న్యాయ రంగములందు ముఖ్యపాత్ర వహించినట్లున్నది.

కాకతీయ యుగమందెక్కువ వ్యాపారసంస్థలు **(Trade Guilds)** న్నట్లు శాసనాధారములు గలవు. అందులో నానాదేశి, ఉభయనానాదేశి, చాలుమూల ఉభయనానాదేశి, అయ్యవోళి–500, తెలికి–1000, నఖరము, పెక్కంద్రు, ముమ్మూరిదండ, తగరము వారు, గానుగలవారు, పంచలోహాల బేహారులు, ముఖ్యులు.[96] నానా దేశి వర్తక సంఘశాఖలు సుమిత్రా, బోర్నియో దేశాలలో నున్నట్లు ఆధారములున్నవి.[97] నల్లగొండజిల్లా, మిర్యాలగూడ తాలూకాలో నున్న పేరూరు గ్రామమందు దొరికిన యొక శిలాశాసనమునందు తమిళ వర్తకసంఘ (అరవనఖరము) ప్రశంసగలదు.[98] దీనినిబట్టి కాకతీయ యుగమందు స్వదేశి, పరదేశి వ్యాపార మెక్కువగ వైశ్యు

హారముగ నిచ్చెను.[60] గణపతిదేవుని సామంతుడైన ఇమ్మాది విశ్వనాథుడు, లెంజింట, సూరిపల్లి అను గ్రామములను బ్రాహ్మణులకు అగ్రహారములుగ నిచ్చెను.[61] రాజారుద్రదేవుడు, యల్లనదేవుడు గోర్వాంకపల్లి మరియు ఆలపాడు అను గ్రామములను బ్రాహ్మణులకు దానమొసంగెను. ఈ విధముగ భూములను, గ్రామములను బ్రాహ్మణులకు దానమొసంగిన దానశాసనములు కొల్లలుగ గలవు.

ఈ దానశాసనములం దుపయోగించిన, సకల కృషియుతము, సకలప్రాయశ్చితము, సకలాయ సహితము, సకలోపద్రవములు, సన్తతిభోగము, సంపంగు కానికమన్నన, సర్వాభ్యంతరము, సమస్తాయము, సర్వకరపరిహారువు, సర్వకరభరపరిహారము, సర్వనమస్యము, సర్వపరిహారము, సర్వపీడావివర్జితము, సర్వబాధాకర పరిహారము, సర్వబాధా పరిహారము, సర్వాగ్రహారము, సర్వాక్రాంతము, సర్వవస్తుభోగము, సర్వభోగసామ్యత, అష్టభోగ తేజస్వామ్యము మొదలగు ప్రయోగములు మనకు నమూల్యమైన సమాచారము నందజేయును.[62] దీనినిబట్టి దానమిచ్చిన భూములపై, గ్రామములపై బ్రాహ్మణులకు అన్నివిధములైన అధికార హక్కులీయబడెనని తెలియుచున్నది. ప్రభుత్వమునకు వారు పన్నులు కట్టనవసరములేదు. పన్నువేసే అధికారము, పన్ను వసూలు చేయు నధికారము, ఆ పన్నుల మూలకముగ వచ్చు సంపదను అనుభవించు హక్కు వారి పరమాయెను. ప్రభుత్వ ఉద్యోగులకు బ్రాహ్మణ అగ్రహారములలో నివసించువారిపై హక్కు వుండదు. భూమిలోనున్న అష్టనిధులపై, పైనున్నచెట్లు, రాలపై వారికి సంపూర్ణ అధికార మీయబడెను. దానము చేయబడిన భూములపై మరియు గ్రామములపై దానగ్రహీతలైన బ్రాహ్మణులకు వంశపారంపర్యాధికారము కూడ సంక్రమించినట్లు, శాసనముల చివరనున్న వ్యాసగీతమువలన తెలియుచున్నది. భూమినే గాక, భూమినంటిపెట్టుకొనివున్న కర్షకులసైతము దానమొసంగినట్లు త్రిపురాంతక, శాయంపేట శిలాశాసనములవలన తెలియుచున్నది.[63] ఈ చర్చవలన తెలియు ముఖ్యాంశములేమన, బ్రాహ్మణులు భూకామందులగుట, దానముచేసిన గ్రామములపై వారికి పరిపాలనాధికారము సంక్రమించుట, భూమిని సాగుచేయు కృషీవలులు వారికి పాదాక్రాంతులై సాంఘిక ఆర్థిక స్వాతంత్ర్యమును కోల్పోవుట, ప్రభుత్వమునకు అగ్రహారములపై అధికారము నశించుట, బ్రాహ్మణుల ఆర్థికాదాయము పెరిగి ప్రభుత్వ ఆదాయము తరుగుట, భూస్వామ్య విధానము తలెత్తుట, అధికార వికేంద్రీకరణము, కేంద్రప్రభుత్వ పటిష్టత తగ్గుట మొదలైనవి—

కాకతీయ యుగమందలి శాసనములలో 'మహాజనులు' అను పదము తరచుగ కానవచ్చును. ఈ 'మహాజను'లెవరు? వారి అధికారములెవ్వి? వారు దేనిమీద ఆధిపత్యము వహించెడివారు? ఏ. యస్. ఆల్టేకరు,[64] ఆర్. సి. మజుందారు,[65] జీ. యస్. దీక్షిత్[66], పి. పి. దేశాయి,[67] కె. ఏ. యన్. నీలకంఠశాస్త్రి[68] గారలు పై అంశములను కూలంకషముగ చర్చించిరి. 'మహాజనులు' ఊరి పెద్దలని, వివేకవిద్యాసంపన్నులని, అగ్రహార పాలకులని వ్రాసిరి. వీరు ఎక్కువగ ద్విజులు. కొన్ని శాసనములందు 'మహాజనుల' పదమునకు ముందు సంఖ్యకూడ కనుపించుచున్నది. నూతక్కి[69], పెదముడియము[70] శిలాశాసనములందు, '500 మహాజనులు,' '108 మహాజనులు,' అని ప్రశంసలు గలవు. బహుశ 'మహాజనుల' సంఖ్య తెలుపు సంకేతమై యుండును. బ్రాహ్మణ మహాజనులకు అపారమైన అధికారహక్కు లుండెడివని ఆనాటి శాసనములవలన తెలియుచున్నది. వారు భూకామందులు. భూములను, గ్రామములను వారు దేవాలయములకు, బ్రాహ్మణులకు దానము చేయుచుండిరి. దేవాలయములలో అఖండదీప నైవేద్యములకు దానమొసంగుట, దేవభూములను సాగుచేయించుట, విద్యావ్యాప్తి జేయుట, సన్యాసులకు అన్నదానము చేయుట, స్థానపతులుగనుండి దేవాలయ ఆదాయ వ్యయముల పర్యవేక్షణ చేయుట, సుంకములు వేయుట మరియు వసూలుచేయుట, అగ్రహార పరిపాలనా భాధ్యతను నిర్వహించుట మొదలైన హక్కులను 'మహాజనులు' అనుభవించుచుండిరి.[71] కొన్ని సమయములందు 'మహాజనులు' అధికార దుర్వినియోగము చేసినట్లు, దానిని కాకతి ప్రతాపరుద్రుడు అరికట్టినట్లు నందలూరి శిలాశాసనము వలన తెలియుచున్నది[72]. ఏది ఎట్లున్నను బ్రాహ్మణ మహాజనులు, అగ్రహారపాలకులుగ కాకతీయ యుగమందలరారిరి. అగ్రహార గ్రామమునకు 'బ్రహ్మదేయ'మనియు, 'చతుర్వేది మగంళ' మనియు మారుపేర్లు.

కాకతీయ యుగమందు జరిగిన దౌత్య వివాహముల పరిశీలించిన ఆనాటి వర్ణవ్యవస్థ స్వరూపము నొకింత తెలిసికొనవీలగును. రెండవ ప్రోలరాజు తనయుడైన రుద్రదేవుడు, ఘూర్యవంశ క్షత్రియుడైన ఉదయచోడుని తనయయైన పద్మను వివాహమాడెను.[72.A] మహాదేవరాజ తనయలైన మైలాంబిక, కుందాంబలను, చతుర్థ కులజుడైన నాతవాడి రుద్రునకిచ్చి వివాహము చేసెను.[73] నాతవాడి రుద్రుని పుత్రికయైన భయ్యలదేవి, చతుర్థకుల సంజాతుడైన కోట మూడవ కేతరాజు రాణి.[74] గణపతిదేవ మహారాజు, దివిసీమపై దండయాత్ర సలిపి, అయ్యవంశజుల నోడించి, అయ్య పినచోడి కుమార్తెలైన నరాంబ, పేరాంబలను వివాహ మాడెను.[75] వారి సోదరుడైన జాయప సేనానికి గజసాహిణి పదవినిచ్చి సత్కరించెను. ఈ గజసాహిణియే 'నృత్య రత్నావళి' ని రచించిన వ్యక్తి, గణపతిదేవుని కళింగ జైత్రయాత్రలో పాల్గొని విజయలక్ష్మిని వరించిన ధీరుడు. గణపతి దేవునికి ఇరువురు కుమార్తెలు గలరు. వారు రుద్రమదేవి, గణపాంబ. రుద్రమదేవిని క్షత్రియుడైన చాళుక్య వీరభద్రునికి, గణపాంబను చతుర్థ కులజుడైన కోట బేతరాజున కిచ్చి వివాహము చేసెను.[76] ఇందులూరి పెద గన్నయ్య తనయుడు, బ్రాహ్మణుడునైన ఇందులూరి అన్నయ్య, రుద్రమదేవి కుమార్తెయైన రుయ్యమ్మ లేక రుయ్యాంబను వివాహ మాడెను.[77] అన్నయ్య రుద్రమదేవి మహాప్రధాని సైన్యాధ్యక్షుడు.[78] ఆలుగడప శిలా శాసనమునందు, యల్లనదేవుని

ఆధిపత్యము క్రింద నున్నట్లు తెలియుచున్నది. పరదేశములలో వర్తకముచేయుట వ్యాపార సంస్థలయొక్క ఆర్థిక గమనమును (Economic mobility)సూచించును.

వైశ్యులు వ్యాపార సంస్థలను నడుపుటయేగాక, రాజుల ఆస్థానములందు గౌరవ ప్రదమైన పదవులను కూడ అనుభవించుచుండిరి. నేతిశెట్టి, సుంకిశెట్టి, చండభీమపోలిశెట్టి, తెలుగు చోళ కన్నారదేవునికి, వెలనాటి కుళోత్తుంగ చోడ గొంకరాజులకు ఆస్థాన వ్యాపారులుగ (State merchants) నుండిరి.[99] ఈ ఆస్థాన వ్యాపారులకు, ప్రభువులు గౌరవ లాంఛనములైన కుంచె, తలిగె, కీలవట్టు, అడ్డనిగ మొదలైనవస్తువులిచ్చి గౌరవించినట్లున్నది[100].

వ్యాపారసంస్థలు సైనిక బలమును కలిగియున్నట్లు ఆధారములు గలవు. బహుశ నిలువచేయబడిన సరకుల గిడ్డంగులను, సరకులను ఇతర ప్రదేశములకు చేరవేయునపుడు దొంగల బారినుండి రక్షించుకొనుటకు వైశ్యులు సొంత సైనికుల నుంచుకొని యుండవచ్చును. శక సంవత్సరము 1071 నాటిదగు నొక శిలా శాసనమునందు, కన్నిశెట్టికి 'సమయసేనాధిపతి' అను బిరుదున్నట్లు తెలుపుచున్నది.[101] తెలికి వేపురకు 'చాళుక్య రాజ్యమూలస్తంభాయమానులు' అను బిరుదున్నట్లు వారి ప్రశస్తివలన తెలియుచున్నది. వేంగి చాళుక్యుల సైన్యములో తెలికి సైన్యమొక భాగముగ నుండెనని చరిత్రకారు లభిప్రాయము[102]. 'దండాయుధహస్తులు,' రణరంగ రాములు,' 'త్రిభువన పరాక్రమోన్నతులు' అను బిరుదులు వైశ్యుల బలపరాక్రముల సూచించును.[103]

కాకతీయ యుగమందు వైశ్యులు పరిపాలనావ్యవస్థయందలి కీలకస్థానముల నాక్రమించి నట్లాధారములు గలవు. చోడపశెట్టి, కరికాళచోళగండని ప్రధాని[104]. మల్లిశెట్టి శ్వేతగ్రామపాలకుడు[105]. కోనసింగమశెట్టి, మల్లభూపతి కోశాధికారి[106]. సోమిశెట్టి రవిలిశెట్టి, 'తలారి,' 'పట్టణస్వామి' పదవులననుభవించిరి[107]. క్రీ. శ. 1320 నాటిదగు నొక శిలాశాసనమునందు కోమట్లు పాకాల గ్రామాధిపతులని పేర్కొనబడి యున్నది[108].

బ్రాహ్మణులవలె వైశ్యులు భూములపై, గ్రామములపై ఆధిపత్యము వహించినట్లున్నది. కొన్ని శాసనములందు 'వైశ్యాగ్రహారముల' ప్రశంసగలదు.[109]. నాగిశెట్టి, వల్లభశెట్టి కాకాండిలోని చెన్నమల్లికార్జునదేవునికి ఒక పూవు తోటను, మరియొక ఫలభరితమైన తోటను దానముచేసిరి[110]. మహాసార్తవాహుడైన పోలయన కాకుంద్రమాను అను గ్రామమును అన్నదానసత్రమునకు దానమొసంగెను[111]. మల్లిశెట్టి సిద్దాపురమను గ్రామమును అన్నదాన సత్రమునకు దానము చేసెను[112]. పాకాల గ్రామమునందలి కోమట్లు 5 తూములు విత్తనములు చల్లు విస్తీర్ణముగల భూమిని దేవునకు దానమిచ్చిరి[113]. బ్రాహ్మణులవలె వైశ్యులుకూడ, భూకామందులుగ అధిక ఆర్థిక సంపదలతో కాకతీయ యుగమునం దలరారిరి.

వీరు వంకగుత్తకాండ్రుగ కూడ నుండిరి. వీరిసమస్యల నన్నింటిని ప్రత్యేకముగ నేర్పరచుకొనిన సమయ సమావేశములద్వార పరిష్కరించుకొనుచుండిరి. కొన్ని గ్రామ, పట్టణములందు వీరికి ప్రత్యేకమైన వీధులు, వాడలున్నట్లు శాసనములవలన తెలియుచున్నది[114]. ఇదికొంతవరకు'Social fragmentation of the community'కి దారితీసినదేమో అనిపిస్తున్నది.

శాంతి భద్రతల నెలకొల్పుట, న్యాయమును చేకూర్చుట ప్రభుత్వముయొక్క ముఖ్య విధులు. ఈ రంగములలో కాకతీయ యుగమందే వర్ణముల కెక్కువ ఆధిపత్యమున్నదో నొకింత పరిశీలింతము. కేతన విరచితమైన 'విజ్ఞానేశ్వరీయము' ఈ సందర్భమున మనకు కొంత మూల్యమైన సమాచారము నందజేయుచున్నది. బ్రాహ్మణులు నేరస్తులైనను వారిని శారీరిక హింస పెట్టు శిక్షలు (Trial by ordeal) వేయరాదని చెప్పుచున్నది.[115] కాని శూద్రులు, వైశ్యులు మరియు క్షత్రియులు ఆ శిక్షలకు అర్హులు. బ్రాహ్మణ నేరస్తులకు 5 ఫణములు, వైశ్య నేరస్తులకు 60 ఫణములు, క్షత్రియ నేరస్తులకు 80 ఫణములు, శూద్ర నేరస్తులకు 100 ఫణములు అపరాధముక్రింద వసూలు చేయవలయునని పై గ్రంథమునందే చెప్పబడి యున్నది. దీనిని బట్టి వర్ణము ననుసరించి శిక్ష విధించెడివారని తెలియుచున్నది. కాని ఇది సత్యదూరము. పెదకోమటి వేమారెడ్డి ఆస్థాన పండితుడైన శ్రీనాథుడు, 700 టంకముల సుంకమును చెల్లించనందులకు కఠినముగ శిక్షింపబడెనని తెలుపు చాటుపద్య మొకటున్నది.[116] దీనిని బట్టి న్యాయవిచారణలో వర్ణ భేదములులేనట్లుకాన్పట్టును.

కాకతీయ యుగమందలి సాంఘిక పరిస్థితుల నెక్కువగ వివరించిన 'క్రీడాభి రామ'మందు 'జార ధర్మాసన'మను న్యాయస్థాన ప్రశంస గలదు.[117] శ్రీమాన్ మల్లంపల్లి సోమశేఖర శర్మ గారు, వేశ్య, విటులమధ్య ఏర్పడిన తగాదాను పరిష్కరింప తాత్కాలికముగ సృష్టించిన న్యాయస్థానమని వ్రాసిరి.[118] కొఱవి గోపరాజ విరచితమైన 'సింహాసన ద్వాత్రింశిక' యందు ధర్మసభ లేక ధర్మ శాసనమను న్యాయస్థానమును పేర్కొని యున్నది.[119] ఈ న్యాయ స్థానమందున్న న్యాయాధీశులను ధర్మశాసన జనులనియు లేక ధర్మశాసన సభ్యులనియు పిలిచెదరు. శక సంవత్సరము 1218 నాటిదగు త్రిపురాంతక శిలాశాసనమునందు 'తీర్పరిసభ' అను మరియొక న్యాయస్థాన ప్రశంస గలదు.[120] ఈ తీర్పరి సభ, గ్రామమునందు ఏర్పడిన సరిహద్దు తగాదాలను పరిష్కరించెడి న్యాయస్థానము. రాజ ప్రతినిధులు కూడ స్థానిక తీర్పరుల సలహాపై గ్రామమునకు సంబంధించిన నీటి పారుదల తగాదాలను పరిష్కరించెడి వారని కరీం నగరు జిల్లాలో దొరకిన నొక శిలాశాసనము వలన తెలియుచున్నది.[121] కాకతీయ యుగమందు న్యాయస్థానము లున్నట్లు ఆధారములున్నను, ఆ న్యాయస్థానములందున్న న్యాయాధీశుల యొక్క సంఖ్యగాని, వారు ఏ వర్ణములకు చెందినవారనిగాని

సరియైన సమాచారమునందజేయు నాధారములు లేవు., బహుశ పైన పేర్కొన్న న్యాయస్థానములందు, న్యాయాధీశులుగ వివేకవంతులైన గ్రామపెద్దలుండ వచ్చును. వారు అన్ని వర్ణములకు చెందినవారై కూడ నుండవచ్చును. కాని 'ఆరెకులుగ', 'తలారులుగ' కాకతీయ యుగమం దెక్కువగ శూద్ర, వైశ్యవర్ణములకు చెందిన వ్యక్తులెక్కువగ నుండిరి.

వ్యాపార సంస్థలు, న్యాయాధికారము నెక్కువగ ననుభవించినట్లాధారములు గలవు. సమయద్రోహులను శిక్షించెడి అధికారము వ్యాపారసంస్థలకుండెను. ప్రతాపరుద్రుని కాలమునాటివగు రెండు తామ్రశాసనములవలన, వ్యాపార సంస్థలకు మరణదండన వేయు అధికారముండెనని తెలియుచున్నది.[123] సుంకమునువసూలు చేయు ప్రభుత్వ ఉద్యోగులైన సుంకకరణాలను సైతము శిక్షించు అధికారము వ్యాపార సంస్థలకుండుట విచిత్రమైన విషయము.[124] బెజవాడ తెలికి వేపురు, భార్యను కోల్పోయిన భర్తకు, భార్య ఆభరణములపై హక్కు గలదని, భార్య బంధువులకు వాటిపై ఏలాటి హక్కు లేదని తీర్మానించినట్లొక శిలాశాసనమువలన తెలియుచున్నది.[125] కేశమశెట్టి, గంగిశెట్టి 'తీర్పరి సభలందు' 'తీర్పరులుగ' నుండిరి.[126] దీనిని బట్టి వైశ్యులు, వ్యాపార సంస్థలు న్యాయరంగమందు నమూల్యపాత్ర వహించినట్లు తెలియుచున్నది.

పై చర్చవలన, కాకతీయ యుగమందు శూద్రులు రాజ్యము లేలుటయే గాక క్షత్రియులమని చెప్పుకొని వారి వంశావళి పట్టికలందు పురాణపురుషుల పేర్లనుకూడ చేర్చుకొనిరి. శూద్రులమధ్య, శూద్ర బ్రాహ్మణులమధ్య, శూద్ర క్షత్రియుల మధ్య జరిగిన వివాహ సంబంధములు 'సాంఘిక గమనము'(Social mobility)ను సూచించును. మహాసామంతులు, సామంతులు ఎక్కువగ శూద్రులుండిరి. బ్రాహ్మణులు, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, దౌత్య, సారస్వత రంగములందు నమూల్యమైన పాత్ర నిర్వహించుటయే గాక, భూకామంధులుగ తయారైరి. వైశ్యులు, బ్రాహ్మణుల వలె, గ్రామపాలితులుగ, న్యాయాధీశులుగ, మంత్రులుగ, సాహస విక్రమోపేతులుగ, వ్యాపార సంస్థలకు అధిపతులుగ నలరారిరి. క్షత్రియుల ప్రగతి క్రమముగ నడుగంటసాగెను.

అధోజ్ఞాపికలు

1. శ్రీ శిద్దేశ్వర చరిత్ర, హైదరాబాదు. 1960, పుట 127.
2. ద. హిం. శా, సంపుటి, X, 278.
3. అదే చూడుము, 400, 464, 470; హెచ్. ఏ.యస్. **19, Ng. I.**
4. ద. హిం. శా, సంపుటి, X, 473.
5. అదే చూడుము, 395; జె. ఏ. హెచ్. ఆర్. యస్, **IV**, పుటలు 147 మొదలు.
6. హెచ్. ఏ. యస్, 13, పుటలు, 98, 101, శ్లో. 3.
7. అదే చూడుము, పుటలు, 144, 150, 154, 159; మార్కండేయ పురాణము, మద్రాసు. 1955, పుట. 4.
8. ఎపిగ్రాఫిక ఆంధ్రిక, I, పుటలు 81 మొదలు.
9. హెచ్. ఏ. యస్, 19 Mn. 17.
10. అదే చూడుము.
11. ప్రతాపరుద్రీయమ్, మద్రాసు. 1965, నాయక ప్రకరణము, పుట. 10, శ్లో 3.
12. శ్రీ శిద్దేశ్వర చరిత్ర, పుటలు 25.
13. ప్రతాప చరిత్రము, పుటలు 2.
14. హెచ్. ఏ. యస్, 13, పుట. 82, శ్లో. 4.
15. ఇండియన్ యాంటిక్వరీ, XXI, పుట. 200, శ్లో. 8.
16. **N. Ramesan, Gopper Plate Inscriptions of Andhrapradesh Government Museum, Hyderabad, 1962, I, p. 106, V. 4.**
17. ద. హి. శా, సంపుటి. X, 371
18. **Mc Crindle, Invasion of India by Alexander, p. 327; K. A. N. Sastri, Age of Nandas and Mauryas, p. 14; P. V. Kane, History of Dharmasastras, II—I, p, 62; R. C. Majumdar, The History of Bengal, I, p. 207; N. S. Bose, History of the Chandellas, Chapter. I; Epigraphia India, IX, pp, 324.**
19. జె. ఏ. హెచ్. ఆర్. యస్; XVIII, పుట 35.
20. అదే చూడుము, పుట. 49.

20—A. అదే చూడుము, సంపుటి. XIX, పుట. 60, XX, పుట. 132.

21. **AR, 1924, Part II, Para. 60.**
22. హెచ్. ఏ. యస్, 13, పుటలు 12, 82; ద. హిం. శా. సంపుటి, X, 395; ఏ. పి. ఇండిక, XVIII, పుట, 347; XII, పుటలు 188 మొదలు; V, పుట. 149; హెచ్. ఏ. యస్, సంఖ్య 4, పుటలు 8 మొదలు.
23. జె. ఏ. హెచ్. ఆర్. యస్; XIX, పుట 56, XX పుట 137. XVII పుట 36, హెచ్. ఏ, యస్. 13; పుటలు 31, 78; ఎ. పి. ఇండిక; IV సంఖ్య 4. **AR, 253 of 1897.**
24. **R. S. Sharma, Aspects of Political Ideals and Institutions in Ancient India, Delhi, 1959, p. 187.**

25. **K. Satyanarayana, A study of the History and culture of the Andhras, I, p. 265.**

26. **M. S. Sharma, Corpus of Telangana Inscriptions, Part IV, Hyderabad, 1973, No. 23.**

27. జె. ఏ. హెచ్. ఆర్. యస్; XX, పుటలు, 131 మొదలు.

28. అదేచూడుము, XXIII, పుట. 9; హెచ్. ఏ. యస్, 13, పుట. 98. శ్లో. 8.

29. అదే చూడుము; XXI, పుటలు. 68; XXIII, పుటలు, 48; రెడ్డి సంచిక, పుటలు. 49.

30. యన్. వెంకటరమణయ్య, పేరూరు శాసనములు, హైదరాబాదు, 1973, పుట. 9.

31. అదే చూడుము, సంఖ్యలు, 6, 8.

32. అదే చూడుము, సంఖ్య 12.

33. నెల్లూరి మండలపు శాసనములు III, ఒంగోలు. 76, తామ్రశాసనము, సంఖ్య. 17.

34. ద. హిం. శా, సంపుటి, X, 278.

35. **P. V. P. Sastri, Select Epigraphs of Andhrapradesh, Hyderabad, 1965, P. 40; M. S. Sharma Op. cit, Nos. 24, 25.**

36. **P. B. Desai & P. Sreenivasachar, Kannada Inscriptions of Andhrapradesh, Hyderabad, 1961, wg. 15, 19; Ep. Ind; IX, pp. 256.**

37. యన్. వెంకటరమణయ్య, సంఖ్యలు. 11, 15; పి. వి. పి. శాస్త్రి, సంఖ్యలు. 17, 19, 20; యం. యస్. శర్మ; పుటలు, 24, 25, 28; ద. హిం. శా, సంపుటి. X, 528, హెచ్. ఏ. యస్, 19, K. m. 1, 2.

38. ద. హి. శా, సంపుటి X, 263, 271, 304, 317, 334, 343, 320, 337, 369, 407.

39. శివయోగసారము, సుభాషి, 1927, పుట. 15.

40. ఇండియన్ యాంటిక్వరీ, XXI, పుటలు, 117–202.

41. హెచ్. ఏ. యస్. 19, Km. 25.

42. అదే చూడుము, 13, పుటలు 74 మొదలు.

43. ద. హిం. శా, సంపుటి, X, 332, 343.

44. అదే చూడుము, 375, 421, 469, 479, 480, 482, 483, 488, 501, 503, 522, 523.

45. హెచ్. ఏ. యస్, 19, Mn. 1.

46. ద. హిం. శా, సంపుటి, X, 240.

47. మనువు, VIII, 348; చూడుము, ఆర్. యస్. శర్మ, పుట. 188.

48. హెచ్.ఏ.యస్; 13, పుటలు. 125, 143, ద.హిం.శా, సంపుటి X 199.

49. హెచ్. ఏ. యస్; 13, పుట. 9.

50. ఏపి. ఇండిక, XXXIII, పుట. 104.

51. హెచ్. ఏ. యస్. 13, పుట. 143.

52. అదే చూడుము, పుట. 76, శ్లో. 12.

53. అదే చూడుము, 19, Mn. 17, పుటలు. 47 మొదలు.

54. అదే చూడుము, 19 Mn. 35, పుటలు 72 మొదలు.

55. అదే చూడుము, 13, పుట. 55, ద. హిం. శా. సంపుటి X, 340.

56. నాగపూర్ యూనివర్సిటి జర్నల్, సంపుటి, 17, పుటలు. 39 మొదలు.

57. ద. హిం. శా, సంపుటి X 77.

58. జె. ఏ. హెచ్. ఆర్. యస్. I, పుట. 77.

59. పి. వి. పి. శాస్త్రి, సంఖ్య. 20, పుట. 50.

60. ద. హిం. శా. సంపుటి X. 248.

61. యం. యస్. శర్మ, పుటలు, 39 మొదలు, సంఖ్య 22.

62. కుందూరి ఈశ్వర దత్తు, శాసన శబ్దకోశము, హైదరాబాదు, 1967, పుటలు 305 మొదలు.

63. ద. హిం. శా. సంపుటి X, 395, జె.ఏ.హెచ్.ఆర్.యస్. IX, పుటలు, 147.

64. **A. S. Altekar; The Rashtrakutas and their Times, Poona. 1934, P. P. 199-ff.**

65. **R. C. Majumdar, Corporate Life in Ancient India; Calcutta, 1922, P. 165.**

66. **G. S. Dikshit; Local Self-Gevernment in Mediaeval Karnataka, P. P. 58, 68.**

67. **P. B. Desai; A corpus of Inscriptions in the Kannada Districts of Hyderabad, P, 29.**

68. **G. Yazdani; The Early History ofthe Deccan, London, 1960, I-VI, P. 237.**

69. వి. రంగాచారి, I సంఖ్య. 348.

70. ద. హిం. శా. సంపుటి X. 79.

71. అదే చూడుము, 119, 162; 261, V. 1290; IV 1281.

72. అదే చూడుము, X. 496.

72.—A. జి. యజ్దాని, పుట. 588.

ఏ. పి. ఆంధ్రిక; I, పుటలు. 73 మొదలు; జె. ఏ. హెచ్.

73. ఆర్. యస్; XX పుటలు 126 మొదలు.

74. జె. ఏ. హెచ్. ఆర్. యస్. XX పుట. 128.

75. ఏ. పి. ఇండిక; III, పుటలు 82 మొదలు.

76. హెచ్. ఏ. యస్. 13, సంఖ్య 25; జె. ఏ. హెచ్. ఆర్. యస్. XXI, పుట 74.

77. సుభాషి, పుట. 28.

78. జి. యజ్దాని, పుట 641; ఏ. పి. కర్నాటక; XII యముకూరుజిల్లా, సంఖ్య. 14.

79. యన్. రామేషన్, పుట. 115.

80. హెచ్; ఏ. యస్. 13 పుట. 30.

81. అదే చూడుము, పుట. 21.

82. అదే చూడుము, పుట 56.

83. అదే చూడుము, పుట. 65.

84. A. R. 1905, No. 233.

85. A. R. 1917, Part II, 22, ద. హిం. శా. సంపుటి X, 340.

86. అదే చూడుము.

87. ఆర్. సుబ్రహమణ్యం; సూర్యవంశ గజపతులు, పుట;141 B. A. Saletore; Social and Political Life in the Vijayanagar Empire; Madras, 1934 I, P. P. 262.

88. హెచ్. ఏ. యస్, 19, Mn. 47.

89. అదే చూడుము. 13, పుట 153.

90. Annual Report on Epigraphy, 1967, Hyderabad 1975, No. 387.

90—A, భాస్కర రామాయణము, పుట 361, పద్యము 454; పల్నాటి వీరచరిత్ర, పుట 24.

91. శ్రీ శిద్దేశ్వర చరిత్ర, పుట 116, జె. ఏ. హెచ్. ఆర్. యస్. XXIII, పుట 105.

92. పల్నాటి వీరచరిత్ర, పుటలు 19 మొదలు.

93. జె. ఏ. హెచ్. ఆర్.యస్. XXX పుటలు. 15 మొదలు; ద. హిం. శా. సంపుటి X, 114, 264. 299.

94. ద. హిం. శా, సంపుటి V, 179, IV, 1012, 1091, VI, 136.

95. జె. ఏ. హెచ్. ఆర్. యస్. XXX పుట. 15.

96. వై. గోపాలరెడ్డి, వ్యాపార సంస్థలు—కాకతీయ యుగము; క్లియో, సంపుటి. 1, పుటలు. 1 మొదలు.

97. కె. ఏ. యన్. శాస్త్రి, ది చోళాస్, మద్రాసు 1955, పుట 597.

98. యన్. వెంకట రమణయ్య, పుట 6.

99. శ్రీమతి డా. ఏ. వి. కె. మూర్తి, తూర్పు దక్కనులోని ఆర్థిక సాంఘిక పరిస్థితులు, పుట 42.

100. అదే చూడుము.

101. ద. హిం. శా, సంపుటి VI. 136.

102. అదే చూడుము, సంపుటి V, 774.

103. వై. గోపాలరెడ్డి, పుట 21.

104. ద. హిం. శా. సంపుటి X, 240,

105. హెచ్. ఏ. యస్., 19. Mn. 1.

106. నెల్లూరి మండలపు శాసనములు, I కందుకూరు, సంఖ్య 15.

107. కుందూరి ఈశ్వరదత్తు, పుట. 175. ద. హిం. శా, సంపుటి X 685.

108. నెల్లూరి మండలపు శాసనములు, I, కందుకూరు, 54, 55.

109. జర్నల్ ఆఫ్ ఇండియన్ హిష్టరి; సంపుటి LIII, పుట 78.

110. ద. హిం. శా. సంపుటి X 534.

111. ఏపి. ఆంధ్రిక III, పుట 17.

112. జె. ఏ. హెచ్. ఆర్. యస్. XXVI, 135.

113. నెల్లూరు మండలపు శాసనములు, I. కందుకూరు, 54. 55.

114. అదే చూడుము; కందుకూరు 15, గూడూరు 115.

115. శ్రీమతి ఏ. వి. కె. మూర్తి, పుట 38.

116. M. S. Sharma, The History of the Redd Kingdoms, P. 234.

117. క్రీడాభిరామము, పద్యములు, 264–265.


118. యం. యస్. శర్మ; పుట. 157.
119. సింహాసనద్వాత్రింశిక I, III. పద్యము 102
120. ద. హిం. శా, సంపుటి X, 261, 480
121. భారతి, జనవరి, 1974, పుట 49.
122. ద. హిం. శా, సంపుటి X 685; యం. యస్. శర్మ, పుట 229.
123. AR. Cp. 10, 11 of 1918-19.
124. అదే చూడుము.
125. ద. హిం. శా, సంపుటి X, 221.
126. ద. హిం. శా, సంపుటి VI 870, 878.

* ఈ వ్యాసము నేను మేనెల 2వ తేది కావలిలో జరిగిన ప్రథమ ఆంధ్ర హిష్టరీ కాంగ్రెసులో చదివిన ఆంగ్ల వ్యాసమునకు ఆంధ్రానువాదము —

అద్వైతం

శ్రీ కె. రాంమోహన్‌రాజు

నేనప్పుడు రక్తపు నదిలో ఈదుతున్నాను
దూరంగా మణి దీప్తులతో నిండిన ఒక తార
నా హృదయ కటకంమీద ప్రతిఫలించి
ఒక శ్రుతిగా, వాద్య సంఘోషణంగా ధ్వనించి
లెమ్మని పురికొల్పి తాను నాకు వినబడునటుల, కనబడునటుల
ఆకాశాన నిలిచింది
నేనింకా పట్టుతెరలమధ్య
అద్భుత భావనా లోకాలమధ్య
సౌధంలో జలయంత్రంలా వ్యర్థంగా
ఉన్నానని సిగ్గిలి,
గులకరాళ్ళ దొర్లుతున్న గుల్లబతుకుని
చీల్చుకుని
కాలు కదల్చలేని మానసిక వృద్ధత్వంనుంచి
విదుల్చుకుని
విశాల మానవ హృదయ సంస్పందన వినలేని
జడత్వంనుంచి నన్నునేను రగుల్చుకుని
బయటికివచ్చి చరిత్ర తీరాన నిలబడి
కాలగర్భంలోకి చూశాను
దుఃఖస్నాతులైన మానవ స్వగతాలతోనిండి
శుష్కభూతమైన నీరవ స్వప్నాలతోకుంగి
సుఖాలు పగిలి — దుఃఖాలు రగిలి
బతుకే భయహేలగా, కలతగా, నలతగాతోచి
రాలిపడుతున్న లఖిత లలిత హిమతుషారం
సవ్వున మంచు తుఫానైతే సుడిపడ్డ కోడిపిల్లల్లా
అర్ధరాత్రి అంటుకున్న అడవిలో బాటసారుల్లా
కకావికలైనజనం, వికావికలైన జనం
కాలసముద్రంలో ఒకడా ఇద్దరా
మహాజనౌ క్షౌహిణీ మథనం !
చూసి ఏడవడానికి కళ్లనీరులేక, ఊరడించడానికి మాటలురాక
నాలోపల లోలోపల విలపించి, వితర్కించి
ఒక్కక్షణం నీరసంగాతోచి, గుండెలో పులులు పరిగెత్తినట్టు
మెదడులో నాగులు బుసకొట్టినట్టు
ఈచిత్రవధ ఎందుకో, ఎందుకు ఈఆశామాలికల్లోచిక్కినానో
ఎందుకీ నెగళ్లలో, పడగళ్లలో స్రుక్కి మైకాన్ని జ్ఞానంగా భ్రమించానో
ధైర్యంగా ఏడవడానికీ ధైర్యంగా నవ్వడానికీ
ధైర్యంగా చావడానికీ ధైర్యంగా బతకడానికీ
ఎందుకు భయపడుతున్నానో
పచ్చని పసిరిక పాములమధ్య
విచ్చిన నాగు పడగల రథ్య
ఎందుకు నడుస్తున్నానో అర్థంకాక
తలని ఝరీ ప్రవాహాలకేసి కొట్టుకుని
రోదనా వ్యాకులంగా నేనున్నపుడు
మళ్లీ పలికింది నక్షత్రం
వెలిగింది నా నేత్రం





పసి బిడ్డకు
జీర్ణసంబంధమైన
బాధలు కలిగినప్పుడు...

సౌమ్యంగా పనిచేసే

అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్

బాధను అతి త్వరగా తగ్గిస్తుంది



గృహౌషధములు
తయారుచేయుటలో
తరతరాలుగా
నమ్మికకు పాత్రమైన
అమృతాంజన్ వారి
తయారీ.

కడుపునొప్పి, అజీర్ణము, వాయువు, పళ్ళు వచ్చేటప్పుడు కలిగేబాధలు మొదలైన వాటిలో దేనితోనైనా సరే, మీ పసిబిడ్డ బాధ పడుతూంటె అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్‌తో అతి త్వరగా ఉపశమనం కలిగించండి త్వరగా సులభంగా తిరిగి మీ పసిబిడ్డ ఆనందంగా నవ్వుతుంది.

అమృతాంజన్ లిమిటెడ్

OBM 3410/1 TG

శ్రీ కొర్లపాటి లక్ష్మన్న

క్రియాసిద్ధిస్సత్వే - చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు

కళాప్రపూర్ణ, శతావధాని, ప్రభుత్వ ఆస్థాన కవి బ్రహ్మశ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు ఆంధ్ర భాషామ తల్లికి చేసిన అపారమయిన సేవా, దాని ప్రాశస్త్యమూ తెలుసుకోవాలంటే, నవ యుగారంభంలో ఉండే పరిస్థితులని స్థూలీపులాక న్యాయంగా నయినా తడిమిచూడాలి. పంథొమ్మిదవ శతాబ్దిని తెలుగు సారస్వతంలో నూతన శకం ఆరంభం అయింది. 1827 లో తెలుగు పుస్తకాలు అచ్చువడం ప్రారంభం. అప్పటినుంచీ భాష అభివృద్ధి పొందసాగింది. అయితే, సంస్కృతం ఆద్య ప్రకృతి అనీ, ప్రాకృతం ద్వితీయ ప్రకృతి అనీ, ఆంధ్రం వికృతి అనీ అనుకునే రోజులవి. బ్రౌన్, శంకరనారాయణ, బహుజనపల్లి సీతారామాంజనేయులు గార్లవంటి నలుగురు నిఘంటుకారులని మినహాయిస్తే మిగిలే వాఙ్మయకారులంతా ప్రబంధ కర్తలే. ఆ ప్రబంధాలలో వైవిధ్యం కనబడదు. వాటికన్నిటికీ ఒకటే మూస — అవే సన్నివేశాలూ, అవే వర్ణనలూ, అదే పరిణామమున్నూ — ఈ రీతి రచనలో ప్రత్యేక విశిష్టత మృగ్యం అయిపోయింది.

ఇలాగ ఉంటూన్న రోజుల్లో ఆంగ్ల విద్యా ప్రాబల్యం వచ్చిపడింది. వాఙ్మయంలోకూడా దాని ముద్ర ప్రస్ఫుటంగా కనిపించింది — మొదట వంగదేశంలోనూ, తరవాత తెలుగు దేశంలోనున్నూ. బంకించంద్రుడు ఆంగ్లవిద్యాభ్యాసంగ పరివర్తనానికి పరవశుడైపోయేడు. ఇలాగే తెలుగు దేశంలో యిద్దరు వ్యక్తులు కనిపిస్తారు: కాకినాడ వాస్తవ్యులు ఆర్. వెంకటరత్నంనాయుడు గారూ, రాజమండ్రి వాస్తవ్యులు కందుకూరి వీరేశలింగంపంతులు గారున్నూ. అయితే, నాయుడుగారు కేవలం ఆంగ్లపండితుడవడం చేత మత సంస్కారంతోనే వీరి వ్యక్తి సంచలనం ఆగిపోయింది. కాని వీరేశలింగం పంతులుగారు "దేశీయ సంస్కృతి" గల మనిషి. ఈయన మత సంస్కారాభిలాషకూడా భాషాభివృద్ధికి తోడయింది. ఒకప్పుడు రాజమహేంద్రవరం ఆంధ్ర విజ్ఞానానికి కేంద్రం; తిరిగీ అదే కేంద్రం అయింది. వీరేశలింగం పంతులుగారు తెలుగు సారస్వతంలో నవయుగారంభకుడు. వీరి సపర్యవల్ల భాషా సౌలభ్యం, వివిధ సారస్వత రూపవ్యాప్తి, పరభాషా వాఙ్మయం ఆంధ్రీకరించడం, యిత్యాది విషయ సౌలబ్ధి అమితంగా యేర్పడింది.

శ్రీ తిరుపతి వేంకటేశ్వరులదీ యిటువంటి సేవే. చెళ్లపిళ్ల వారి గురించి ప్రసంగించినప్పుడు, తిరుపతి కవివతంసుణ్ణికూడా కలిపిచెప్పుకోవాలి. వీరు పండితకర్షభులూ, సహజ కవులున్నూ. సంస్కృతాంధ్రాలలో విశేషమైన ప్రజ్ఞా, ఉభయ భాషలలోనూ అనర్గళమైన కవితాధారా వీరికి పెట్టని సొమ్ములు. "పెద్దనాదులకి కృష్ణరాయలులాగ పోలవరం కృష్ణరాయుడు వీరికి పట్టుకొమ్మ. ఆయన పరిపోషణ ఛత్రంక్రింద, తదుపరి, వీరు చేసిన వాఙ్మయ సేవ యించుమించు వీరేశలింగం పంతులుగారు చేసినంతా వుంది— యింకా కాస్త మెరుగ్గా వుందేమోకూడాను".

కవి పండితులు :

నేడు ప్రాచుర్యంలో ఉన్న సారస్వత రూపాలు, చాలావరకు, వీరు తీర్చిదిద్దినవే. నాటక రచనలో వీరి ప్రతిభ అగ్గలమైనది. వీరు తెనిగించిన "మృచ్ఛకటిక", "ముద్రారాక్షసా" యి సంస్కృతంలో ఉన్న మాతృకలకి మెరుగులు దిద్దేయి. వీరి పాండవ పంచకం — దానికదే సాటి.

దేవీభాగవతం రాసి పురాణశైలి తమ కైవసం చేసుకున్నారు. అప్పటివరకూ చర్విత చర్వణంగా వస్తూన్న ప్రబంధాలతో విసుగెత్తి చవి చచ్చిపోయిన జిహ్వకి "శ్రవణానందం" అనే ప్రబంధ మధుర మాకందాన్ని అందిచ్చేరు. ఈ కావ్యంలోని ఒక రెండు పద్యాలయినా కంఠతారాని ఆంధ్ర వాఙ్మయాభిలాషి ఉండడు. "Sight of Asia" ని అనుసరించిన వీరి "బుద్ధచరిత్ర" నవ్యభారతి కంఠసీమని అలంకరించిన నవరత్న ఖచిత స్వర్ణాభరణం. వీరేశలింగం పంతులుగారి స్వీయచరిత్రలాగే వీరూ "జాతక చరిత్రా," "కామేశ్వరీ శతకా"లు రాసేరు.

"జన్మనా జాయతే కవిః" అన్న సూక్తి వీరిపట్ల వర్తించినట్టుగా యింకొకరిపట్ల వర్తించదు. వీరి కావ్యాలలో రసపుష్టీ, కళోపాసనా యెంత బిగువుగా అవుపిస్తాయో, ఆధ్యాత్మిక చింతన కూడా అంత నిశితంగానూ కానవస్తుంది — "ప్రజ్ఞా పురాణీ" సంతతివారు మరి ! భావనలోనూ, రచనల్లోనూ జిగిబిగితోపాటు అతివేలమయిన స్వాతంత్ర్యం ! నిరంకుశాః కవయః !

అనాదిగా ఉన్నటువంటి నాటక, ప్రబంధేత్యాది కావ్యాలే కాక, తద్విలక్షణమైనదీ, విశిష్టమైనదీ "అధిక్షేప కావ్యం"

(Satire) కూడా రాసేరు వీరు. అధిక్షేప కావ్యాలు తెలుగు రచనల్లో క్వాచిత్కంగా కనిపిస్తాయి. అప్పటప్పట కవులు అధిక్షేపంగా పద్యాలు చెప్పడం కద్దు. కాని, యీ యుగంలో నిశిత దృష్టితో, తీవ్రకోపానలాన్ని సంపూర్ణ కావ్యరూపంగా వెలువరించింది వీరే. "గీరతం" భారతానికి దీటువచ్చే గ్రంథం. అందులో లాగే యిందులోనూ—చప్పట్ల పర్వమనీ, మేకు బిగింపు పర్వమనీ, జీలుగుబెండ్ పర్వమనీ—పర్వ విభాగం ఉంది. వేంకటకవిగారి శిష్యులొకరు, తాము వారి శిష్యులం కాము అనడంతో వెలువడిందీ గ్రంథం. ప్రతిపక్షులకి వెన్నెముక విరిగిపోయింది. ఆదిలోనే "గీరత" నిర్వచనం యెలాగ చేసేరో చూడండి—

"గీర్వాయేషు రతాస్తే వై గీరతా పరికీర్తితాః
తానుద్దిశ్య కృతం కావ్యం గీరతం పరిచక్ష్యతే॥"

"మాట" అనే అర్థం యిచ్చే వాగాది పదాలు ఉన్నా, గీ శ్శబ్దం ప్రయోగించడంలో వారికి గల భాషా పాండిత్యం, పదాల వాడుకలో వారు పాటించే ఔచితీ వ్యక్తం అవుతాయి. ఈ "గీ" శ్శబ్దానికి బదులు మరి యే శబ్దం ప్రయోగించినా ఉద్దిష్టం అయిన అధిక్షేపం (Satiric effect) రాదు అన్న సంగతి విశదం.

"కాకవి! కావపాత్రల మొగంబులు మూసెడు జీల్గు బెండ్లకున్
జేకురునే సభాస్థితియు, జేకురుగాకది, తద్రసంబులన్
గైకొనువేళ నొక్క కడగా బడవైవరె! పట్టుపట్టినన్
మేకు బిగించి లాగి బలిమిన్ పలుముక్కలు సేయకుందురే!"

యిత్యాది ఘట్టాలలో అధిక్షేప వైశిత్యం కోకొల్లలుగా అవుపిస్తుంది.

భాషా సేవ :

వీరు సారస్వతానికి యెంత సేవచేసేరో, భాషాభివృద్ధి కోసంవూ అంతకుమించి పాటుపడ్డారు. కృతకృత్యులూ అయేరు. భాషా విషయైకమయిన వీరి సేవాగరిమ యీనాడు మనకి పూర్తిగా అర్థం కాకపోవచ్చును. కాని గద్యకవిబ్రహ్మ అనిపించుకున్న వీరేశలింగం పంతులుగారు, సభలకి ఎడంగా నుంచుని—"(గిడుగు) రామ్మూర్తి పంతులు చేసే వాదంలో సత్యం లేకపోలేదు; కాని కొన్ని విషయాలు పునఃవిమర్శించాలి" అని ముందుకీ వెనక్కీ ఊగిసలాడుతూన్న ఆ రోజుల్లో,— "వీరు గ్రాంథిక భాషలో మాట్లాడ్డం లేదు కనక ఉపన్యాసవే ఆపించెయ్యా" అని రామ్మూర్తి పంతులుగారి విషయమయి, ముడికట్టుకున్న పండిత ప్రకాండులంతా ఏకగ్రీవంగా అభిప్రాయం వెలిబుచ్చి ప్రజాభిప్రాయాన్ని అల్లకల్లోలం చేసిన ఆ దినాలలో — అంతవరకూ సనాతనుల్లో సనాతనుడయిన వేంకటశాస్త్రిగారు "నేను" అవి ముందుకు వచ్చి, "ఆయన గిడుగుకాదు పిడుగు!" అంటూ సత్యాచరణకి పూనుకున్నాడు. కాలప్రవాహంతోపాటు భాషావాహిని కూడా మారుతూ ఉంటుందనీ, శృంఖలాబద్ధంగా ఉన్నన్నాళ్ళు భాషకి ప్రగతి ఉండదనీ చెవినిల్లు కట్టుకుని శతవిధాల పోరుతూన్న ద్రష్ట రామ్మూర్తి పంతులుగారి వాదంలో ఉండే సత్యాన్ని సమగ్రంగా గ్రహించిన మహనీయులు వీరు. ఉదార స్వభావులు. వీరి శిష్టవ్యావహారిక భాషా వైదుష్యాన్ని తెలియజెయ్యడానికి రెండు మచ్చుతునకలు ఉదహరిస్తాను. "శిష్టవ్యవహారమేగతి" అనే శీర్షికని తెనాలి రామలింగకవి కవిత్వం గురించి రాస్తూ, "తిరువారాధనం" అన్న పదప్రయోగం గురించి యిలా అన్నారు: యీ పదం శ్రీవైష్ణవులు దేవతార్చనాపరంగా వాడతారు. (శ్రీ శబ్దస్య తిరుశబ్దేన ద్రావిడానాం వ్యవహారః). ఇందులో "తిరు" అన్నది అఱవం. ఆరాధనం సంస్కృతం. అన్యదేశ్యాలు తెలుగులో చేర్చుకోవడానికి క్వాచిత్కంగా శాస్త్రజ్ఞుల సమ్మతికనక, తిరుపదం తెలుగే అయిందనుకుందాం. మిశ్రసమాసం చేస్తే, తిరు+ఆరాధనం=తిరారాధనం కావాలి. యణాదేశ సంధి చేద్దామంటే తిరు శబ్దం సంస్కృతం కాదుకదా... యింత గందరగోళ మెందుకు? అది తిరుశబ్దం కాదు, తిరువు శబ్దమే అంటేనో? శ్రీవైష్ణవులు దీన్ని సర్వత్రా తిరునక్షత్రం, తిరుమణి, తిరుచూర్ణం అని వుకార విరహితంగానే వాడుతూన్నారు గాని యిక్కడ తప్ప వుకార సహితంగా వాడలేదు... శిష్టవ్యవహారమే దీనికి గతి యని నా విజ్ఞప్తి.

ఇంకొకసారి "బ్రాహ్మణ శాఖలు" అనే శీర్షికని రాస్తూ, "తుని మొదలుకొని బరహంపురందాకా దివిలి ద్రావిళ్లు అనే శాఖ వుంది. వీరు పేరూరి ద్రావిళ్లే కాని అన్యులు కారు. రజస్వలా వివాహం చేయడంవల్ల స్వశాఖనుండి విడిపోవలసి వచ్చిందని వినికిడి. అలాంటి వివాహం యెందుకు చేశారో అన్యత్ర వ్యాఖ్యానించేను—తూర్పున, పుట్టనంబులు అంటూ గంజాం డి—ప్రాంతంలో వొక శాఖ వుందనిన్నీ, వారు చెప్పుకోవడం ఆరామ ద్రావిళ్లుగా చెప్పుకుంటారుగాని, ఆరామద్రావిళ్లు కారనిన్నీ మా శాఖీయులు తూర్పుదేశీయులు చెప్పగా విన్నాను...ఆయీనంబులు కూడా ఆంధ్ర బ్రాహ్మణ జాతీయులే.

వ్యావహారిక భాషా వాదానికి సారళ్యం ప్రధానం. భావరమ్యతకి అక్షర రమ్యత చేదోడు వాదోడుగా ఉండేటట్టు శిష్ట వ్యావహారిక భాషని మలిచేరు వీరు. "మాండలిక పదాలు వాడకూడదనేవార్లు, వీరు రచించిన వ్యావహారిక భాష చదివితే, తమది తప్పని వొప్పుకుంటారు. వీరి రాతల్లో సర్వప్రాంతీయ వ్యావహారికమ్మే ఉన్నట్టు కనపడుతుంది. మళ్ళా సులభంగా అర్థమవుతూ వుంటాయి." శిష్టవ్యవహార రచనలకి వీరి వ్యాసాది రచనలు నికషోపలాలు.

వచన రచనలు :

పద్య రచనలలో లాగే వచన రచనలలోనూ వీరికి ఒక ప్రత్యేకత యేర్పడింది. వీరి వ్యాసాలలో శైలి అతి నిగూఢమయిన భావాలని కూడా శిరీషకుసుమపేశలంగా పండిత పామరుల కందరికీ సులభ బోధకంగా నివేదిస్తుంది. వీరి శిల్పంలో భావోద్దీపనకీ, అర్థసౌలభ్యానికీ, రసపుష్టికీ నిరుపమానమయిన సామరస్యం వ్యక్తం

అవుతుంది. సామాన్య సంభాషణలో దొర్లే పదాలని సహితమూ రచనలలో జొప్పించి, ఒప్పించి, వాటికి ఒక స్థాయీ, అంతస్థూ వీరు యేర్పరిచేరు.

కాగా "సరస్వతీ" పత్రికద్వారా అనేక అముద్రిత గ్రంథా లని వెలికితెచ్చేరు వీరు.

వీరి "ప్రమదావనం", "వసుమతీ వసంతం" గద్యలలో కీర్తి కాలవాలములై వెలిసేయి. ప్రమదావనం ఉత్కృష్టమైనది. దీని కథాకథనంలో వీరి శక్తి అంతా ప్రదర్శితం అయింది. వీరి శైలి అత్యంతాకర్షకంగా వెలిసింది. "దాని మాధుర్యమపరిమితము. చిత్రకళా తైక్ష్ణ్యము, సంగీతములోని యానంద తన్మయత్వము, భారతీయ విగ్రహ శిల్పములోని నిగ్గు నొకచో గుమిగూడినవి."

ఆంధ్రప్రచారిణీ గ్రంథమాలద్వారా వీరు వెలువరించిన రచనలు అపారం. అందులో ముఖ్యంగా యెన్నదగినవి నవలలు. వీటిలో చాలావరకు బెంగాలీ, కన్నడ భాషలనుంచి పరివర్తనాలు. "వసుమతీ వసంతం", "దుర్గేశనందిని", "చతురచంద్రహాసం" మొదలైనవి పుంఖానుపుంఖాలుగా రచించి ప్రచురించేరు. ఈ గ్రంథ మాల ద్వారా నవలా వాఙ్మయం ఎంతో అభివృద్ధి చెందింది. "మొదట మొదట ప్రేమ ప్రధానంగా ఉన్నవల్లా తరవాత తరవాత అపరాధ పరిశోధకాలుగా మారినై... వీటిని చూసి ఆంధ్రదేశంలో అన్నిమూలలా నవలాకారులు బయలుదేరారు."

చాటుధారలూ-అవధానాలూ :

ఓం ప్రథమా శ్రీనాథుడు చాటు పద్య చక్రవర్తి ననిపించు కున్నాడు. అటుపిమ్మట, రామరాజ భూషణుడు తాను శతలేఖినీ పద్యసంవిధాన నిపుణుణ్ణని సగర్వంగా చెప్పుకున్నాడు. ఈ యుగంలో తిరిగీ తిరుపతి వెంకట కవులు పాతయుగాలని జ్ఞప్తికి తేవడమే కాకుండా, వారిని మించి చరించేరు. కలం చేత పుచ్చుకుని పద్యం రాస్తూన్నప్పుడు చెయ్యిగనక ఆగితే, ఖండించవచ్చునని శపథం పట్టేరు వీరు ! అలాగని వీరు చెప్పిన ఆశువులూ, శతావధాన పద్యాలూకూడా పాదపూరణాలు కాకుండా ఉత్తమ రసస్ఫోరకంగా ఉంటాయి. వీరి శతావధానాలవల్ల ఆ యా స్థలాలకి పేరు ప్రతిష్ఠలు వచ్చేవి అన్నారు వేటూరివారు. అంతేకాదు. రస స్ఫూర్తితో హృదయంగమంగా రాగవరసని పద్యాలు చదివే చాతుర్యం అలవడచేసిన ఆచార్యపీఠం శ్రీ చెళ్లపిళ్ల వారేనట. వేటూరివారు యింకా యేమన్నారంటే—

"కొంకులు వోని సత్కవన గుంభన మంతకు మించిబింకమున్
పొంకము గల్గగా చవులు బొంపిరివో పఠియించు నేర్పుమా
వేంకటశాస్త్రి పండిత కవి ప్రభు చక్కటిదక్క, తక్కువి
ద్యాంకుల యందు నెందుగలదా సకలాంధ్ర మహామహీస్థలిన్"

వక్తృత్వం :

వీరి శతావధానాల్లాగే, వీరి వక్తృత్వం కూడా ముచ్చట గొలుపుతూ ఉండేది. బందరులో శాస్త్రిగారి ఉపన్యాసం లేని పురజన సభలు అసలు ఉండేవే కావుట. ముందుగా విషయాన్ని తరిచి, హంశాలు యెత్తిరాసుకుని, ఫలానా మోస్తరుగా చెప్పాలి అనుకోవడం వీరు ఎన్నడూ యెరగరట! అయినా, అలాగ పరిశ్ర మించి వచ్చి ఉపన్యసించిన వారివాటికంటె, వీరి ఉపన్యాసాలే ఉరు తరంగానూ, గురుతరంగానూ, సూరిసభామోగ్యంగానూ, శ్రవణ పేయంగానూ పరిణమించేవిట! శాస్త్రిగారు వేదిక మీద నిలుచుని, స్వర్గంగా ప్రవాహావేగంతో, ఆంధ్ర సంప్రదాయ సిద్ధమయిన స్వభా వోక్తులతో, సరసోక్తులతో, ఛలోక్తులతో, మధ్యేమధ్యే ఆశు రాజాలతో ఉపన్యసిస్తూ ఉంటే సదస్సులు మంత్ర ముగ్ధులయ్యే వారని రాసేరు కురుగంటి సీతారామయ్యగారు.

ఛలోక్తులు :

ఛలోక్తికి శాస్త్రిగారు పెట్టింది పేరు. పట్టు బట్ట యెన్నాళ్లదాకా మడి అనడిగితే, కంపుకొట్టకుండా ఉంటే యెన్నా ళ్లయినా మడే నన్నారుట! ప్రయాణోన్ముఖుడికి, శ్వానం కుడి నుంచి ఎడమకి వెళితే శుభమా? ఎడమనుంచి కుడికి పోతే శుభమా అన్న పృచ్ఛవస్తే, కరవకుండాపోతే మంచిది అన్నారుట, యింకోసారి!!

యుగ కవులా ?

ఈ విషయంలో అభిప్రాయభేదాలున్నాయి. "వేంకటపార్వ తీశ్వర కవుల పేరనే యీ యుగము పిలువబడవలయునని తద్భక్తు లనుచున్నారు. కాని యీ యుగాంత్యము దవ్వులకున్నది. అంత్యము తర్వాతి వారు ఇరువదొకటవ శతాబ్దిలో విమర్శకుల కెట్లుతోచునో?" అని అంటూ ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహ కర్తలు, వీరి నవలలో అనేకం అనుసృతులు అనిన్నీ, కొన్ని అను వాదాలవలె ఉన్నాయి అనిన్నీ చెప్పేరు. వసుమతీ వసంతంలోని కథకిన్నీ, స్కాట్‌రాసిన 'క్విన్‌టెన్ డర్వర్డ్' నవలకిన్నీ పోలిక లున్నాయి అన్నారు. పిచ్చి శ్యామల కథని, షేక్స్పియరు రాసిన "మేక్‌బెత్" నాటకపు కథతో తైపారులేసి చూడమన్నారు. "తిరుపతి వెంకటకవులు శతావధానముల మూలమున విద్యాభిలాష కలిగించినందులకు వారు వంద్యులేగాని, వారు యుగ కవులను టకు నేనామోదించన"ని తల్లావఝ్ఝల వారన్నారు.

మరి కొందరు వీరిని ఈ యుగకవులుగా చెప్తారు. "ఒక కాలం యెక్కువ మంది యే కవిని ఎక్కువగా అనుకరిస్తారో వారిని ఆ యుగ కవులనవచ్చు." ఆంధ్రదేశం నిండా ఆ తర వాత వెలిసిన జంట కవులకి, వొరవడి వేంకట పార్వతీశ్వర కవులే ననాలి. వీరిని అనుకరించని కవులు చాలా తక్కువ.

తుదిమాట :

ఆంగ్ల విద్యా వ్యాసంగ ప్రాబల్యం దేశీయతని తోసి రాజం టూన్న ఆ రోజు లెక్కడ? ఎక్కడో బందరులో సంస్కృతాంధ్రాలతోనే సతమత మైపోవలసిన శాస్త్రిగారి ఉనికి యెక్కడ?

గ్రాంథిక వాదాన్ని కాదని విరాట్ రూపంతో అవతరిస్తూన్న శిష్ట వ్యవహారం యెక్కడ? గ్రాంథికం తప్ప మాట్లాడకూడదు, రాయకూడదు అని పట్టుబట్టుకు కూచున్న ఛాందస పండిత వంశం ఎక్కడ? అప్పటి వరకూ పేరైనా చెవి సోకని బెంగాలీ నవలలెక్కడ? అనూచానంగా వస్తూన్న ప్రబంధేత్యాది వాఙ్మయ రూపాలెక్కడ? అయినప్పటికీ నూతన విషయాలని శోధించి, కరతలామలకం చేసుకుని, వాటిలోని సత్యాన్ని గ్రహించి, ప్రగతి మార్గాన్నే లక్ష్యంగా పెట్టుకుని, అనేక విధాలుగా తెలుగు సాహిత్యాన్ని మరిచి, పురోగమింపచేసి, మార్గదర్శికులయ్యేరు చెళ్ల పిళ్లవారు.

ఈ రీతిగా ''సాహిత్యాచార్యులూ, ప్రబంధ పరమేశ్వరులూ, నాటక ప్రణేతలూ, వాచప్రవీణులూ, విమర్శన ప్రముఖులూ, హృదయమునుఱ్ఱూతలూచు పాఠకులూ ''అయిన శాస్త్రిగారికి ఏ ప్రభువూకూడా తన పేరోలగాన్ని నిత్య కవితా వినోదానందాన్ని చేకూర్చలేకపోయినా, శాస్త్రిగారే ప్రజలలో నిండుకొలువు కల్పించుకున్నారు. ఏనాడో ఆంధ్ర భారతి తన విద్వజ్జన రత్నహారంలో శ్రీ శాస్త్రిగారిని కౌస్తుభమణిగా పరిగణించింది. చివరకి ప్రభుత్వం కూడా వీరిని ఆస్థానకవిగా అంగీకరింపక తప్పిందికాదు! 'క్రియాసిద్ధిస్సత్త్వే భవతి మహతాం నోపకరణే!'

ఈ వ్యాస రచనలో తోడు పడ్డవి

(Bibliography)

(1) ఆంధ్రపత్రిక 30–7–1940
(2) ఆంధ్రపత్రిక 20–8–1944
(3) ఆంధ్రపత్రిక 14–4–1948
(4) కవిత్వతత్త్వ విచారము—కట్టమంచి రామలింగారెడ్డిగారు.
(5) ఆంధ్ర వాఙ్మయి చరిత్ర సంగ్రహం.
(6) నవ్యాంధ్ర సాహిత్య వీధులు.

క్రాంతి జ్వాల-శాంతి హేల

శ్రీ కాసల నాగభూషణం

చీకటిపై విజయం ప్రకటిస్తున్నాను.
పవన జవనాశ్వ పంచకం పూన్చిన
జ్వాలా స్వర్ణ స్యందనాన్ని అధిరోహించి,
ధూమవర్ణ కేతన పటాంచలాన్ని
రిక్కల మార్గంలో రెపరెపలాడిస్తూ
కాంతి కన్యకా సమేతంగా
వియన్మధ్య రథ్యలో ఊరేగివస్తున్నాను.
ఉర్వీ తలానికి
ఉడివోని శాంతిసౌఖ్యాన్ని ఊరించి తెస్తున్నాను.
నిన్నటి వరకూ
నేల నలుమూలలా వ్యాపించిన అంధకారం—
అజ్ఞానం, అహంకారం
అలసత్వం, అసమానత్వం—అంతా
నేటి ఈ మతాబాల
నిప్పుల రవ్వల వడిలో,
జడిలో
ఒరిగిపోయింది.
నిలువెల్లా కరిగిపోయింది.
ఒరిగిపోయి, కరిగిపోయి
వెలుగు వెల్లువలో కలిసిపోయింది.
ఈ కరిగిన కొత్త వెలుతురు నెత్తురుగా
ఉదయించిన రేపటి పాప
తన కాకర పూవత్తుల చేతులతో
నక్షత్రాల నవ్వుల్ని వెదజల్లుతుంది.
మంత్ర నగర ద్వారాలకి
మరోరకం మాలికల్ని అల్లుతుంది.
ఇప్పుడు
ఒక చేత కాంతినీ,
వేరొకచేత శాంతినీ నాతో చేర్చుకుని
దిగుతున్నాను నేనూ స్యందనాన్ని.
దింపుతున్నాను మనందరిమధ్యకీ
స్వర్గలోక నందనాన్ని.
కాంతిని
ప్రతియింటి ముంగిటి ప్రమిదలోనూ
జ్వాలగా మారనివ్వండి!
శాంతిని
ప్రతి ఎడద విడిదిలోనూ
హేలగా చేరనివ్వండి!
కవికుమారుని సంతసంలో మీ వంతు స్వీకరించండి!
గతవ్యథల ఉదంతాన్ని కొంత కొంత మరచిపొండి!!

ఆంధ్ర వచన వాఙ్మయము*

తెలుగులో కవుల చరిత్రలే ఎక్కువగా ఉన్నవి. వాఙ్మయ చరిత్రలు వానికంటె చాలా తక్కువగానే ఉన్నవి. కవుల చరిత్రలు వ్రాయడం కంటె వాఙ్మయ చరిత్రలను రచించడం కొంత కష్టమే దీనికి కారణమై ఉండవచ్చును. ఉన్న వాఙ్మయ చరిత్రలయినా గద్య పద్య సామాన్యములై ఉన్నవేగాని ప్రత్యేకంగా వచనవాఙ్మయానికి సంబంధించినవి ఏ మల్లాది వెంకటరత్నంగారిదో, ఏ గొబ్బూరి వేంకటానంద రాఘవరావుగారిదో తప్ప ఇతరాలు కానరావు. వాఙ్మయాన్ని చర్చించే వ్యాసాలు ఎన్నో వచ్చినా, ఇంచుమించుగా అన్నీ పద్య వాఙ్మయాన్ని గురించినవే! పైవారి వచన వాఙ్మయ చరిత్రలయినా అసమగ్రాలుగానే ఉన్నవి. ఇట్టి స్థితిలో ఆంధ్ర వాఙ్మయాన్నంతనూ పూర్తిగా అవలోడన చేసిన విమర్శకాగ్రేసరులు, విద్యారత్న వేంకటరావుగారు సమగ్రమైన వచన వాఙ్మయ చరిత్ర రచనకు పూనుకోవడంవల్ల తెలుగు వాఙ్మయానికి మహోపకారం జరిగినదనే చెప్పవచ్చును.

శ్రీ వెంకటరావుగారి పరిజ్ఞానాన్ని గ్రహించే పాతికేళ్ళక్రిందట ఆంధ్రపత్రికాధిపతులూ, తత్సంపాదకులూ అయిన శ్రీ శివలెంక శంభుప్రసాద్‌గారు "ఆంధ్రవచన రచన"ను గురించి ఒక వ్యాసం సంవత్సరాది సంచిక కోసం వ్రాయాలని వీరిని కోరారు. సంవత్సరాది సంచికలో ప్రకటించబడిన ఆ వ్యాసం వాఙ్మయాభిమానుల ఆదరాన్ని ఎంతగానో పొందినది. దానిని ప్రశంసిస్తూ చాలామంది శ్రీ శంభుప్రసాద్‌గారికి జాబులు కూడా వ్రాశారు. ఆ వ్యాసాన్ని విపులీకరింపజేసి, పుస్తక రూపంగా ప్రకటించాలనే సంకల్పం ఆయనకు కలిగింది. వారి కోరిక ప్రకారం శ్రీ వేంకటరావుగారు ఆది నుండి పందొమ్మిదవ శతాబ్ది చివరి వరకూ వుండే ఆంధ్ర వచన వాఙ్మయాన్ని గురించి విపులమైన వ్యాసం రచించారు. అది ఎంతో ఆకర్షణీయంగా ముద్రించబడి ఆంధ్ర గ్రంథమాల ప్రచురణగా ప్రకటింపబడినది. దాని ప్రతులు కూడా కొద్ది కాలంలోనే చెల్లిపోయినవి. తిరిగి వచన వాఙ్మయ చరిత్ర లభించని పరిస్థితే ఏర్పడింది. శ్రీ వేంకటరావుగారు ఆ మాత్రపు రచనతో తృప్తిపడకుండా, ఇప్పటి వరకూ ఉన్న వచన వాఙ్మయాన్ని — వ్యావహారిక — గ్రాంథిక భేదం లేకుండా పరిశీలించి, విపులమైన వ్యాసాన్ని తయారుచేశారు. ఇది వెనుకటి గ్రంథం కంటె ఇది చాలా పెద్దది. దీని ప్రకటన కూడా ఆంధ్రపత్రికాధిపతుల ఆర్థిక సహాయం వల్లనే జరిగింది. శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు, శివలెంక శంభు ప్రసాద్ ధర్మనిధి వారు ముద్రణ వ్యయాన్ని నిధిమూలంగా ఇచ్చి యీగ్రంథాన్ని (వ్యాసాన్ని) వెలుగులోనికి తీసుకువచ్చారు.

వాఙ్మయమంటే గ్రంథాలు మాత్రమే అని అనుకోనక్కర లేదు. శాసనాలు, వ్యాసాలు, పత్రికల సంపాదకీయాలు, జాబులు మొదలైనవి కూడా దానిలో చేరుతాయి. అందువల్ల వచనంలో ఉండే అవన్నీ — ముఖ్యమైనవి యీ వచన వాఙ్మయ చరిత్రలో చర్చించబడినవి. ఇందులో చిన్నవీ, పెద్దవీ కలిపి ఇరవైయారు శీర్షికలు, ఒక అనుబంధము ఉన్నవి. ఆ శీర్షికలలో వచన పరిణామాన్ని బట్టి చేసిన యుగ విభజనలు—నన్నయ పూర్వయుగము, శివకవి — తిక్కన యుగములు, ఎఱ్ఱా ప్రెగడ — శ్రీనాథయుగము, శ్రీకృష్ణదేవరాయయుగము, దక్షిణాంధ్రయుగము, కుంఫిణీయుగము, ఆంగ్లపాలనయుగము అనునవి ఉన్నవి. మొదట సంస్కృతాంధ్రాలలో గద్య—వచనముల నిర్వచనం, ఆ పదముల వాడుక వివరించబడినవి. ఋగ్వేదంలోని సూక్తాలు పద్యమయాలనీ, యజుర్వేదంలోని యజుస్సులు గద్యాలనీ, గద్యాలు కూడా పద్యాలవలె సస్వరంగా గానం చెయ్యడం కలదనీ, లౌకిక వాఙ్మయంలో కూడా మొదట్లో పద్యాలకున్నంత ప్రశస్తి వచనాలకు లేదని తెలుపబడింది. కందుకూరివారు ముఖపత్రాన్ని పద్యరూపంగా కూర్చడం, కొక్కొండవారు బిల్వేశ్వరీయం విషయసూచికను పద్యంలో కూర్చడం చూపబడింది.

నన్నయకు పూర్వం ఉండే శాసనాలలోని వచన భాగాలు ఎలా ఉండినదీ, తర్వాత శివకవుల కాలంలోనూ, తిక్కన యుగంలోనూ ఎట్టి మార్పులను చెందినదీ రచయిత వివరించారు. ప్రత్యేకమైన వచన వాఙ్మయం పూర్వం లేదనీ, అది నవీనమనీ చాలామంది భ్రాంతి. కాని, ద్వితీయ ప్రతాపరుద్రుని కాలంనాటికే కృష్ణమాచార్యులనే సింహాచలక్షేత్ర నివాసి 'సింహగిరి నరహరి వచనములు' వ్రాసి, వచనవాఙ్మయ ప్రథమాచార్యుడయ్యెనని, తాళ్లపాక అన్నమాచార్యులకు మార్గదర్శకుడయ్యెనని శ్రీ వేంకటరావుగారు తెలుపుతున్నారు. అప్పటినుంచే ప్రత్యేక వచన వాఙ్మయం ప్రారంభమై, స్తోత్ర రూపాలయిన అనేక వచనాలు వచ్చాయి. ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు సముఖం వెంకట కృష్ణప్పనాయకుడు రచించిన జైమిని భారతాన్ని ప్రకటించిన తర్వాతనే వచన గ్రంథాలను గురించిన ఆలోచన, పరిశీలన ప్రారంభమయాయి. ఇందులో 16 వ శతాబ్ది మధ్యకాలం నుండీ రచితాలయిన చాలా వచన గ్రంథాల వివరణ ఇయ్యబడింది.

కుంఫిణీయుగంలో క్రైస్తవులు తెలుగు ముద్రణానికీ, వచన వాఙ్మయానికీ ఎంతో సేవ చేసినట్లు ఈ గ్రంథం తెలుపుతున్నది. వారి వాఙ్మయమంతా వ్యావహారికంలో ఉన్నది. సాహిత్య దృష్టితో చూస్తే దానికి ఎక్కువ విలువ లేకపోయినా. విషయాన్నిబట్టి విలువ ఉండనే ఉన్నది. ఈ యుగంలో సి. పి. బ్రౌను పండితుని సాహిత్యసేవ ఎక్కువగా ప్రశంసింపబడింది.

* ఆంధ్ర వచన వాఙ్మయము . రచన : కళాప్రపూర్ణ శ్రీ నిడుదవోలు—వేంకటరావు, ఎం. ఏ. డెమ్మీసైజు 12+223 పుటలు. వెల రూ. 6 ప్రకాశకులు శ్రీ ఎన్. ఎస్. సుందరేశ్వరరావు, ఎం. ఏ., బి. ఓ. ఎల్. లక్ష్మీకాంత నిలయం, 2—2—1187/5. న్యూనల్లకుంట, హైదరాబాదు—44.

ఆంగ్ల పాలన యుగంలో మద్రాసు విశ్వవిద్యాలయ స్థాపనను గురించీ, పరవస్తు చిన్నయసూరి, కొక్కొండ వెంకటరత్నం, కందుకూరి వీరేశలింగం మున్నగు వారిని గురించీ ఎన్నో వివరాలు ఉన్నవి. వారి వచన రచనా పద్ధతిని గురించి స్పష్టపరచబడింది. అంతేకాకుండా వ్యావహారిక భాషను గురించిన వాదోపవాదాలు, అప్పటి వేర్వేరు విద్వాంసుల మనస్తత్వాలు స్పష్టం చెయ్యబడినవి.

ఆంధ్ర వాఙ్మయంలోని పెక్కు ప్రక్రియలలో రచనలు ప్రారంభించి మార్గదర్శకులైన వీరేశలింగం పంతులుగారు తానే మొదటి నవలా రచయితనని చెప్పుకొన్నారు. అది సరికాదని, ఆయనకు ముందే నరహరి గోపాలకృష్ణమ్మసెట్టిగారు రంగరాయ చరిత్ర అనే నవల వ్రాశారనీ కొన్ని దశాబ్దుల క్రిందటనే (రమారమి 40 ఏళ్ల క్రిందటనే) సాహిత్య విమర్శకులు తెలియజేశారు. శ్రీ వేంకటరావుగారు కొక్కొండవారి 'మహాశ్వేత' యే తొలినవల అంటున్నారు. తామీవరకే యీ విషయం వెల్లడించగా, కొందరు సందేహించారనీ, కాని అలా సందేహించడానికి అవకాశం లేదనీ యిందులో స్పష్టం చేశారు. 'మహాశ్వేత' కాదంబరిలోని కథయే కాని కొత్తది కాదని, స్వకపోల కల్పితమైన రచనయే నవల అనడం ఉచితమనీ ఆ విమర్శకుల అభిప్రాయమేమో! ఏమయితేనేమి, వీరేశలింగంగారి రాజశేఖర చరిత్రయే మొదటి నవలగా ప్రఖ్యాతి పొందింది. అంతకుముందు రచితాలయిన వాటికి ఆ ప్రఖ్యాతి రాలేదు. ఇతరులు స్పృశింపని విషయాన్ని వెల్లడించినందుకు శ్రీ వేంకటరావుగారు అభినందనీయులు!

నవలలను గురించి వ్రాస్తున్నప్పుడు మొదట నవలల రచనను ప్రోత్సహించడానికి జరిగిన పోటీలను గురించీ, అప్పుడు వెలువడిన నవలలను గురించీ వివరాలు ఇయ్యబడినవి. వేంకటరావుగారు ఈ వివరాలియ్యకపోతే వీటి సంగతి యువలోకానికి తెలిసే అవకాశమే లేకపోయేది.

గత శతాబ్ది చివరి భాగంలోని వ్యక్తుల చమత్కార ప్రసంగాలను గూర్చి కూడా ఆనుషంగికంగా తెలియజేయబడింది.

1954 లో దీనిని ప్రకటించినప్పుడు పందొమ్మిదో శతాబ్దం చివరివరకూ ఉన్న వచన వాఙ్మయాన్ని పురస్కరించుకునే రచన సాగింది. ఈ ముద్రణలో ఇరవయ్యో శతాబ్దానికి సంబంధించిన వివిధ వచన శాఖలను గురించి కూడా తెలుపబడింది. ఈ శతాబ్దంలో వచన సాహిత్యం ఎంతో విస్తరించింది. ఎన్నో ప్రక్రియలు నూతన మార్గాలలో బయలుదేరాయి. కథలు, కథానికలు, ఏకాంకికలు, వ్యాఖ్యానాలు, లేఖలు, వ్యాసాలు, పత్రికా వాఙ్మయం, ఆకాశవాణి ప్రసంగాలు, విజ్ఞాన సర్వస్వాలు మున్నగునవి చాలా వచ్చాయి. వీటినన్నింటినీ స్పృశించి వ్రాయడం ఎంతో కష్టసాధ్యం. ప్రారంభిస్తే ఎంతో గ్రంథం పెరుగుతుంది. అయినా శ్రీ వేంకటరావుగారు తమ రచనకు ఒక పరిమితి పెట్టుకొని పయివాటిని గురించి సంగ్రహంగా, తమకు ముఖ్యములని తోచినవాటిని గూర్చి తెలియజేశారు.

కథానికలను గురించి వ్రాసేటప్పుడు వాని సామాన్య లక్షణాలను, దీక్షితులుగారి పిల్లల కథలను, విశ్వనాథవారి ప్రౌఢశైలిని ప్రశంసించారు. వేలూరి శివరామశాస్త్రిగారు, మునిమాణిక్యం నరసింహారావుగారు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారు మంచి కథలు వ్రాసినారన్నారు. వీరి కథలు అందర్నీ ఆకర్షించేవే!

వ్యాసాలను గురించి వ్రాస్తూ, సాక్షి వ్యాసాలకు ఒక ప్రత్యేక స్థానం ఉన్నదని చెప్పడం అక్షరాలా సత్యం. ఒకప్పుడవి పాఠకులను ఉర్రూత లూగించేవి. వ్యాస రచనా ప్రక్రియకు సామినేని ముద్దు నరసింహులు నాయుడుగారు నాంది అంటూ వ్యాస లక్షణాన్నీ, దాని క్రమ పరిణామాన్నీ శ్రీ వేంకటరావుగారు విపులంగా తెలిపారు. సాహిత్య వ్యాసకర్తలలో నడకుదుటి వీరరాజుగారిని, వేలూరు శివరామశాస్త్రిగారిని, రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మగారిని ప్రధానంగా పేర్కొన్నారు. ప్రారంభ దశలోనేకాక తర్వాతకూడా వారి వ్యాసాలు సాహిత్యాభిమానుల ఆదరాన్ని పొందుతూ ఉండేవి. చారిత్రకవ్యాసాలు వ్రాసేవారిలో చిలుకూరి వీరభద్రరావుగారు, మల్లంపల్లి సోమశేఖర శర్మగారు, కుందూరి ఈశ్వరదత్తుగారు, భావరాజు వెంకట కృష్ణారావుగారు, నేలటూరి వెంకట రమణయ్యగారు, రాళ్లబండి సుబ్బారావుగారు, మారేమండ రామారావుగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ముఖ్యులుగా పేర్కొనబడినారు. చరిత్ర విషయంలో ప్రభాకరశాస్త్రిగారు సాటిలేనివారని 'కనిష్ఠికాధిష్ఠిత కాళిదాసా' అని ప్రశంసింపబడినారు. చరిత్రలోనేకాదు, సాహిత్యంలోను, పరిశోధనలోను కూడా ఆయన అట్టివారే!

అచ్చ తెనుగు వచన రచయితలలో పుంభావ సరస్వతి ఆదిభట్ల నారాయణదాసుగారిని పేర్కొనడం ఎంతో సముచితంగా ఉన్నది. అట్టి రచయిత ఆయన ఒక్కరేయేమో అనిపిస్తుంది.

భారతదేశ ప్రాచీన విజ్ఞానాన్ని వివరించే వ్యాసాలు వ్రాసేవారిలో పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు, ఒంగోలు వెంకటరంగయ్యగారు, గొబ్బూరి వెంకటానందరాఘవరావుగారు ఈ గ్రంథాన్ని బట్టి ముఖ్యులుగా కానవస్తున్నారు. వారి పరిశోధనలు అమూల్యమైనవి.

పత్రికా సంపాదకీయాలను వాఙ్మయంలోని ఒక భాగంగా ఇదివరకు ఎవ్వరూ చెప్పినట్లు నాకు జ్ఞప్తి లేదు. ఈ గ్రంథరచయిత వాటికి వచన వాఙ్మయంలో స్థానం కల్పించారు. కృష్ణాపత్రికా సంపాదకులు ముట్నూరి కృష్ణారావుగారు, ఆంధ్ర పత్రికా సంపాదకులు కాశీనాథుని నాగేశ్వరరావుగారు, శివలెంక శంభుప్రసాద్‌గారు, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావుగారు వ్రాసిన సంపాదకీయాలు అమూల్యాలని వీరు తెలపడం సమంజసంగా ఉన్నది. తక్కిన వాటిసంగతి తెలియదుకాని కృష్ణారావుగారి సంపాదకీయాలలో మాత్రంకొన్ని వాచక పుస్తకాలలో పఠనీయాలుగా ప్రకటింపబడేవి.

సాహిత్య పత్రికలలో సారస్వత సర్వస్వం, భారతి, ప్రతిభ, విభూతి ప్రశంసించబడ్డాయి. భారతిని విడిచి మిగిలినవి స్వల్పకాలమే సాగినా ఉత్తమమైన సారస్వత సేవ చేశాయని చెప్పవచ్చును.

ఇప్పుడు ఇంచుమించుగా వచన వ్యాసాలన్నీ వ్యావహారిక భాష లోనే వస్తున్నవి. వీరేశలింగంగారి కాలంలో వ్యావహారిక భాషను గ్రంథాల్లో వాడకూడదనే అనుకునేవారు. సంస్కృత నాటకాలను తర్జుమా చేసినప్పుడు ప్రాకృతానికి బదులు వ్యావహారికాన్ని వాడ కుండా సంస్కృతాన్నే వాడేవారు. వ్యావహారిక వాదానికీ, దాని ఉప యోగానికీ మొదటి మార్గదర్శకులు గురజాడ అప్పారావుగారూ, గిడుగు రామమూర్తి పంతులుగారున్నూ, చెళ్లపిళ్లవారు వ్యావహారిక రచన ప్రారంభించడంతో రచయిత లందరూ ఆ మార్గాన్నే తొక్కి నారు. పంచాగ్నులవారు రామమూర్తి పంతులుగారికి కుడిభుజంగా పనిచేశారు. ఈ గ్రంథంలో పై విషయాలు బాగా గోచరిస్తాయి. పత్రికా రచనలోని క్రమ పరిణామం కూడా స్పష్టం చెయ్యబడింది.

విశేషమేమిటంటే — శ్రీ వేంకటరావుగారు గ్రాంథికంలోనే గాని, వ్యావహారిక భాషలో గ్రంథ రచన చేసినట్లుగాని, వ్యాసాలు వ్రాసినట్లుగాని కానరాదు. అయినా వ్యావహారికంపైని అభిమానం చూపడం వారి విశాల హృదయానికి తార్కాణం.

ఈ విధంగా యీ గ్రంథంలో తెలుగులోని వచన వాఙ్మ యాన్ని గురించి ఎన్నో విషయాలు బయలుపరచబడ్డాయి. ఇందలి రచన సామాన్య పాఠకుణ్ణి కొంత తికమకలు పెడుతుంది. అది ఒక రచనా చమత్కృతి. ముందు వెనకలను బాగా అవగాహన చేసుకుంటే విషయమంతా కరతలామలకమౌతుంది. శ్రద్ధగా చదివితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చును.

తెలుగులో వచన వాఙ్మయ చరిత్రలేని లోపాన్ని ఈ గ్రంథం తీరుస్తుంది. దీని రచనకు ప్రధానకారకులైన కైలాసవాసి శ్రీ శివ లెంక శంభుప్రసాద్‌గారి స్మృతి చిహ్నంగా ఇది ప్రకటితం కావడం ఎంతో ఉచితంగా ఉన్నది. ఆంధ్రావనిలో దీనికి గొప్ప ఆదరం లభించ గలదని నా ఆశయం.

— *శ్రీ బులుసు వేంకట రమణయ్య*

వెన్నెల తుఫాను

శ్రీ రామా చంద్రమౌళి

ఎక్కడో హృదయాన్ని పోగొట్టుకున్నాను
ఉదయించని తూర్పు ఆకాశంలా,
ప్రవహించని నదీ ప్రవాహంలా — నేను మిగిలి
నాలో సమస్యల పాతాళగంగలు పొంగి పొంగి
నరాల తీగలను
శిలా వీణపై మ్రోగిస్తున్నాయి
రాగాలు పక్షుల్లా గొంతు విప్పితే ఏంలాభం
రెక్కలులేని శబ్దాలు ఎంతదూరం పరుగెత్తుతాయి
ఎన్నో మధుర ధ్వనులు మల్లెపూలై
రాతివిగ్రహాలపై కురియడం నేను చూశాను
కాని వెన్నెల తుఫానుగా మారి
నేను పదిలంగా దాచుకున్న ఎన్నో రమ్యానుభూతులను
అగాథాల్లోకి కొట్టుకుపోయింది —
కలల్లో స్నానం చేసిన నా కళ్ళు
ఎదురుగా ఫిలమెంట్ రాలిపోయిన బల్బును చూస్తూ
శిశిర పత్రాల్లా కన్నీళ్ళను రాల్చుతున్నాయి

నాకు తెలుసు —
నేను సూర్యునికన్నా గొప్పవాన్నని...,
సూర్యుడు యివ్వాళ అస్తమించి మళ్ళీ రేపు పుడతాడు
మరి నేనో —
ఒక్కసారి ఉదయిస్తే చుక్కలా శాశ్వతంగా ఉండిపోవాలి
కాని...నిరాశలు అప్పుడప్పుడు శిలాబాణాల్లా
గుండెల్లోకి కుమ్ముకొస్తాయి
అప్పుడు నేను ధనుస్సులా వంగి వంగి
తపస్సులో పొంగి పొంగి
తమస్సులోనుండి ఉషస్సునై చొచ్చుకొస్తాను.
పిడికిళ్ళనిండా అగ్నిజ్వాలలతో
ఆకాశాన్నీ, అఖాతాలనూ,
దిక్కుల గర్భాంతరాలనూ గాలిస్తున్న నాకు
యిప్పుడు —
నా హృదయం సముద్రంకన్నా లోతుగా కనబడుతోంది
అసలు నేను — నన్ను నేనే పోగొట్టుకుని
నా హృదయంలో నేనే కరిగిపోతున్నాను.

భగీరథుని అడుగుజాడల్లో

"గలగలా పారేటి గంగమ్మతల్లీ
చల్లని చూపుతో సంపదలనివ్వు"

నదులు ఉప్పొంగి గట్లు తెంచుకుని వరదల ఉరవడితో, ఉరుకులు పరుగులతో ప్రవహిస్తూ ఉంటే నదీమతల్లిని శాంతింప జేయడానికి ఊరి ముత్తైదువులు పసుపు కుంకుమ, హారతి పళ్లాలతో జానపద గీతాలు పాడుతూ నదిగట్టుకు చేరి పసుపు కుంకుమలు, కొత్త రెవిక మడతలు నదిలోకి విడవడం అలనాటి ఆచారం. మానవుడు ప్రకృతిని తన సౌభాగ్యం కోసం వినియోగించుకోవడం నేర్చిన తర్వాత నదులను కూడా అదుపులోకి తెచ్చాడు. అవి సముద్రాన్ని వదలి మన పంట భూములను ఆశ్రయిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ నదుల రాష్ట్రం. మన రాష్ట్రంలో బీడు భూములను బంగారం పండే పంట భూములుగా మార్చడానికి వీలుగా నీటిపారుదల సౌకర్యం కల్పించడానికి భగీరథ ప్రయత్నం జరుగుతూనే వుంది.

ఐదవ ప్రణాళిక కాలంలో **4,65,000** ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించాలి.

భారతీయ ఇంజనీరింగ్ ప్రతిభకు నిదర్శనంగా నాగార్జున సాగర్ వంటి ప్రాజెక్టులు వెలుస్తున్నాయి. తెలంగాణాకు వర ప్రసాదం పోచంపాడు ప్రాజెక్టు. రు. **182** కోట్లతో నిర్మిస్తున్న వంశధార ప్రాజెక్టు మన రైతుల భవిష్యత్తుకు వెలుగుబాటలు.

సమాచార పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.

శ్రీ కలువకొలను సదానంద

నగ్నరాత్రి

(గతసంచిక తరువాయి)

3

బసవరాజాగారి యింటిముందు పందిరిక్రింద చాలా సందడిగా వుంది. బెంచీలమీద, కుర్చీలమీద ఊరిలోని పెద్దమనుషులు, పొరుగూళ్లనుండి వచ్చిన పెద్దమనుషులు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. కొందరు భోజనాలకోసం వేచివున్నారు. మరికొందరు భోజనాలు చేసి, తాంబూలాలు నములుతున్నారు. గేటు లోపలవున్న విశాలమైన లోగిలిలో వడ్డన జరుగుతూంది. కుక్కల్నీ, అడుక్కు తినే వాళ్ళనీ, అనాథుల్నీ అరికట్టడమే పనిగా పెట్టుకున్న మనిషి ఒకడు గేటు దగ్గరే నిలబడ్డాడు.

క్రితంరోజే జరిగింది బసవరాజాగారి కొడుకుపెళ్ళి కన్యాదాత స్వగృహంలో. అదేదో వూరు...రైలుచార్జీ ఇరవై రూపాయలట! ఇప్పుడు జరుగుతున్నది మగపెళ్ళివారి విందు.

ఊళ్ళో పేరూ పలుకుబడీ వున్నవాళ్ళంతా పెళ్ళాలకు పట్టుచీరలు కట్టబెట్టి, మెడనిండా మోపెడు నగలు తగిలించి విందుకు వెంటబెట్టుకొచ్చారు.

పందిరి వెలుపల చెత్తకుండీలో చిందరవందరగా పడివున్న ఎంగిలి విస్తరాకుల్ని కెలుకుతూ, కుక్కలు కాట్లాడుకుంటున్నాయి. చెత్తకుండీ దగ్గరే పిచ్చిదొర నిలబడి వున్నాడు.

మళ్ళీ ఎవడో మోపెడు ఎంగిలి విస్తరాకుల్ని తెచ్చి తొట్టిలో పడేశాడు. వాటి కోసమే కాచుకొని వున్న ఓ పది మంది గతిలేని వాళ్ళు బిలబిలమంటూ తొట్టి మీదికి ఎగబడ్డారు. విస్తరాకుల్ని చకచకా పార్లిస్తూ, వాటిలో మిగిలిపోయిన ఎంగిలి పదార్థాల్ని చేతులో జవిరి గిన్నెల్లో, డబ్బాల్లో పడేసుకుంటూ చేతులు నాక్కుంటున్నారు.

వాళ్ళకు అపురూపమైన ఆ ఎంగిలి కూటిని విస్తళ్ళలో విడిచి లేచిన పెద్దమనుషులు చేతులు కడుక్కొని భుక్తాయాసంతో బయటపడుతున్నారు.

వాళ్ళ దగ్గిర కూలీనాలీ చేసి వాళ్ళిచ్చే పావలా డబ్బులతో ఆకలి తీరని వాళ్ళు ఎంగిలి మెతుకులు ఏరుకుంటున్నారు.

వాళ్ళ రక్త మాంసాలలోని జవ సత్వాలను వాడుకుని, తమ సిరిసంపదల్ని పెంచుకుని నేలమీద నడవటం మరిచిపోయిన వాళ్ళు నెయ్యన్నం తిని తేన్పుతున్నారు.

బక్కవాళ్ళు చూస్తూ వూరుకుంటున్నారే! బలిసినవాళ్ళను క్షమించి వదిలేస్తున్నారే! ఈ పదిమందీ ఒక్కుమ్మడిగా పోలో మంటూ వెళ్ళి భోజనశాలను ఆక్రమించుకుని, ఆ బలిసిన వాళ్ళ నందర్నీ ఈ ఎంగిలాకుల దగ్గిరికి తరమగొట్టరాదూ ?

అంతపని జరగలేదుకానీ, ఎంగిలి కూటికోసం బక్కవాళ్లే సిగపట్లు పట్టుకుంటున్నారు, పేగులు మాడిన కుక్కల్లా!

కిందివాళ్ళు పైవాళ్ళ మీద తిరగబడటం లేదు. తమలో తామే పోటీలు పడుతున్నారు.

పైవాళ్ళు ?

ఎప్పుడు పోటీ పడాలో, ఎప్పుడు భేటీ కావాలో వాళ్ళకు బాగా తెలిసినట్లుంది. వాళ్ళు ఎప్పుడు పోటీ పడినా, కిందివాళ్ళను దోచుకోవటానికేగానీ, తమను తాము దోచుకోవటానిక్కాదు. ఎన్నికలప్పుడు ఒకరితో ఒకరు పోటీలు పడి దొమ్మీలకు తలపడే బలిసిన వాళ్ళు యిప్పుడు పోట్లాడుకోవటం లేదు. భుజాలు రాచుకుంటూ ముచ్చట్లు చెప్పుకుంటున్నారు.

బక్కవాళ్ళు ఎంగిలి కూటికోసం కీచులాడుకోవటం మానుకోనంతవరకు, బలిసిన వాళ్ళకు భయంలేదు.

చెత్తకుండీ దగ్గర నుంచున్న పిచ్చిదొరలో కదలిక వచ్చింది.

దేవముని గేటుదాటి పందిరిలోకి వచ్చాడు. వక్కపొడి నోట్లో వేసుకుని, తమలపాకు మడిచి తురుముకున్నాడు. కుర్చీల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళందరికీ నమస్కరించాడు.

'పెళ్ళికి భలే పద్యాలు రాశావయ్యా దేవమునీ!' అంటూ అభినందిస్తున్నారెవరో.

'అంతా మీ దయ! మీలాంటి వాళ్ళ ప్రోత్సాహమే చాలు!' అన్నాడు దేవముని మందహాసంతో.

పందిరి చివరిదాకా వచ్చి గుంజకు ఆనుకుని కన్నులరమోడ్చి నిలబడ్డాడు—పిచ్చి దొరకు నాలుగడుగుల దూరంలో.

వెర్రినవ్వు నవ్వాడు పిచ్చిదొర.

ఉలికిపడి చూశాడు దేవముని.

'ఎంగిలి పాయసం తినే నాయాలా!...'

దేవముని కంగారు పడ్డాడు. బెదురు కళ్ళతో బిక్కుబిక్కుమంటూ దిక్కులు చూశాడు.

'పెళ్ళిభోజనం ముక్కుదాకా మెక్కావుగా? పరిగెత్తి పోలేవులే!' అంటూ ముందుకు ఒక్కడుగు వేశాడు పిచ్చిదొర.

దేవముని గబగబా నడిచివెళ్ళి సందులోకి దూరాడు. తడబడే అడుగులతో సందు చివరిదాకా నడిచి వెనక్కి తిరిగి చూశాడు.

వాడి తస్సదియ్యా, పోలీసు కుక్కలా వెంటబడు తున్నాడు, పిచ్చిదొర.

దేవముని సందు మలుపు తిరిగాడు. నడక వేగం హెచ్చించాడు. కాళ్ళు సాగదీసి అంగల ప్రమాణం రెట్టించాడు.

కడుపు బియ్యం బస్తాలా బరువుగా వుంది.

బలవంతంగా పడవలసి వచ్చిన శ్రమకు డొక్కలు నొప్పెడు తున్నాయి.

పొట్టలో చోటు చేసుకుని ఒక దాంతో ఒకటి రాసక్రీడలాడుకుంటున్న షడ్రుచులు పేగుల కుదుపుల్లో ఊగిసలాడిపోతూ కుయ్యోమంటున్నాయి.

మనిషికింత భోజన ప్రియత్వం పనికిరాదు.

హద్దూ పద్దూ లేని జిహ్వాచాపల్యం వల్లనే కదా, బొజ్జకింత చేటొచ్చింది!

కాస్త తక్కువ తిని వుండాల్సింది!

అయినా అన్ని వంటకాలు ఆకులో కొలువుదీరి 'ఇందా ఇందా తీసుకో, ఇపుడే సొంతం చేసుకో' అంటూ ఊరిస్తూ వుంటే, తక్కువ తినడం ఎలా సాధ్యం?

ఆ వెజిటబుల్ బిరియానీ ఎంత దివ్యంగా వుంది!

ఆ మైసూరు పాకు ఎంత పెద్దదీ!

ఎంత కమ్మటి గారెలు!

ఎంత తియ్యని పాయసం!

ఆ పచ్చళ్ళూ, ఆ సాంబారూ, ఆ రసం...ఓహ్! అత్యద్భుతం!

నవరస భరితమైన కవిత్వం దిగదుడుపు — ఆ భోజనం ముందు. ఒక్క పిసరైనా విడిచిపెట్టటానికి మనసు రాలేదు కదా!

దేవుడు కురిపించిన వరాల్లాగా చెత్తకుండీని కప్పేసిన రెండువేలా నూట పదహారు ఎంగిలాకుల్లో — శుభ్రంగా నాకేసిన విస్తరాకు ఒక్కటే! ఆ విస్తరాకు దేవమునిది!

ఆ పచ్చని అరిటాకు... ఎంత పెద్దది!

అది అరిటాకు కాదు, అన్నపూర్ణ!

పాడి పంటలు పొంగి పొరలే భాగ్యసీమ!

అంత సుష్టుగానూ తిన్న తరువాత కొంతసేపు కుదురుగా కూర్చుని వుంటే హాయిగా వుండేది.

అలా తినడమూ సరే, ఇలా పరిగెత్తడమూ సరే!

పిచ్చిముండా కొడుకు— వీడొకడు దాపురించాడు, స్వర్గంలో అప్పలవాడిలా!

దేవముని మరోసందులోకి తిరిగాడు.

మరో సందులోకి...మరో సందులోకి...మరో సందులోకి...

కుడి వైపు సందులోకి... ఎడమ వైపు సందులోకి... కుడి వైపు సందులోకి... ఎడమ వైపు సందులోకి...

బావిలో పడ్డవాడు ఒడ్డుకోసం వెతుకులాడినట్లు,

కటిక చీకట్లో నిద్ర లేచినవాడు తలుపు కోసం తడుములాడినట్లు,

అడ్డిబిడ్డిగా అడ్డదిడ్డంగా

వీధిదీపాల వెలుగుల్లో తేలిపోతూ

మేడచాటు నీడల్లో మునిగిపోతూ

తుఫానులో పడవలా దారీతెన్నూ లేకుండా సాగిపోయాడు.

ఆయాసం బుసలు కొడుతోంది.

వెనక్కి తిరిగి చూశాడు.

పిచ్చిదొర కనిపించలేదు.

వెంబడిస్తున్నాడా?

వెంబడించటం మానేశాడా?

ఏమైనా యిక ఫరవాలేదు. పిచ్చివాడు వెంటాడటం మానేసి వుండాలి. లేదా వెంబడించలేక వెనకబడిపోయి వుండాలి. లేదా ఈ దాగుడుమూతలాటలో దారి తప్పి వుండాలి.

దేవముని ఆగి ఆయాసం తీర్చుకున్నాడు.

మళ్ళీ ఓసారి వెనక్కి తిరిగి చూచి గుండెలు కుదుటబరచుకుని మెల్లగా నడవసాగాడు.

తాను ఏ వీధిలో నడుస్తున్నాడో గ్రహించగానే ఒళ్ళు మళ్ళీ కంపరమెత్తింది. కాళ్ళు వాటంతట అవే ఆగిపోయాయి.

పులికి అందకుండా పరుగులంకించుకున్న లేడి పులిగుహలోనికే దూరినట్లయింది తన పని. గుహలోనైనా, గుహదాపుల్లోనైనా పులి వుంటే?

వీధిదీపాలు వెలగటం లేదు ఆ వీధిలో. ఇళ్ళమీద చీకటి రెక్కలు పరిచి నిద్రపోతోంది. మూసిన తలుపుల లోపల నిశ్శబ్దం నిండుసభ తీర్చింది.

ఓ అయిదారు వాకిళ్ళకవతల వున్న పూరిపాకలోంచి గుడ్డి వెలుతురు తలుపు బార్లా తెరుచుకుని వీధిలోకి వచ్చిపడుతోంది— మొగుడు గెంటేసిన ముండలా.

ఆ యిల్లే పులిగుహ!

పిచ్చివాడు గుహలో వుంటాడా?

దేవముని చివుక్కున వెనక్కి మరలాడు.

అడుగు కదల్లేదు.

పిచ్చివాడు ఎదురుపడితే?

మళ్ళీ పూరిపాకవైపు తిరిగాడు.

అతడి మనసు రెండు ముక్కలయింది.

ఒక ముక్క అతన్ని పూరిపాకవైపు లాగుతోంది.

మరోముక్క పూరిపాకవైపు వెళ్ళనివ్వకుండా వెనక్కి లాగుతోంది.

ఆ పాకను చూస్తే దేవముని గుండె కోరికతో గుబాళిస్తుంది.

ఆ పాకను చూస్తే దేవముని గుండె భయంతో గుభేల్ మంటుంది.

ఈ క్షణంలో ముందుకు వెళ్ళినా, వెనక్కి వెళ్ళినా—భయం వొదిలిపోదు.

కోరికకు మాత్రం ఒక్కటే దారి! ముందుకే!

ముందుకే నడిచాడు దేవముని— భయంతో బిక్కుబిక్కుమంటూ, కోరికతో గుక్కిళ్ళు మింగుతూ.

ఒక్కొక్క అడుగుకు ఒక్కొక్క వసంతం గడిచిపోతుందేమోనన్నట్లు అడుగులు తూచి పాక ముందర నడుస్తూ గుమ్మంవైపు వోరగంట చూశాడు.

గలగలమని గాజులు పల్కరించాయి గుమ్మంలో.

'ఇక్కడ దారులు కొడుతున్నావేమయ్యా రంగేళీరాజా!' అంటూ పరామర్శించింది అమృతకలశం.

పులకలెత్తిన గుండెతో పుడకలా నిలబడ్డాడు దేవముని.

'అలా నిలబడ్డావేం? ఆడదాని ముఖం యిప్పుడే చూస్తున్నట్టు!' అంటూ కిలకిలమంది చిలకలకొలికి.

'నీ మొగుడు లేడా?' అన్నాడు దేవముని మెల్లగా.

'నా మొగుడితో ఏం పని?' వీణ రాగాలు తీసింది.

'అబ్బ! చంపకు!... లేడు కదూ?'

'లేడులే రాజా! లోపలికి రా!'

ఎవరైనా చూస్తున్నారేమోనని ముందూ వెనకా చూచి గబగబా గుమ్మం దగ్గరికి నడిచాడు దేవముని.

'రాకరాక వచ్చావు. ఇంట్లోకి రా పంతులూ! నా గుండెల్లోకి రా!' అంటూ కళ్ళలో కైపు నింపుతూ, పైట జార్చి మళ్ళీ వేసుకుంటూ దారి తొలిగింది దరహాస చంద్రిక.

'వొద్దులే! మాట్లాడి వెళ్ళిపోతాను!'

'నీ మొగతనం ఎప్పుడూ మాటల్లోనేగా?' అంది వెటకారంగా, వలపుల తీగ.

'మధురం!...' అంటూ నోట మాటరాక ఆమెను మింగేసేలా చూస్తూ గుమ్మానికి ఆనుకుని నిలబడ్డాడతను.

అప్పుడే కుచ్చిళ్ళు పోసి కట్టుకున్న ఇస్త్రీ చీర!

పిటపిట లాడుతూన్న పల్చటి రవిక!

రొమ్ముల మధ్య తాచుపాములా వేలాడుతూన్న నల్లని జడ!

సిగలోనుంచి జారి చెవిలో చిలిపిమాటలు చెబుతూన్న సిరిమల్లెదండ!

చెంపలమీద రోజాలు!

కళ్ళల్లో గాలాలు!

కాటుక కళ్ళ చివరల్లో కోరలు పదును పెట్టుకుంటోన్న కోరికలు!

రవికంచు దిగువ, పొత్తికడుపు మీద కట్టిన చీర కుచ్చిళ్ళ ఎగువ— స్వర్గలోకానికి సింహద్వారంలా బంగారపుబొడ్డు!

వెర్రెత్తించే ఆకర్షణ!

గుమ్మం లోపల తలుపును ఆనుకుని నుంచున్న ఆ వన్నెల విసనగర్ర పొత్తికడుపుమీద చేత్తో మెత్తగా రాస్తూ అన్నాడు దేవముని, 'ఎంత మోతగా వున్నావే మధురం!'

కితకితలతో వంకర్లు తిరిగిపోతూ అన్నదామె, 'నిజంగా? అంత మధురంగా వున్నానా?'

'దాని సిగదరగ! ఆగలేకపోతున్నాను. ఆకలి తీర్చకుండాఎంత కాలం యిట్లా బులిపిస్తావ్?'

'ఆడంగి మొహమా! మాటలకు తక్కువలేదు. అసలు నీ కది వుందా అని?'

దేవముని ముఖం ముడుచుకున్నాడు. 'అదిగో, ఆ మాటే వొద్దన్నాను. ఆడంగి వాణ్ణయిందీ, మొగరాయణ్ణయిందీ ఇప్పుడేం తెలుసు నీకు? తింటేగా రుచి తెలిసేది?'

'మరి నామీద నెపం వేస్తావెందుకూ? నేనెప్పుడు వొద్దన్నాను?...లక్కపిడతమొహమా! నువ్వంటే నాకెంత యిష్టమో

తెలుసా ? నీ కోసమే పక్వంగా వుడికిన కూరనోయ్ రాజా ! కావాలంటే యిప్పుడే వొలుచుకు తిను !' అంటూ నిలువెల్లా కులికింది మధురం.

'ఎక్కడ ?' అన్నాడతను ముఖం చేటంత చేసుకుని.

'ఇక్కడే ! ఏం, ఈ యిల్లు పట్టనంత మగసిరా నీది ?'

'ఇల్లు పట్టక పోతేనేం ? నువ్వు యిముడ్చుకుంటావుగా?'

'కవి అనిపించుకున్నావ్ ! నీ కథ ఏమిటో చూస్తాగానీ, లోపలికి రా మరి !' అంటూ చెయ్యిపట్టుకుంది మధురం.

'చంపావుపో! ఇక్కడా?...పిచ్చిముండాకొడుకొస్తే?'అంటూ వీధి చివరిదాకా చూపులు బరపేడు దేవముని.

'వొస్తే నీకేం ? అరుగు మీద పడుంటాడు.'

'ప్చ్ ! నా ఒక్కడిమీద మాత్రం దయలేదు వాడికి. నా నీడ కనిపిస్తే చాలు, తోడేలులా వెంటబడతాడు.'

'ఆ భయం నీకెందుకు ? నే చూసుకుంటాగా ?'

'ఉహుఁ ! ఇక్కడొద్దు. భయంభయంగా, ఏంబాగుంటుంది?

'పోనీ, ఇంకెక్కడికి రమ్మంటావ్ చెప్పు !'

'మా యింటి కొస్తావా ?'

'నీ పెళ్ళాం లేదా ?'

'పురుడు పోసుకోటానికి పుట్టింటికెళ్ళింది.'

'అబ్బో ! మొనగాడివేనే !' అంటూ నవ్వింది మధురం. 'నా మొగుడొచ్చాక అన్నంపెట్టి, వొస్తాను. నీ మాట తోసెయ్యలేక వొస్తున్నా రాజా ! నువ్వంటే నాకెంతో యిష్టం !'

'ఇప్పుడే రాకే నా రాణీ ! బసవరాజాగారి యింటి దగ్గిర హరికథ చెప్పబోతున్నాను, పది గంటలకు ! ఒంటిగంటకు రా ! నీ కోసం ఇంట్లోనే వుంటాను.'

'హరికథలు కూడా చెబుతావా నువ్వు ! ఇదెప్పణ్ణుంచీ ?'

'ఏం ? ఎందుకు చెప్పగూడదు ? ఇది వరకే నాలుగు దఫాలు చెప్పాను పొరుగూళ్ళల్లో ! ఈ వూళ్ళో ఇదే తొలిసారి !'

'చెప్పేవి శ్రీరంగ నీతులు, దూరేవి దొమ్మరి గుడిసెలు !'

'చెప్పటానికే నీతులు ; చెయ్యటానికి కాదు. హరికథకు వొస్తావా ?'

'నీ హరికథ వింటూ కూర్చుంటే నా కడుపు నిండుతుందా?'

'సరేలే, నీకు చెప్పే హరికథ వేరే వుందిగా!...ఒంటిగంటకు — మరిచిపోకు !'

'రాక తప్పుతుందా స్వామీ ! నా కోసం యింతగా నీళ్ళుగారి పోతుంటే !'

ఆమె భుజంమీద చేయివేసి నొక్కాడు దేవముని. 'మధురం ...' అంటూ ఆమె ముఖం మీద తన ముఖం వంచబోయి, ఓసారి వీధి వైపు చూశాడు.

వీధి చివర నీడల్ని పర్యవేక్షిస్తూ, తలొంచుకుని నీడలా నడిచి వస్తున్నాడు పిచ్చిదొర.

దేవముని చెయ్యి ఆమె భుజం మీది నుంచి జారిపోయింది, పక్షవాతం సోకినట్లు.

'పిచ్చోడొస్తున్నాడు. నే వెళ్ళిపోతాను.' అంటూ ఒక్క అంగలో వీధిన పడ్డాడు.

'ఒంటిగంటకు ! మరిచిపోవద్దు !'

'మరిచిపోను !' అని నవ్వుతూ నమ్మబలుకుతూ వాకిట్లోకి వచ్చింది మధురం.

విసవిసా నడిచి వెళ్తోన్న దేవమునిని చూచి గజ్జికుక్క ఒకటి లొళ్ళున మొరిగింది.

దేవముని పరుగులంకించుకుని వీధి మలుపు తిరిగాడు. దాని తాత సొమ్ము దొంగలెత్తుకు పోయినట్లుగా మొరుగుతూ అతడి వెంటబడింది కుక్క.

పూరిపాకను సమీపించాడు పిచ్చిదొర.

కుక్కల అరుపులతో అవతలి వీధి 'భౌభౌ' మంటూ మారు మ్రోగిపోతోంది.

4

కంచాలు నేలకేసి తాటిస్తూ 'అమ్మా ! అన్నం పెట్టవే !'అని ఆక్రందిస్తున్నారు రోజారమణి, రాజా.

'మిమ్మల్ని మహమ్మారి ఎత్తుకుపోనూ ! కాస్సేపు ఓపిక పట్టండి. ప్రాణంపోనుగానీ !' అంటూ గొంతు చించుకుంటోంది, పచ్చడి నూరుతున్న తల్లి.

ఎక్కణ్ణుంచో బ్యాండు సంగీతం వినిపించడం మొదలెట్టింది. ఆ సంగీత ఝరి తరంగాలు తరంగాలుగా దగ్గిర పడసాగింది.

ఇరుగుపొరుగు అమ్మలక్కలు, పసిపిల్లలు చరచరా వెళ్ళి సందు మొగలో గుంపు చేరి, పెద్ద వీధిలోకి చూస్తూ నుంచున్నారు.

రోజారమణి కంచం కింద పారేసి బయటకు పరుగుతీసింది. మరునిమిషంలోనే తిరిగివచ్చి 'అక్కా, అక్కా ! పెళ్ళి ఊరేగింపు వస్తోంది. చూద్దువుగానీ, రా !; అంటూ మళ్ళీ తుర్రుమంది.

చింకిచాపమీద వెల్లకిలా పడుకుని రెప్పలార్పకుండా పై కప్పలకేసి చూస్తున్న ఆశాప్రియ కదలలేదు, మెదలలేదు. ఈ రోజు ఆమె మూగపోయిన వీణలా వుంది. మనస్సేమీ బాగాలేదు. ఆమె వెలిగించుకున్న ఆశాదీపాలలో అన్నిటికంటే మిన్నయైనది ఈ రోజు

ఆరిపోయింది. దాన్ని మళ్ళీ వెలిగించుకునే శక్తిని కోల్పోయాయి, ఆమె ఊహలు.

ఆశాప్రియ లేచి కూర్చుంది. బ్యాండు సంగీతాన్ని చెవులొగ్గి ఆలకించింది. లేచి నిలబడింది. బరువుగా అడుగులువేస్తూ గుమ్మం దగ్గరికి నడిచింది. క్షణకాలం ఆగి, ఒక్క ఉదుటున సందు మొగలోకి వెళ్ళిపోయింది. ఆమె కళ్ళు మిలమిలలాడాయి. అదే సమయంలోనే గుండె గిలగిలలాడింది.

అల్లంత దూరంలో పెళ్ళి ఊరేగింపు కదిలి వస్తూంది. జోహార్లు చేయించుకుంటూ దేవేంద్రుడి వైభవమంతా కట్టుగా కదిలివస్తున్నట్లుంది.

ముందర బారులు తీరి నడుస్తూ బ్యాండు వాద్యగాళ్ళు!

ఊరేగింపుమీద చీకటి కన్ను పడనివ్వకుండా అంగరక్షక దళంలా వెంట నడుస్తూ బారబారకూ పెట్రోమాక్సులైట్లు!

ముక్కోటి దేవతలు ఒక్కటై దీవిస్తున్నట్లు ముందు వెనుకల బంధుమిత్ర పరివారం!

రకరకాల పువ్వులతో దేవుడితేరులా అలంకరింపబడిన టాపు లేని కారు.

కారులో వూరేగుతూన్న దోరదోర కోరికలు!

పెళ్ళికూతురి ముక్కూమొహం యింతకుముందు ఈవూరివాళ్ళెరగరు. ఆ ముక్కూమొహం బాగానే వున్నాయి!

పెళ్ళి చేసుకుని పెళ్ళాంతో వూరేగడమే లోకోద్ధరణ అన్నంత గంభీరంగా పెళ్ళికూతురి వీపుమీద చెయ్యేసి కూర్చున్న ఆ మగవాడెవడు?

ఆశాప్రియ ఊహల్లోనుంచి ఆరిపోతున్న మణిదీపం!

జీవితంలో నీ మొదటి కోరిక ఏమిటి?

నేను చపలకుమార్‌ని పెళ్ళి చేసుకోవాలి!

చపలకుమార్ ఎవరు?

ప్రెసిడెంటు బసవరాజుగారి కొడుకు!

అహహహా... ఇహిహిహీ... ఒహొహొహో... ప్రేమించావా?... అంత అందగాడా?... ఎప్పుడూ చెప్పలేదే?...

ఆశాప్రియ కంట్లో నీళ్ళు తిరిగింది.

ఆమె ప్రేమించింది. ఉట్టి కెగరలేనమ్మ స్వర్గానికి ఎగరడం సాధ్యం కాదని తెలిసికూడా ప్రేమించింది. తనను ప్రేరేపించి తనలో ప్రేమను పురికొల్పిన వాడు చపలకుమారే! తాహతుకు మించిన కోరికల్ని చెప్పుకుంటే నగుబాట్లు తప్పవు కదా?

ఆలోచనల్లో కూరుకుపోయిన ఆమె కళ్ళకు కట్టెదుటి దృశ్యాలన్నీ అస్పష్టంగా, నిరూపంగా కనిపిస్తున్నాయి—రంగులన్నీ కలగలిసిపోయి తెల్లగా తిరిగే న్యూటన్ చక్రంలా!

చపలకుమార్ మెడిసిన్ చదువుతున్నాడు.

అతని చెల్లెలు గీత పదో తరగతిలో తన క్లాస్‌మేట్!

తానూ, గీతా అప్పట్లో ఎంతో నేస్తంగా, ప్రాణంలో ప్రాణంగా వుండేవాళ్ళు.

తాను లేకపోతే గీతకు పొద్దుపోయేదికాదు. రోజూ సాయంకాలం పూట తాను వాళ్ళ యింటికి వెళ్ళేది. ఆలస్యమయితే గీతే వచ్చి లాక్కుపోయేది. వాళ్ళ యింట్లో మేడమీది గదిలో కూర్చుని యిద్దరు పాఠాలు చదువుకునే వాళ్ళు. నోట్సు రాసుకునే వాళ్ళు. ఊసులాడుకునే వాళ్ళు.

అప్పుడప్పుడూ ఆ యింట్లో చపలకుమార్ కనిపించేవాడు. చక్కటి దుస్తులతో, నీట్టైన క్రాపుతో, టాయిలెట్ అయిన ముఖంతో—పెళ్ళిలో బహూకరించే ప్యాకెట్‌లా చెక్కుచెదరకుండా వుండేవాడు. నవ్వుతూ, నాజూకుగా పెదాలు కదుపుతూ గీతతో మాటలు మొదలుపెట్టి తనతో మాటలు కలిపేవాడు. ఏవేవో జోకులు వేసి యిద్దర్నీ నవ్వించేవాడు.

ఆశాప్రియ నవ్వితే, తాను వంకరటింకరగా నవ్వేవాడు.

అతడు కనిపించినా, మాటలు కలిపినా ఆమెకు హాయిగానే వుండేది కానీ, అంతవరకూ మాత్రం అతని కోసం ఆమె వయస్సు పురివిప్పుకోలేదు.

ఓ రోజు సాయంకాలం గీత కోసం వెళ్ళింది ఆశాప్రియ. చపలకుమార్ గుమ్మంలోనే నుంచుని వున్నాడు. ఆమెను చూడగానే 'థాంక్ గాడ్!... రావేమో అనుకున్నాను...' అంటూ చిరునవ్వు నవ్వుతూ దారి తొలిగాడు.

ఆమె లోపలికి దారితీస్తూ 'గీత వుందా?' అని అడిగింది.

'మేడపైకి వెళ్ళు!'

ఆశాప్రియ మెట్లెక్కి మేడమీదికి వెళ్ళింది. మెల్లగా గది తలుపులు నెట్టి 'గీతా' అంటూ లోపల అడుగుపెట్టి ఆగిపోయింది. గదిలో గీత లేదు.

ఆమె వెనుకనే మెట్లెక్కి పైకి వచ్చాడు చపలకుమార్.

'వొస్తుంది—కూర్చో ఆశా!'

ఆమె గదిలోకి వెళ్ళి సోఫాలో కూర్చుంది. అతడు కూడా గది లోపలికి వచ్చాడు.

'ఏం చేస్తోంది గీత?' అని అడిగింది.

'అమ్మతో కలిసి ఎక్కడో పేరంటానికి వెళ్ళింది.'

ఆశాప్రియ లేచి నిలబడింది.

ఇప్పుడొచ్చేయదూ! కూర్చో! నువ్వొస్తే వుండమని చెప్పి వెళ్ళింది.'

ఆమె మళ్ళీ కూర్చుంది సిగ్గుపడుతూ.

ఆమె శరీరంలోని ప్రతి అంగాన్నీ కళ్ళతో గుచ్చి తింటూ ఆమె ఎదుట నిలిబడ్డాడతను.

అతడి చూపుల పదునుకు తట్టుకోలేక గువ్వలా ముడుచుకుపోయిందామె.

'పరీక్షలు దగ్గరపడుతున్నాయికదా, బాగా చదువుతున్నావా?' అన్నాడతను తలవాల్చి, కళ్ళలోకి చూస్తూ.

'ఊఁ!'

'చదవాలి మరి! నీ మీద నాకెన్నో ఆశలున్నాయి...'

సూదులు గుచ్చుకుంటున్నట్టుగా యిబ్బంది పడిందామె.

'ప్యాసవుతావా ?'

'ఊఁ!'

అతడు దగ్గిర్గికి వచ్చాడు. 'ఏదీ, నీ చెయ్యి చూపించు' అన్నాడు. ఆమె సందేహిస్తుంటే, తానే చొరవగా చెయ్యి అందుకున్నాడు. అరచేతి గీతల మీద మృదువుగా రాస్తూ 'తప్పకుండా ప్యాసవుతావు. నీ చేతిలో గీతే చెబుతోంది' అంటూ సోఫా మీద కూర్చున్నాడు. ఆమె చేతిని తన ఒడిలోకి లాక్కుంటూ 'నీ జాతకమంతా నా చేతిలో వుందిప్పుడు. నువ్వు సరేనంటే నీ గీతే మార్చేస్తాను ఆశా!' అంటూ ఆమెకు మరింత దగ్గరగా జరిగాడు.

ఆమె తన చేతిని విడిపించుకోవడానికి ప్రయత్నిస్తూ 'వొదలండి! గీత వొస్తుందేమో!' అంది.

'ఇప్పుడే రాదులే! అది వొచ్చేలోపల పది డ్యూయెట్లు పాడుకోవచ్చు.'

ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి, ఎందుకో.

'ఆశా! నీ చెయ్యి చూచి ఓ సంగతి చెబుతాను. నిజమో, కాదో చెప్పాలి నువ్వు! సరేనా ?... నువ్వు ఒకణ్ణి ప్రేమిస్తున్నావు. ఆ మాట వాడితో చెప్పలేక సతమతమై పోతున్నావు. రాత్రి తెల్లవార్లూ వాడికోసం కలలు గంటున్నావు. అవునా, కాదా ?'

ఏం చెప్పాలో తోచక గుక్కిళ్ళు మింగింది ఆశాప్రియ.

'వాడు కూడా నన్ను ప్రేమిస్తున్నాడా అని అడుగుతున్నావు కదూ ? వాడూ నీలాగే అలమటించి పోతున్నాడు. నీకోసమే వేగిపోతున్నాడు. నువ్వు ఒంటరిగా చిక్కితే నిన్ను గుండెల్లో దాచేసుకోవాలనుకుంటున్నాడు...' అతడి చేతుల ఒత్తిడి ఎక్కువైంది.

ఆమె దూరంగా జరుగుతూ తన చేతిని లాక్కోబోయింది. సాధ్యం కాలేదు. 'విడిచిపెట్టండి. ఇంటికెళ్ళాలి' అంది, పసిపిల్లలా బతిమాలుతూ.

'ఒక్కసారి చెయ్యిపట్టుకున్నాక, మళ్ళీ విడిచిపెట్టడం మహాతప్పు కదూ ? అంటూ చపలకుమార్ హఠాత్తుగా ఆమెను కౌగలించుకుని తన ఒడిలోకి లాక్కున్నాడు. ముఖంమీద గబగబా ముద్దులు కురిపించాడు.

ఆశాప్రియకు మెదడు మొద్దుబారి పోయింది. ఇలా జరుగుతుందని ఆమె కలలో కూడా ఊహించుకోలేదు. అతడి ప్రవర్తన వల్ల కలిగిన ఆఘాతం నుంచి తేరుకుని 'వొదలండి! నాకు భయంగా వుంది' అంటూ గింజుకుంది.

చపలకుమార్ వినిపించుకోవటంలేదు. ఆమె చంకల కింద చేతులువేసి ఆమెను పువ్వులా నలిపేస్తున్నాడు.

ఆమె బలమంతా కూడదీసుకుంది.

గిలగిలా కొట్టుకుంది.

విలవిలా తన్నుకుంది.

అతడి బాహువుల్లోంచి బయటపడి సుడిగాలిలా మేడమెట్లవైపు పరుగుతీసింది. చెట్టెక్కి చేరువకు వచ్చిన చిరతపులినిచూచి హడలిపోయి చిటారుకొమ్మ మీదినుంచి జర్రున జారిపోయే కోతిపిల్లలా మేడమెట్లు దిగిపోయి, ఒక్క అంగలో వీధిలో పడింది.

ఆ రాత్రంతా ఆమె కంటి మీద కునుకు పడలేదు.

అతడి చేతినొక్కులు పడి ఆమె శరీరం దోరనూగిపోయింది. అతడి మాటల జల్లులు సోకి మనసులో తీయదనం ఊటలెత్తింది.

మరునాడు వాళ్ళ యింటికి వెళ్ళలేదు. మూడో రోజున గీత వచ్చి రెక్కపట్టి లాక్కుపోయింది.

మళ్ళీ అంత చొరవ తీసుకోవటానికి చపలకుమార్‌కు ఎప్పుడూ అవకాశం దొరకలేదు. అయితే అతడామెను కవ్వించటం మాత్రం మానుకోలేదు. చెల్లెలుందన్న బిడియంకూడా లేకుండా ఆమె అందచందాల్ని పొగిడేవాడు. సరసమాడేవాడు. ఛలోక్తులు విసిరేవాడు.

ఒకటి రెండు క్షణాలు ఆమెతో ఒంటరిగా మాట్లాడే అవకాశం దొరికితే తన గుండెను తెంచి ఆమె పాదాలమీద పెడుతున్నట్లు నీళ్ళుగారి పోయేవాడు.

'నీ కోసం చిక్కి శల్యమైపోతున్నాను' అన్నాడు.

'నువ్వు లేకపోతే చచ్చిపోతాను' అన్నాడు.

'నిన్నే పెళ్ళి చేసుకుంటాను' అన్నాడు.

'నిన్ను కట్టుకోలేకపోతే,బ్రహ్మచారిగానే వుండిపోతా'నన్నాడు.

ఆశాప్రియ మనస్సు ఉయ్యాలలూగింది.

ఆమె వయస్సు పరవళ్ళు తొక్కింది.

అతని కోసమే శ్వాసించింది.

అతణ్ణే ఊహించింది.

అతడితో కలిసి కోటి కలల్లో విహరించింది.

అంతా మరిచిపోయింది.

పరీక్ష తప్పింది.

గీత పరీక్ష ప్యాసై కాలేజీ తొక్కిన తరవాత, వాళ్ళయింటికి వెళ్లే అలవాటు తప్పిపోయింది ఆశాప్రియకు. లేకుండావుంటే, ఆమె కన్నెరికాన్ని వీణగా మలుచుకుని రాగాలు పలికించుకుని వుండే వాడేమో చపలకుమార్!

ఓరోజు గీత కబురంపితే వాళ్ళయింటికి వెళ్ళింది ఆశాప్రియ.

'ఏమిటే! మా యింటికి రావటం బొత్తిగా మానేశావు?' అంది గీత.

'ఎలా రావటం? నువ్వేమో కాలేజీలో! నేనేమో యింట్లో! లంకె తెగిపోయిందిగా?'

కాస్సేపు యిద్దరూ పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు.

ఉండబట్టలేక చివరికి తానే అడిగింది ఆశాప్రియ. 'మీ అన్నయ్య ఎక్కడే? ఇంట్లో లేడా?'

గీత కొంటెగా ఆమె వైపు చూచి నవ్వుతూ 'ఏం! చూసి చాలా రోజులైంది కదూ?' అంది.

ఆశాప్రియ సిగ్గుతో తలొంచుకుంది.

గీత అంది, 'అది సరేగానీ, మా అన్నయ్య నిన్ను అంత గొప్పగా ప్రేమించేస్తున్నాడేమిటే? ఎప్పుడూ నీ వూసే! ఆశాను మనింటికి వస్తూవుండమని చెప్పవే— అంటూ మధ్యలో నా దుంపతెంచుతాడు. నీ కోసం ప్రాణాలైనా యిచ్చేస్తాడనుకో!'

ఆశాప్రియ స్నేహితురాలివైపు ఓసారి చూచి, మళ్ళీ కళ్ళు వాల్చేసింది. 'గీతా! మేం పేదవాళ్ళం! మీరేమో గొప్పవాళ్ళు! మీ అన్నయ్య నన్ను పెళ్ళి చేసుకుంటానంటే మాత్రం, మీ వాళ్ళుఒప్పుకుంటారా?'

గీత ఆశ్చర్యపోయి సోఫాకు చేరగిలబడింది. ఆశాప్రియవైపు వింతగా చూస్తూ 'పెళ్ళా! నీతోనా! మా అన్నయ్యకా! నీకేం వెర్రా? లేకపోతే కలగంటున్నావా?' అంది.

ఆశాప్రియ ముఖం నల్లగా మసిబారిపోయింది.

ఇక అక్కడ కూర్చోలేక పైకిలేచి 'వెళ్ళొస్తాను గీతా!' అంది.

'అప్పుడేనా? సరే! అప్పుడప్పుడూ వస్తూ వుండవే! నా కోసం కాదులే!' అని మళ్ళీ కొంటెగా నవ్వి సాగనంపింది గీత.

ఆమె కోసం మళ్ళీ ఎప్పుడూ వెళ్ళలేదు ఆశాప్రియ.

స్నేహితురాలి మాటలు ఆమె గుండెను గాయపరిచాయి.

అయినా చపలకుమార్‌ని మరిచిపోలేకపోయింది. అంతరాత్మ వెక్కిరిస్తున్నా, అందని పండ్లకు అర్రులు చాచడం తెలివితక్కువ అని మందలిస్తున్నా— ఆశాసౌధాలకు రోజూ రాళ్ళు మోసింది.

ఆశాలతలకు పాదులుగట్టి నీళ్ళు పోసింది.

కలలకు బానిసైంది.

ఎప్పుడో ఓరోజు చపలకుమార్ వచ్చి చెయ్యి పట్టుకులాక్కుపోతాడని ఎదురు తెన్నులుగాచింది. ఆశలు లేకపోతే ఆనందం లేదు గనుక, అలా ఆశలు అల్లుకోవడంలోనే ఆనందాన్ని వెతుక్కొంది.

రోజులు గడిచాయి.

నెలలు గడిచాయి.

నువ్వులేకపోతే చచ్చిపోతానన్న చపలకుమార్— ఏనాటికైనా నువ్వే నా దానివన్న చపలకుమార్— నిన్ను పొందలేకపోతే బ్రహ్మచారిగానే వుండిపోతానన్న చపలకుమార్— కొత్త పెళ్ళికొడుకై కారులో కూర్చుని వూరేగుతున్నాడు.

అరక్షణం భోగానికి ఆడపిల్లల బ్రతుకుల్ని బూడిదపాలు చెయ్యటానికి వెనకాడని గొప్పవాళ్ళ వాగ్దానాలన్నీ యిలాంటివేనా?

ఊరేగింపు కళ్ళ ముందునుంచీ సాగిపోతుంటే అమ్మలక్కలంతా కళ్ళప్పగించి చూస్తున్నారు. ఆ పెళ్ళి వైభోగాన్ని వేయి నాల్కలతో కొనియాడుతున్నారు.

పెళ్ళికూతుర్ని 'సాక్షాత్తూ లక్ష్మీదేవి' అంటున్నారు.

'అదృష్టమంటే అతడిదే!' అంటున్నారు.

'బాగా వున్నవాళ్ళట! ఏడు తరాలు తిన్నా తరగదట! అమ్మాయికి ఏభై సవరన్ల బంగారంవేసి, అబ్బాయికి ఐదెకరాల మాగాణి పొలం, ఏభైవేల రొక్కం యిచ్చారట!' అంటూ బుగ్గలు నొక్కుకుంటున్నారు.

తాను అతన్ని పొందాలంటే అంతెత్తు ధనం పోయాలన్న మాట!

తాను మాత్రం అప్పనంగా వచ్చేట్లయితేనే అతడిక్కావాలి!

ఊరేగింపు సాగి వెళ్ళిపోయింది. పెట్రోమాక్సు లైట్లు వెనక్కి రువ్వుతూన్న పొడుగాటి నీడలు ఆమె ముఖంమీదికి ప్రాకి, కాంతిలేని ఆమె కళ్ళలో దాక్కున్నాయి.

నూరేళ్ళపాటు నిలిచి వుంటుందనుకున్న మేడ నిమిషంలో కూలిపోయినట్లు బరువుగా నిట్టూర్చి, పక్కకు తిరిగింది ఆశాప్రియ.

ఎదుట పూలరంగడు నిలబడి వున్నాడు. తనవైపే చూస్తున్నాడు. చూపులు కలవగానే చిరునవ్వు నవ్వాడు. ఆ చూపుల్లో— చూపులకు అర్థాలు దొరికే సాంకేతిక భాషలో— అదే పిలుపు!... 'రాత్రికి వస్తావ్?...'

ఆమె తలొంచుకుని ముందుకు నడిచింది.

ఇంట్లోకి వెళ్ళి గుమ్మంలోనే నిలబడింది.

గుమ్మంవైపే చూస్తూ వెళ్ళాడు పూలరంగడు.

(ఇంకా వుంది)

శ్రీ సరస్వతుల కృష్ణమోహన్

రామకృష్ణగారి స్నేహదేహళి

వంద నిన్నల కింద కూర్చిన
వన్నెలే రేపటికి ఎందుకు?
రంగురంగుల వేగు రేపటి
రాకకోసం నేటి మెలకువ!

—(స్నేహదేహళి పేజి 106)

కవిత్వానికి పర్యాయపదం విలక్షణ రచన అనీ, నవత లేనపుడు కవితలేదనీ విశ్వసించడం ఆధునిక కవి ప్రత్యేక లక్షణం. ఈ కాలానికి సంబంధించిన వారంతా ఆధునికులు. కాలేరు. జీవితంలో మార్పునీ, కాలంలో మార్పునీ గుర్తిస్తూ తదనుగుణంగా కవిత్వంలో మార్పుతేవడానికి యత్నిస్తారు—ఆధునిక కవులు. ఇలాంటి వారు ఏది రాసినా నిన్నటి సంప్రదాయానికి, నిన్నటి లక్షణాలకు భిన్నంగా ఉంటుంది. దీనినే 'విలక్షణత్వం' అంటారు. విలక్షణత్వమే నవ్యత. అదే కవి స్వతంత్ర మార్గానికి సూచిక. నేటి కవులలో ఈ విలక్షణత్వంకోసం ప్రయత్నిస్తున్నవారు వేళ్ళ సంఖ్యలోనే కనుపిస్తారు. తన వస్తువునీ, తన ఛందస్సునీ, తన శిల్పాన్నీ తానెన్నుకుని నిజాయితీతో కవిత్వం పలుకుతున్న కొద్దిమందిలోను శ్రీ మిరియాల రామకృష్ణగా రొకరు. 1953లో పద్యంతో సేద్యం మొదలుపెట్టి, మరొక ప్రక్క దేశి ఛందస్సులను చేరదీసుకొంటూ 1963 నుంచి 1969వరకు హెచ్చుగా ముత్యాల సరాలలోనూ, వచన కవితలోనూ, ఆధునిక వస్తువుని ఆవిష్కరించడానికి పూనుకున్నారు ఈయన. 1970నుంచి ముత్యాలసరాన్ని వదలి వచన కవిత్వంకోసం కంకణం కట్టుకొన్నారు. అయితే తన కవితలో వస్తున్న మార్పుని సాహితీలోకం గుర్తించడానికి వీలుగా 1963–'69 మధ్య రచింపబడి ప్రముఖ పత్రికల్లో ప్రచురింపబడిన ముత్యాల సరాల్నీ, తదితర గేయాలనూ 'స్నేహదేహళి'గా కూర్చి ముద్రించటం జరిగింది. ఇది 1972 లోనే వెలువడింది.

సంక్షిప్తత గీతి మాధురి, వ్యావహారిక భాష : ఇవి రామకృష్ణగారి కవితా బాహ్యరూపానికి పరమావధులు. వస్తువులో మార్పు రానిదే ఏ కవిత్వంలోనూ నవ్యతరాదని రామకృష్ణగారి విశ్వాసం. జీవితానుభవాల వ్యాఖ్యానం, విమర్శ వీరికిష్టం. ఆనందంతోపాటు సందేశం కూడా కవితా ప్రయోజనంగా భావిస్తారు వీరు. 1963, —'66ల మధ్య రచించిన గేయాలలో ఆత్మాశ్రయత్వం, స్వాప్నిక భావన, లలిత మనోజ్ఞ పదవిన్యాస లాలస మొదలయినవి సాక్షాత్కరిస్తాయి. 1966 తరువాత గురజాడ వారి గురుత్వాన్ని శిరసావహించినట్లు కనుపిస్తారీ కవి. వాస్తవికత, వాడుకభాష, సామాజిక స్పృహ '66 తరువాతి గేయాల్లో గోచరిస్తాయి.

'స్నేహదేహళి' అన్న గేయంతో ప్రారంభమై 'ఆనందం' అన్న గేయంతో ముగిసే ఈ కవితా సంపుటిలో ఉన్నవి 44 గేయాలు. డా. కొత్తపల్లి వీరభద్రరావుగారి ఆంగ్లపీఠిక ఆంధ్రేతరులు కూడా కవి వైలక్షణ్యం తెలుసుకొందుకు పనికి వస్తుంది. ఈ పీఠికలో కవిగురించి ఆత్మీయతతో పరిచయంచేస్తూ రామకృష్ణగారి కవిత్వాన్ని ఇలా వ్యాఖ్యానించారు:—

"—Ramakrishna is singularly free from all those 'isms'. For him poetry is poetry without any label attached to it. . . . Restraint is the key note of Ramakrishna's poetry. His poetic nature is deeply rooted in the precision of his language, his simple and direct approch to exeperience, his unity at purpose and above all, his broad humanism"—

ఈ కవి కేవలం ఆవేశపరుడుకాడు. ఆవేశాన్ని అదుపులో పెట్టుకోగల ప్రజ్ఞాశాలి. అందువల్ల ఔచిత్యం సిద్ధిస్తుంది. రామకృష్ణగారిది విశాలమైన మానవతా దృక్పథమే కాని మరే ఇజానికి ముడిపడ్డ చూపు కాదంటారు కొత్తపల్లివారు.

ఈ గీతాల్లో ప్రారంభ గీతమైన 'స్నేహదేహళి'లో స్నేహాన్ని ఒక పచ్చని వృక్షంతో పోల్చి రేఖా చిత్రాన్ని నిర్మించారు. స్నేహమే ఒక వృక్షమైతే బుద్ధి సంపదే దానిమూలం అంటారు. ప్రేమ రేఖలే దాని శాఖలు; స్పందనాలే దాని చివురులు; సానుభూతులే దాని పూవులు; సహాయాలే దాని కాయలంటారు. ఇలాంటి స్నేహ వృక్షానికి వేరుపురుగులయిన కులమతాలను చేరనివ్వ వద్దని హెచ్చరిస్తారు. ఈ రేఖా చిత్రంలోకి తానై ఊహించిన దాన్ని మన అనుభూతికి తేగలిగారు. ఇలాంటి మిత్రుడు ఎలాంటి వాడు?

"ముఖస్తుతులకు అంతదూరం
మనస్సీమకు ఇంత దగ్గర
ఆంతరంగిక రహస్యాలకు
మిత్రుడే <u>బాంకు</u>
ఏ నిరాశకుపట్టుబడ్డా
మిత్రుడే <u>జామీను</u>

ఆధునిక సమాజానికి సన్నిహితమైన భావన ఉంటేనే ఆధునిక కవిత్వం అవుతుంది. 'బాంకు' 'జామీను' అనేవి నాగరిక జగతిలోని పదాలు. వాటిని కావ్య సామగ్రిగా వాడుకున్నారు. అందరికీ తెలిసిన విషయాన్నే కవి సులభంగా చెప్పేసి మనస్సులో బలంగా నాటుకొనేట్టు చేస్తారు.

ఈ కవి ఆత్మాశ్రయత్వానికి ప్రకృతి వర్ణనకూ ఉజ్వల ఉదాహరణం ''సీతాకోక చిలుకలు' (పేజి 26). ఇందులోని ఊహలు, అనుభూతులు నవంనవంగా కనిపిస్తాయి. ఒక పూలతోటలో ఉదయ కాలంలో గోరువెచ్చని ఎండలో ఈ కవికి పూలమీద ముసురుతున్న సీతాకోకచిలుకలు కన్పిస్తాయి. వాటిని చూడగానే ఇతనికి చిన్నప్పటి ఆటలు, అనుభవాలు తళుక్కున మెరుస్తాయి. ఆ చిలుకలు గాలి పటాల్లా ఉన్నాయి. వాటిని ఎగురవేసింది ఎవరు ? ఇంకెవరు ! ఆ క్రింద ఉన్న పూలబాలికలే అయి ఉంటారంటారు కవి. ఇది మనల్ని బాల్యానుభవాల వైపు లాక్కుపోతుంది.

కలంలో దాక్కునే కత్తి మెరుపులు

ఉత్తమ కవిత్వం ఎప్పుడూ రెండు అర్థాలు కలిగిఉంటుంది. మొదటిది పైకి కనిపించే వాచ్యార్థం. స్ఫురించేది రెండవది. దీన్నే ధ్వని అంటారు. దాంట్లో కలంలో దాక్కున్న కత్తి మెరుపులుంటాయి. ఆ మెరుపులే సమాజ దురవస్థ మీది కవి నిరసనలు. ఇలాంటి విమర్శలు చమత్కారంగా విసురుతారు రామకృష్ణగారు. 'అసిధార' 'ఏకపతాక' 'అహంత' 'ఆఖరి కేక' మొదలైన గేయాల్లో ఇటువంటి చెణుకులు అగపడతాయి.

అసిధార (పేజి 32) విద్యార్థుల స్వభావానికి ఒక అద్దం. ఇందులో కవి ప్రేమకు కూడా నామరూపాల నూహిస్తారు. ప్రేమ ఒక భావము, కనుక రూపం ఉండటానికి అవకాశంలేదు. కనుక ప్రేమను ఒక గనిగా దర్శిస్తారు. ఆ గని ఎక్కడుంది ? అనుభవాల పునాదిలో పడిఉంది. దాన్ని త్రవ్వుకోగల్గాలి. ఇక ఆ ప్రేమ అనే పేరు ఎలాంటిదంటే ''అంతరంగము కోరు తృప్తికి అంతరాత్మయె ప్రేమ నామము'' అంటారు. ఏ ప్రేమ లేకపోతే మనస్సుకు తృప్తి కల్గదో ఆ తృప్తికి అంతరాత్మ ప్రేమ. ఇటువంటి చోట్ల సంక్షిప్త పదశిల్పం మెరుస్తుంది. ఇలా ప్రేమ గురించి చెబుతూ కాలేజి కుర్రాళ్ళ కపటప్రేమను మెత్తమెత్తగా ఎత్తిపొడుస్తారు. తరగతులు వదలి, చదువుకు ఎగనామం పెట్టి బాలికల వెనుక వాల్జడ అందాలకు మురిసిపోతూ తిరిగే విద్యార్థులను చూసి జాలిపడతారు. అయితే వారి సౌందర్యారాధన మీద కవికి కోపంలేదు. అది వ్యర్థమవుతున్నదని జాలి ! చూడండి.

''చదువు వెన్కకు నెట్టి వాల్జడ
కదలికలకే మురియు యువకులు
మందయానల తిరస్కారము
నందుకొని రెండింట జెడుదురు.

యిందులో మందయానలన్న పదం సుందరంగా ఉంది. వారి మందయానాన్ని చూసి మురిసిపోతారు యువకులు. కాని వారు చదువులో మందయానలు కారు, శీఘ్రయానలే ! ఈ వ్యంగ్యం ఇక్కడ స్ఫురిస్తుంది. ప్రేమకూ, చదువుకూ కూడ చెందకుండా పోవడమే రెండింట చెడిపోవడము. అయితే వీరికి పరిష్కారం ఏమిటి?

''అంతరంగపు కొంటె కోతిని
కొంత శిక్షింతువా ఆగును
విడిచిపుచ్చితివేని బ్రతుకునె
వెక్కిరించుచు నవ్వుచుండును.'

మనస్సు ఎంత చెంచలమైనదో దానిని కోతితో పోల్చడం వల్ల తెలుస్తుంది. చివరికి ఆ కోతినికూడా శిక్షించి బిచ్చగాడు ఆటలాడిస్తాడు. అలాగే మనస్సునీ శిక్షించాలి. లేకుంటే పరిణామం స్పష్టమే. అయితే కాలేజీ కుర్రాళ్ళకి ప్రేమించే అర్హత లేదా? ఉంది! దాన్ని ఇలా వివరిస్తారు:

చెరికి పంగీతాల తేనెల
చిందుకొనుచును 'భోగి' వలె నగు
స్వప్న తటిపై 'రామ' నామము
జపము చేయుచు 'యోగి' వలె నగు.

ఈ కవి అక్కడక్కడ పాండిత్య ప్రకర్ష చూపిస్తారు. అదీ చమత్కార సాధనం కోసమే కాని పాండిత్యం కోసమేమీ కాదు. పై గేయంలో 'రామ' 'భోగి' అను పదాలు రెండంచుల కత్తుల్లా వాడ బడ్డాయి. రామ శబ్దానికి రెండవ అర్థం స్త్రీ అని! భోగి శబ్దానికి పాము అని మరో అర్థం. ఈ అర్థాలు ఇక్కడ చమత్కారం కల్గిస్తున్నాయి.

'అహంత' (పేజి 123) అన్న గేయం మరో చక్కని చమత్కారపు సందేశం.

''తనదె నవ్యకవిత అంచు
తలయెత్తును ప్రతి కవియును
సహృదయుని ఎదలో అది
స్పందించునో లేదో కనడు.''

ఇది నేడున్న కవుల మీద చేసిన చక్కటి విమర్శ. తమను తాము పూర్వకవులతో పోల్చుకొని తమది నవ్యకవిత అని చాటుకొనే వారికి చురక. ఏ కవిత్వానికైనా గొప్ప పణం ఏమిటి ? పాఠకుని హృదయాన్ని స్పందింపజేయగలగడం. అది ఎంత నవ్య కవితలని చాటుకున్నా హృదయాని కది ఎంచలేక పోతే అది వ్యర్థమయి పోతుంది. అయితే పాఠకుడు సహృదయుడైనప్పుడే ఇది సాధ్యమౌతుంది. ఈ సాహితీ రహస్యాన్ని ఇందులో వ్యాఖ్యానించారు కవి. ''గుణ మున్నదొ లేదో అది కనుగొనవలసినది జగతి'' అందుచేత అప్పటిదాకా అహంత పనికిరాదని హెచ్చరిస్తారు.

'ఏక పతాక' (పేజి 47) అన్నగేయం ఒక హిత బోధ. దేశం దేహమైతే రాష్ట్రం, భాష, జాతి, ప్రాంతం దాని అంగాలు. మానవత దాని ఆత్మ. సమానత్వం దాని వాంఛ. ఒకరి అవసరం ఒకరి కుంటుంది. మానవులు పరస్పరావగాహనం, సఖ్యం కలిగిఉన్నపుడే శోభిస్తారు. ఇందుకు ఒక చక్కని భావచిత్రం చూడండి.

''చూడ గల్గిన కంటి కొసలకు
నల్లకాటుక అంటినపుడే

ప్రణయ సుందర భావ రేఖలు
ప్రస్ఫుటము లగుచుంట లేదా''

కంటి కొసలు, నల్లకాటుకలు ఈ రెంటి సఖ్యం వల్ల కలిగే వైభవాన్ని సూచించారు కవి.

'వికల్పం' (పేజి 118) గేయం 1965 చైనా సాంస్కృతిక విప్లవాన్ని విమర్శిస్తూ వ్యంగ్యంగా వ్రాసిన ఖండిక. కార్మికులు, కర్షకులు బీదతనంలో మునిగి ఉన్నమాట నిజం. అంతా సమానం కావాలంటే ఉన్నవాణ్ణి హింసిస్తే రామణీయకతనీ, నాగరికతనీ ధ్వంసం చేస్తే సమానత్వం వస్తుందా? ఇది పద్ధతి కాదు. ఎవరికీ నష్టం కల్గని విధంగా సంఘం ముందుకు పోవాలి. అయితే ఈ కవి సామ్యవాద వ్యతిరేకికాదు. కవికి సామ్యవాదమంటే ఎంత అభిలాషో చూడాలంటే ''ఆఖరి కేక'' (పేజి 137) అన్న గేయం చూడవచ్చు.

''చుక్కలు చూసే భావుకులారా
దిక్కులు వెదికే బుద్ధుల్లారా
కునికిపాట్లు పడు దేవుళ్ళారా
మనుషుల బుద్ధులు మారుస్తారా
హుజూరు పంచే జీతాల్లారా
బజారులమ్మే ఖరీదులారా
బతుకిస్తారా సామాన్యులను
బతికిస్తారా సంసారాలను.

తారా పథాలవైపు చూసే భావుకత్వం కానీ, ఆధ్యాత్మిక వాదుల అన్వేషణలు కానీ, మత ప్రచారంచేసే యజ్ఞ యాగాదులు గానీ దేశంలోని మానవుల శీలాలను తీర్చి దిద్దలేవనీ అందుకు క్రియాశీలత, క్రమ శిక్షణ అవసరమని ధ్వనింప జేస్తారు.

ఈ కవి బాహ్య దృష్టికి కన్పడే కల్లోలాలనే కాకుండా 'కనుపించని కల్లోలం' (పేజి 139) వైపుకూడా దృష్టి సారిస్తారు. ఈ కవి వృత్తిరీత్యా ఉపన్యాసకుడు కావటం ఈ కవితలో తొంగి చూస్తుంది. 1966 నాటికి దేశంలోని విద్యా సంస్థలలో నేడున్న క్రమ శిక్షణ లేదు. మంచి పాండిత్యంకానీ, ప్రజ్ఞ కానీ ఉపన్యాసకుని సమర్థతకు గీటురాళ్ళు కాకుండాపోయాయి. ప్రజ్ఞాశాలి అయిన బోధకుడి, ఉపన్యాసకుడి ఉపన్యాసం అడవిగాచిన వెన్నెల, చెవిటిముందు శంఖం అయిపోతూంటే ఆ బోధకుడిపట్ల కవి పడిన జాలి ఈ గేయం వ్యక్తీకరిస్తుంది.

ఈయన కవిత్వంలో 'జీవిత పరిశీలన, 'సౌందర్యాన్వేషణ' 'అనుభూతి చిత్రణ' కూడా అగుపిస్తాయి. సౌందర్యలహరి (పేజి 37) అన్న ఖండికలో ఒక్కొక్క అందాన్నే విప్పుకొంటూ ''అందమే తల్పులను తీయక అనుభవానికి లేదు మార్గము'' అన్న సత్యాన్ని నిరూపిస్తారు. ఎవరికోసమో చందమామ వెన్నెల రేకలు రాల్చుకొంటూ కరిగిపోతూంది, నీరు తాగి నన్నీమబ్బు నింగి కెగిరి కరగిపోతూంది, విసుగు బ్రతుకును వీడి సీతాకోక చిలుక కొత్త రూపాన్ని ధరిస్తోంది. వీటన్నిటినుండి జనులు ఆనందం పొందుతున్నారు. రస తన్మయులౌతూనే ఉన్నారు. ప్రకృతి మన కందించే ఈ ఋణాన్ని తీర్చుకోడానికి ఏం చేయాలో 'ఆనంద ధార' (పేజి 53) అన్న గేయంలో చెబుతారు.

''ప్రకృతి నీ కందిచ్చు ఋణమును
తీర్చుకొనుటకు నీవు పొందిన
అనుభవానందాలు మళ్ళీ
అందరికి అందిచ్చుటొకటే
ఉత్తమోత్తమమైన పద్ధతి
మానవోత్తములకు మహోన్నతి''

తను ఒక్కడే ఆనందంలో మునిగిపోక, పక్కవాళ్ళకికూడా ఆ ఆనందాన్ని అందించగలిగినప్పుడే జీవితం ధన్యమౌతుంది.

'ప్రస్తుత గీతం' (పేజి 62) లో వర్తమానపు శోభల్ని వివరిస్తారు. గతం కట్టిన బూజు పందిరికింద నీడ వెతుక్కునే వాడు కాల పురుషుడి వేళాకోళానికి కందిపోక తప్పదంటారు ఈకవి.

'శిశు గీతం' (పేజి 69) లో 'దేవుడి దగ్గర ఏమీ తోచక దిగి వచ్చారా పిల్లల్లార' అని ప్రారంభిస్తారు గీతాన్ని. కపటం, కల్మషం ఎరుగని పిల్లల్ని దేవుడి స్నేహితులతో పోల్చడం ఒక భావసౌందర్యం.

'ఏదీ వసంతం' (పేజి 74) అన్న గేయంలో జీవితంలో ముచ్చటించే ఆశ ప్రతీదీ ఒక వసంతం అంటారు. ఆశలు చాలా ఉంటాయి. అన్ని ఆశలు వసంతాలు తేలేవు. అందుకనే కవి ఇక్కడ 'ముచ్చటించే' అన్న ప్రయోగంతో వసంతాన్ని తెచ్చే ఆశని

ర్ణించారు. అందుకనే కాలమర్మం తెలిసి వెడితే అన్ని ఆశల్ని వసంతాలుగా మార్చుకోవచ్చును. కాలమర్మం తెలిసి వెళితే జీవితానకు సదా ఆమని' అన్న నగ్న సత్యాన్ని చెప్పారు కవి.

'అర్ధ రాత్రి' (పేజి 102) అన్నగేయంలో అర్ధ రాత్రి నుండి కొత్త అందాలు వెలికి తీస్తారు కవి. అర్ధరాత్రిని అందమైన భావాల్తో చూపటం ఒక విశేషం.

''ఆస్తిలో భాగాన్ని మొదటే
పంచుకోడాని కని వచ్చిన
కాల పురుషుడి చిన్నకోడలు
లాగు కనిపించింది రాతిరి''

ప్రకృతంతా ఒక ఆస్తి. అందుచేత ముందుగానే ఈ ఆస్తిని అందుకోవాలని వచ్చిందట రాత్రి! మన కుటుంబాల్లో చిన్న కోడళ్ళు చేసే ఆస్తికోసపు ఆర్భాటాన్ని అర్ధరాత్రితో పోల్చారు. ఆస్తులు పంచుకొని కొడుకు వెళ్ళిపోతే పెద్దల మనసులో మిగిలి పోయేది చీకటే సుమా అన్న హెచ్చరిక లేక పోలేదు.

—''అన్యసాహిత్యాలతో పోల్చిచూస్తే తెలుగు కవిత్వపు సౌధంలో ఇంకా ఎన్నో గవాక్షాలు తెరవాల్సి ఉన్నట్లు స్పష్టమవుతుంది. ఎన్నో దీపాలు వెలిగించాల్సి ఉంది, ఎన్నో పంఖాలు వేయించాల్సి ఉంది. ఈ సౌధం చుట్టూ ఆరోగ్యదాయకాలైన తోటలు పెంచాల్సి ఉంది. వస్తువులో మార్పు రానిదే ఈ వ్యవహారమంతా నెరవేరేది కాదు''—(చూ. భూమిక—స్నేహదేహళి పేజి 14) ఇది రామకృష్ణగారి కవితా దర్మం.

—''స్నేహం, సౌదర్యం, కాలం, యౌవనం, శైశవం మానవత, ఐకమత్యం, మనస్సు, ఆశ, ఆనందం వంటివి మౌలికమైన భావాలు. వీటి అనుభవం జీవితంలో ఉన్నది. వీటిని కవి తాత్త్విక నేత్రంతో, భావనా చక్షువుతో చూడగల్గితే ఇవన్నీ కవితా వస్తువులే. కవి తనదైన వ్యక్తిత్వంతో వీటిని వ్యాఖ్యానించాలి. ఇవి అన్ని దేశాల, అన్నికాలాల వారికీ సమానాలే. వీటున్నిటి సమాహారమే జీవితం. ఈ జీవితాన్ని వ్యాఖ్యానించడంలో, విమర్శించడంలో కవిత్వం ఉదయిస్తుంది. తెలుగు కవిత్వంలో ఈ రీతి చాలా తక్కువగా ఉందనుకుంటాను. నిజానికిది ఒక కొత్త కిటికీ''—(చూ. భూమిక—స్నేహదేహళి పేజి 15) జీవితంలోని మౌలిక భావాలని కవి పేర్కొన్న స్నేహం, సౌందర్యం కాలం, యౌవనం వగైరాల మీద కవి భావనా మనోహరమైన సూక్తుల నెన్నింటినో ఈ స్నేహదేహళిలో పలికారు. మచ్చుకు కొన్నింటిని చూపి ఈ వ్యాసం ముగిస్తున్నాను.

(1) ''స్నేహమే ఒక వృక్షమైతే బుద్ధిసంపద దాని మూలం'' —**పేజి 21.**
(2) ''మృత్యువే ఎదురైన వేళను మనకు కవచం మిత్రవచనం'' —పేజి 23.
(3) ''చెలిమి కోరే చిన్న కానుక మందహాసం''—పేజి 24.
(4) ''కామవాసన రేగునప్పుడు కల్గునా మరిత్రపావాసన'' —పేజి 28.
(5) ''అందమునకొక కొత్త జీవము నందజేసే శక్తి ప్రేమయే'' —పేజి 32.
(6) ''పొరుగు అరుగులు పగులగొట్టి తాము గోడలు కట్టుకోడం మూర్ఖతత్వం''— పేజి 47.
(7) ''ఒకరి హక్కుం కగ్గివెట్టుట అనాగరికత''— పేజి 47.
(8) ''ఇచ్చుకొంటూ పుచ్చుకొంటూ బ్రతకడంలో ఉందిసౌఖ్యం'' —పేజి 48.
(9) ''ఒకరితో మరి యొకరి స్నేహం బ్రతుకులో హరివిల్లుకోసం''— పేజి 48.
(10) ''చెలిమి లేనిదే బ్రతుకు నల్లన, కలిసి బ్రతుకని బ్రతుకు పుల్లన''— పేజి 48.
(11) ''ప్రజాస్వామ్యం గుండె సత్తువ ఐకమత్యం''—పేజి 50,
(12) ''జనుల కానందాలు పంచుట నీవు తృప్తిని పొందజూచుటె'' —పేజి 55.
(13) ''రాత్రి వంటిది గతము! సూర్యుని రాకముందరి
ప్రకృతి వంటిది వర్తమానము! దాని లోనికె
వచ్చుచుండును భావికాంతులు''— పేజి 67.
(14) ''మందబుద్ధికి గతమె మహదానందకరమగుచుండుపాపము'' —పేజి 67.
(15) ''కాలమందున వర్తమానమె కానబడు రహదారి''—పేజి68.
(16) ''శిశిర రుజులూ ముసలి చలులూ గతిస్తేనే నవవసంతం'' —పేజి 77.
(17) ''ఇంద్రియాలను అదుపుచేస్తే ఇంద్రసౌఖ్యం కళ్ళ ఎదుటే'' —పేజి 79.
(18) ''యువతరాన్ని నిరాశ ముంచే ప్రమాదంలో సమాజం పడినపుడు ఆశా సూర్యకిరణం చూపితేనే నవ కవిత్వం'' —పేజి 86.
(19) ''గుడిసె దైన్యము తీర్చుకోసం గుడులు కూలం గొట్టవలెనా'' — పేజి 119.
(20) ''ఎన్నిపోయె ఉగాదులన్న మా టేల ఉన్నవే చాలు మనకున్న తులసీయ'' — పేజి 121.
(21) ''భావనారామ వైశాఖ మాశ'' — పేజి 134.
(22) ''వంచనలు చూపేది మౌన వేదన కాదు'' —పేజి 149.
(23) ''కవిత ధార్మిక యుద్ధ వీరులు ఊదగల ఉత్సాహకాహళి'' — పేజి 149.

---

* (స్నేహదేహళి (గేయ సంపుటి)— శ్రీ మిరియాల రామకృష్ణ. ప్రచురణ 1972.

ప్రతులకు : ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికిందరాబాదు ; విశాలాంధ్ర బుక్ హౌస్, విజయవాడ ; హైదరాబాదు. వెల రు. 3.]

ఆంధ్రదేశ చరిత్ర - భూగోళ సర్వస్వము - 3

ఏక కర్తృక గ్రంథాన్ని విమర్శకుడు సమీక్షించడం కొంత భావ్యంగానే కనిపిస్తుంది. అనేక కర్తృకమై బహువిషయ సంభరితమైన సర్వస్వాలవంటి బృహద్ గ్రంథాన్ని ఒకే విమర్శకుడు పరిశీలించి విమర్శ రాయడం శ్రమసాధ్యమైన పని. ఒక్కొక్కప్పుడు ఆయా వ్యాసకర్తలకు, ప్రచురణకర్తలకు జరగవలసినంత న్యాయం కనబడకపోవచ్చు. అయినా ఆం. చ. భూ. స. ప్రధానంగా చరిత్ర తోను, అప్రధానంగా భూగోళశాస్త్రంతోను, భాషావాఙ్మయాల తోను సంబంధించింది కావడంవల్ల, పదిమంది విమర్శకులు ఒకే గ్రంథాన్ని విమర్శించే సంప్రదాయం లేకపోవడంవల్ల నేనీ రచనా వ్యాసంగానికి తలపడ్డాను.

589 పుటల భారీ పుస్తకాన్ని తెరచేసరికి 'భీష్మద్రోణ కృపాది ధన్వి నికరాభీలం' ఎదురుగా కనిపించింది. భయం వేసింది. నిదానంగా పుటల్ని తిరగవేస్తూ, ఒక్కొక్క వ్యాసం చదువుతూ పోయే సరికి కాస్త ధైర్యం వచ్చింది.

దేశచరిత్రకు, భూగోళ శాస్త్రానికీ అవినాభావ సంబంధం ఉంది. దీన్ని చారిత్రక భూగోళమని ఇటీవల అంటున్నారు. కన్నింగ్ హామ్, నందలాల్ దేవ్, బి.సి. లా. ఈరంగంలో ప్రాతఃస్మరణీయులు. ఈ చారిత్రక భూగోళం ముఖ్యంగా పరిష్కృతమైన శాసనాలమీద ఆధారపడి ఉంటుంది. శాసన పరిష్కర్త త్రిముఖుడూ, చతుర్ముఖుడూ, పంచముఖుడూ, షణ్ముఖుడూ అయి ఉండాలి. అట్టి మహనీయులలో కీల్‌హారన్, ప్రిన్సెస్, ఫ్లీటు, బర్గెస్, బూహ్లర్, హుల్జ్ మొదలైన విదేశీయులు, కృష్ణశాస్త్రి, చక్రవర్తి, భండార్కర్, భట్టాచార్య, బెనర్జీ, వెంకయ్య, వెంకటసుబ్బయ్య, సర్కార్, సూక్తాంకర్ మొదలైన భారతీయులు, కావలి వెంకటబొర్రయ్య, కొమర్రాజు వేంకటలక్ష్మణరావు, గిడుగు రామమూర్తి, జయంతి రామయ్య, నేలటూరి వేంకటరమణయ్య, మల్లంపల్లి సోమశేఖర శర్మ, హర్షవర్ధనశర్మ మొదలైన ఆంధ్రపుత్రులు తక్కా మొక్కాలు తేరిన మొనగాండ్రు. సహజంగా వీరిలో ఉన్న దేశచరిత్ర రచనాభిలాషే కాకుండా, భాషా వాఙ్మయాలమీద అమితమైన అధికారం కూడా ఉంది. ఈ సమన్వయగుణం వర్ధమానుల్లో ఎంత ఉందో అనుమానాస్పదంగానే ఉంది.

తెలుగులో చారిత్రక భూగోళరచన - గ్రంథప్రకటన

'ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళము' అనే శీర్షికతో కథాశేషులు కుందూరి ఈశ్వరదత్తుగారు రచించారు. దాన్ని 1963లో ఆం. ప్ర. సాహిత్య ఎకాడమీవారు అచ్చువేశారు. ఆంధ్రచారిత్ర చతురాననుడని పేరుపొందిన ఆంధ్రుల చరిత్ర కృతికర్త చిలుకూరి వీరభద్రరావుగారికీయన మేనల్లుడు. జీవితమంతా ఆడిట్ అండ్ అకౌంట్స్ డిపార్టుమెంటువారి లెడ్జర్లు, ఫైళ్లు, స్టేట్‌మెంట్‌ల మధ్యే గడచిపోయింది. అటువంటి వ్యక్తి ఇటువంటి గ్రంథ రచనకు పూనుకోవడం కేవలం దేశాభిమానమే అని చెప్పాలి.[1] కాబట్టి ఈ ప్రక్రియలో ప్రథమస్థానాన్ని ఇచ్చి గౌరవించదగిన వారు స్వర్గీయ కుందూరి ఈశ్వరదత్తు.

ఆంధ్రదేశ చరిత్ర-భూగోళ సర్వస్వము

హైదరాబాదు ఆంధ్ర రచయితల సంఘంవారు ఇప్పటి వరకు మూడు సర్వస్వ సంపుటాలను ఆంధ్ర ప్రజలకి అందిచ్చారు.[2] భారత, ఆంధ్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయాన్ని ఈ సంఘంవారు పొందారు. ప్రస్తుత సమీక్షా వ్యాసం మూడో సంపుటాన్ని గూర్చి.

వీరి ప్రధానోద్దేశం — "ఆంధ్ర సంస్కృతిని, ఆంధ్రదేశమునకును, ఆంధ్ర ప్రజానీకమునకును నివాళులు పట్టుటయే." (ప్ర. సం. 1971. తొలిపలుకు.)

ఈ ఆదర్శాన్ని నిలబెట్టగలిగేవి తొలి రెండు సంపుటాలే అని మూడు సంపుటాలు చదివినవారికి ఇట్టే గోచరిస్తుంది. 'నానాటికి తీసికట్టు నాగంబొట్లు' అన్న దానికి ఆదర్శంగా ఈ సర్వస్వమే నిదర్శనం. పరాకు చిత్తగిస్తే పొయ్యిమీద పెట్టిన అన్నం ఏమవుతుందో అంత పనీ అయింది.

అచ్చు-అట్టహాసం

అన్నంలో రాళ్ళూ, అచ్చులో తప్పులూ ఏదో ఒకటీరెండూ ఉంటే సణుక్కొంటూ సరిపెట్టుకొంటాం. రాళ్ళెక్కువా అన్నం తక్కువా అయితే! ఎంత పురోడాశంలాంటి పవిత్రమైనది అయినా నభోజ్యం అవుతుంది. ఎక్కడైనా ఈ పొరబాట్లను సహించవచ్చునుగాని మంత్రప్రతాత్మకంగా నామకరణ మహోత్సవంనాడు పెద్దలు పెట్టిన పేర్లకే వంకలు పెడితే ఆ యా వ్యక్తులను అగౌరవపరచినట్లుంటుంది.

---

* [ఆంధ్రదేశ చరిత్ర—భూగోళ సర్వస్వము, మూడవ సంపుటము; (ఆకర—ఉపయ) ప్రకాశకులు. ఆంధ్రరచయితల సంఘం, విద్యానగరు; హైదరాబాదు — 500044, వెల : 25 రూ.]

ఉదా : శ్రీహరి ఆదిషువు (పీఠిక V. ఆదిశేషువు), ఆచటం రుక్మణమ్మ, ఆచటం లక్ష్మీపతి, ఆచటం వేంకట సాంఖ్యాయనశర్మ, ఆతుకూరి మొల్ల (పీఠిక, (IV, V, VI,) ముప్పమదేవి(123), ఇల్లరి భట్టారక వర్మ (383), చేతనభట్ల విశ్వనాథం (109), ఏ. యన్. రామేశన్ (592), ఓల బిక (592) దూపగుంట్ల నారాయణ ధూర్జటి (596. ఇదెక్కడి పేరు బాబూ!). బూరుల రామకృష్ణా రావు (598) నరస భూపాలీయం (195), భట్టు లంకకవి, వెన్నయరాజు (215) చివరకి ఖండవల్లి లక్ష్మీరరంజనం (594). సీతాఫలంలాంటి ఈ సర్వస్వాన్ని అచ్చువేసిన ఆ ముద్రాలయం వారిని ఎంతైనా అభినందించాలి. అక్షరాలు కంపోజిటర్‌తో నాలుగు స్తంభాల ఆట ఆడుతున్నాయి. అచ్చు తప్పుల విషయం విమర్శచేయడం గౌరవ భంజకం అయినా కాస్త సడలించవలసి వచ్చింది.

[బ్రాకెట్లలోనివి పుటల సంఖ్యలు]

ఏ వ్యాసం ఎంతపరిమితిలో ఉండాలి :

ఈ సమస్య విమర్శకుడికి తట్టింది. సర్వస్వ నిర్వాహకులకే మొదట్లో తట్టిఉంటే గ్రంథం ఎంతో బాగుపడేది.

1. ఆసఫ్ రాజవంశం 34 పుటలు
   (మనకేం ఉద్ధరించారని)
2. ఇక్కేరి వంశపు రాజులు 6 ,,
3. ఆనందరంగం పిళ్లె 6 ,,
4. ఆనందుడు 4 ,,
5. ఆర్కాటుకోట, నవాబులు 5 ,,
6. ఆనందకుమారస్వామి 4 ,,
7. ఆల్‌బూకర్క్ అఫన్‌సోడి } 3 ,,
8. ఆల్మైడా—డాన్ ఫ్రాన్సిస్‌కో—డి }
9. ఇబ్న్ బటూటా 4 ,,

ఇవి తెలుగు సంస్కృతికి సుదూరమైనవి. పోనీ మనకి సంబంధించిన వ్యాసాలయినా కనీసం చర్విత చర్వణం, అస్తవ్యస్తం, అనవసరపు పొడిగింపు కాకుండా చూసుకోవలసింది. ఊరిపేరు శీర్షిక వచ్చినప్పుడల్లా 'ఇంచుక వివరించవలసియున్నది' అంటూ చెప్పిందే చెప్పి పాఠకులకు విసిగెత్తిస్తారు. ఊహాగానాలు చేస్తారు, అయిందీ కాందీ రాస్తారు.

1. ఆకి—విష్ణుకుండినులు 3 పుటలు
   (ఇంతకీ స్థలనిర్ణయం కాలేదు)
2. ఆకుమళ్ల (ఇక్కడ శాసనం దొరికిందట)
3. ఆకులమన్నందు—తూ. చాళుక్యుల చరిత్ర 3½
4. ఆటూర్లు (విజయనగరరాజులు) 1
   ఈ గ్రామం ఉనికి తెలియదు.
5. ఆదులపల్లి—కొప్పులవంశం. 2
   (అసలు ప్రధానారోపమే తప్పు)
6. ఆముదాలపాడు—బాదామీ చాళుక్యులు. 4½
   (ఇది సరిగాలేదు)
7. ఆరట్లకోట—విజయనగరం రాజులు 3½
   ("ఆరట్లకోట ఏదియో సరిగా తెలియవచ్చుట లేదు గాని అదియొక బలిష్ఠమైన దుర్గమే." ఇదీ సారాంశం.]
8. ఆరవీడును గూర్చి ప్రత్యేక వ్యాసం లేదుగాని కర్నూలు జిల్లా మార్కాపురం తాలూకా అని ఒక చోట (192 పుట), గిద్దలూరు తాలూకా అని ఇంకోచోట (242).
9. ఆరవీటి వంశం. 45 పుటలు—చర్విత చర్వణం. అస్తవ్యస్తపు వాక్యాలు.
10. ఆరవీటి కొండ్రాజు వ్యాసంలో దక్షిణదేశపు ఆళ్వారుల సంక్షిప్త చరిత్ర. 3 పుటలు.
11. ఆరుంబాక (చరిత్ర)లో తూర్పు చాళుక్యుల చరిత్ర 2 పుటలు.
12. ఆరువేలనాడు, ఆర్వేలనాడు. 5 పుటలు. రెండూ ఒకటే.
13. ఆర్కాటుకోట—అసలు కోట గురించిలేదు.
14. ఆలమి (ఆలవెల్లి అయి ఉంటుందట) 2 పుటలు.
15. ఆవలూరు (తమిళ దేశానిది)
16. ఆసనపురం (కర్ణాటక దేశానిది) 2 పుటలు.
17. ఇందుపూర్—ఘటిక. ఇందుపూరూలేదు ఘటికను గూర్చీ లేదు.
18. ఇందులూరి వారినిగురించి మొదట సంపుటంనుంచి సందు దొరికినపుడల్లా వివరించారు. ఈ విషయంలో తాళ్లపాకవారి సామెత వర్తిస్తుంది. ఎవరు ఎవరికి కొడుకులో, భర్తలో తెలియని అయోమయపు గోలగా ఉన్నాయి.
19. ఇట్టి గేయ అగ్రహారం—1½ పుటలు.
20. ఇదుపులపాడు—చరిత్ర —2 పుటలు.
21. ఇంకొల్లు—రెడ్లచరిత్ర—1
22. ఇనుగుర్తి—కాకతీయుల చరిత్ర—4 పుటలు.
23. ఇసుకల్లి (ఎక్కడిదో) 1½
24. ఈడేరు (ఎక్కడిదో శాసనాలు లభించినంతమాత్రాన ఆ వూరి చరిత్రరాస్తే ఎట్లా) 3½
25. ఈ శాన పెగ్గడ—అసలు విషయం ఏమిటో 7 పుటలు.
26. ఉగ్రవాడి—శీర్షికలేదు. ఎక్కడిదీవాడి.

ఈ విధంగా అదను దొరికినప్పుడల్లా చరిత్రను ఇరికించి, ముఖ్యమైన విషయాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా, అనేక పొరబాట్లతో గ్రామాల చరిత్ర నడిచింది. ఆధునిక గ్రామాలు చరిత్ర రచనకు **Cencus Dept** వారి ధర్మమా అని గ్రంథాలు ప్రకటించారు కాబట్టి కడుపులో చల్ల కదలకుండా ఒకే మూసలోపోసిన కాసుల్లా వ్యాసాలు ఉన్నాయి. చమత్కారానికి ఓ వాక్యం—

"ఆలమూరు : ఇచ్చట జనులు అందరు వరి అన్నమునే తిందురు." (ఈ ఆలమూరు సుక్షేత్రమైన గోదావరీ తీరభూమి.) ఇన్ని గ్రామాలున్నా ఈ సర్వస్వంలో ఈ క్రింది గ్రామాలు ఉంటే బాగుండేది. అనవసరపు తుక్కు తగ్గిస్తే వీటికీ చోటు దక్కేది. ఈ సర్వస్వ వ్యాసాలలో కనుచూపు మేరలో కనిపించేవే. అకువీడు (కర్నూలు గిద్దలూరు తా) (20) ఆరెవీడు, ఉజ్జివోలు (395), ఆలూరు (ఒంగోలుఫిర్కా (421), ఉగ్రవాడి (556), ఇరుఢ్ధో (336), ఇసుడపల్లి (565).

చేరవలసిన గ్రామాలు :

ఆదిత్యపల్లి(వరంగల్లు శాసనాలు నెం.21) ఆకునూరు(అదే–(3 నెం.), ఇంద్రపురం (అదే.16 నెం), ఆదికుంట బ్రాహ్మణ క్రాక శాసనం. (**E. A. Vol. 11**), ఆదూరు(E 1 19 137–154), ఆదువాడ (ప్రా. జ. శా. 226 ఇదే అజ్జాడ తొలిరూపం?), ఆరువిల్లి, ఇడియూరు (అదే.189 పుట), ఆవకూరు, ఇఖ్ఖులకొటు, ఇన్నుతోలి ఇమ్మళూరు, ఇరుకుటూరు, ఇబ్బన్ లి(ఇర్పులి), ఇఖ్ఖులూరు, ఇలుపాడు, ఉత్పిలొటు (ఇవన్నీ ప్రాచీనాంధ్రశాసనాల్లోని గ్రామాలే). ఆతూరునాడు, ఆదరస్థలం, ఆహుఅపాకనాడు (ప్రాచీనాంధ్ర చారిత్రక భూగోళం) ఇంకా ఎన్నో ఉండవచ్చు.

చేరవలసిన ఇతర విషయాలు :

ఆచన ప్రెగ్గడ — (వరంగల్లు శాసనాలు—నెం. 21), ఉగ్రవర్మ (పల్లవరాజు), ఇందప రాజు (కుసుమాయుధుని మంత్రి (**E. A. 1. P. 90**), ఈదులపల్లి భవానీశ కవి, ఈవని వెంకటకవి, ఇమ్మడి జగదేవరాయడు, ఆమూరి రంగస్వామి సరస్వతి, ఈదర వేంకట్రావు, కుందూరి ఈశ్వరదత్తు, ఆర్య సంఘము (బౌద్ధ భిక్షులు) (వి. కుం. పుట 52), ఇరుగణ చోళ మహారాజు (తె. శా. సం. 2 క. చా. 4, 5, 6), ఇంద్రవర్మ (విక్రమేంద్ర వర్మ పుత్రుడు), ఇందిరా దేవి (అనంతచోడ గంగుని రెండో భార్య), ఇంగాల బ్రహ్మిరెడ్డి (కాకతి రుద్రదేవుని మంత్రి) (**S11.IV.1107**)

పునరుక్తం :

ఆరవీటి రాజుల వ్యాసాల్లోనూ, ఇందులూరివారి వ్యాసాల్లోను చాలాసార్లు చెప్పిందే చెప్పడం జరిగింది. అటాగే ఉత్తమాదిత్యుడు, ఉత్తమాదిత్య చోళమహారాజు (566) ఒకరే. ఇందుశేఖర చక్రవర్తి, ఇందుశేఖరరాజు, (మొత్తం 5 పుటలు) ఒకరే. ఇమ్మడి మంత్రి, ఇమ్మడీంద్రుడు (2 పుటలు) ఒకరే.

వ్యాసాలూ-వాటి వైఖరి : (పుటల వారీ)

1. ఆకరపల్లి కోదండ రాముడూ, కొటికలపూడి కోదండ రాముడు ఒకరే అని భ్రమ. కొటికలపూడివారికి ఆలంబనం బొబ్బిలి వెలమ వీరులు. ఆకరపల్లి కోదండరాముని శిష్యుడు ఏనుగు లక్ష్మణకవికి పోషకులు వత్సవాయివారు సూర్యవంశ క్షత్రియులు. ఆ యిరువంశాల సంస్థానాధీశ్వరులకు ఆ రోజుల్లో అంత పొత్తు లేదు.

3. విష్ణుకుండిన మాధవవర్మ వేయి 'అగ్నిహోమ' ములు చేసినాడట. శాసనంలోని 'క్రతుసహస్ర యజినః' అన్న దానికి అగ్ని హోమం అని వ్యాసకర్త.

15. ద్వితీయ జయసింహుడు 33 సంవత్సరాలు రాజ్యం ఏల లేదు. 13 సంవత్సరాలు మాత్రమే. **E. I. Vol. V.** ఉదహరించికూడా అందులోని **foot-note** చూడకపోవడంవల్ల ప్రమాదం. కొక్కిలి పెద్దన్న విష్ణువర్ధనుడు 37 సం. రాజ్యపాలన. సంఖ్య ఇవ్వలేదు.

20, 21. "పింగళి సూరన 1500 ప్రాంతమున జన్మించి శ్రీకృష్ణదేవరాయల నిర్యాణమునాటికి (క్రీ. శ. 1530) అతడు విద్యార్థి దశలో నుండి" నాడు అని చాగంటివారి అభిప్రాయమట! అంటే మీసాలూ, గెడ్డాలూ వచ్చి పిల్లలు కనే వయస్సుకి ఇంకా డింకీలు కొడుతూ పింగళి సూరనవంటి మహాకవి విద్యార్థి దశలో ఉన్నాడన్న మాట. ఎంత అపచారం! కళాపూర్ణోదయ కృతిపతి 1599 వరకు ఉన్నాడు. అటు తర్వాత ప్రభావతీప్రద్యుమ్నం. ఈ గ్రంథరచనా కాలంనాటికి ఉన్నాడనుకొందమా, లేడనుకొందమా? ఇదంతా పాత లెఖ. సూరన జననం 1520. ఆతడు రాయల నిర్యాణానికి విద్యార్థి. 1560—65 లో రాఘవ పాండవీయం. 1580లో కళాపూర్ణోదయం. ఆ తర్వాత ప్రభావతీ ప్రద్యుమ్నం. 65–70 సంవత్సరాలు జీవించి ఉంటాడు. రెండర్థాల కావ్యం వ్రాయించిన కీర్తి అకువీటి వెంకటాద్రిది ఎలా అవుతుంది? అది వేములవాడ భీమకవి చేత వ్రాయించినవానికి చెందుతుంది.

25. అకొండి రామమూర్తిశాస్త్రి. 'ఆంధ్ర రచయితల'', కర్త మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారి గ్రంథంలోని విషయాల్నే యధాతథంగా వాడుకొని రామమూర్తి శాస్త్రిగారు ఆ పుస్తకం అంకితం పుచ్చుకొన్నారన్న విషయం తెలియక పోవడం ఆశ్చర్యంగా ఉంది. పుస్తకం మొదట్లోనే 'తాతయ్యా కొనుమయ్యా' అంటు సరసమైన పద్యాలు మధునాపంతులవారు చెప్పితే అంత ఏమరుపాటేమిటి ? రామమూర్తి శాస్త్రిగారి దౌహిత్రులు సత్యనారాయణశాస్త్రిగారు.

26. ఆకొండి వేంకట కవిగారి తత్త్వసంగ్రహ రామాయణంలో కొంత భాగాన్ని వరుల అన్వయ భట్టే కాకుండా, మండపాక కామకవి (బొబ్బిలి) కాకాసుర వృత్తాంతం మొదలు సుగ్రీవ సౌఖ్యం వరకు, లక్ష్మణ మూర్ఛ మొదలు మూర్ఛాంతంవరకు రాసి ఇచ్చారు. ఈ గ్రంథాన్ని విజయనగరం ఆంధ్రవిజ్ఞాన సమితివారు ప్రకటించారు.

47. ఆచంట వేంకటసాంఖ్యాయన శర్మ. అసలు పేరు ఆచంట వేంకటరాయసాంఖ్యాయన శర్మ. ఇదే శీర్షికలో ఉండాలి. సాంఖ్యాయన శర్మ యను నామాంతరము కలదట. తప్పు. ఆయన నామాంతరం వేంకటరావు. మనోరమ నాటకం కాని పద్య కావ్యం కాదు; డా. పి. యస్. ఆర్. అప్పారావుగారు ఆంధ్రప్రభుత్వంవారు సాంఖ్యాయనశర్మగారి వర్ధంతి ఉత్సవ కమిటీ కార్యదర్శిగా ఉండినప్పుడు వేయించిన సావెనీరు అది. ప్రయివేటు ప్రచురణకాదు.

48. ఆచార్యుల రంగాచార్యులు : భారతవర్ష మహామహోపాధ్యాయ శ్రీమాన్ పరవస్తు రంగాచారయ్యావార్లంగారి పేరుకి వచ్చిన పాట్లివి. సర్వస్వ ప్రకటనకర్తలు మర్యాదప్రకారం పరవస్తు రంగాచార్యులు అని ఉండాలి. అప్పుడు ఏ వర్గసంపుటంలో చేరుతుంది. ఇంతకీ రంగాచార్యులవారి ఇంటిపేరు ఆచార్యులవారని ఎవరు చెప్పారు? ఎక్కడ చదివారు? పైగా విశాఖపట్టణం వీరి జన్మస్థానమట! ఆపాటి తెలియకే ''ఆంధ్రరచయితల'' కర్త నివాస స్థానము విశాఖపట్టణమని వ్రాశాడా? వీరిది దక్షిణదేశము. వీరు గురురాయ పట్టభద్రులు. అశేషశేముషీ దురంధరులు. ఈ వ్యాసకర్త ఆచార్యులవారి శాకుంతలానువాదంపై ఇచ్చిన certificate చదవండి. నవ్వొస్తుంది. వీరి ఆంధ్రీకరణ విధానము రసభావ వ్యంజికమై సర్వజన మనోరంజకమై మెప్పుచున్నదట!

అసలు ఆచార్యులవారి శాకుంతలానువాదం రెండంకాలవరకే సాగింది. అవి 1875లో ఏ మారుమూల పత్రికలోనో అచ్చయినాయి. దేశంలో చాలామందికి ప్రతులు దొరకటమే కడుంగడు క్లేశప్రాయము. అట్టి పరిస్థితులలో ఈ వ్యాసకర్త కాళిదాస మూలమును, రంగాచారిగారి అనువాదం దగ్గర పెట్టుకొని తైపారువేసి మనకొక అమూల్యాభిప్రాయాన్ని సాయించారు. ఇది నమ్మదగినదేనా? ఇటువంటి మోసగింపు సర్టిఫికేటు లివ్వవచ్చునా! ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే వ్యాసకర్తకు పరవస్తు రంగాచారి గారిని గూర్చి ఏమీ తెలియదు. 'ఆంధ్ర రచయిత'లే ఆయనకు ముఖద్వారం.

54. ముదిగొండ చాళుక్యవంశ వృక్షంలో కోకిరాజు మూలపురుషుడు ''రణమర్దకుడను భూపతి కుమార్తెను పెండ్లియాడెనని'' ఉంది. కోకిరాజు కుమారుడు కసుమాయుధుడు రణమర్దనాన్వయు డెట్లా అవుతాడు. తల్లివంశాన్ని చెప్పుకొన్న రాజులెవరూ కనిపించరు. దత్తతపోతే తప్పు.

58. ఆణెమురాజు—ఇది పాణెము రాజు అయి ఉంటుంది.

61. ''మొల్ల తండ్రి కేసనసెట్టి ఉత్తర శైవుడని తెలుస్తున్నదట. వీరశైవ మతస్థులు కాకపోవచ్చును'' అని.

కేసనసెట్టి గురులింగ జంగమార్చకుడు అంటే అతనిది వీరశైవం, వీరమాహేశ్వరం కాక ఏమయి ఉంటుంది. అసలు ఉత్తరశైవం అంటే ఏమిటో.

100. ఆదిపూడి సోమనాథరావుగారు ఇంతఅసంతృప్తిగా, అసమగ్రంగా, వ్యాసం ఉంటుందనుకోలేదు. తెలింగాణాకు సోమనాథరావుగారికి ఎంత బాంధవ్యముందో తెలపడానికి తెలింగాణాపు ముద్దుబిడ్డలైన వ్యాసకర్తలే ఉదాసీన భావం ప్రకటిస్తే విచారంగా ఉంది. సోమనాథరావుగారు కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయ స్థాపిత సభ్యులలో నొకరు. గద్వాలాస్థాన కవులైన ప్రభాకరామాత్యుని కగ్రజులు. వీరేశలింగంగారి వితంతూద్వాహవాహినిలోపడి వితంతువును భార్యగా స్వీకరించిన మహా సంస్కర్త. భగవద్గీత, శ్రీకృష్ణదేవరాయచరిత్ర, సర్వమాన్య శతక, రామమోహన నాటకము, విజయేంద్ర విజయ గ్రంథనిర్మాత. ఈవిషయాలు లేకపోవడం పరికదా ఏమిటీ క్రింది వాక్య విన్యాసవైఖరి — ''కాళిదాసు కావ్యత్రయము నీయన తెలుగులోనికి / అనువాదము చేసినాడు. ఇదిగాక కుమార సంభవ కావ్యమును—'' కాళిదాసు కావ్యత్రయంలోనే ఉందికదా కుమార సంభవం?

104. ''షేక్స్పియర్ కాళిదాసుల సాహిత్యము బాగుగా అర్థము చేసుకొని వారి గ్రంథములను సూక్తులను తనకు (ఆది భట్ల నారాయణదాసు) అభిమానమైన అచ్చతెనుగు (దేశి) లోనికి అనువదించెను'' ఇదీ ఒక దబాయింపే. అసలు గ్రంథము పేరు **Navarasa Tarangini or Beauties of Shakespeare & Kalidasa** ఇది. విజయనగరంలో 1925లో అచ్చయింది. భాష కవిత్రయంవారు ఏది వాడేరో అదే దాసుగారు కూడా వాడారు.

చూ. విధివశంబున వచ్చు వివిధాపదలకు (పుట 95.) ఇది అచ్చ తెనుగేగా, దేశియా !.

122. ''అదులపల్లి (వొప్పుల వంశము). శ్రీ సోమశేఖర శర్మగారుతమ 'రెడ్డిరాజ్యము' అను గ్రంథమునవివరించిరి'' అన్నారు. శ్రీ శర్మ గారి **History of the Reddi Kingdome** అనే ఇంగ్లీషుభాషలోని గ్రంథానికి బద్ధకమైన హ్రస్వ నామం 'రెడ్డి రాజ్యము'.

కాని ఆ పుస్తకంలో ఆదులాపల్లి లేదు. ఉన్నది అదులాపల్లి అందులాపల్లి అని ఉంది. ఆంగ్లేయ వర్ణక్రమ పఠన దైన్యంవల్ల వ్యాసకర్త ఆదులపల్లి అని పఠించి మొదటి సంపుటంలో చేరవలసిన దాన్ని ఇక్కడ ఇరికించారు. వ్యాసమా అసంబద్ధ పూరితం. కనీసం వడ్డాది శ్రీరామచంద్రమూర్తిగారు రెడ్డి సంచికలో ప్రచురించిన 'కొప్పుల వంశం' అనే వ్యాసాన్ని దగ్గర పెట్టుకొని రాసినా కాస్త మెరుగ్గా ఉండేది.

132. ఆనందకవి మంగళగిరి. ఇతని వేదాంత రసాయనాన్ని 1969లో నెల్లూరు **St John Press** వారు చక్కగా ముద్రించారు. ఇతని కృత్యంతరం విజయనందన విలాసం. ముద్రిత ప్రతి ఉస్మానియా విశ్వవిద్యాలయం లైబ్రరీలో ఉంది. ఈ రెండూ చూడకుండా రాసిన వ్యాసం ఎట్లాగుంటుందో మనమే ఆలోచించు

కోవాలి. వేదాంత రసాయన గద్యలో తన సూత్రగోత్రాలు చెప్పు కొన్నాడు. విజయనందనంలోనూ అంతే. క్రైస్తవుడెట్లాఅయ్యేడు?

139. "ఆనంద గజపతి. నారాయణదాసుగారి నవరస తరంగిణి...వీరి ఆదరాభిమానములచే రూపొందినదే" నవరస తరం గిణి అలక నారాయణ గజపతి (1902–1937) కంకితము. 'కాళిదాసు షేక్స్పియర్ కవితలపై ప్రేమపడెదవుగాక' యని కృతి పతిని సంబోధిస్తూ దాసుగారన్న మాటలు. అలక నారాయణ గజ పతి గౌరవాన్ని ఆనందగజపతికి అంటగడితే ఎట్లా ?

150. "అనేక కావ్యములకు వ్యాఖ్యానములు వ్రాసిన మల్లినాథునికి తోడరమల్లు అను బిరుద నామము కలదట". కల్లి నాథు డనడానికి బదులు మల్లినాథుడు అని పరాకురాత. అయినా కల్లినాథుడు కావ్యాలకు వ్యాఖ్యానాలు రాసినట్లులేదు.

214. "రామరాజ భూషణుడు: ఈ కవి తిరుమల రాయల ఆస్థాన కవిగా ఉండినట్లు తెలియుచున్నది. తెలియడం ఏమిటి రామరాజ భూషణుడు రామరాజు, తిరుమలరాయల ఆస్థాన కవి గాడని అనుమానమా !

215. రెండవ వేంకటపతి రాయల సాహిత్య పోషణ రచనా సందర్భంలో—

"అయ్యలు భాస్కరుడు రెట్టమత శాస్త్రమును" అయ్యలు భాస్కరుడు ఆంధ్రీకరించెను అని అయ్యలు భాస్కరుడు ఏకనామ కవిగా వ్యాసకర్తలు స్వీకరించినారు. వారు చరిత్రాధ్యాపకులు. వారికి **Father Heras. Aravid Dynasty** పరిచయగ్రంథం. అందులో ఆ బుడతకీచు ఫాదరీ ఎలా అంటే అలా అనవలసిందే. **"Ayyalu Bhaskara was likewise another of his court poets. Once he was asked."** ఇలా నడిచింది ఫాదరీ రచన! తెలుగువారైన వ్యాసకర్తలు వావిళ్లవారు అచ్చువేసిన రెట్టమతాన్నైనా, లేదా వంగూరి సుబ్బారావుగారు రచించిన శతక కవుల చరిత్రనైనా చూస్తే రెట్టమత గద్య.

"ఇది శ్రీ మదొంటిమిట్ట రఘువీరకృపాలబ్ధ సారస్వత ధుర్యాయ్యల రాజవంశ సంభవాయ్యలాఖ్య భాస్కరాఖ్య కవిద్వయ ప్రణీతంబగు" అని స్పష్టంగా వీరిద్దరూ కవిద్వయం అని తెలుస్తుందే! [శతక కవుల చరిత్ర. పుట 113. [1924] తెలుగు దేశపు చరిత్రకారులు విదేశీయ రాతలను ఖండించి "నీచపు దాస్య వృత్తి మననేరని శవారతతో మాతృదేశ సేవాచరణమ్ములు" కొలవ కూడదా !

295. "పురోహితవృత్తి నవలంబించి జీవితము గడుపు చున్న భీమన పండితునకు గౌరాంబకును జన్మించిన బసవని స్వరూపమే మల్లికార్జున పండితారాధ్యుడు." శ్రీశైల మల్లికార్జునుని మనసార భీమన పండితుడు పూజించి తన కొడుక్కి మల్లికార్జున అని సౌభాగ్య నామాన్ని పెట్టుకొన్నాడు. బసవని ప్రక్కన భక్తి వర్ధనముగా వసుధలో వెలయుమని శివుని ఆశీస్సు. పండితారాధ్య చరిత్రలో ఉన్న విషయమే. ఆ పుస్తకం దయచేసి ఇష్టముంటే స్వామి తిలకించండి.

296. ఆసనపుర వ్యాసంలో కోదండ రాముడికి కొడుకైన చిన వెంకటపతి కృష్ణరాయ విజయ గ్రంథకృతి పోషకుడన్న విషయం మరచారు.

362. కూఁతురు అన్నపదం 12వ శతాబ్దిదాక ఎందుకు ? నారాయణభట్టు కూంతురు కుపమ శాసనం 11వ శతాబ్దిలోనే వెలసిందికదా! **(S 11 4-1010)**

363. మళ్ళీ ఇందులూరివారి గోల. పెద మల్లియ తమ్ముడు పినమల్లయగాని గణపయ్య కాదండి బాబు !

365. ఆది గణపతిదేవుని శివయోగసారము నాల్గాశ్వాసాల గ్రంథం కాదని పూర్వోత్తర భాగాలతో 8 ఆశ్వాసాలని హిస్టరీ ప్రొఫెసరుగారికి మనవి చేసుకొంటున్నాము.

367. ఇందుశేఖరరాజు గొడవలో రుద్రమదేవి ఉత్తరేశ్వర శాసనం **(EI XXXVIII 76-94)** మరచిపోయారు. అయినా ఏమిటా వ్యాసం తీరు?

375. శ్రీపతిపండితుడు. ఈయన చూపిన మహిమలలో వస్త్రమునం దగ్నినుంచి మూట గట్టుటయు, జమ్మికొమ్మచే శివ లింగమును బంధించుటయు అనునవి కలవు"

"చీనాంబరేఽగ్నిం సంస్థాప్య శమీకోమం శాఖయా" అని వ్యాసంలో సూచించిన పల్లికేతుని శాసనంలోనే ఉందే.

శివ లింగాన్ని కొమ్మకు బంధించడమేమిటి? శ్రీపతి పండితారాధ్యులవారు నిప్పులు మూటకట్టుకొని ఇప్పుడూ తెలుగుదేశంలో ఉన్నారు. మనం తెలిసి వ్యవహరిస్తే మంచిది.

383. విష్ణుకుండినుల చరిత్రకు ఆధారాలు అయిదు కాదు తొమ్మిది ఉన్నాయి. (చూ. వి. కుం. చ.)

494. "మల్లారెడ్డి సుప్రసిద్ధుడు. మోటుపల్లి రేవు అధిపతి" ఇంతేనా!! అంటే Port chief officer అన్నమాట. అయ్యో!

కాని ఎర్రాప్రెగడ మల్లారెడ్డిని మల్ల రథినీ నాథుడని, శాసనాలు, పూర్వసముద్రాధీశ్వరుడని పొగిడాయి. తెలుగువారికి మల్లారెడ్డి నవలలో ఆదర్శ కథానాయకుడుగా సాక్షాత్కరిస్తాడే. ఎర్రాప్రెగడ హరివంశం అంతా అతని నామస్మరణతోనే ఉందే.

499. ఇలిందవాడ సూరపరెడ్డి: ఒకరి జీవితరేఖను చిత్రిస్తూ కుడుములతోపాటు గసడవాదేశాలు, ద్విగుసమాసాలు ఎందుకు తినిపిస్తారు. జీవిత విశేషాలుంటేనే జీవిత చరిత్ర స్పష్టంగా తెలుస్తుంది.

502. ఇతటూరి సోమనాథయ్య పిల్లలమర్రి చేతిరెడ్డి పెండ్లాము ఎఱకసానమ్మ క్రీ. శ. 1215లో పిల్లలమర్రిలో వేసిన శాసనంలో ఉన్నాడు. ఆయనని పలకరించడం మరచారు.

504. ఇసుకపల్లిలో మళ్లీ ఇందులూరివారి వంశం ఇసక పాతరలా ఉంది. అందులో రుద్రయ వ్యాకరణ బ్రహ్మకదా! అతడు రచించిన కాశికావృత్తిపై వాఖ్యం లభ్యం అవుతోందే దాని మాట ఏమంటారు?

557. 8 కోట్ల గుఱ్ఱములు—తప్పు. 'దశాస్యకోటీర', అనీ 'దశకోటీచ వాజిన', అని ఉంటే గుడ్డిగా దక్కను హిస్టరీని (2వ సం. పుట 586) అనుసరిస్తే ప్రయోజనం లేకపోగా అపవాదు కూడా వస్తుంది. గోవిందపురం శాసనం అచ్చయింది (వరంగల్లు శాసనాలు—నెం. 26లో) ఉగ్రవాడి మేళరసు చరిత్ర ఆశాభంగంగా ఉంది. అతని కాలంలో చక్కని తెలుగు శాసన కవిత వెలసింది.

563. ఉత్తమ గండమాడ వ్యాసంలో రాజరాజనరేంద్రుని తరవాత దేశ పరిస్థితి తెలుసుకోడానికి ఇటీవల శ్రీ ఎన్. రామేశన్ గారి సిద్ధాంతవ్యాసం. Studies in the Medieval Deccan History సాయపడుతుంది. అందులో కొత్తగా దొరికిన పరాంతకుని మల్లవరం శాసనం సవ్యాఖ్యానంగా అచ్చయింది. (1972) ఆర్కియాలజీ డిపార్టుమెంటువారు అచ్చువేశారు.

581. బాలదుర్గం కాదు పాలదుర్గం అని తెలుస్తుంది. జైమినీ భారతావతారికలోని (1–12) పద్యంలో 'బా'కిముందు అరసున్నా ఉంది.

589. "వల్లభ బీమనామాత్యుడు వెన్నెలకంటి సిద్ధన మంత్రికి ఉద్యోగియూ, గురువున్నై, యుండెను." పాపం! బీమనామాత్యునికి అంత దురదృష్టం పట్టలేదు. ఆ బీమనామాత్యుడే సిద్ధన మంత్రికి సకల సౌభాగ్య చిహ్నాలు ఇచ్చాడని విక్రమార్క చరిత్ర సాక్ష్యం.

589. దూబగుంట నారాయణ కవికి పంచతంత్ర రచనలో ప్రోత్సాహకుడు తమ్మభూపాలుని బసవయకాని కొండమ రాజా కాదు, వల్లభయ్యాకాదు.

ఇవే కాకుండా 589 పుటల డబుల్ డెమ్మీ, డబుల్ కాలమ్ గల గ్రంథంలో—గంపెడు లోపాలూ, పిడికెడు మెరుగులు.

మొత్తంమీద ఈ ఆంధ్రదేశ చరిత్ర—భూగోళ సర్వస్వం లోని వ్యాసకర్తలు ఎవరో ఒకరూ ఇద్దరూ తప్ప తక్కిన వారందరూ తమ రచనలను ప్రతిఫలాపేక్ష నాశించి పంపించినవే తప్ప వేరుకావు. రచయితలు నిజాయితీ, సత్యశోధన, ఆత్మసంశోధన గలిగి ప్రవర్తిస్తే ముందు ముందు సర్వస్వ సంపుటాలు కాస్త నయమనిపించవచ్చు. సంపాదకులు శ్రద్ధతీసికొని వ్యవహరిస్తేనే ప్రజల సొమ్ము దూబరకాదు. ప్రస్తుత సంపుటం ఉత్తమాదర్శాలను ఏమాత్రం అందుకోదు.

Epigrphia Indica, Andhrika, South Indian Inscriptions. Inscriptions of Warangal District South Indian Inscrptions.

ఆంధ్ర రచయితలు: మొదలైనవి ఈ సమీక్షా వ్యాసానికి పనికొచ్చాయి.

శ్రీ సుందరేశ్వరరావు

అథో జ్ఞాపికలు

1. చార్లెస్ ఫిలిప్ బ్రౌను చాలాకాలం అదాలత్ కోర్టు జడ్జీ, జయంతి రామయ్య డిప్టీ కలక్టరునుంచి ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్, బండారు తమ్మయ్య తాలూకా ఆఫీసు హెడ్డుకొంటెంటు. తరువాత ప్రస్తుత సర్వస్వ సంపాదకవర్గ అధ్యక్షులు, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారిదే పీఠం. వారు తెలుగు పండితులుగా తప్పబుట్టిన చరిత్ర పరిశోధకులు. తెలుగు శాఖాధిపతులుగా విశ్వవిద్యాలయంలో పనిచేసిన వారిలో లక్ష్మీరంజనంగారికి ఉన్నంత చారిత్రక జ్ఞానసంపత్తి, జిజ్ఞాస, దేశసేవాభిలాష వాటికితోడు సంస్కృతాంధ్రాంగ్ల భాషా పాండిత్యం, వేరొకరికి అబ్బలేదని అనటానికి సాహసిస్తున్నాను.
2. ప్రథమ సంపుటము అం—అల్లా 1971
   ద్వితీయ ,, అల్లి—ఆంధ్రా 1974
   తృతీయ ,, ఆకర—ఉదయ 1976


క్రొత్తది!
అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్ఠమైన
ఆముదము
శుద్ధిచేసినది.
వాసనలేనిది.
AMRUTANJAN
LTD'S
SPECIAL GRADE
CASTOR
OIL
SUPERIOR
PURE REFINED
AND ODOURLESS
NET CONT. 200 ML LOT No.
Manufactured by
AMRUTANJAN LTD.
UPPAL — HYDERABAD
MADE IN INDIA
మూడు
సైజులలో
లభిస్తుంది:
50 మిలి
100 మిలి
200 మిలి
OBM 3270 TG

శ్రీ గుమ్మా శంకరరావు

మల్లియ రేచన

తెలుగు భాషలో మొట్టమొదటి లక్ష్య గ్రంథం మహాభారతము. మొట్ట మొదటి లక్షణ గ్రంథం కవి జనాశ్రయము.

నన్నయకు భారత రచనలో నారాయణ బట్టు తోడైనట్లే మల్లియరేచనకు కూడా "ప్రాణ సమాన మిత్రుడు" సహాయుడు కాగా కవి జనాశ్రయాన్ని రచించాడు. ఈ విషయాన్ని మల్లియ రేచన గ్రంథాదిని సంజ్ఞాధికారంలో స్వయంగా చెప్పుకొన్నాడు.

కం॥ అసమాన దాన రవితన
య సమానోన్నతుడు వాచకా భరణుడు ప్రా
ణ సమాన మిత్రుడీ కృతి
కి సహాయుడుగా నుదాత్త కీర్తి ప్రీతిన్.

అయితే ఈ ప్రాణ సమాన మిత్రుని పేరు ఎక్కడా చెప్పలేదు.

'కవి జనాశ్రయం' భీమన ఛందమనే పేరుతోనే వాడుకలో ఉంది.

భీమన ఛందమనేది వేరేదీ దొరకలేదు. కాని వేములవాడ భీమకవిని లాక్షణికునిగా చాలామంది వినుతించారు.

దీనికి అప్పకవి మాటలు మరికొంత బలాన్ని కలిగించాయి. అప్పకవీయంలో గ్రంథాదిని మగణం ఉంటే మంచిదని చెబుతూ "భారతమున" 'శ్రీవాణీ గిరిజా' యని వాగను శాసనుండును, కవిజనాశ్రయమున, 'శ్రీకాంతా' యని వేములవాడ భీమకవియును ....మొదల గదియంచిరి అంటూ అప్పకవి చెప్పాడు. అంతేకాక

"భీమన పది చెప్పె ననం
తా మాత్యుడు చెప్పె వెనుక యతు లిరువది నాల్గు"

అని కూడా అప్పకవి అన్నాడు.

ఈ అప్పకవి దృష్టిలో బ్రాహ్మణుడు దప్ప ఇంకెవడూ పుస్తకం వ్రాయడానికి వీల్లేదు. ఖండించేటప్పుడు బ్రాహ్మణేతరుల పద్యాలను లక్ష్యాలుగా ఇతడు గ్రహించాడు. అదే దృక్పథం అంతకుముందు వాళ్ళకూ, ఆ తరువాతి వాళ్ళకూ, అంతో ఇంతో లేకపోలేదు.

రేచన బ్రాహ్మణుడు కాడు. వైశ్యుడు. పోనీ వైదిక భక్తి తత్పరుడు కూడా కాదు. జైన మతస్థుడు. అందుకే కట్టు కథల సృష్టి జరిగి ఉంటుంది.

వేములవాడభీమకవి, పనిగట్టుకొని డబ్బుకోసం రేచన వ్రాసినట్టు ఈ పుస్తకం వ్రాసాడని ప్రచారం చేశారు కొందరు.

కం॥ వేములవాడను వెలసిన
భీమేశ్వరు కరుణ గల్గు భీమసు కవి నే
గోమటి రేచన విాదను
నీ మహి గవులెన్న ఛందమెల మి రచింతున్.

అనీ భీమకవి అవతారికలో వ్రాశాడని కల్పించి కవి జనాశ్రయంలో దీనిని అతికించారు.

మొత్తం గ్రంథంలో కనీసం వందసార్లయినా మల్లియ రేచన పేరు కనిపిస్తుంది కదా! దానిని కాదనడానికి మరో మార్గం వెదికారు.

కం॥ నిను నీవె పొగడు వైఖరి
నొనరించెద దెనుగు బాస నొప్పగ ఛందం
బును గనక కవిత చెప్పిన
వినవే లచ్చనము వాడు వెంగలి రేచా!

అని మరో పద్యం భీమన చెప్పినట్లు చేర్చారు. 'వెంగలి' అని భీమన చెప్పాడట. రేచన చెప్పనిచ్చాడా? అది తిట్టు అని రేచనకు తెలీదా? శాపానుగ్రహ దక్షుడూ, వశ్యావాక్కు గలవాడూ అయిన భీమకవిచే రేచన అలా తిట్టించుకుంటాడా? అందువల్ల ఇవన్నీ కట్టుకథలే అని శ్రీ ఆరుద్రగారు 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం'లో వ్రాశారు.

'వెంగలి రేచా' అన్నది సంబోధనగా భావించారు శ్రీ ఆరుద్రగారు. నిజానికి దాని అర్థం ఇలా అనుకుంటున్నాను: "ఛందంబును గనక (చూడక) కవిత చెప్పిన వాడు వెంగలి. లచ్చనము వినవే రేచా!" అని సమన్వయించుకోవాలి.

అయితే కవిజనాశ్రయం మొత్తంలో మిగిలిన పద్యాల రచనకు, ఈ పద్యరచనకు తేడాఉంది. అందువల్లనే ఇది ఎవ్వరో వ్రాసి చేర్చినదన్న శ్రీ ఆరుద్రగారి ఊహలో సామంజస్యం ఉంది.

కాని కీ. శే. శ్రీ జయంతి రామయ్య పంతులుగారు ఆంధ్ర సాహిత్య పరిషత్తు తరపున దీనిని భీమన కృతిగానే అచ్చు వేయించారు.

ఇంత వివాధ గ్రస్తమయిన దీని కర్తృత్వ విషయ నిర్ణయానికి గ్రంథంలోని అంతస్సాక్ష్యాన్ని పరిశీలిద్దాం.

కవి జనాశ్రయంలో గద్య ఇట్లా ఉంది: "ఇది శ్రీ వాదీంద్ర చూడామణి చరణ సరసీరుహ మధుకరాయమాణ కవిజనాశ్రయ శ్రావకా భరణాంక విరచితంబైన కవిజనాశ్రయంబను ఛందంబునందు........."

ఈ గద్యను బట్టి కవిజనాశ్రయుడు, శ్రావకాభరణుడు అన్న బిరుదులు గలవాడున్నూ, శ్రీ వాదీంద్ర చూడామణి శిష్యుడున్నూ అయిన మల్లియరేచనకవిజనాశ్రయం వ్రాశాడన్నది స్పష్టం.

కవిజనాశ్రయుడు అన్న బిరుదు మల్లియరేచనకు కవిజనాశ్రయ రచనకు ముందే ఉన్నట్లు మనం భావించవచ్చు. గద్యలలోనే కాకుండా గ్రంథాదిని ఈక్రింది పద్యంలో కూడా కవిజనాశ్రయుడ నని మల్లియరేచన చెప్పుకొన్నాడు.

కం॥ అనవద్య కావ్యలక్షణ
మొనరంగా గని జనాశ్రయుడు మల్లియ రే
చన సుకవి కవిజనాశ్రయ
మను ఛందము దెనుగుబాస నరుదుగ జెప్పెన్.

కవిజనాశ్రయంలో అంత్యప్రాస లక్షణాన్ని చెబుతూ ఈ క్రింది పద్యం ఉంది—

కం॥ జననుత భీమ తనూజా
సునయార్పిత విభవతేజ సుభగమనోజా
వినుత విశిష్ట సమాజా
యననంత్య ప్రాసమగు నహర్పతి తేజా!

ఇక్కడ భీమ తనూజ పదాన్ని చూసి వేములవాడలోని భీమేశ్వరుని కరుణ వలన గలిగిన భీమకవిగా భావించి భీమనయే కవిజనాశ్రయాన్ని రచించాడని కొందరు భావించారు. అందుకే దీనిని ''భీమన ఛందము''ని అంటారు.

కాని నా ఊహకు ఈ మల్లియరేచన తండ్రిపేరు 'భీమన' అనిపిస్తూ ఉంది. భీమనకు ఇతడు పెద్ద కొడుకు. ఈ విషయాన్ని గ్రంథాదిలో ఉన్న ఈ మూడో పద్యం స్పష్ట పరుస్తూ ఉంది.

కం॥ పరగిన విమల యశోభా
సురచరితుడు భీమనాశ్ర సుతుండఖిల కళా
పరిణతుడయ్యును భూసుర
వరప్రసాదోదితధ్రువ శ్రీయుతుడై.

ఇందులో ''భీమనాశ్రసుతుడు'' అని ఉండటంచేత భీమేశ్వరుని కొడుకైన భీమకవి కాడని స్పష్టమవుతూ ఉంది. ఎందుకంటే భీమేశ్వరుని కరుణవల్ల గలిగినవాడు భీమకవి ఒక్కడేకదా! 'అగ్రసుతుడు' అని ఉండటంవల్ల తరువాత మరికొందరు సుతులు కూడా ఉన్నట్లు అర్థమవుతూ ఉంది కదా!

అందువల్లనే ఈ భీమన వేములవాడ భీమేశ్వరుడు కాడని 'భీమన' పేరుగల మల్లియరేచన తండ్రియేయని స్పష్టం. అతనికి మల్లియరేచన అగ్రసుతుడని భావించడమే సమంజసము.

దీని తరువాత పద్యంలో ప్రాణ సమాన మిత్రుడు సహాయుడు కాగా, ఈ కృతి రచించినట్లు చెప్పాడు మల్లియరేచన.

ఈ పద్యానికి దీనిముందు పద్యం విశేషణంగా భావించి మల్లియరేచన ప్రాణసమాన మిత్రుడే భీమనాశ్రసుతుడేమో! అన రాదా అని ఎవరైన ప్రశ్నించవచ్చు. ''భూసుర వరప్రసాదోదితధ్రువ శ్రీయుతుడై''. మల్లియరేచన ప్రాణసమాన మిత్రుడు సహాయుడు కాగా కవిజనాశ్రయమనే ఛందము రచించాడని చెప్పేటప్పుడు సాలభ్యం ఉంది.

ప్రాణ సమాన మిత్రుడికే ఈ విశేషణం చెందవలసి ఉన్నప్పుడు మూడో పద్యం చివరి పాదం ''భూసురవరప్రసాదోదితధ్రువ శ్రీయుతుడై'' అని కాకుండా ''...... శ్రీయుతుడున్'' అని ఉండవలసి ఉంటుంది.

ప్రాణ సమాన మిత్రుని పేరే చెప్పని రేచన ఆ ప్రాణ మిత్రుని తండ్రిపేరు చెప్పడనటం మరీ విడ్డూరం.

అంతేకాక ''భూసురవరప్రసాదోదితధ్రువ శ్రీయుతుడై'' అన్నది భూసురుడు కానటువంటి మల్లియరేచనకే చెల్లుతుందనడం సబబు.

మరో సాక్ష్యం గ్రంథంలో దీనికే అనుకూలంగా ఉంది. దండక లక్షణం గూర్చి చెబుతూ ''జగద్గీతకీర్తీ! పురారాతి మూర్తీ! సముద్యద్గుణార్తీ! సదాచారవర్తీ! వణిశ్వంశ చూడామణీ! సాధుచింతామణీ! శిష్టరక్షామణీ! సుందరీవశ్య విద్యామణీ! రేచనా! కావ్యసంసూచనా! నిత్యవైరోచనా!'' అని మల్లియరేచనకు సంబంధించిన సంబోధనలే ఉన్నాయి.

''పురారాతిమూర్తీ'' అన్నదానికి అర్థం గ్రహిస్తే పురారాతి అంటే ఈశ్వరుడు. 'భీమః స్థాణూర్రుద్ర ఉమాపతిః' అని ఉండటంవల్ల భీముడు అని కూడా చెప్పవచ్చు. 'ఆత్మావై పుత్ర నామాసి' అన్న ఆర్యోక్తి ననుసరించి ''పురారాతిమూర్తీ'' అంటే ''భీమస్వరూపా'' అని అర్థం వచ్చి భీమనాశ్రసుతుడైన మల్లియ రేచనకే వర్తిస్తుందనటంలో విప్రతిపత్తి లేదనుకుంటాను. అందుచే మల్లియరేచన తండ్రి 'భీమన' అని చెప్పటం సబబు.

అట్లాకాకుండా ఈ భీమననే భీమకవి అందామా అంటే వణిశ్వంశ చూడామణీ అని ఉన్న విశేషణం భీమకవికి వర్తించదు.

'పురారాతిమూర్తి' కేవలం భీమేశ్వరుడే అందామా అంటే అందుకు కూడా ఇది అడ్డు వస్తుంది కదా! పై వాటిని సమాలోచిస్తే మల్లియరేచన తండ్రి 'భీమన' అని చెప్పటమే అత్యంత సమంజసము.

'వణిశ్వంశ చూడామణీ' అన్న విశేషణం మల్లియరేచన ''వైశ్యుడు'' అన్న విషయాన్ని ధ్రువపరుస్తూ ఉంది.

మల్లియ రేచన భార్య పేరు శ్రీదేవి. ఈ విషయాన్ని బలపరుస్తూ 'శ్రీసంసేవ్యవక్షా, శ్రీ రమణీ ప్రియ, శ్రీ కాంతా సఖుడు, శ్రీ సమేతుడు, శ్రీనారీ ప్రియుడు, శ్రీ శ్రితవక్షుడు'' అనే విశేషణాలు కవిజనాశ్రయంలో చెప్పబడ్డాయి. ఇవి అన్నీ లక్ష్మీ పరంగా చెల్లుతాయి అని అనుకుందామా అంటే 63 వ పేజీలోని పద్యం ఇలా ఉంది :

కం॥ శ్రీదేవీ పతి రేచడు
నాది యొప్పెనగ దేశకాల కళాలో
కాది విరోధస్థితుల స
మాదరమున దెలియజెప్ప నఖిల జనులకున్.

అందువల్ల 'శ్రీదేవి' ఇతని భార్యయే.

ఇంక ఇతని కాలనిర్ణయాన్ని గురించి చూద్దాం.

నన్నెచోడుని కుమార సంభవం 8వ ఆశ్వాసం చివర ఉన్న పద్యంలో 'పరవాదీంద్ర ఘనాఘనానిలు' అన్న భాగం చూస్తే నన్నెచోడుని గురువైన జంగమ మల్లిఖార్జునుడు ఈ వాదీంద్రుణ్ణి ఓడించినట్లు కనిపిస్తూ ఉంది. ఈ వాదీంద్రుడే మల్లియ రేచనకు గురువు. అంటే ఇద్దరి గురువుల కాలం ఒక్కటే. వారి వారి శిష్యులైన నన్నెచోడుడు, మల్లియ రేచన కూడా ఒక కాలం నాటి వారన్నమాట.

నన్నెచోడుడు 'వస్తుకవిత' అనే మాటను వాడాడు. 'గూఢ వస్తుమయ కావ్యం' అన్నాడు. తనది 'రుచిరవస్తు విస్తారితోత్తమ కావ్యరత్న విభూషణ'మన్నాడు.

మల్లియరేచన కూడా తాను వస్తు కవిజనాశ్రయుణ్ణని స్వయంగా చెప్పుకొన్నాడు. సమగీదియలలో తేటగీదియ లక్షణం చెబుతూ—

''వాలునిడి యొండెజెప్పిన వస్తుకవి జ
నాశ్రయా! తేటగీదియ యగు ధరిత్రి''.

జాను తెనుగు పదాన్ని నన్నెచోడుడు వాడాడు. అట్లే రేచన కూడా తరువోజ లక్షణం చెబుతూ 4వ పాదంలో—

''సలలిత గతి కృతిచన జెప్పడనియె
జానుగా గవి జనాశ్రయుడు దర్వోజ''
'జాను' శబ్దాన్ని ప్రయోగించాడు.

అంతేకాక రేచన నన్నెచోడుని కాలంనాటి వాడనడానికి మరో ఆధారం కూడా ఉంది.

ఇప్పుడు మనం అరసున్న లున్నాయనుకొనే కొన్ని పదాలను నిండు సున్నలతో ప్రాసస్థానంలో నన్నెచోడుడు ప్రయోగించాడు. రేచన కూడా అలాగే చేశాడు.

''మూండుసేసిన గణములు రెండు నలములు
మూండిన గణములును మొగి నహంబు
పొండిగాగ నర్థమునకగు మీదని
ట్లుండ జెప్పవలయు నొగి ప్రగీతి.''

కవి జనాశ్రయంలో వాడిన శతాధిక సంబోధనలలో ఎక్కువ అతని వైదుష్యానికి చెందినవే.

కం॥ మందరగిరి విభుడఖిల
చ్ఛందోర్ణవ పారగుండు సత్కవి సయతి
చ్ఛందో లక్షణ మందం
బొందంగా గవి జనాశ్రయు డొనరించున్.
అఖిలచ్ఛందోర్ణవ పారగుడు మల్లియ రేచన.

కం॥ ఇప్పారుదొల్లి పింగళు
చెప్పిన క్రియ ధప్పకుండ జెలువలరంగా
జెప్పబడె వళ్ళు ప్రాసలు
తప్పక యర్ధ సమవృత్త తతి విదితముగాన్.
దీనివల్ల పింగళచ్ఛందము నెరిగినట్లేకదా!

కం॥ జయ దేవాదిచ్ఛందో
నయమున సంక్షేప రూపునం జెలువుగ మ
ల్లియ రేచన సుకవి జనా
శ్రయుడీ ఛందంబు జెప్పె జనులకు దెలియన్.
అన్న దానివల్ల జయదేవాదిచ్ఛందము లెరిగిన వాడనవచ్చుకదా!

ఇంతేకాక కన్నడ భాషలో నాగవర్మ వ్రాసిన 'ఛందోంబుధి' అనే గ్రంథాన్ని చూసినట్లూ, దానికీ దీనికీ దగ్గరి సంబంధ మున్నట్లూ శ్రీ సంపత్కుమార తన ''తెలుగు ఛందోవికాసం''లో పేర్కొన్నారు. శ్రీ నిడదవోలు వేంకటరావుగారు కూడా ఈ విషయాన్ని బలపరిచారు. వీటన్నిటివల్ల మల్లియ రేచన అఖిలచ్ఛందోర్ణవ పారగుడనటం నిర్వివాదం.

సర్వశాస్త్ర విధిజ్ఞా, వాక్ప్రీపతిప్రియవల్లభా, వాగ్వధూవల్లభా, విద్వద్వంద్యోద్వృత్త, సార ప్రజ్ఞాంభోనిధి పురుషా, సత్కవి జనాశ్రయా, కవీంద్రజనాశ్రయా, సారాచార విశారదా, సూరిస్తుత్యా, బుధనిధీ, సర్వశాస్త్ర విశారదా, నిఖిలాగమజ్ఞ, శిష్టజన సేవిత, సారార్థవిచార, సకలకళాకుశల, సమస్తకళాసూన, అఖిల కళాపరిణత, విద్యా శ్రీ శ్రితముఖ, సత్కవి అన్న సంబోధనలు మల్లియ రేచన సర్వశాస్త్ర విదుడు, సమస్త కళాకోవిదుడు, కవిజనాశ్రయుడు అని చెబుతున్నాయి. గ్రంథంలోని వేర్వేరుచోట్ల చెప్పుకొన్న సంబోధనలే కాక ఒక్కచోటనే కూడా ఈవిషయాన్ని కంఠోక్తిగా చెప్పుకొన్నాడు.

కం॥ విలసదురు కావ్యరచనా
విలసన్మతి రేచడఖిల విద్యావిదుడి
మ్ముల నాది విషమవృత్తం
బులు సెప్పె రసోత్కటముగ పూర్వోక్తవిధిన్.

శిష్టామర తరువా, సన్మానదానా, అశ్రాంత త్యాగాన్విత, విశిష్టకల్ప మహీజ, సాధుచింతామణీ, సంచిత పుణ్యా, పరహిత చరితా, లోకహిత, పరహితార్థి, సంతృప్తాతిథి, పరమ చారిత్ర అన్న సంబోధనలు రేచన త్యాగనిరతిని, దాన గుణాన్ని, పరోపకార పారీణతనూ వేనోళ్ళ చాటుతున్నాయి.

పాండిత్యం తరువాత ఇతని రూపంగురించి చెప్పుకొన్న విశేషణాలు ఎక్కువ.

సుగుణ సుందర తరుణీస్మర నిభుడు, వారస్త్రీ సంసేవ్య వక్షుడు, సుందరీవశ్య విద్యామణి, కుచభార నమ్రవధూ ముఖాంబోజ భాస్కరుడు, రమణీ రమణీయ రమణ రమణుడు, మారాకారుడు, కామనిభుడు మొదలైనవి ఇతని రాసిక్యాన్ని వెల్లడిస్తున్నాయి.

ప్రహరణకుశలుడు, అనతారి, మృగేంద్రోద్యచ్ఛౌర్యుడు, అమిత సాహసుడు, మందర భూభృత్సమానుడు, అనేవి ఇతని శౌర్యాన్ని చాటుతున్నాయి. చిలుకూరి వీరభద్రరావు గారన్నట్లు ఇతడు సేనాని కావచ్చు. లేకపోతే ప్రహరణ కుశలుడు కావడానికీ, అనతారి అవడానికీ అవకాశం ఉండదు.

ఇతడు సకల సంపదలతో తులతూగినవాడు. 'క్షత ద్విడ్వంశాళీ' అన్న సంబోధన ఉంది. దీనివల్ల ఈతనికి శత్రువంశ సమూహనాశకత్వ లక్షణమున్నట్లు భావించడానికి వీలవుతూ ఉంది.

శ్రావకాభరణ, జినమతహిత, జపాథ్య శ్రావకాభరణాంక, జినేంద్ర పదభక్తి నిరత మున్నగు పదాలు ఇతని జైనమత హితత్వాన్ని, దానితోపాటు వాదీంద్ర చూడామణి శిష్యత్వాన్ని, ఇతని జైనమత స్వీకారాన్ని తెలియబరుస్తున్నాయి. జైనమత ప్రసక్తి ఉదాహరణలుగా దోషాధికారంలో రెండు చోట్ల చెప్పుకొన్నాడు.

కం॥ ఘనదండ కాష్ఠ కృష్ణా
జినములు సొగయింప నొక్క జినము నిచనుదెం
చెననగ సమయ విరోధం
బని కవులకు జెప్పగవి జనాశ్రయుడొనరన్.

కం॥ జినమత ధర్మ మహింసయ
యను మతమున విితతముగ గజాసురు చాపం
బని చంపడయ్యె నీశ్వరు
డన నిదియాగమ విరోధమనిరి కవీంద్రుల్.

కాకతీయుల కాలం నుంచీ అందులోనూ ముఖ్యంగా రుద్రదేవుని కాలం నుంచీ జైనమతం తెలంగాణాలో తగ్గుముఖం పట్టింది. అది వీరశైవం విజృంభిస్తున్నకాలం. రేచన ఈ మత విప్లవాల సంధియుగంలో వర్ధిల్లి ఉంటాడు.

రగడలకు రేచన లక్షణం చెప్పలేదు. ఇతని కాలానికే నన్నయగారు వాడిన మధ్యాక్కరలలోని యతిస్థానం మారి ఉంటుంది. నన్నయగారి మతానికి విరుద్ధమైన నాలుగోగణం మొదటి అక్షరం ఇతడు యతిగా చెప్పాడు.

కవిజనాశ్రయం తొలి లక్షణ గ్రంథం కాబట్టి ఇందులో చిత్రబంధ కవిత్వాల ప్రస్తావన లేదు.

తెలుగులో దాదాపు 35 ఛందో గ్రంథాలున్నాయి. ఇవన్నీ కవి జనాశ్రయాన్ని అనుసరించినవే. అందువల్ల దీని ప్రాశస్త్యం తెలుస్తూ ఉంది.

కవి జనాశ్రయుడు వ్రాసినది కాబట్టి దీనికి కవి జనాశ్రయమని పేరు వచ్చింది. తరువాత ఇది కవిజనులకు ఆశ్రయమయింది కూడా.

కవి జనాశ్రయం అన్న పేరులోనే 'కవిజనాశ్రయుడు వ్రాసినది' అని గ్రంథకర్తృనామం ఇమిడి ఉండగా కేవలం గ్రంథం

(ప్రక్క పేజీ క్రిందిభాగంలో)

శ్రీ ఎమ్. పార్థసారధి

బెలూన్

రంగురంగుల బెలూన్లు తురాయిలాగ ఎగురుతూంటే, రోజూ సాయంత్రం బెలూన్లమ్మే అతను వస్తాడు.

కేక ముందు వినిపిస్తుందో, సిలిండర్ నిలిచిన చక్రాలబండీ మోత ముందు వినిపిస్తుందోగాని— పిల్లాడు ఒక్క గెంతులో గేటు దాటతాడు.

''ఒద్దురా నాన్నా, రోడ్డు జాగ్రత్త'' అంటుంది తల్లి.

అయిదేళ్ల పిల్లాడు వినిపించుకోడు.

రోడ్డుపక్కన యిల్లు— ఎన్ని కార్లో, ఎన్ని రిక్షాలో!

రోడ్డుకటువైపున సిలిండర్ బండీమీద ఆకాశంలోకి ఎగరకుండా పక్షుల్లా బంధించబడ్డ బెలూన్లుతప్ప మరేమీ కన్పించవు పిల్లాడికి.

తల్లి కేక వినిపించదు. ఆమె గొంతులోని బాధ, ఆందోళన వాడికి తెలియనైనా తెలియదు.

వరండాలో నిల్చున్న తల్లి, కొడుకు క్షేమంగా రోడ్డుదాటి బెలూన్లతని దగ్గరకు చేరితే సంతోషిస్తుంది— భయపడుతుంది. చిన్నప్పుడు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో పేలిన సిలిండరూ, గత సంవత్సరం పక్క వీధిలో జరిగిన మరో ప్రమాదమూ జ్ఞాపకం వస్తాయి. ఎంత భయంకరమైన ప్రమాదం— హరిహరీ!—ఎంత మంది పిల్లలు...భయంతో ఊహ కూడా నిల్చిపోతుంది.

ప్రపంచాన్ని గెలిచిన సంతోషంతో కొడుకు మళ్లీ రోడ్డు దాటి పరిగెట్టుకుంటూ యిల్లు చేరతాడు. పిల్లలకు పరిగెత్తటమే తప్ప నడక తెలియదు.

ఎగరనివ్వకుండా బెలూన్ దారాన్ని వేలికి చుట్టుకుని మరీ వస్తాడు.

తల్లి ఆనందంతో, తృప్తితో—

''సరే, వుద్ధరించావుగాని, యింక లోపలికి పద. బెలూన్ ఎగిరిపోతుంది'' అంటుంది.

ఐదు నిమిషాలన్నా ఆడుకుంటాడో లేదో — ఆ చిన్నారివేళ్ల నుండి దారం జారిపోతుంది.

విముక్తి పొందిన బెలూన్ క్షణంలో ఆకాశంలోకి ఎగిరిపోతుంది— లేదా ఇంట్లో చూరుకు తట్టుకుంటుంది— ఈలోగా పగిలిపోకపోతే.

ఏనాడైనా వాడు బుద్ధిగా యింట్లో దాచుకుంటే — అది కాస్తా తెల్లారేసరికి నేలకు దిగిపోతుంది. ప్రాణంపోయిన ఆ బెలూన్ని చూసి కుర్రాడు దిగులు పడతాడు. తల్లి మళ్లీ, ''సాయంత్రం కొందాంలేరా. ఊరుకో నాన్నా. ఆ బెలూన్ అంతే. కొన్ని కాసేపటి దాకానే దానికి ప్రాణం వుంటుంది.ఏం చేస్తాం—ఏడవకు'' అంటుంది.

బెలూన్లతను వస్తూనే వున్నాడు. సిలిండరు యాక్సిడెంట్లను గురించి ఆమె వింటూనే వున్నది. కార్లను గురించీ,రిక్షాలను గురించీ, ప్రమాదాలను గురించీ ఏమీ తెలియని పిల్లలు రంగుల బెలూన్ల ఆకర్షణతో రోడ్డు దాటుతూనే వున్నారు.

బెలూన్లతని చుట్టూ మూగిన పిల్లల్లో యిప్పుడామెకు తన మనవలు, మునిమనవలు కూడా కన్పిస్తున్నారు.

భయవిహ్వలమైన ఆమె కళ్ళు, ఆందోళితమైన ఆమె మనసు ఆ పిల్లల్ని చూస్తూ అలసిపోలేదు. ఆ భయం తగ్గలేదు. పిల్లలకు పెద్దవాళ్ల కేకలు విన్పించలేదు.

దారం కాస్త వదిలేస్తే చాలు — బెలూన్లు ఎగిరిపోతూనే వున్నాయి.

పగిలిపోతూనే వున్నాయి—బెలూన్లు, సిలిండర్లు. జాగ్రత్తగా దాచుకున్నప్పటికీ తెల్లారేసరికి అవి, గ్యాస్ తగ్గి నేలక్కరచుకు పోతూనే వున్నాయి—ఇప్పటి కిలాంటివెన్నో!

మల్లియ రేచన

(ముందుపేజీ తరువాయి)

పేరుగా భావించి ఇది భీమన కృతమన్నారు కొందరు. మరి భీమ కవికి కవిజనాశ్రయ బిరుదు లేదు కదా! అందుచే ఇది కవిజనాశ్రయ బిరుదాంకితుడైన మల్లియరేచన కృతమే.

మల్లియ రేచన దాననిరతుడు, సత్యనిరతుడు, అభిమాన నిరతుడు. ఈ విషయాన్ని తానే కంఠోక్తిగా త్రిప్రాస లక్షణం చెబుతూ ఇలా అన్నాడు :

కం॥ దానమున సత్యమున నభి
మానమునం బోల్పనీ సమానము ధరణిన్
గానమునం ద్రిప్రాసము
దాన మనోహరమగును బుధస్తుత చరితా''

రేచనకృతమైన దానిని భీమన కృతమనడం ఇలాంటి సత్యనిరతుని కంఠోక్తిని అసత్యమనడమే కదా!

శ్రీ వేలూరి రాధాకృష్ణ

భారతదేశపు జానపదకళ

'కళ' అనేది ప్రజలదీ, ప్రజలకోసం, ప్రజలచే సృష్టింపబడినదీ అయితే 'జానపదకళ' అనేది కేవలం వారిలోనించి వారి ఆనందం కోసరం పుట్టుకువచ్చిందని చెప్పాలి. 'జనపదం'అనంగానే మామూలు ప్రజాబాహుళ్యమనే అర్థం వస్తుంది. వారికి సంబంధించింది కాబట్టి 'జానపద కళ' అని పేర్కొనటం జరిగింది. నేనుంటున్న ఈ ఉత్తర హిందూస్థానంలో 'లోక్‌కళ' అని అంటారు. 'లోకుల'కు సంబంధించిందనగానే జనపదులకు సంబంధించిందని మనకు తేలికగా అర్థమయిపోతుంది. అందువల్ల ఈ జానపదకళకు ఎల్లలు అనేవి లేనేలేవు. ఇది సార్వజనీనమైనదీ, జనపదానికి సంబంధించిందీ కాబట్టి 'జానపదకళ' ఆ విధంగా సార్థకమయింది. ఇది ప్రజల స్వాభావికమైన సృజనా నైపుణ్యాన్ని తెలిపే కళ. జానపద కళలో ప్రజలలో జనించే అంతర్లీనమైన, నిరాడంబరమగు ఆనందోత్సాహాలను కలిగింపజేసే అతి సహజమైన శక్తి ద్యోతమానమవుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే వారి 'ఆత్మ' ఆ కళలో ప్రతిబింబితమవుతుంది. మానవాళిలో సృష్టి మొదటినుంచి, ప్రకృతిచే 'ప్రేరేపింపబడి' ఆనందోత్సాహాలను పెంపొందింపజేసే పరిసరాలవలన సమ్మోహింపబడి దానిని బాహ్యంగా ఏదో ఒక రూపంలో ప్రదర్శించే ఉత్సుకత సహజంగానే ఉంటుందన్నమాట! ఆ విధంగా ఆవిర్భావం పొంది, అనాది కాలం నుంచీ జనబాహుళ్యంతోపాటు వారి ఆనందాన్ని ఇనుమడింపచేస్తూ గుప్తంగా, వృద్ధిపొందుతూ వచ్చింది.

ఈ జానపద కళ ముఖ్యంగా పల్లెపట్టులందు అజ్ఞాతంగా అధునాతనమైన ప్రస్తుతపు నాగరికతకు 'దాసోహం' అనకుండా అస్ఖలితంగానే ఉంటూవచ్చింది......

మానవుని సహజ ప్రవృత్తి, ఒక కల్పనచేసి, ఆ కల్పనలో తనంతట తానే ఆనందంపొంది, తన్మయత చెందటంలోనే ఉంది. అతడు తన ఇంటి చుట్టూ తన ఆనందంకోసం పూలమొక్కలను నాటి, వాటిని ఎంతో ఆప్యాయతతో పెంచుతాడు. ఆ మొక్కలు పెద్దవై పూలు పూస్తూండటం చూసి, తన పరిచర్యయొక్క ఫలితంలో సంతృప్తిని చెందుతాడు. తన ఇంటికున్న మట్టి గోడలపై సుద్దతో, తనకు తోచినవిధంగా అనేక రూపాలుగల బొమ్మలను వేస్తాడు. తన గృహిణి ఇంటిని పేడతోఅలికి, ఇంటిముంగిలి కడ, రకరకాల ముగ్గులు పెడుతుంది. ఆ ముగ్గులలో ఎంతటి కళారూపకమైన నైపుణ్యం ఉందని ! ఆ అలంకారికమైన ఘనత దానికే తగుతుంది!! ఉత్తర హిందూస్థానంలో పారిశ్రామికుల భార్యలు మట్టికుండలమీద సున్నంతో తమకు తోచినవిధంగా అలంకారం చేయనిదే వాటిని ఇండ్లలో ఉపయోగించరు! అలంకారం చేయటం అనే ఈ అమూల్యమైన వాంఛయే ప్రజలలో కళాతృష్ణను రేకెత్తించింది! దానినే మనం ''సౌందర్యోపాసన''గా కూడా చెప్పుకోవచ్చును. జానపదకళ మానవుని దైనందిన జీవన ప్రేరణచేత పెంపొందుతూ, అతని అసలు జీవనాన్నే ప్రతిబింబించుతుంది. సాధారణ జనుల జీవనం చాలా సరళమైనదీ, ఆడంబరమనేది ఏ కోశానా లేనిదీను. వారి జీవనమెంత సరళమో, ఎంత నిరాడంబరమైనదో, వారి స్వభావంకూడా అంత సరళమైనదీ, నిరాడంబరమైనదీ కావటం మూలంగా, వారిలో ఎక్కువగా మనం చెప్పుకుండే 'సంస్కారం' లేకపోయినప్పటికీ, వారి జీవనరీతి అతి సహజమూ, మనోహరమూ అయి విలసిల్లుతుంది. ఆ విధమైన జీవితమే సార్థకమయినదీ, శాశ్వతమైనదీను. వారి జీవనంలోని ఆ ప్రభావమే వారిచేత అంతటి సరళమైనవీ, సహజమైనవీ అయిన చిత్రాలను లేక కళా ఖండాలను సృష్టింపించుతుంది, గానం చేయిస్తుంది, నృత్యం చేయిస్తుంది. ఆ ప్రభావములో ఉన్మత్తత ఉంది. అదే మనలను తన్మయత్వంలోనికి తీసికోపోతుంది !...

వంగదేశంలో అనాది కాలంనుంచీ పాటక జనంలో, జానపద కళ అన్ని రూపాలలోనూ, ప్రస్ఫుటంగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. వారు ధరించే వస్త్రాలపై అలంకరణ, వారి ఇటికలపై మలచు 'టెర్రకోటా' అని పిలవబడే చిన్ని చిన్ని శిల్పాలు, 'పాట్ శైలి' అని పిలవబడే మట్టి రంగులతో చిత్రించిన చిత్రాలూ, వారి 'జాత్ర' అని పిలవబడే నృత్య గాన మిశ్రమమైన నాటకాలూ ఎంతో సహజంగానూ, నిరాడంబరంగానూ కనిపిస్తవి. ఆ విధంగా ఓఢ్ర దేశంలోని అట్టబొమ్మలు అతి ప్రసిద్ధమైనవి. ఆంధ్రావని అనాది కాలంనుంచీ ప్రచారంలోనున్న చందనపు బొమ్మలూ, బుట్ట బొమ్మలూ, కొండపల్లి మట్టి బొమ్మలూ, బందరులోనూ, ఏలూరులోను ప్రవర్ధిల్లిన కలంకారీ పనితనమూ, కూచిపూడిలో ప్రవర్ధిల్లిన నృత్యమూ, ఇవన్నీ కూడా ఇప్పుడు మళ్లీ పరిణతిలోకి తీసికోరాబడినవి. సంక్రాంతినాడు మన ఇళ్లల్లో పెట్టే బొమ్మలకొలువు, ఇళ్ల ముంగిళ్లలో వేసే వివిధమైన అందమైన ముగ్గులూ, మన ఆంధ్రదేశంలో ప్రవర్ధిల్లిన, ప్రవర్ధిల్లుతున్న జానపద కళాప్రతిభను వేయినోళ్ల చాటుతున్నవి.

సహజత, సుబోధత, ఈ జానపదకళకు ప్రాణము వంటివి. జానపద కళాకారుడు ఏ కళానికేతనంలోనూ కళాభ్యాసం చేయ్యనవసరం లేకపోయింది. ఇక ఉండదుకూడా! తనతోపాటు పుట్టిన అపూర్వమైన కళాతృష్ణయే అతనిచే కళారూపకమైన సృష్టి చేయిస్తూ వచ్చింది. ఈ కళాకౌశల్యమే అతని సర్వస్వమూ ! తన జీవితమే తనకు కళానికేతనం! తనకు కలిగిన మనోభావాలను ఆశువుగా గేయ రూపంలో పాడుకుంటాడు. తనకూ, తన పరిసర

జనులకూ, ఆనందోత్పాదనంకోసం స్వేచ్ఛగా నృత్యం చేస్తాడు. అతను గీచే బొమ్మ, చేసేగానం, నృత్యం, శాస్త్రబద్ధంగా ఉన్నవా లేదా అని అతడు చూడలేదు. చూడనవసరం లేదుకూడా. అల్లాటి 'ఛందో బందోబస్తు' లన్నిటినీ "ఛట్ ఛట్" మని తెంచేసి, ఆశువుగా, యాదృచ్ఛికంగా సృష్టించిన దానినుంచి తనూ ఆనందం పొందుతాడు...

కవి భవభూతి ఆనాటి విమర్శకుల తీవ్రాక్షేపణలకు ఈ విధంగా జవాబు చెప్పాడు : "మనలను అనాదరణ చేసే వారు మనం చేసే రచనలు వారిని ప్రసన్నులను చేసికొనుటకు కాదని తెలిసికోవటం మంచిది." ఆ విధంగా తీవ్రఖండన చేశాడు. కాని సామాన్య మానవుడు అసలు విమర్శకుడనే వాడిని గుర్తించనే గుర్తించడు! తను సృష్టించిన దానిని ఆ విమర్శకుని ముందరకు రానివ్వడు! అతను చేస్తున్న కళాసాధన తన అంతఃసుఖము కొరకే గాని వేరొకని విమర్శకు ఎదురుచూచి తన సృష్టిని సాగించనే లేదు. చిన్న పిల్లల భావ ప్రదర్శనలోని సహజత్వమే మాధుర్యమే అతని సృష్టిలో కూడా కనిపించుతుంది. అతని ప్రతి క్రొత్త సృష్టిలోనూ సరిక్రొత్తదనమూ, విశేష ప్రతిభ గోచరమవుతవి. అతడు గీచే స్వాభావికమైన చిత్రాలలో కనులకింపుగా ఉండే రంగుల కలయిక కనిపిస్తుంది.

జానపద కళలోని యీ జీవమూ, నిరాడంబరతా, వాటితో పాటున్న సహజ సౌందర్యమూ, ఇప్పటి అనేక కళాకారుల్ని ఆకర్షించింది. వారు ఆకర్షణచే, ఆ పంథాలలోనే కళను సాధన చేద్దామని నిశ్చయించారు. ఈ ఇచ్ఛ మొట్ట మొదటగా విదేశాలలోని కళాకారులలో ఉత్పన్నమయింది. ఆ విధంగా ఆకర్షితుడై కళాసాధన చేసిన ఫ్రెంచి కళాకారుడు మిస్టర్ పికాసో. అతడు మొట్టమొదటగా అధునాతన శైలిలో అనేకమైన గొప్ప చిత్రాలను రూపొందీకూడా, ఆ విధానాన్ని వదలి ఈ జానపదశైలిని అలవర్చుకున్నాడు. శిల్పులలో 'ఆగస్టే రోడాన్', 'హెన్రీమూర్' లాంటి ప్రముఖులను వారి జానపదశైలి శిల్పాలలో చూడగలము. మిస్టర్ పికాసో చిత్రశైలిలో అతి స్వాభావికమైన భావ ప్రవంతి అంతర్హితంగా ప్రవహిస్తూంటుంది. క్రిందటి శతాబ్దం చివరిలోనూ, ప్రస్తుత శతాబ్దంలోనూ, చిత్ర శిల్పకళలోనేకాక సంగీత సాహిత్యాలలో కూడా జానపద కళా జాగృతి కలిగిందనే చెప్పాలి. ఈ అభివృద్ధి మొత్తం కళ నంతనీ పునర్జాగృతం చేయటం గమనార్హం.

భారతీయ జనపదం ఎంతటి పురాతనమైనదో భారతీయ జానపద కళ కూడా అంతటి పురాతనమైనది. గంగా ప్రవాహం వలె ఈ కళా ప్రవాహం కూడా అవిచ్ఛిన్నమయినది. ఋగ్వేదంలో "పునః పునః జాయమానా (అపి) పురాణీ" అన్న చందంగా భారతీయ జానపద కళ రోజు రోజుకూ క్రొత్త క్రొత్తరూపాలను దాలుస్తూ ఉన్నదయినప్పటికీ అతి పురాతనమైనది. కాని మన ఈ ఆధునిక ప్రపంచంలో దానికి ఉన్నత స్థాయి లభించి ఎంతో కాలం కాలేదు. జానపద కళ మన నిత్యజీవితంతో పెనవేసుకొని విడిపడలేనంత సాదృశ్యాన్ని కలగజేసుకున్నదనటంలో యేమాత్రం సందేహం లేదు. దానిని ఇంతకు మునుపు వరకూ కళ్ళారా చూస్తూ కూడా చూడనట్లే నటిస్తూ వచ్చాం. సూటిగా చెప్పాలంటే మనం ఇంతవరకూ దానిని 'గౌరవించ' లేకపోయాం. మన దృష్టిలో ఇంతవరకూ అభిజాత్యమైన కళయే అధునాతనమైన కళగా ఎంచుతూ వచ్చాం. ఈ జానపద చిత్రకళపై ఇప్పటివరకూ ఉన్న ఉపేక్షా భావాన్ని త్రోసివేయటమే శ్రీ జమినీరాయ్ చేసిన గొప్ప పని......

శ్రీ జమినీరాయ్ ఆధునికయుగంలో జానపదకళను ఉద్ధరించిన మహామహుడుగా యెంచవచ్చును. ఆయన అపూర్వ కళా ప్రతిభా శాలురలో ఒకనిగా మనం పరిగణించి తీరాలి. ఆయన చిత్రకళను శాస్త్ర బద్ధంగానే మొదటినుంచీ సాధన చేస్తూ వచ్చారు. మూర్తి చిత్రాలను రూపొందించుతూ, ఆయన కలకత్తాలో కాలం వెళ్ళదీస్తూండేవారు. ఆ రోజులలో భారతీయ కళను ఉద్ధరించి నిద్రావస్థలోనున్న భారతీయ కళాకారులను మేల్కొలిపి వారికి నవనూతన పంథాను చూపించి సేవను సాగించిన మహనీయుడు మిస్టర్ యి. బి. హావెల్, డాక్టరు ఆనందకెంటిష్ కుమారస్వామిన్నీ. వీరిద్దరి ప్రోత్సాహంతో అప్పటి యువ కళాకారులు మళ్ళీ కేవలం భారతీయమైన కళాశైలిలో సాధన చేయసాగించారు. స్వర్గీయ శ్రీ అవనీంద్రనాథ టాగూరు, వారి అనుంగు శిష్యులయిన ఆచార్య నందలాల్ బోస్, శ్రీ అసిత్‌కుమార్ హాల్దార్ మొదలగు ప్రముఖులు కళాపునర్జీవనం కోసం చాలా పాటుపడినవారిలో అగ్రగణ్యులుగా పేర్కొన వచ్చును.

శ్రీ యామినీరాయ్ ఈ "టాగూరు బృందం" వారి నుంచి వేరై భారతీయశైలిలో పరిశోధనలు సాగించి, జానపదశైలిని గుర్తించి ఆ మౌలికమైన, నిరాడంబరమైన శైలిలో సాధన సాగించారు. ఆ విధంగానే మరికొంతమంది ప్రముఖ చిత్రకారులు కూడా వారినుంచి వేరై చిత్రకళాపరిశోధనలు చేసి, వారివారి విశిష్టత్వాన్ని స్థాపించుకున్నారు. అందులో ప్రముఖులు శ్రీప్రమోద కుమార్ ఛటోపాధ్యాయ బహుకాలం ఆంధ్రదేశాన్ని తమ సాధనా స్థలంగా చేసుకున్నారు. మరొక ప్రముఖ చిత్రకారుడు శ్రీ శారదా చరణ ఉకిల్ కూడా "టాగూరు బృందం" నుంచి విడిపోయి,తమ స్వకీయమైన శైలిలో సాధన చేసిన వారే. ఆ తరువాత శ్రీ దేవీ ప్రసాదరాయ చౌధరీగారు. వీరు, ఆంధ్ర కళా విద్యార్థులకు గురు వర్యులయ్యారు. కాని వీరందరినుంచీ విడిపడి జానపదశైలినే అంటిపెట్టుకుని ఉన్నది శ్రీ యామినీ రాయే. వీరందరికన్న మిన్నయైన శైలి శ్రీ రాయ్‌ది. మామూలు మానవుని కూడా అలరింప జేసిన శైలి శ్రీ యామినీ రాయ్ శైలి ! బాల్యంనుంచీ తన మాతృభూమియైన వంగదేశంలో పల్లెపట్టులలో. ప్రవర్థిల్లుతున్న ఆ జానపద చిత్రాలనుచూచి, శ్రీ యామినీ ఉన్మత్తులవుతూ వచ్చారు. కాని తను అప్పటిలో అవలంబించుతూ వచ్చిన శాస్త్ర బద్ధమైన చిత్రశైలిని మొదటగా విడనాడటానికి సాహసించలేక పోయారట ఆ పిన్నవయస్సులో ఒక్కసారిగా సరి క్రొత్తమార్గాన్ని త్రొక్కటం అంత తేలిక పని కాదుకదా ! కాని ఆయనలోని సాహస శక్తియే దర్మిలా పూర్వపు తన శైలిని విడనాడ సహాయం చేసింది! దానికి తోడు, విదేశీయుల ప్రాపకం కూడా ఎక్కువగా కలిగింది. ఆయన వేసిన ఏ జానపద చిత్రాన్నీ వదలకుండా విదేశీయులు కొనుక్కుంటూ వచ్చారు. దానితో మరీ ఉత్సాహం, ప్రోత్సాహం కలిగి చివరిదశ వరకూ ఆ జానపదచిత్ర శైలిలోనే చిత్రాలను రచించుతూ వచ్చారు. వారి స్వగృహాన్ని సందర్శించి వారు చిత్రాలు రూపొందించుతూ ఉండగా చూచే భాగ్యం నాకు కలిగింది. ఆ విధంగా శ్రీ యామినీరాయ్ జానపదశైలిలోనే తన భావ పరంపరను సువ్యక్తంగా తెలుపదలచారు. జానపద చిత్రకళను, మళ్ళీ విద్యార్థియై సువ్యక్తంగా తెలుసుకోగలిగారు. అందుకై, కేవలం దేశీయమైన మట్టిరంగులనే వాడేవారు. విదేశీ రంగులను పూర్తిగా విడనాడారు. ఈ యామినీరాయ్‌గారు చూపించిన నవనూతన మార్గం అందరికీ సుగమ మనిపించింది. ఆయన సందేశాన్ని ఈ దశాబ్దపు చాలామంది చిత్రకారులు అందుకొని, వాడవాడలు సాధన చేశారు. ఆ విధంగా, వారున్నూ నవవైతాళికులుగా, కళోద్ధరణలో ప్రథములుగా ఎన్నుకోబడ్డారు...



జపం: వినోకటి చిత్రం

భారతదేశంలోని ప్రతిప్రదేశంలోనూ ఆయా స్థల పరిసరాలకి అనుగుణంగా ప్రవర్ధమానమైన కళను ధేయాతగా కొని తమ తమ చిత్రశైలులను వీలుగా మార్చుకుంటూ సాధన చేస్తున్న నవ వైతాళికులు ఆంధ్రలో ఇప్పటికీ చాలామందియే ఉన్నారని చెప్ప వచ్చును. ఉత్తరహిందూ స్థానంలో మంగళ్ సింహ, హరికృష్ణ లాల్ మొదలగువారి లాగా, ఆంధ్రలో శ్రీ పిలకా లక్ష్మీ నరసింహ మూర్తి, వారి సతీమణి శ్రీమతి విజయలక్ష్మి, శ్రీఅ. పైడిరాజు, శ్రీ కె. శ్రీనివాసులు, శ్రీ రాజయ్య మొదలగు వారున్నారు కాని, వీరిలో మళ్ళా ఏదో వింత పరివర్తనం ప్రస్తుతం కానవస్తుంది. జానపదశైలిని, కొద్ది కొద్దిగా విడనాడటం గమనించ వచ్చును. వీరంతా ప్రజా దృష్టిలోనికి వచ్చింది, జానపద కళోద్ధరణ వల్లనే. దానిని విడనాడటం ఏమాత్రమూ సమంజసం కాదని నా అభిప్రాయం.

ఈ జానపదశైలిని, ప్రజల మన్ననలను తిరిగి పొందగల్గిన తరుణంలో నిత్యమూ, నవ చిత్రకారులు, యువకులూ, విద్యార్థులూ అవలంబించి, చివరివరకూ సజీవంగా ఉంచే బాధ్యతను విడనాడకూడదని నా ప్రేమపూర్వకమైన హెచ్చరిక !

శంకావృతం

డా. పి. శివనారాయణమూర్తి

మేము నిత్య శంకితులం
మాకున్నది ఓ మనసు
మనసుకుంది పిరికితనం.

తరతరాల క్రితంలో
తరలిపోయిన ముత్తాతలు
ప్రకృతిలోని వికృతికి జడిసి
మంత్రకత్తెల మాయలపడి
తోటివాని తల తెగ నరికి—
ఉండెడువారు — నిశ్చింతగ.

తరువాతి తరాలలో
మసిలారు మా తాతలు
మరిడమ్మలు మశిరమ్మలు
పట్టుక పీడించెదరని
నమ్మెడివారు గుడ్డిగ,
చేసెడివారు జాతరల్ ...

యుగాలు మారిన
తరాలు తరలిన
మాతర మొచ్చిన
మారలేదు మనసు...

పుట్టాము ఆధునిక యుగంలో
పట్టాము అధునాతన భావం
కొట్టాము గప్పాలు గట్టిగా
వగ్గాము తల — తరుముకొచ్చెడు
కష్టాల కెదురుగ నిలువ లేక
చేస్తున్నాం పూజలు మెండుగా ...

మేము నిత్యశంకితులం
మాకున్నది ఓ మనసు
మనసుకుంది పిరికితనం
కదన రంగమునకు
కదను తొక్కుతూ
వెడతాడు — మావాడు !
విధవరా లెదురైతె
వేస్తాడు — వెనుకడుగు !!
పులి మీద పడితే
పోరాడు—రేచులా !
పిల్లి ఎదురైతే
ఇంట చొరబడు — ఎలుకలా !!
జందెము పోగు చూసి
జడుసుకుంటాడు—ఎదురింటివాడు !
తెలుకలి తారసిల్లితె
తెల్లబోతాడు — ఇరుగింటివాడు ! !
మంగలి ఎదురుకు మరొక
అడుగు వేయడు—పొరుగింటివాడు !
తుమ్ము వినబడగానె
తల్లడిలిపోతాడు — మిత్రుడు !
బల్లిమీద పడితె
తుల్లిపడతాది — బొమ్మ
త్రాచు ఎదురైతె
చావు తథ్యమంటాడు — తాతయ్య.

మేము నిత్య శంకితులం
మాకున్నది ఓ మనసు
మనసుకుంది పిరికితనం ...

శ్రీ బి. జి. ఎల్. స్వామి

తమిళ దేశంలో గోళకీ శైవమతము

(గతసంచిక తరువాయి)

తమిళ దేశంలో శైవమత పరిణామ చరిత్ర పునర్నిర్మాణం.

పూ ర్వ రం గ ం

6వ శతాబ్దంలో తొండై మండలాన్ని పాలించిన పల్లవులు 'ఒక విధమైన శైవాన్ని ప్రోత్సహించారు. దాని చిహ్నాలు శతాబ్దాల తరబడి దేవాలయాల రూపంలో నిలబడి ఉన్నాయి. చాలామంది రచయితలు ఈ విషయాన్ని గురించి చర్చించారు. కాని వారి అభిప్రాయాలు, నిర్ణయాలు యధాలాపంగా ఏర్పరచుకొన్నవి. వీరి రచనలు ఆ కాలంలో తమిళదేశంలో ప్రాచుర్యంలో ఉన్నది ఒక సామాన్యమైన శైవమతమని, దాని స్వభావాన్ని ఇంకా వివరంగా తెలుసుకోవడం అసాధ్యమనే అభిప్రాయాన్ని కలుగచేస్తాయి. కాని మత్త విలాస ప్రహసన కర్త నిజంగా మహేంద్రవర్మ I (A.D. 610–30) అయితే అప్పటికే పాశుపత కాపాలిక శైవశాఖలు ప్రాచుర్యంలో ఉండేవి అనుకోవాలి; కాని ఈ దేశపాలకుల వ్యక్తిగత మతాన్ని గురించిన ప్రశ్న ఇంకా తీరని సమస్యే. ఈ సందిగ్ధస్థితి చోళరాజరాజు I కాలం వరకూ కొనసాగింది. అప్పటికి దేశంలో రాతితో కొత్తగా కట్టించబడినవీ, ఇటుకతో కట్టబడిన వాటికి బదులుగా రాతితో కట్టబడినవీ, అనేక శివాలయాలు వెలిసాయి (బాలసుబ్రహ్మణ్యం, 1966). ఇవి ముఖ్యంగా ఆదిత్యుడు I, ఆదిత్యుడు II కాలాలలో కట్టించబడ్డాయి. ఈ రాజులు వేయించిన శాసనాలద్వారా ఆ కాలపు శైవమత స్వభావాన్ని గురించి మనకు అంతగా తెలియదు. కాని పాశుపత పద్ధతికి సంబంధించిన ఏదో ఒక విధమైన మాహేశ్వర ఆరాధన ప్రాచుర్యంలో ఉండేదని మాత్రం ఈ శాసనాలు సూచిస్తాయి. ఆలయంలో ప్రతిష్ఠించబడిన శివలింగానికి పూజచేయడము, ఆలయపూజ కర్మకాండలో పాలు పంచుకోవడము, స్తోత్రగానము చేయడము ఆనాటి మతాచారాలుగా కనిపిస్తాయి. మొదటి ముగ్గురు నాయన్మారులు ఈ కాలంలోనే జీవించి వుంటారనేది చాలావరకు సంభావ్యమయిన విషయము.*

మూలం

చోళరాజ్యం పరాంతకుని (I) కాలంలో ఉత్తరాన నెల్లూరు వరకు వ్యాపించింది. రాజరాజు (I) తన రాజ్యాన్ని ఇంకా ఉత్తరానికీ (వేంగి వరకు), పశ్చిమానికీ (చాళుక్య సామ్రాజ్యపు సరిహద్దుల వరకు) వ్యాపింపచేసాడు. అతని కొడుకు రాజేంద్రుడు I బెంగాలు వరకూ ఉన్న దేశాలను అన్నిటినీ జయించాడు. ఈ యాత్రలు, విజయాలు ఉత్తర దక్షిణ దేశాల మధ్య సాంస్కృతిక ఆదాన ప్రదానాలను, రాకపోకలను ప్రోత్సహించేయి.


9వ శతాబ్దపు పూర్వార్ధంలోనే 'మత్తమయూర' తెగకు చెందిన గురువులను చేది దేశపు రాజులు ఆదరించారు. కాలచూరి వంశానికి చెందిన యువరాజు I కాలంలో దాహళ–మండలంలో గోళకీ మఠ స్థాపనను గురించి మనము వింటాం. ఈ సందర్భంలో శైవమతము (సూక్ష్మమైనది) 8వ శతాబ్దం నాటికే ఈ ప్రాంతంలో ఆధిక్యం వహించిందనే విషయాన్ని మనం గుర్తించాలి. ఈ విషయం కాలచూరి శాసనాలలో కనిపించే గురు పరంపరలు చెపుతాయి. ఈ గురుపరంపరలను వెనకకు లెక్కిస్తే 8వ శతాబ్దం వరకు వెళ్తాయి. రాజరాజు I, రాజేంద్రుడు I (పాశుపత ప్రాధాన్యం కల శైవమతము వారసత్వంగా కలవారు) దక్షిణ–రాఢ దేశము ("దక్కణ–లాడమ్") వరకు చేసిన విజయ యాత్రలలో చూసిన శైవమత పద్ధతిచేత గాఢంగా ప్రభావితు లయ్యారు. ఇంతకు ముందే చెప్పినట్లు రాజేంద్రుడుI శివాచార్యుల ననేకులను వారి కుటుంబాలతో సహా గంగాతీరంనుంచి తరలించుకునివచ్చి వారికి కాంచీపురంలోను, చోళరాజ్యంలో ఇంకా అనేక ఇతర స్థలాల్లోను ఆవాసం కల్పించాడు. ఈ రాజుల ఉత్తరదేశ విజయ యాత్రల తరువాతే గోళకీ మతాచార్యుల పేర్లు తమిళదేశంలో వినపడడం మొదలవుతుంది. ఈశాన గురువు రాజరాజు Iయొక్క రాజ గురువు (S I I. II Nos. 9, 91); సర్వ–శివుడు రాజేంద్రుని రాజగురువు (S I I. II. No. 20) ఈ ఇద్దరి రాజుల రాజ్యకాలంలోనే సిద్ధాంతసారము, ఈశాన గురుదేవ పద్ధతి మొదలగు గ్రంథాలు చోళదేశంలో వ్రాయబడ్డాయని స్పష్టమే. వీటన్నింటిని బట్టి గోళకీ శైవమతం తమిళదేశంలో 9/10 శతాబ్దాలలో ప్రవేశించి ఉంటుంది అని నిశ్చయించవచ్చు.

గోళకీ మతప్రవేశము, ఇతరమతాలకు దానికిగల అన్యోన్య ప్రభావాలు

తంజావూరులో రాజరాజేశ్వరాలయము, గంగైకొండ చోళపురంలో గంగైకొండ చోళేశ్వరమూ కట్టడము, తమిళదేశంలోని గోళకీమత చరిత్రలో మైలు రాళ్లు. ఈ గుడులు కట్టించిన

---

* ఈ విషయం ఇంకొక పరిశీలనలో చర్చించబడుతుంది.



పటం—1

క్రీ. శ. 11–14 శతాబ్దాలలో ఆంధ్రదేశంలో గోళకీ సంస్థలని చూపే పటం. 1. కరీంనగర్, 2. వరంగల్, 3. కర్నూలు, 4. గుంటూరు, 5. అనంతపురం, 6. కడప, 7. కోలారు (కర్ణాటక), 8. చిత్తూరు జిల్లాలు.

రాజులు ఆర్యదేశం, మధ్యదేశం, గౌడదేశాల నుంచి చాలామంది మతాచార్యులను, వారి శిష్యులను తమిళదేశానికి రప్పించారని తెలుస్తోంది. (S I I. II. No 20) ఈ ఆచార్యులకోసం అనేక మఠాలు కట్టబడ్డాయి. తిరువావడుతుఱైలో ఇటువంటి సంస్థలు రెండు ఉన్నాయి. దీనిని బట్టి ఇది గోళకీమతం తమిళదేశంలో ప్రవేశించినప్పటినుంచే ఆ మత ముఖ్య కేంద్రాలలో ఒకటని తెలుస్తోంది. వీటిలో ఒకటైన సర్వదేవన్ మఠం రాజ గురువైన సర్వదేవుని పేర కట్టబడింది [103–1925, క్రీ. శ. 1040). ఈ కాలంలో స్థాపించబడిన మఠాలు శివపురం (కుంభకోణంతాలూకా), తిరుక్కడైయూర్ (మయూరం తాలూకా), బ్రహ్మదేశం (విల్లిపురం తాలూకా)లలో స్థాపించబడ్డాయి.

ఈ సందర్భంలో రాజరాజు I ప్రవేశపెట్టిన శైవమతానికి అంతకు ముందు ఇక్కడ ప్రాచుర్యంలో ఉన్న శైవ మతానికి ఎక్కువ భేదము లేదనే విషయం గమనించాలి. రెండిటిలోను శివుడు ఒక్కడే పరాత్పరుడు. రెండు మతములలో శివుడు రూపారూప స్థితిలో పూజింపబడుతాడు. అంటే ఆలయాలలో ప్రతిష్ఠించబడిన శివ–లింగ రూపంలో పూజింపబడుతాడు. రెండూ ప్రార్థనల ప్రయోజనంలోనూ, యోగాభ్యాసంలో కొంతవరకూ నమ్ముతాయి. వేదాల అధికారాన్ని కొంచెం ఎక్కువ తక్కువగా రెండూ అంగీకరిస్తాయి. అదేవిధంగా ఆగమ శాస్త్రాల అధికారాన్ని — కనీసం ''క్రియ'', ''కార్య'' ఆచరణకు సంబంధించినంతవరకు—రెండూ అంగీకరిస్తాయి. ఈ రెండిటిలో పాతమతము పాశుపత – సూత్రాలను, అవి చెప్పే ఆచరణవిధానాన్ని అనుసరిస్తుంది. రెండవది శైవ ఆగమాల మీద ఆధారపడుతుంది. కాని ముందర చెప్పినట్లు కర్మకాండ విషయంలో స్వల్పంగాను, దర్శన తత్వవిషయంలో అధికంగాను ఈ రెండిటి మధ్య భేదాలున్నాయి. కర్మకాండ విషయంలో కొత్త మతానికీ, పాతమతానికీ గల భేదం చాలా కొంచెమే కావటం వల్ల ఈ కొత్త మతం అంతగా ప్రాతికూల్యాన్ని ఎదుర్కొనవలసి రాలేదు. అంతేకాక 7వ శతాబ్దం ప్రారంభం నుంచి పాతమతం చైతన్యాన్ని కోల్పోయి ఉండడంచేత ఉత్తరంనుంచి ఈ కొత్త మతం ఉత్సాహాన్నిచ్చే చల్లగాలిలాగా వచ్చింది.

కొత్త మతం రాకచేత ఏర్పడిన రెండు మతాలలోని కొన్ని అంశాల కలయికలు, వాటిని తర్కబద్ధం చేసే ప్రయత్నాలు చేర్చబడిన గ్రంథాలు 'పద్ధతు' అనే పేరుతో వ్రాయబడడం మొదలయింది. హీరాలాల్ అభిప్రాయం (1927)–గోళకీ మతస్థాపనకు ''శక్తి'' ఆరాధనతో సంబంధం ఉన్నట్లు భేదఘాట్‌లోని ''చౌన్సాధా జోగిని'' ఆలయం చూపుతోంది—నిజమని అంగీకరిస్తే, ''శక్తి'' ఆరాధన గోళకీమతంలో భాగముయివుండాలి. ఈ మతంతోపాటు ''శక్తి'' ఆరాధన తమిళదేశంలోకి ప్రవేశించి వుండాలి. తమిళదేశంలో శివాలయాంతర్భాగంగా దేవికి ప్రత్యేకమైన గుడి (కామకూట్టం) కట్టడం 11వ శతాబ్దంనుంచే ప్రారంభమవడం (శ్రీనివాసన్. 1960) దీనికి సాక్ష్యం. పాతమతంలోకి ఈ అంశం ప్రక్షేపించబడడం చేత ఆగమశాస్త్రాలను, కర్మకాండను వివరించే గ్రంథాలను, కొత్త అంశాలను చేర్చడానికి వీలయ్యే వ్యాఖ్యతో విపులీకరించవలసి వచ్చింది.

గోళకీ ఆచార్యులచేత తీసుకురాబడిన ఈ కొత్త మతం త్వరలోనే తమిళదేశంలో ప్రజాదరణ పొందింది. రాజరాజు I తమిళదేశస్థులు ఈ మతంలో చేరడాన్ని స్వయంగా ప్రోత్సహించాడు. ఆయన శాసనాల్లో ఒకటి (S I I. II-No. 65) రాజరాజేశ్వరాలయంలో ''తిరుప్పదియం'' లను పాడడానికి 45 గురు నియమించబడ్డారని చెపుతోంది. ఇంకొకచోట (స్వామి, 1971) చూపించబడినట్లు దీనిలో పేర్కొనబడినవారి వ్యక్తిగతమైన పేర్లు ఆ కాలంలో సామాన్యమైనవిగా ఉండగా వారి దీక్షానామాలు గోళకీ ఆచార్యులకు సామాన్యమైనవి. ఉదా॥ ఇరామన్ సంబందవ్ లేక సత్య – శివుడు; అంబళవన్ పట్టార్క లేక వామ – శివుడు; కంబన్ [illegible] వెణ్‌కాటన్ లేక అఘోర శివుడు మొ॥. ఈ పేర్ల పట్టికలో కాపాలి – వాలి లేక జ్ఞాన శివుడు అనే పేరుకూడా

కనిపిస్తుంది. దీనినిబట్టి గోళకీ మతంలో కాపాలికులు కూడా చేర్చుకోబడేవారని తెలుస్తోంది. దీనిలో చేరినవారికి ఆ మతంలో గాఢాభినివేశం ఉండేది. 10/11 వ శతాబ్దపు లిపిలో చెక్కబడిన శాసనం ఒకటి శాత్తకుట్టిమాదేవన్ అనబడే వామ-శివుడు, ఉ॥ ఆర్కాటు జిల్లాలోని తిరునామనల్లూరులో రాతితో కట్టబడిన ఆలయంలో చండేశ్వరుని విగ్రహం ప్రతిష్ఠించాడని పేర్కొంటున్నది (241 – 1939/40).

12 వ శతాబ్దపు శాసనాలు గోళకీ మతం ఎంత త్వరగా ప్రజాదరాన్ని చూరగొన్నాయో తెలుపుతాయి. తిరువావడుతుర్రైకు చెందిన ఒక మఠంలో విటంకన్ – ఉయ్యవందాన్ లేక జ్ఞానశివుడు అనబడే ఒక తపస్వి నివసించేవాడు. (144 – 1926, క్రీ. శ. 1122). తిరుమాళిగైప్పెచ్చన్ అనే పీఠాధిపతి ఒక శాసనంలో పేర్కొనబడ్డాడు (446 – 1912, క్రీ. శ. 1181).* తన పూర్వీకులలాగానే విక్రముడు (1118—1135) కూడా శ్రీకంఠ శంభువు (శ్రీకంఠ–శివుడు) అనే గురువును కలిగివుండేవాడు. ఇంతకు పూర్వమే చెప్పినట్లు ఈ శతాబ్దంలోనే రెండు ''సిద్ధాంత'' గ్రంథాలు వ్రాయబడ్డాయి. ఇది తమిళదేశంలో ఈ మతం ఎంత త్వరగా ప్రజాదరణను పొందిందో చూపుతోంది.

వ్యాప్తి

ఈ మతం తమిళ ఆంధ్రదేశాలలోకి అలలు అలలుగా ప్రవేశించిందనడానికి తగిన ఆధారాలున్నాయి. దీని మూలాన ఇక్కడి శైవంలోకి కొత్త నెత్తురు నిరంతరాయంగా ఎక్కుతూ వుండేది. దీనివల్ల కొత్త మతానికి ఈ కొత్త దేశంలో బలం కలగడమేకాక, కొత్త వంశాలు స్థాపించబడడం కూడా జరిగింది. ఈ సందర్భంలో తమిళ, ఆంధ్రదేశంలోని లక్షాధ్యాయి వంశాలు వేరువేరనీ, ఆంధ్రదేశంలో ఈ వంశం తమిళ దేశంలోకన్నా ఒక శతాబ్దం తరువాత మొదలయిందని గుర్తుంచుకోవాలి. **(Fig. 3)**. ఈ రెండూ పొరుగుదేశాలవటం చేత పరిమితంగానైనా కొంత అటు ఇటు రాకపోకలు జరిగి వుండవచ్చు గాని, ఆ విధంగా జరిగిందనడానికి ఆధారమేమీ లేదు.

తమిళదేశంలో, ఆంధ్రదేశంలో లాగే లక్షాధ్యాయి వంశమే (భిక్షా వంశము) గోళకీ వంశాలలో మొదట వచ్చినదీ, స్థిరపడినదీ. 13వ శతాబ్దంలో రాఢదేశంనుంచి, ఆ చుట్టుపక్కల ప్రాంతాల నుంచీ గోళకీ ఆచార్యులు,వారి అనూయాయులు మళ్ళీ వలసవచ్చారు. (47, 209–1924; 9–1935/6; 242–1939/40 102—1934/5. మొ॥) ''మత్త–మయూర'' తెగకే చెందిన రుద్ర శివునిచేత స్థాపించబడిన ''ఆమర్దక'' మతశాఖవారు 15వ శతాబ్దంలో తిరునల్వేలి జిల్లాకు వలసవచ్చి స్థిరపడ్డారు. (465, 569—1917)


ఈ మతం నిరంతరాయంగా ఉత్తరదేశం నుంచి ఇక్కడకు వ్యాపించడము, తమిళదేశస్థులే ఎంతో మంది దీనిలో చేరడము, 13వ శతాబ్దంలో అనేక వంశాలు ఏర్పడటానికి కారణమయ్యాయి. ఈ కాలం తమిళదేశ శైవ చరిత్రలో ఒక మహర్దశ. ఈ కాలంలోనే ఈ మతము బలపడి, దాని తత్వము, సిద్ధాంతాలు క్రోడీకరించబడి, సమన్వయించబడి, తర్కబద్ధం చేయబడ్డాయి. ఈ శతాబ్దంలో గోళకీ సంస్థల సంఖ్య అమితంగా పెరగడం ఇదివరకే పేర్కొనబడింది. ఇదే విధంగా ఆ మఠానికి చెందిన వంశాల సంఖ్య పెరగడం గురించికూడా చెప్పబడింది. ఈ వంశాలు చాలా ప్రాచీనమైన కొన్ని శివాలయాల సంవిధానాన్ని నిర్వహణను చేపట్టాయి. ఈ శతాబ్దంలోనే ఎక్కువమంది రాజులు, ప్రజలు ఎక్కువ దానాలను మఠాలకూ, ఆలయాలకూ ఇవ్వడం జరిగింది. దేవాలయాల నిర్మాణ శిల్పము, విగ్రహ శిల్పము, వైవిధ్యంలోనూ, వ్యాప్తిలోనూ, విపులత్వంలోనూ, క్లిష్టతలోనూ చాలా అభివృద్ధి చెందాయి.

కొత్త ధోరణులు

ఈ శతాబ్దంలో జరిగిన ఇంకొక గమనించదగిన విశేషం శైవమతానికి చెందిన తత్వసిద్ధాంతాలు తమిళంలో మెయ్‌కండన్ చేత వ్రాయబడడం. ''శివజ్ఞాన సిద్ధియార్'' కూడా ఈ శతాబ్దంలోనే వెలుగు చూసింది. తమిళంలోని 14 సిద్ధాంత గ్రంథాలలో 4 ఈ శతాబ్దంలోనే వ్రాయబడ్డాయి. బహుశా ''సంతానాచార్యులు'' నలుగురూ ఈ శతాబ్దంలోనే జీవించి వుంటారు. వీరిలో చివరి ఆచార్యుడైన ఉమాపతి – శివాచార్యుడు ఈ శతాబ్దం చివరా, తరువాతి శతాబ్దం మొదటా జీవించాడు.

ఈ కాలపు మఠాలు, ఆలయాలు, వీటిలోని ఆచార్యులూ, అనుయాయులూ ఎక్కువమంది ఈ దేశస్థులవడంచేత తమిళ స్వభావాన్ని సంతరించుకున్నాయి. ''మెయ్‌కండన్'' విషయమే దీనికి ప్రబలమైన ఉదాహరణ. తిరుచ్చత్తిముట్రమ్‌కు చెందిన ఎదిరొప్పిలదర్ (సోమనాథుడు) తవప్పెరుమాళ్ తిరుమడమ్ అధిపతి (109–1911). తత్తనుడైయార్ (ఈశాన–దేవుడు) అనే గురువు ఒక మఠాన్ని దానంగా స్వీకరించాడు (49–1911, క్రీ. శ. 1240). ఆరియవ్రతన్కొండ – ముదలియార్ నందికేశ్వర మఠంలో నివసించేవాడు (239–1912). పుకళిదేవర్ ఒక పవిత్రమైన మఠానికి అధిపతి (54–1914) జ్ఞానామృతాచార్య సంతానానికి చెందిన పుకళిప్పెరుమాళ్ తిరుజ్ఞానమ్ చదవడానికి నియమించబడ్డాడు. (359 — 1916, క్రీ. శ. 1256). జీయర్ సంతానానికి చెందిన శోళన్ – శీయన్ (అఘోర–దేవుడు) 364–1916, క్రీ. శ. 1222 ప్రాం.లో పేర్కొనబడ్డాడు. తిరుచ్చిట్రంబల — ముడైయార్ తిరుత్తెయ్యార్‌నాయనార్ అభిముక్తన్ మఠంలో నివసించేవాడు (311–1927/8 క్రీ. శ. 1283). ఉయ్యనిన్రాడువాన్ – కందన్ (ఈశాన–దేవుడు) తిరుజ్ఞాన–సంబందన్ గుహై అనే

* ఈయనే తిరుముఱై 9 వ పుస్తకంలో పేర్కొనబడ్డ తిరుమాళిగై–దేవరా ?



పటం—2

క్రీ. శ. 11–14 లలో తమిళదేశంలో గోళకీ సంస్థలని చూపించే పటం. 1. ఉత్తర ఆర్కాడు, 2. చెంగల్పట్టు, 3. దక్షిణ ఆర్కాడు, 4. తిరుచ్చి, 5. తంజావూరు, 6. మధుర, 7. రామనాథపురం, 8. తిరునల్వేలి జిల్లాలు.

మఠము కట్టించాడు (311–1927/8, క్రీ. శ. 1207). జియత్తువాయ్‌తార్ (వామదేవుడు) త్యాగవినోదన్ మఠంలో ఉండేవాడు (146–1935/6). ఇంకా ఇటువంటి ఉదాహరణలనేకం చూపవచ్చు.

గోళకీ మతానికి తమిళదేశంలో ప్రజాదరణ క్రమంగా వృద్ధి పొందడం కొత్త ధోరణులకు దారితీసింది. ఇంతకుముందే చెప్పినట్లు, శైవ పద్ధతి (సూక్ష్మమైనది) రాక పూర్వము ఈ దేశంలో పాశుపత సంబంధమైనవి, భక్తి ప్రధానమైనవి శైవ శాఖలు అనేకం ప్రాచుర్యంలో ఉండేవి. ఇక్కడ కాపాలిక, బహుశా కాల శైవాలు కూడా ఉండేవి. ఇంతకు పూర్వమే ఒక కాపాలికుడు ఈ కొత్త శైవమతాన్ని అంగీకరించడం పేర్కొనబడింది. ఈ కొత్తమతంలో చేరినవారిలో ఎక్కువమంది ఏదో ఒక శైవమత శాఖకు చెందినవారనీ, వారందరూ శివుడే పరాత్పరుడని నమ్మేవారు అనీ తేలుతోంది. ఈ కొత్తపాత మతాలలోని అంశాల కలయిక స్వచ్ఛందమయినది. ఉత్తరదేశాన్నుంచి వచ్చిన గోళకీ ఆచార్యులు ఈ సమన్వయం తమిళదేశంలో ఈ మతం స్థిరపడడానికి దోహదం చేస్తుందనే విషయాన్ని గుర్తించారు. తిరుప్పదియంలను దేవాలయాలలో చదవడం ఈ సమన్వయంలో ఒక భాగం. ఈ సాంప్రదాయం బహుశా గోళకీమతం రాకమునుపే ఇక్కడ ఆచరణలో ఉండేది. తరువాతి శతాబ్దాలలో ఇది పరిపాటిగా అనుసరించబడింది. ఆళుడైయ పిళ్ళైకి తిరుజ్ఞాన సంబందర్ అనే పేరుంచి, తమ ఆచార్యుల పరంపరలో చేర్చుకోవడం గోళకీ మతస్థులు ఈ సాంప్రదాయాన్ని స్వీకరించారని చూపుతోంది. ఈయన పేరుమీద అనేక మఠాలు, "గుహై"లు స్థాపించబడడము, ఈ మతానుయాయులు అనేకులు ఈయన పేరు పెట్టుకోవడము, గోళకీ మతస్థులు ఈ సాంప్రదాయాన్ని ఎంత అభినివేశంతో స్వీకరించారో చెపుతోంది. సుమారు ఈ కాలంలోనే ఆళుడైయపిళ్ళై వ్రాసిన దశకాలకి 11వ పద్యాలు చేర్చబడ్డాయి. (స్వామి, 1971)

తమిళ భాషలో శివ–స్తోత్రాలు, శైవ సంబంధమైన రచనలు కలిపి 12 విభాగాలుగల గ్రంథంగా "తిరుమురై" నిర్మించబడడం పాతమతాల అంశాల ఘనీకరణానికి, ఇవి కొత్త మతంతో సమన్వయించ బడడానికి ఒక ఉదాహరణ. దీనిలో కొన్ని భాగాలు ముందే సంపుటీకరించబడినా, లేకపోయినా ఇప్పుడు మనకు లభించే సంపూర్ణ రూపం 13వ శతాబ్దంలోనే ఏర్పడింది.

ఈ విధంగా కొత్తమతం మీద నిక్షేపించబడిన అంశాలు గోళకీమతం యొక్క మొదటి స్వభావాన్ని మత విషయకంగా మార్చాయి. శాసనాలలో కనిపించే "దక్షిణ–గోళకీ" అనే పదం ఈమార్పు చెందిన మతాన్నే ఉద్దేశిస్తుంది. (243–1924, క్రీ.శ. 1303 C. P. 33–1940/1 క్రీ. శ. K. S. 77) ఆంధ్రదేశంలోని గోళకీమతం కూడా ఇటువంటి ధోరణులకే లోనయి వుంటుంది. కాని వాటి నిర్దిష్ట స్వభావం మాత్రం తెలియదు. 13వ శతాబ్దంలో మనం వినే నవగోళకీ (4—1956/7) అభినవ గోళకీ (50—1940/1) అనే మాటలు గోళకీమతం ఏదో ఒక విధమైన మార్పుకు లోనయిందని సూచిస్తున్నాయి.

స్థిరీకరణం

శైవ తత్త్వవిషయకములైన 8 గ్రంథాలను 14వ శతాబ్దపు పూర్వార్ధంలో జీవించిన ఉమాపతి – శివాచార్యుడు రచించాడని నమ్మబడుతోంది. సిద్ధాంత శాస్త్రాలనబడే తత్త్వ విషయక గ్రంథాలు 14వ శతాబ్దానికి పూర్తిచేయబడ్డాయి. ఈనాటివరకు ఇవే తమిళదేశపు శైవులకు ప్రామాణిక గ్రంథాలు.


11వ శతాబ్దానికే తంజావూరు జిల్లా, మయూరం తాలూకాలోని తిరువావడుతురై శైవ (సూక్ష్మమైనది) మతానికి పెద్ద కేంద్రంగా ఉండేది. 11వ శతాబ్దపు మొదటి దశాబ్దంలో ఇక్కడి ఆలయము సదా–శివుడు అనే ఆయన నిర్వహణ కింద ఉండేది. ఈయన గోళకీమతస్థుడై ఉంటాడని తెలుస్తూనే ఉన్నది.

(ARE 1924/5, Part II, para 13). ఇక్కడి ఆలయాలకు, మఠాలకు చోళరాజులు చాలా దానాలు చేసారు. దీనినిబట్టి ఇక్కడ మత సంస్థలు, వ్యవస్థలు ఎంత ఉన్నతస్థితిలో ఉన్నాయో గ్రహించవచ్చు. 11, 12 శతాబ్దాలలో తిరువావడుతురైలో ఏడు మఠాలు నిర్వహించబడుతూ ఉండేవి :

సర్వదేవన్ మఠం	రాజేంద్రుడు I	103—1925, క్రీ. శ.1040,
తిరువీది మఠం	కులోత్తుంగుడు I	147—1925, క్రీ. శ. 1084
తిరునీలకంఠన్ మఠం	,,	144—1925, క్రీ. శ. 1101
పరమాణవాచకన్ మఠం	కులోత్తుంగుడు I	155-1925 క్రీ. శ. 1109,
నార్పత్తెణ్ణాయిరవన్ మఠం	,,	150—1925, క్రీ. శ. 1111
శివై యోగనాయకన్ మఠం	,,	148—1925, క్రీ. శ. 1116
,,	విక్రముడు	149—1925, క్రీ. శ. 1121
పంచనదివాణన్ మఠం	,,	67—1925,

ఈ మఠాల్లో చాలావరకు భక్తులు, తపస్యులు మొ|| వారికి భోజనము, నివాసము కల్పించడానికి నిర్వహించబడేవి. అందుచేత అటువంటివారు చాలామంది ఈ మఠాలలో నివసించేవారనీ, కొంతమంది జంగములు వారి యాత్రలలో ఇక్కడ బసచేసేవారనీ ఊహించవచ్చు. ఇటువంటిదే ఇంకొక కేంద్రం, ఇంత ఉన్నతస్థితిలో కాకపోయినా, తిరునల్వేలి జిల్లా, అంబాసముద్రం తాలూకా, తిరువాలీశ్వరంలో పాండ్య రాజుల ఆదరణలో వర్ధిల్లింది. ఇక్కడి వీరపండితన్ మఠము, తిరువావడుతురైలోని మఠాలలాగే ప్రజాహిత కార్యాలను నిర్వహిస్తూ ఉండేది.

ఇంతకుముందరే చూపించినట్లు ఈ సంస్థలు గోళకీ మతానికి సంబంధించినవి. ఇవి తమిళీకరించబడిన ''సిద్ధాంత'' గ్రంథాలను తమ మతతత్వాన్ని ప్రచారం చేయడానికి తగిన సాధనంగా అంగీకరించాయి. ఈ విధంగా అంగీకరించడంచేత తమ మతం తమిళదేశమంతటా నిరాటంకంగా వ్యాపించడానికి వీలున్నదని గోళకీ ఆచార్యులు గ్రహించారు. తిరువావడుతురైకు చెందిన శివప్రకాశుని శిష్యుడైన నమశ్శివాయ (పంచాక్షర — దేశికుడు) ఈ విషయాన్ని గ్రహించినట్లు తోస్తుంది. 15 వ శతాబ్దం పూర్వార్థంలో ఆయన ఇక్కడి సంస్థను సుస్థిరంగా ఉండేటట్లు చేసాడు. ఈ మఠానికి ఇంతవరకు ఏకైక పోషకులుగా



పటం—3

తమిళ, ఆంధ్రదేశాలలో గోళకీ పరంపరలని చూపించేపటం. (A) లక్షాధ్యాయి (భిక్ష), (B) తిరువావుడ్‌తురయ్, (C) తిరుచ్చట్టిముట్రమ్, (D) నందికేశ్వర, (E) శంబైక్కుడి, (F) కీళమఠ, (G) మెరుడప్పెరుమాళ్, (H) పండరంగావణర్ (I) మెయ్‌కండ, (J) లక్షాధ్యాయి (భిక్ష), (K)దేవికాపురం పరంపరలు.

ఉన్న చోళవంశము అంతరించడంవల్లనే ఈ విధమైన ప్రయత్నాలు అవసరమయ్యాయని మనం అనుమానించవచ్చు. వీరి తరువాత వచ్చిన విజయనగర పాలకులు శైవాన్ని, వైష్ణవాన్ని సమానంగా ఆదరించారు. అంతేకాక వారు వర్ణాశ్రమ ధర్మాన్ని గుర్తించే వేద మార్గాన్ని, స్మార్త శాఖను పునరుజ్జీవింపచేసి ప్రజా గౌరవానికి పాత్రమయ్యేటట్లు చేసారు. దీని ఫలితంగానే కాంచీపురంలో కామకోటిపీఠము, శృంగేరిలో శారదాపీఠము, స్థాపించబడ్డాయి. విజయనగర రాజులు తమ వ్యక్తిగతమైన నమ్మకాలు ఏవైనా తమ రాజ్యంలోని మతాల నన్నిటినీ—శైవము, వైష్ణవము, శ్రీవైష్ణవము, స్మార్తము, లింగాయక మతము—సమానంగా ఆదరించారు. వారు గోళకీ ఆచార్యులను, మఠాలను పోషించారని చెప్పడానికి ఆధారాలు ఉన్నాయి. ఈ పరిస్థితి మతాలమధ్య శాంతియుతమైన స్పర్ధకు అవకాశం కలుగచేసింది. 14, 15 శతాబ్దాలలో వ్యాఖ్యాన, వివరణ, సంవాద రూపకమైన మత

సంబంధమైన వాఙ్మయం అపారంగా వ్రాయబడింది. ఈ కాలం లోనే ఇప్పుడున్న అనేక మత వ్యవస్థలు వాటి నిర్మాణ నిర్వహణ సంవిధానాలు రూపొందించబడి క్రోడీకరించబడ్డాయి.

నమశ్శివాయ పాత్రను నిర్ధరించేటప్పుడు ఈ పరిస్థితిని గుర్తుంచుకోవాలి. తిరువావడుతురై 11వ శతాబ్దంనుంచీ గోళకీ మత కేంద్రాలలో ప్రముఖమైనదనేది నిర్వివాదము. 14వ శతాబ్దంలో తమిళదేశంలో రాజకీయంగా పెద్దమార్పు వచ్చింది. దీనిని తట్టుకుని నిలవడానికి వీలుగా మతవ్యవస్థల నిర్మాణ, నిర్వహణ విధానాలలోనూ మార్పు కలిగింది. తిరువావడుతురై వ్యవస్థ నిర్మాణ సంవిధానాల్లో ఆ వ్యవస్థ చరిత్రలో, అది గోళకీ—దక్షిణ గోళకీ — మత అధ్యయనానికీ, ప్రచారానికీ ముఖ్యమైన కేంద్రంగా కొనసాగేటట్లు చేయడమే నమశ్శివాయ పాత్ర. దీని కోసమై ఆయన చేసిన పనులలో ఒకటి ఇక్కడి మఠాలనన్నిటినీ ఒకే నిర్వహణ కిందకు తేవడం. ఆయనవేసిన పునాది ఈ మత వ్యవస్థకు బలం చేకూర్చడమేకాక ప్రజ్ఞాపాటవాలకి దోహదం చేసింది. తరువాత వచ్చిన ఆచార్యులు గౌరవం, సామర్థ్యం, ముందు చూపు కలవారేకాక, గొప్ప పాండిత్యము కలవారు. ఈ విషయము పీఠాధిపతుల ఆధ్వర్యంక్రింద వ్రాయబడిన, పీఠాధిపతులే స్వయంగా వ్రాసిన, వారి శిష్యులువ్రాసిన అసంఖ్యాకమయిన మత గ్రంథాలను బట్టి గ్రహించవచ్చును. **(Anon 1962)**

తరువాత చరిత్ర

తిరువావడుతురై "ఆధీనమ్" తరువాతి శతాబ్దాలలోను ఇదే విధంగా ప్రవర్తిల్లింది. కాలక్రమంలో దీనినుంచి రెండు ఇతర వంశాలు...ధర్మపురం, తిరుప్పందల్ 'ఆధీనం'లు — ఉద్భవించాయి. మతప్రచారంలోను, తత్త్వ ప్రబోధంలోను భక్తిశ్రద్ధలతో వీరుచేసే కార్యకలాపాలు ప్రసిద్ధమైనవి గనుక వాటిని గురించి ఇక్కడ చెప్ప నక్కరలేదు. ఈ "ఆధీనం"లు (తిరువావడుతురై "ఆధీనమ్"తో కలిసి) కొన్ని శివాలయాలనిర్వహణ, పూజాదికము నిర్వర్తించడం మొదలైనవి చేస్తున్నాయి. తిరునల్వేలిలోని వెంబత్తూర్ మఠం ఇప్పుడు తిరువావడుతురై "ఆధీనమ్"శాఖగా వ్యవహరిస్తోంది. దీనికి చెందిన ఆచార్యుల పేర్లు గోళకీ ఆచార్యుల పేర్లను గుర్తుకు తెస్తాయి. (ఉదా॥ ఈశాన—శివాచార్యుడు)

ఉపసంహారం

పాశుపతమతం క్రీస్తుశకం మొదటి శతాబ్దాలలో రాజస్థాన్, గుజరాత్, సౌరాష్ట్ర, మధ్యభారతాలలో ఉత్పన్నమయి వుంటుంది. భారతదేశంలో వాయవ్య భాగంలో పాలించిన రాజులు కొందరు—ఈ దేశస్థులు, విదేశాలనుంచి వచ్చినవారు కూడా—తమను "పరమ మాహేశ్వరు"లుగా వర్ణించుకున్నారు. (ఛట్టోపాధ్యాయ, 1970) ఇది వీరు "రుద్రు"ని భక్తులని సూచిస్తోంది. లకులీశుడు (క్రీ.శ. 1, 2, శతాబ్దాలు) ఈ మతానికి కొన్ని మార్పులు చేర్పులు చేసారు. ఈయన అనుయాయులు పాశుపతంనుంచి వేరుపడి లకులీశ—పాశుపతులని పిలువబడేవారు. కౌండిన్య రాశికారుడు (క్రీ. శ. 401–425) పాశుపత మత సూత్రాలను సంపాదించి, క్రోడీకరించాడని నమ్మబడుతోంది. ఇది శైవ (స్థూలమైనది) చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టం. 5, 8 శతాబ్దాల మధ్యకాలంలో ఎప్పుడో ఒకప్పుడు "మాహేశ్వర మతానుయాయులు, పాశుపతులు, శైవులు అని రెండు విభాగాలుగా చీలిపోయారు. ఈ చీలిక బహుశా తత్త్వ సిద్ధాంతాలలో భేదాలమీద ఆధారపడి ఏర్పడివుంటాయి. కాని లకులీశుడు ప్రతిపాదించిన ఆదర్శాన్ని సాధించడానికి రెండు మతాలు చెప్పే కర్మకాండ ఇంచుమించు ఒకటే (దివాన్జి, 1955). అప్పటికి ఈ మతం భారతదేశమంతటా, పల్లవులు పాలించిన ప్రాంతాలతోసహా, వ్యాపించింది.

9వ శతాబ్దం ప్రారంభంనుంచి మనం నాలుగు ముఖ్యమైన శైవశాఖలను గురించి వింటాం—శైవము; పాశుపతము, కారుణిక—సిద్ధాంతము, కాపాలికము (శారీరక—భాష్యంమీద వాచస్పతి మిశ్రుని భామతి వ్యాఖ్య) ఈ శాఖలు భారతదేశంలో వివిధ ప్రాంతాలలో వ్యాప్తిచెందాయి. ఈ నాలుగింటి మధ్య భేదాలు తత్త్వ సిద్ధాంత విషయంలోనే, వారు ఆచరించే కర్మకాండవిషయంలోకంటే ముఖ్యమైనవి. మధ్య భారతానికి చెందిన 'మత్తమయూర' తెగ శైవ (సూక్ష్మమైనది) శాఖకు చెందినది. ఈ శైవం దీనికంటె ప్రాచీనమైన పాశుపతమతంనుంచి కొంత మార్పుతో ఏర్పడింది. తమిళదేశంలో ఈ కాలంలో మత పరిస్థితి భారతదేశంలోని ఇతర ప్రాంతాలలోకంటే అంత భిన్నంగా ఉన్నట్లు కనిపించదు. కాని ఇక్కడ పాశుపతము (?లకులీశము కానిది) ప్రాముఖ్యం కలిగి వుండేది* ఈ అల్లికలుకే' రాజరాజు I కాలంలో గోళకీమతమనే నూలు చేర్చబడింది. 13వ శతాబ్దం ప్రారంభమయ్యే టప్పటికి ఈ కొత్త అల్లిక పాత అల్లికను ఇంచుమించు పూర్తిగా మరుగుపరిచింది. ఇది జరుగుతున్నప్పుడే ఆ పాత అల్లికలోని కొన్ని భాగాలు బయటకు తీయబడి, బలపరచబడి ఈ కొత్త అల్లికలో ఐక్యతకు సుసమన్వయానికి భంగం కలుగకుండా చేర్చబడ్డాయి.

13వ శతాబ్దంలో ఈ పరిణామాలు, ధోరణులు పతాక స్థాయిని చేరుకున్నాయి. ఈ కాలంలోనే ఒక గొప్పవిశేషం జరిగింది. సంస్కృత భాషలోని తత్త్వ సిద్ధాంత గ్రంథాలు తమిళంలో వ్రాయబడ్డాయి. దీనివల్ల ఈ మతం సామాన్య ప్రజల హృదయాన్ని, బుద్ధిని ఆకట్టుకుని తమిళదేశమంతటా వ్యాపించింది; తమిళదేశంలో వేరూనింది. తమిళదేశంలో కొన్ని ప్రాంతాల్లో ప్రాచుర్యంలో ఉన్న ఇతర శైవమత శాఖలు, పద్ధతులు గోళకీమత ప్రభావానికి పూర్తిగా లోబడి, దానిలో కలిసిపోయి తమ స్వారూప్యాన్ని పూర్తిగా పోగొట్టుకున్నాయి.

---

* పల్లవ, మొదటి చోళ, పాండ్యకాలాల్లో ప్రాచుర్యంలో ఉన్న శైవమత శాఖలనుగురించి పరిశోధించవలసినది చాలా ఉన్నది. (6–10వ శ॥)

ఈ విధంగా 10/11వ శతాబ్దాలలో తమిళదేశం గోళకీ మత శాఖ పెంపొందడానికి, స్థిరపడడానికి అనువైన పరిస్థితిలో ఉంది. ఈ పరిణామంలోనే అది ముందున్న పాశుపత మతంలోని కొన్ని అంశాలను తనలో చేర్చుకున్నది. ఈ శైవమే శతాబ్దాల తరబడి అనుసరించబడి ఇప్పుడు తమిళదేశంలో ఆచరణలో ఉంది. ఈ కాలమంతటా మధ్య అంతరాయాలుగాని, ఆటంకాలు గాని లేక ఇప్పటివరకు ఈ శైవము కొనసాగింది. అందుచేత "తమిళనాడు శైవము", "తమిళశైవము", "తమిళశైవ సిద్ధాంతము" అని పేర్కొనబడిన సందర్భాలన్నింటిలోను, తమిళదేశంలో పెంపొందిన గోళకీ–లక్షాధ్యాయి పద్ధతి శైవమే పేర్కొనబడుతోందని నిస్సందేహంగా గ్రహించాలి. ఇదేవిధంగా మెయ్‌కండన్ తమిళ శైవానికి "పిత" అన్నప్పుడు స్వయంగా గోళకీ–ఆచార్యుడైన ఆయన సంస్కృతంలోని ఈ మతసిద్ధాంతాలకు సంబంధించిన సూక్తులను తమిళంలోకి అనువదించడం మాత్రం చేసాడని మనం అర్థం చేసుకోవాలి. "తమిళ గురువంశం" అని పేర్కొన్నప్పుడు, గోళకీ లక్షాధ్యాయి పద్ధతి ననుసరించే తమిళ దేశస్థులయిన ఆచార్యులను గురించి మాత్రమే చెప్పాలి కాని అంతకుమించి (ప్రత్యేకమైన ఒక వంశం) ఏమీలేదని గ్రహించాలి. "తమిళ–మడమ్"లు అని చెప్పినప్పుడు గోళకీ–లక్షాధ్యాయి పద్ధతికి చెందిన తమిళ దేశస్థులైన వారిచేత స్థాపించబడిన లేక వారి ఆధిపత్యంకింద ఉన్న మతములని మాత్రమే అర్థం.

ఇందులో ఉదాహరించబడిన గ్రంథాలు

Anon, 1962. అరుసువనత్తు అణిలైయం (తమిళం) తిరువావడుతురై ఆధీనం, మయూరం

అరుణాచల గౌండర్. కె. 1964 కయిలాయ పరంపరయిల్ తిరుప్పెరురాధీనమ్ (తమిళం) శాంతలింగ అడిగళర్ తమిళ కాలేజ్ దశాబ్ద సంచిక, కోయంబత్తూరు. పుటలు 79–85.

బాలసుబ్రహ్మణ్యం. ఎస్. ఆర్. 1966 ఎర్లీ చోళా ఆర్ట్ Part I ఏషియా పబ్లిషింగ్ హౌస్, బాంబే.

ఛటోపాధ్యాయ. ఎస్. 1970 ఎవల్యూషన్ ఆఫ్ హిందూ సెక్ట్స్, మున్షీలాల్ మనోహర్‌లాల్ – న్యూఢిల్లీ.

చిదానందమూర్తి. ఎమ్. 1966 కన్నడ శాసనంగళ సంస్కృతి అధ్యయన (కన్నడ) ప్రసరంగ, మైసూర్ యూనివర్శిటీ, మైసూర్

దివాన్జీ. పి. సి. 1955 ది మాహేశ్వర కల్ట్ ఎండ్ ఇట్స్ ఆఫ్ షూట్స్ J.As, Soc బాంబే, 30–6–22

దొరైస్వామి పిళ్లై, అవ్వై 1938 ఎ హిస్టరీ ఆఫ్ తమిళ లిటరేచర్ [తమిళం] అన్నామలై యూనివర్శిటీ, అన్నామలై నగర్.

... ... 1968 శివజ్ఞాన బోధమూలముమ్, చిత్తురైయుమ్ (తమిళ) అన్నామలై యూనివర్శిటీ, అన్నామలై నగర్.

గురుమూర్తి. ఎస్. 1970 సమ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్ సౌత్ ఇండియా బుల్లె. ఇన్. ట్రెడ్. కల్ట్. మద్రాసు యూనివర్సిటీ మద్రాసు.

హందికి. కె. కె. 1949 యశస్తిలక ఎండ్ ఇండియన్ కల్చర్. జైన సంస్కృతి సంరక్షణ సంఘ, షోలాపూర్.

హీరాలాల్ 1927 లోకనాయకి నన్నితంబి, చోళర్ కొలత్తి కర్వి (తమిళం) తమిళ్ అర్రైచి 359–375

మహాలింగం. టి. వి. 1957 ఎ ఫామిలీ ఆఫ్ పాశుపత గృహస్థాన్ ఎట్ జంబుకేశ్వరమ్ J. or Res. మద్రాస్, 25. 79–85

... ... 1962 ది గోళకీ మఠాస్ ఇన్ ఏన్షియన్ ఇండియా ఫిలాసఫీ పుటలు 446–451, గణేశ్ అండ్ కో, మద్రాస్.

/ అయిపోయింది /

శ్రీమతి చిన్నం విజయలక్ష్మి

నవ్యాంధ్ర కవిత్వము - మతదృక్పథము

నిన్న మొన్నటి వఱకు మతము మానవ జీవితముతో అవినాభావ సంబంధమును కలిగియున్నది. నిమిత్తమిదియే కావచ్చును. నాగరకత తొలి ప్రొద్దులోనే వేదబుక్కులు వాఙ్మయాంబుధిలో తొంగి చూచినవి. నాటినుండి వెలువడిన సాహిత్యమంతయు, మత స్పర్శ ననుభవించుచునే యున్నది. సాహిత్యావతరణకు నాందీ వాక్కు పలికినప్పటినుండి వెలువడిన వేదబుక్కులు, ఉపనిషత్తులు, భగవద్గీత, రామాయణ భారతములు ఆధ్యాత్మిక చింతనను ప్రబోధించునవనియే, భావింపవచ్చును. సాహిత్యపు విలువలను పెంచుటతోపాటు, పారమార్థిక చింతనను కూడ నివి సాహితీ ప్రియంభావుకులలో కల్గించినవి. మతప్రసక్తి (దైవప్రసక్తి) అనగా ఇష్టదేవతారాధనముతో కావ్యారంభమును చేసిరి. మత సామరస్యమునకు పాటుపడిన తిక్కన హరిహరనాథు నుపాసించెను. మతోన్మాదముతో శివకవులు కవిత్వముతో మతమున కూడిగము చేయించిరి.

కాని తరములు మారుచున్నకొలది దృక్పథములలో మార్పు వచ్చినది. మత దృక్పథములోను, దేవతార్చనలోను ఆధునిక కవులలో మార్పు స్పష్టముగ కనబడుచున్నది. సామాజిక పురోగతి నరికట్టు మత విశ్వాసములను, సంప్రదాయములను అనుసరింప వీరిచ్చగింపరు. మానవత్వమే దైవత్వమని, మంచిని పెంచే మనిషే దేవుడని వీరు భావించిరి. ''శిథిలాలయమ్ములో శివుడు లేడ''ని నిర్ధారించిరి.

ఈ భావనకు ప్రాధాన్యము నిచ్చియే, దేవుని కొండ కోనలలో వెదుకవలసిన యవసరములేదనియు, కన్నుతెఱచిన కనబడుననియు, మనుష్య మాత్రునియందే కనబడునని యుగకర్త గురజాడ తన యభిప్రాయమును వెల్లడించిరి.

''మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషులంటే రాయి రప్పల
కన్న కనిష్టం
గాను చూస్తావేల బేలా !

దేవు డెక్కడో దాగె నంటూ
కొండ కోనల వెతుకులాడే వేలా
కన్ను తెఱచిన కానబడడో ?
మనిషిమాత్రుడియందు లేడో,
యెరిగి కోరిన కరగి యీడో, ముక్తి''.

తలంపులలో వచ్చిన యీ మార్పు తలలు వంచి నమస్కరించడంలో ప్రతిఫలించినది. ఆధునిక కవులు దేవతోపాసకులు కావడం కంటె, ప్రకృత్యుపాసకులు కావడానికే ప్రయత్నించారు. కృత్యాదిని ఇష్టదేవతా స్తుతిలో ఈ మార్పు స్పష్టంగా దర్శనమిస్తుంది. ఆధునికాంధ్ర కవిత్వమునకు లక్షణ గ్రంథ మనదగిన 'రమ్యాలోక' కర్త రాయప్రోలు ''మామిడి కొమ్మమీద కల మంత్రపరాయణుండైన కోకిల స్వామికి మ్రొక్కి ఈ యభినవ ధ్వనిధారణ కుద్యమించితిన్'' అని చెప్పుకొన్నారు. ఛాందసాచారములపై ధ్వజమెత్తి దండయాత్రసాగించిన కవిరాజు త్రిపురనేని ఇష్టానిష్ట దేవతాస్తుతిలో చమత్కారముగ 'దైవతకోటి' అసమర్థతను ఎత్తి చూపిరి. మానవులవలెనే సంసార లంపటమున చిక్కుకొని పలవించు దేవతలు తన విన్నపముల నాలకించలేరని చెప్పినారు.

''ఇల్లును వాకిలిం గలిగి యిద్దఱొ ముగ్గురొ యాండ్రుగల్గి పైఁ
బిల్లలు జెల్లలుం గలిగి లెక్కసమైన కుటుంబ భారమన
వెల్లున నీఁదలేక పలవించెడి దైవతకోటి నా మొఱల్
మెల్లగ నాలకించి లవలేశము ముక్తి నొసంగ నేర్చునే !''

పురాణములలోని కాళ్లులేని కుంటి నడకల కథలను, నడుము విరుగ గొట్టినారు. పురాణముల గుట్టు మట్టులను సూత పురాణములో వెలికి తీసినారు. ఈ దేవతల ప్రభుత్వము చాల అసమర్థమైనదని విమర్శించారు.

''విభుఁడొకఁడు చేయునంట పైపెత్తనంబు
కర్మమొకఁడు సంసార చక్రంబుఁ ద్రిప్పు
నంట ! ద్వంద్వ ప్రభుత్వ మిందమరలేదె ?
ఎంత కాలంబు సాగునో యిట్టి చిట్టు.''

తన మొఱల నాలకించడానికి, నిత్యకృత్యములలో మునింగిన యే దేవునికి తీరిక లేదని, తత్కారణమున తానెవరికి జోత లెట్టవలెనో తెలియుట లేదని సందిగ్ధావస్థలోపడిపోయిరి. నిత్యసంచారి అయిన శ్రీలక్ష్మి కొరకు విష్ణుదేవుడిల్లిల్లు తిరుగుచుండెననియు, త్రిపురారి భిక్షకు బయలుదేరెననియు, క్రీస్తు సిలువపై కాలక్షే

పము చేయుచుండెననియు, మహమ్మదు శత్రువులకు భయపడి ఊరూర తిరుగుచుండెననియు, వారి కష్టములు వారికుండగ, మధ్య తన గోడు నేల విందురనియు, విన్నను వారు తన నాదుకొనుట కసమర్థులనియు నిర్ణయించుకొనిరి. వీరి దృక్పథము లిట్లుండ, కన్పించని దేవతల నారాధించుటకంటె ప్రత్యక్షదైవతములగు తల్లి దండ్రులను, గురువును ఆరాధించారు నవీనులు కొందరు.

ఎవరినో ఒకరిని ఆరాధించాలన్న నియమం లేని కవులు, భగవంతుని అస్తిత్వాన్నే ప్రశ్నించారు. హేతువాదులయిన కవులు తమ అభిప్రాయములను నిరాఘాటముగా వెల్లడించారు. నిరీశ్వర వాదిగా ఒకప్పుడు పేరువడ్డ 'చలం' భగవంతుడు "ఉండి నిర్దయుడో, కఠినుడో నిస్పృహుయుడో కావడంకన్న లేకపోవడం నయం కదూ" అని "ప్రేమ విఘాత దారణేశ్వరు డొకడుంటే వ్యధను మఱచి ఎన్నటికయినా క్షమిస్తుందా మానవకోటి" అని ప్రశ్నించుకున్నాడు.

సనాతన మతవ్యవస్థపై సాగిన ఈ ప్రతికూల వాయువు విగ్రహారాధనముపై, పూజా విధులపై కూడ తన వీచికలను ప్రసరింప చేసినది. విగ్రహారాధనముపై దండెత్తిన కవుల ఆంతర్యమును చదివిన పాఠకునకుకూడ దేవతా విగ్రహము కేవలము రాతి బొమ్మగనే దర్శనమిచ్చును. ఏ ఒక్కరి ఆధిక్యమును సంస్కార ప్రియులు సహింపజాలకుండిరి. కరుడు గట్టిన మత వ్యవస్థపై దండయాత్ర సాగినది. రాతిబొమ్మలను కొలిచి, కొలిచి, రాళ్ళుగా మారిన మనుషులను వీరు ఏవగించుకొనిరి. శిలా సదృశులుగ వీరు మారుటకు, వారారాధించెడి దేవతా శిలలే కారణమేమోయని సందేహించిరి. ఆ కారణముననే గురజాడ మనిషిచేసిన రాతిబొమ్మకు మ్రొక్కులిడి, ఆ మనిషిని రాయికన్న హీనంగా చూచే యీ బేలతన మేమిటని ప్రశ్నించుకొన్నారు.

ముంగిట నిలచిన బిచ్చగానిని, జీర్ణవస్త్ర ధారిని, ఆకలి బాధతో డొక్కలంటుకొనిపోయి అన్నార్తుడై 'మాతా! కబళం' అని ఆక్రోశించే వానిని కాపలాదారుచే గెంటించి, కుక్క మసిగొల్పిన ఏ పెద్ద మనిషి ఆలయంలో విగ్రహానికి (తద్వారా పూజారికి) నిలువుదోపిడీ సమర్పించడం చూశారో కడుపుమండి కవిరాజు ఇలా దూషించారు:

మలమల మాడు పొట్ట తెగమాసిన బట్ట కలంత పెట్టగా
విలవిల యేడ్చుచున్న నిఱుపేదకు జాలిని చూపకుండ
నుత్తలపడిపోయి జీవరహితంబగు బొమ్మకు నిండ్లు వాకిళుల్
పొలమును బుట్ట నిచ్చెడి ప్రబుద్ధ వదాన్యుల నిచ్చ మెచ్చెదన్.

అసలు దేవుని అస్తిత్వమువలన ప్రయోజనమేమి? అని ప్రశ్నించుకుంటే, సంఘంలోని ఒక వర్గపు మనుషుల పెద్దరికాన్ని నిలపడానికే అని సమాధానం చెప్పుకున్నారీ కవులు. శ్రీ వేదుల సత్యనారాయణగారు, గుడిలోని రాతిబొమ్మల ప్రయోజన మిదియే అని భావించారు. దయారసామృతాస్వాద దరిద్రులైన ధనవంతుల పెద్దరికమ్ముకై మతోన్మాదమును పెంచుటయే ఈతని పని యని తెల్పారు.

"పేదల రక్తమాంసముల పెంపు వహించి దయారసామృతాస్వాద దరిద్రులైన ధనవంతుల పెద్దఱికమ్మును నిల్పుటకై మతోన్మాదముపెంచు దేవునికి మారుగ నిల్చిన రాతిబొమ్మలు" అన్నది విగ్రహములను గురించిన ఆయన వ్యక్తీకరణ; ధూపదీప నైవేద్యములతో దేవునికి సమర్పింపబడిన పుష్పము ఈ యవకాశ లబ్ధికి ఆనందించక, రాతిబొమ్మలకడ పొగగొట్టుకొనిపోవు పాడు బ్రతుకు నిమిష కాలమ్మైనను సహించలేనని మొహమోటము లేకుండ చెప్పినది.

ఎవరికివారు నమస్కరించడంతో తృప్తిపడలేదు ఈ దైవ భక్తులు. చందాలు వసూలుచేసి మరీ ఉత్సవాలను జరపడమన్నది తమ ఆచార వ్యవహారాల్లో ఒకటిగా భావించారు. అందుకే ఏటేటా శ్రీరాముడికి, సీతకు పెండ్లి జరిపే తీరుతున్నారు. దసరాకు పెద్ద పెట్టున రావణ దహనాన్ని జరుపుతూనే ఉన్నారు. దీపావళికి మందుల పేరుతో డబ్బు తగలేస్తూనే ఉన్నారు. ఇలా దేవునిపేరిట ఉత్సవాలు జరుపుతున్నా, అక్కడ కూడా ఆధిక్యం ఆర్థిక బలాబలాలపై ఆధారపడే ఉంటుంది. ప్రసాదం లభించాలన్నా చందాదారులకే దానిపై హక్కు. కళ్యాణోత్సవాలను జరపాలన్నా డబ్బుతో ముడిపడే ఉంటుంది. ఈ బూజుపట్టిన వ్యవస్థను, కర్రుదు కట్టిన మనస్తత్వమును పరికించి, కలత చెందిన మనస్సుతో జాషువాకవి— "ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయింత్రు కాని క్షుధార్తుని భిక్షాపాత్రలో మెతుకు విదల్పరని" నిటూర్చారు. ఈ దేశంలో ప్రతి మనిషికీ ఒక దేవుడున్నాడని చెప్పవచ్చు. అందుకే "ముప్పదిమూడుకోట్ల దేవత లెగవడ్డ దేశాన" పేదల ఆకటిచిచ్చు తీరదనీ ఆయన నిశ్చయించుకొన్నారు.

ఈశ్వరత్వాన్ని తనలో నిక్షిప్తం చేసికొని సృష్టికి ప్రతిసృష్టిచేయ నేర్పుగల కవిబ్రహ్మ, వస్తువుల సహజ ధర్మాలకు కూడ కారణాల నరయగలడు. ప్రాణికోటి ప్రవర్తనా రీతులకు సృష్టిలోని అవక తవకలకు సమన్వయాన్ని చూపెట్టగల సమదృష్టి ఆతనికున్నది. తలక్రిందుగా సంచరించడం గబ్బిలము స్వభావమయితే, తన కవితా చమత్కారంతో దానికొకహేతువు నాపాదించాడు నవయుగ కవి చక్రవర్తి జాషువా.

''నరుని కష్టపెట్టి నారాయణుని గొల్చు
ధర్మశీలురున్న ధరణిమీద
కాలుమోపలేక గబ్బిలమొక్కటే
చరణయుగళి దివికి సాచి నడచు''.

విగ్రహారాధనపై ఈ విధంగ ధ్వజమెత్తి భగవంతుని అస్తిత్వాన్ని ఆధిక్యాన్ని ప్రశ్నించడంతో తృప్తి పడలేదు ఆధునిక కవులు. సామాన్య మానవుడు తన స్థాయికి భగవంతుడనబడే బ్రహ్మపదార్థాన్ని కూడ దిగజార్చాడు. అందుకే నేటి 'మనిషి'లో కనబడే అవలక్షణాలు మనుషులు సృష్టించిన దేవతలలో కూడ దర్శనమివ్వసాగాయి.

''ముడుపుకట్టిన కాని సమ్మోద పడరు
వేట తల జూచి కాని మోమోట పడరు
పోతురాజాదు లేనెట్లు పూజసేతు
లంచగొండితనమ్ము కాన్పించుచుండ''

అని కవిరాజు విగ్రహాలకు నమస్కరించడానికే మనస్కరించడం లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఈ పరిశీలన వలన ఆధునిక కవులను నాస్తికులుగా నిరూపించదలచుకొన్నామా, వారు నాస్తికులా? అంటే 'కాదు' అని చాల స్పష్టంగా సమాధానమీయవచ్చు. స్థూలదృష్టికి నాస్తిక బ్రహ్మగా దర్శనమిచ్చే కవిరాజు 'ఇష్టానిష్ట దేవతాస్తుతి'లో బ్రహ్మజ్ఞాన స్వరూపమైన పరతత్వమును భజించెదనని చెప్పుకొన్నారు.

ఆధునిక కవుల మనస్తత్వమును ప్రతిబింబించేదే వారి మత దృక్పథము. ఆ కారణముననే యాగాలపేరిట, బలుల పేరిట ఘాతుక కృత్యాలకు దోహదంచేసే మతాలు అడుగంటాయి. ''ఎవనికివాడే తాను'' అనెడి ఇష్టదైవమునకు ఆలయంకట్టి పూజలు చేస్తున్నాడు. తన దైవం అనే అహంకారం మనిషిలో జీర్ణించుకొనిపోయినది. అహంకార పూరితమైన ఆ వాతావరణంలో గాలి, వెలుతురు చొరని ఈ స్వార్థపరుల కట్టడాలలో బాధపడుతున్న భగవత్స్వరూపుని విడుదలకు వచ్చినవ్యక్తి గౌతమబుద్ధుడు.

తామాశించే దైవత్వానికి ఉన్నతాశయాలకు సమీపంలో, ఉన్న మానవోత్తముడు గౌతముడు అన్న సత్యాన్ని వారు గుర్తించారు. అందుకే గత వైభవాన్ని స్మరించుకొన్న ప్రతి నవకవీ బుద్ధునికూడా స్మరించి చేయెత్తి నమస్కరించాడు. తన సుఖాన్ని పరిత్యజించి, లోకోద్ధరణకు 'సత్యమార్గ గవేషణాసక్తు' డయి నిర్వాణపథం కనుగొన్న నిస్సంగుడు గౌతమర్షిని మానవతా ప్రేమికుడయిన ప్రతి మనిషీ స్మరించాడు. కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పరతత్వమూర్తితోపాటు బుద్ధదేవునికీ నమస్కరించారు.

బౌద్ధ ధర్మాన్ని ప్రతిపాదించే కార్యాలను కూడ యీ తరం కవులు రచించారు. ఇందులో తిరుపతి వేంకట కవుల బుద్ధచరిత్ర పింగళి—కాటూరి సౌందరనందము, కరుణశ్రీ కరుణశ్రీ పేరెన్నిక గన్న కావ్యములు. ఈతని త్యాగమహిమ నాలకించి మూడు కాలములు రోమాంచము వహించుననియు, ఈతని ధర్మలతలు ఏడు దీవులకు ప్రాకి ననలెత్తెననియు సౌందరనంద కర్తలు భావించిరి. బౌద్ధమత పరమార్థమును విప్పి చెప్పుచు ... ''ప్రేమ శూన్యము గాదన్న భిక్షగణము, జీవకారుణ్యమే మాకు జీవగఱ్ఱ ...'

''ప్రేమకన్న సత్యము లేదు భిక్షుకులకు,
పరమసత్యముకన్న సుందరము లేదు''

జీవకారుణ్యాన్ని మించిన మతములేదని నొక్కి వక్కాణించారు.

వారు వీరని విభేదములేక ఆధునిక కవులందరు బుద్ధుని యనుయాయులే అని చెప్పవచ్చును. మానవత్వాన్ని విశ్వసించే ఈ తరం మూర్తీ భవత్ మానవత్వమనదగిన బుద్ధుని ఆరాధించడంలో వింత లేదు. లోకం కోసం తాముకూడ బుద్ధునిలా, క్రీస్తులా అలమటించాలని ఈ కవులు కలలు కన్నారు.

''వ్యధా శోకాల పీడిత లోకాలలో
విరిసిన కారుణ్యాం మహాబోధి వెలుగులో
మెరసిన తథాగతుణ్ణి నేను
అహంకారం సిలువపైన నవ్విన నెత్తురు గులాబీని నేను.'

దుఃఖ సముద్రాన్ని నిస్తరించడానికి ప్రయత్నించి, మార్గం చూపిన యీ మానవతా మూర్తి జన్మ దేశంలో యింకా కన్నీళ్లకాలువ లింకనే లేదు.

అందుకే

''నేను చూశాను నిజంగా
మూర్తీ భవత్ దైన్యాన్ని, హైన్యాన్ని
క్షుభితాశ్రు కల్లోల నీరధుల్ని
ఇది ఏ నాగరికతకు ఫల స్మృతి
ఏ బుద్ధదేవుడి జన్మభూమికి గర్వస్మృతి?''

అని ఆక్రోశించారు, ప్రశ్నించారు.

దిగంబరకవి భైరవయ్య తన విప్లవకంఠంతో 'నేను దేవుణ్ణి నమ్ముతున్నాను' అని శంఖారావం చేశారు. అయితే

ఈ దేవుడి స్వభావం ఎటువంటిదో, అతని మాటల్లోనే పరిశీలించడం ఉత్తమం.

''నేను దేవుణ్ణి నమ్ముతున్నాను''
... ...
అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు
మొదలైన చచ్చుపీనుగ కాదు నా దేవుడు,
... ...
వడలిపోయిన జీవితాల కుదుళ్లలో ఆత్మీయతని విదిల్చి
మనిషిని మనిషిగా గుర్తించి
మనిషిగా బ్రతకడమే నాకిష్టం.

ఎవరికీకాని కుక్కపిల్లమీంచి, కారు నడచి నప్పుడు,
మెతుకుకోసం మానాన్ని కాల్చుకున్నప్పుడు
జాలిపడ్డ గుండెలో నా దేవుడున్నాడు.

నా దేవుడు
చీమూ నెత్తురూ ఉన్న మానవుఁడు
మానవత్వాన్ని తప్ప మరో మతాన్ని అంగీకరించడు.''

భైరవయ్యేకాదు, అతఁడు నమ్మిన దేవుడే కాదు, మనిషి అయిన ప్రతివాడూ మానవత్వాన్ని తప్ప మరో మతాన్ని అంగీకరించడు.

భావనా దృక్కులతో గత కాలంలోని శైవ—వైష్ణవ ఘర్షణను దర్శించాడో, భౌతిక నేత్రంతో సమకాలీన హిందూ—ముస్లిమ్ సంఘర్షణను చూశాడో, ఆధునిక కవి మతమన్న పేరు చెప్పితేనే బెదరిపోయాడు. ద్వేషాలను రోషాలను పెంచి కళ్లకు మసకను ప్రసాదించేదే మతమైతే 'మతంవద్దు గతం వద్దు మారణహోమం వద్దు' అనుకున్నారు.

ఈ విధంగా, మూఢాచారాలను అవహేళన చేసినా భగవంతుని అస్తిత్వాన్ని మానవత్వంలో అంగీకరించారు ఆధునిక కవులు.

కాలంతోపాటు మారలేకపోవడం అవలక్షణం, కాలంతోపాటు మారడం సహజ లక్షణం, కాలగమనానికన్న ముందుకు పరుగులెత్తడం సాహసికుల లక్షణం. మూఢాచారాలను ద్వేషించడం, ఏదో ఒక రూపంతో బ్రహ్మ పదార్థపు అస్తిత్వాన్ని నమ్మడం ఈ తరం కవుల లక్షణమైతే, సాహస అయిన యువ కవి ''కొంచెం నమ్మకముంటే దైవానికి ఎదురు తిరగగలననే చెప్పాడు'' గుండెమీద చేయి వేసికొని. ''నా క్కొంచెం నమ్మక మివ్వు'' అని ఆ నమ్మకముంటే ''కాలుని మీద కలబడతాను. పరమశివుని శూలాగ్రాన తలక్రిందుగ నిలబడతాను'' అని సవాలుచేశారు.

అయితే, ఈ తరంలో ప్రాచీన కాలం నుండి ఉన్న దేవతలను ఆరాధించిన వారు లేరా అంటే ఆధునికులలో వీరి సంఖ్య చాలా ఎక్కువ అనే చెప్పవచ్చు. వీరు కాలధర్మాన్ని అనుసరించి ఆధునికులవుతారు కాని లక్షణాన్నుసరించి ప్రాచీనులనే చెప్పవచ్చు. తత్కారణమున ఆ గ్రంథ పరిశీలన ఈ వ్యాసంలో అప్రస్తుతమని భావించడం జరిగినది.

సమష్టి పరిశీలనపై ఆధునిక కవులందరూ 'మానవ సేవయే మాధవ సేవ' అన్న సూక్తిని అక్షరాలా అక్షరబద్ధం చేశారు. కావ్యగానం చేశారు అని చెప్పవచ్చు. భరత వాక్యాన్ని పలుకుతూ ''స్వస్తి గోబ్రాహ్మణేభ్యః'' అనడానికి మనస్కరించక ''ఈ దక్షిణాగ్ని కలుషితాచారముల గాల్చి వెలుగు గాక'' అని శుభం పలికారు. అతీత శక్తుల ప్రయోజన మిదే కావాలనీ మంచిని పెంచడానికే అవి ఉపయోగపడాలనీ ఆశిద్దాం.



క ల గూ ర గం ప

బ్రౌన్ లేఖలు

నిడుదవోలు సమీక్ష - బంగోరె సమాధానము

శ్రీ వెంకటేశ్వర విద్యాలయం ప్రచురించిన బంగోరె సంశోధిత గ్రంథం "బ్రౌన్ లేఖలు"పై కళాప్రపూర్ణ నిడుదవోలు వెంకటరావు సమీక్షావ్యాసం (భారతి, 1977 జూన్) చదివాను. ఆయన ఆ పదిపేజీల వ్యాసంలో బ్రౌన్‌ను గూర్చి లోకానికి చాటాలనుకున్న తప్పుడు విషయాలను ఖండించవలసిన అవసరం వుంది గనుక యీ సమాధానం వ్రాయవలసి వచ్చింది.

, నా పుస్తకంలోని అసలు విషయాలను బుద్ధిపూర్వకంగా గాలికి వదిలేసి, బ్రౌన్‌పేరు 'బ్రౌన్' కాదు 'బ్రౌను' అనీ, బ్రౌన్ జాబుల సంపుటాలు 20 కాదనీ 10 మాత్రమేననీ, విషయసూచిక అట్లు కాదు యిట్లు అనీ, లోపలి ముఖపత్రం అట్లా కాదు యిట్లా అనీ, ఇండెక్స్‌లో అవేకాదు, యివి కూడా వుండాలనీ, బిబ్లియాగ్రఫీలో యీ తప్పు దొర్లిందనీ—యీ బాపతు స్వల్పవిషయాలపైన్నే తన సమీక్షా కాండనంతా కేంద్రీభూతం చేశాడు. అంతటితో సరిపుచ్చుకోకుండా బంగోరెపై పెక్కు అభాండాలు గుప్పించాడు. నేను బ్రౌన్ నిఘంటువు సైతం 'చూడలేద'నీ 'విప్పి చూడలేద'నీ, నాకు బ్రౌన్ జాబులు—మెకంజీ సంపుటాలమధ్యగల తేడాయే తెలియదనీ, తెలుగు కావ్యాలను గురించిన నా 'పరిజ్ఞానం ఆకాశకుసుమ'మనీ, నా 'సాహిత్య చారిత్రక పరిజ్ఞానాన్ని శంకించవలసి వస్తున్నద'నీ—యిట్లాంటి అభాండాలను వేశాడు. బంగోరె అని యేకవచన ప్రయోగమే చేశాడు. ఆ అభాండాలన్నీ సదరు ని. వెం. రావుకి వర్తిస్తాయే గానీ బంగోరెకు కాదనిమాత్రం మనవి చేస్తున్నాను. ఆ 'స్థాయి'లోనే సమాధానం చెప్పేటట్లు చేశాడాయన నన్ను.

మొదటగా బ్రౌన్ పేరు :

బ్రౌన్‌ను 'బ్రౌన్' అనకూడదట. 'బ్రౌను' అనాలట. దీనిపైన్నే వొక పేజీ పైగా వ్యాకరణ రగడ లేవదీశాడు. ఇంతవరకూ బ్రౌన్ గురించి తెలుగులో వచ్చిన పుస్తకాలు అయిదు. ఆ అయిదింటిలో మూడు బంగోరెవే. వాటిని వదిలేద్దాం. మిగతా రెండింటిలో వొకటి డాక్టర్ కొత్తపల్లి వీరభద్రరావుగారిది. రెండోది డాక్టర్ చల్లా రాధాకృష్ణ శర్మగారిది. ఈ రెండు పుస్తకాల ముఖపత్రాల్లో మనకు పెద్దగా కనపడేది 'సి. పి. బ్రౌన్' అనే రూపమే గానీ వెంకట్రావు చెప్తున్న 'బ్రౌను' గాదు. కంటిచూపు తక్కువైతే కళ్ళద్దాలు పెట్టుకొని మరొకసారి చూడవచ్చు. కీ. శే. వేదం వెంకటరాయశాస్త్రి 'ఆముక్తమాల్యద సంజీవనీ వ్యాఖ్య' లో మొదట్లోనే 'సి. పి. బ్రౌన్' కు నమస్కార బాణం అంటూ తన వ్యాఖ్యను ప్రారంభించాడు.

ఇక, బ్రౌన్ సేకరించి పట్టిపోయిన 6–7 వేల పేజీల జాబుల్లో 95 శాతం మనకు కనపడుతున్నది 'బ్రౌన్'. రూపమే. మిగతా 5 శాతంలో మటుకే బ్రవును, బ్రౌను, భ్రౌం రూపాలు. ఈ జాబులు వ్రాసినవారిలో ఆ నాటికి మహా పండితులైనవారు—పురాణం హయగ్రీవశాస్త్రి, రావిపాటి గురుమూర్తి శాస్త్రి, వఠ్యం అద్వైత బ్రహ్మయ్యశాస్త్రి—యిట్లా ని. వెం. రావును తలదన్నే పండితులే వున్నారు. వీళ్ళు వుపయోగించిన రూపంకూడా బ్రౌన్ అనే. ఇట్లా అనాదిగా వస్తున్న లేఖన సంప్రదాయాన్ని దృష్టిలో పెట్టుకొని, వుచ్చారణకూ, లేఖనకూ మధ్య కృత్రిమాలు కల్పించి భాషను భ్రష్టు పట్టించకుండా యీ బ్రౌన్ రూపాన్నే మేము వాడవల్సివచ్చింది. అప్పటి యిప్పటి సంప్రదాయం 'నిజమైన సంప్రదాయం' యిదే. ఏనుగుల వీరాస్వామయ్య 'కాశీ యాత్ర చరిత్ర'లో యిటువంటి రూపాలు బోలెడు. ఇప్పుడు ని. వెం. రావు చెప్పే హలంత—అజంత భేదాలు మధ్యలో కొందరు తెచ్చిపెట్టిన భాషా భేషజాలే. అంతెందుకు యీ ని. వెం. పండితుడే 'శతక కవుల చరిత్రము' (1957) లో 'బ్రౌన్', రివైజ్డు ఎడిషన్' అనే వుపయోగించాడు. బ్రౌన్ అనకూడదని దబాయించే యీ ని. వెం. రావు తన 'చిన్నయసూరి జీవితము' (1962) లో 'జూన్' అన్నాడు. జూను అనకుండా. బులెటెన్, సరస్వతి మహల్, విద్వాన్, శ్రీమాన్ అనే రూపాలనే చచ్చినట్లు వ్రాశాడు. వాటి సంగతేమిటి? ఆయన యిప్పుడు యింతగా గొంతు చించుకొంటున్న వ్యాకరణ పాతివ్రత్యాన్ని యెందుకు భంగం చేసినట్లు? అక్కసుకూ వొక హద్దు వుండాలిగదా. ఇట్లాంటి వాళ్ళనే గదా విరసం వాళ్ళు 'సాహిత్య మూర్ఖులు' అని అంటున్నది.

బ్రౌన్ జాబులు యెన్ని ?

మద్రాసు లైబ్రరీలో వున్న బ్రౌన్ లేఖల సంపుటాలు సరిగ్గా పది అని వొక తప్పుడు లెక్క పనిగట్టుకొని సృష్టిస్తున్నాడు ని. వెం. రావు. ఆచార్య జి. యన్. రెడ్డిగారు ప్రస్తావనలో '20 సంపుటాలు, ఒక్కొక్క సంపుటంలో సుమారు 400 పేజీలు కలవి' అన్నారు. బంగోరె ముందు మాటల్లో 'దాదాపు 6–7 వేల పేజీల్లో వున్న జాబులు. — అన్నాడు, ఈ రెండు వాక్యాల్లో యేదో వైరుధ్యం వుందని పసిగట్టాడు ని. వెం. రావు. నిజానికి యిందులో అలాంటిదేమీ లేదు.

సగటున 400 పేజీలుగల 20 సంపుటాలు అంటే మొత్తం 8 వేల పేజీలు వస్తాయి. బ్రౌన్ జాబులు అనే పేరు గల్గిన యీ 20 సంపుటాల్లో మధ్యన అక్కడక్కడా కొన్ని కథలు—తాతాచార్ల కథలు, రామకృష్ణమాచార్యులు చెప్పిన కథలు, చిల్లర కథలు యింకా విశాఖపట్నం రెవెన్యూ రిపోర్టులు, తమిళ లేఖలు—యిట్లా తెలుగు 'లేఖేతర' సామగ్రికూడా కాపీ చేయబడి వున్నది.

కాబట్టి, షుమారు 400 పేజీలు కల్గిన ఆ సంపుటాల్లో నుంచి వాటిని తొలగిస్తే, మిగిలే నిఖరమైన జాబుల పేజీలు దాదాపు 6—7 వేలే కదా వచ్చేది. కొన్నిలేఖలు రెండు మూడు సంపుటాల్లో చర్విత చర్వణంగా కాపీ చేయబడి వున్నాయి.. ఈ 'రహస్యాల్ని' దృష్టిలో పెట్టుకొనే నేను 6—7 వేల పేజీలన్నాను. లెక్క తెలియక కాదు.

ని. వెం. రావు లెక్కబెట్టుకోడానికి అనువుగా ఆ లైబ్రరీ లోని బ్రౌన్ లేఖల సంపుటాల నెంబర్లు యిస్తున్నాను. M. 401, 410, 411, 413, 417—432. ఇవన్నీ కూడితే వచ్చేది 20 సంపుటాలు. పై పట్టీలో; మధ్యలో లోపించిన నెంబర్ల సంపుటాలలో జాబులు గాకుండా కోర్టు తీర్పులు, సాక్ష్యాలు, తదితర పత్రాలున్నాయి గనుక వాటిని యీ లెక్కలో చేర్చలేదు. 1973లో నేను 'బ్రౌన్ జాబులు: తెలుగు జర్నలిజం చరిత్ర' ప్రకటించిన నాటికి నేను గుర్తించగలిగిన జాబులు 16 సంపుటాలే కాగా, మరో నాలుగు సంపుటాలు ఆ తర్వాత గుర్తించినవి. ఇంతకూ యిందులో యిద్దరూ 'సుమారు', 'దాదాపు' అని ప్రయోగించాము గాబట్టి యిది వుజ్జాయింపు లెక్కే. దానికీ కారణం లేకపోలేదు.

నిజానికి బ్రౌన్ లేఖలు యెన్నో నిఖరంగా లెక్కపెట్టి చెప్పడం అనేది యిప్పట్లో సాధ్యమయ్యేదికాదు. ఉదాహరణకు— ఏనుగుల వీరాస్వామయ్య 'కాశీయాత్ర చరిత్ర' వ్రాత ప్రతిలో వీరాస్వామయ్య స్వయంగా తనకు వ్రాసిన జాబును అందులోనే కుట్టి పెట్టి పోయాడు బ్రౌన్. ఇక ఆయన డిక్షనరీ నోట్సు డజన్ల సంపుటాల్లో మధ్య మధ్య కొన్ని జాబులు—యెన్నో విషయాలు గురించినవి, 'శబ్దార్థ వివరణలకు సంబంధించినవి, తెలుగువి, ఇంగ్లీషువి—వున్నాయి (ఈ డిక్షనరీ నోట్సులోని రెండు జాబుల్ని ప్రస్తుత గ్రంథంలో యిచ్చాను కూడా.) అట్లాగే జూలూరి అప్పయ్య వసుచరిత్ర వ్యాఖ్యాన ప్రతిలో దాని ప్రింటింగ్ యెస్టిమేషన్‌కు సంబంధించి ప్రెస్‌వాళ్ల జాబువొకటి కుట్టిపెట్టాడు బ్రౌన్. ఇట్లా యెన్నని చెప్పుకోవడం?

ఏమైనా వొకటిమాత్రం నిజం. ని. వెం. రావు పని గట్టుకొని సంఖ్య తగ్గించి చెప్తున్నట్లు 'పది సంపుటాలు' మాత్రం కాదు. బ్రౌన్ తన డిక్షనరీలో—పది సంపుటాల జాబులను కాలేజి లైబ్రరీకి బహూకరించినట్లు వ్రాసుకున్న వాక్యాన్నే వేదంగా భావించి యీ తప్పుడు లెక్కను సృష్టించాడు యీ పరిశోధన పరమేశ్వరుడు. పైగా ఆ బ్రౌన్ వ్రాతను బంగోరె చూడలేదని వొక బుకాయింపు. ఈ డిక్షనరీ అచ్చయింది 1852లో. ఆయన ఇండియా వదిలి వెళ్లిపోయింది 1855లో. ఈ మధ్యకాలంలో ఆ మిగతా సంపుటాలను యిచ్చి పోయాడని యెందుకు అనుకోలేకపోయాడు? ఒక లైబ్రరీలో వున్నది యెన్ని సంపుటాలో తెల్సుకోడానికి మార్గం వాటిని ప్రత్యక్షంగా చూచి లెక్కతీయడమే గానీ పరోక్ష పద్ధతివల్ల ప్రయోజనం యేమిటి? ఈ గొడవలేమీ పట్టించుకోకుండానే యేదో వొక గాలిలెక్క యిచ్చి రభస చేయడం మూర్ఖవిమర్శే అవుతుంది.

మరొక పచ్చి అబద్ధం

ఇక యీ కళాప్రపూర్ణుడు మరొక పచ్చి అబద్ధం ఆడుతున్నాడు. "వీటి ప్రాధాన్యం గుర్తించి యీ జాబుల్లో 16 సంపుటాలను మాత్రం ఆం. ప్ర. సా. అకాడమీ కాపీ చేయించి భద్రపర్చుకొని వుంది—" అని నేనంటే, "ఇది శుద్ధముగా అసంబద్ధము...అకాడమీవారు కాపీ చేయించినవి మెకంజీ సంపుటములు గాని బ్రౌన్ జాబులు కానే కావు—" అని కావు కావు మంటూ మొండిగోల చేస్తున్నాడు. పైగా యీ కాపీ కర్మకాండకు పర్యవేక్షకుడు తానే అయినట్లు, 10 వేల రూపాయల ఖర్చు పెచ్చం పుచ్చుకొన్నట్లు సగర్వంగా చెప్పుకొన్నాడు కూడా. ఈ మహానుభావుడు యే పేరుమీద యేమి కాపీచేసి పంపాడో కానీ అకాడమీలో మాత్రం బ్రౌన్ జాబుల కాపీలు ఖరీదైన తోలుబైండ్ చేయబడి నేటికీ భద్రంగా వున్నాయి. కావల్సినవారు ఆ సంస్థ కార్యదర్శి దేవులపల్లి రామానుజరావుగారు కూర్చొనే కుర్చీకి కుడిపక్కన అద్దాల బీరువాల్లోని కింది అరల్లో చూచుకోవచ్చు

తేడా తెలియని తప్పుడు వ్రాతలు

బ్రౌన్ జాబులకు, మెకంజీ సంపుటాలకు మధ్యగల తేడా తెలియక నేను 'బట్టతలకు మోకాటికి ముడిపెట్టా'నని వ్రాశాడు. ఆ తెలియని ముళ్లు పెట్టింది 'విద్యారత్న'దే కాని నేను కాదని మనవి. మెకంజీ సంపుటాల కాపీ కార్యక్రమం పేరుతో బ్రౌన్ జాబుల సంపుటాలను కూడా కలిపి కాపీ చేయించి పంపి, పచ్చి అబద్ధమాడే యీ 'సాహిత్య దొంగవ్యాపారి'కి వాటి తేడా తెలిసిందనడం సాహసమే అవుతుంది.

మెకంజీ 'సాహిత్య సేవ' ఈయనకేం తెల్సు ?

మెకంజీ ప్రస్తావన తెచ్చాడు గనుక వొకమాట. 1976 మార్చి 'భారతి'లో యీ ప్రపూర్ణుడు వొక సమీక్షా వ్యాసంలో "మెకంజీ చేసిన సేవ చరిత్రకే గానీ సాహిత్యమునకు కాదు" అని కంఠోక్తిగా వ్రాశాడు. అటు చరిత్రగానీ, యిటు సాహిత్యంగానీ తెలియదని రుజువు చేసుకొన్నాడు. ఉన్న విషయం చెప్పాలంటే తెలుగు కావ్యాలను, ఆ మాటకొస్తే దక్కన్ కావ్యాలను యే దీక్షగా సేకరించి భద్రపర్చిన మొదటి వ్యక్తి మెకంజీయే. మహాభారతం దగ్గర్నుంచి రామాభ్యుదయం దాకా యెన్నో సేకరించాడాయన. మన కవుల కాలాదుల్ని గురించి అప్పట్లో యేవరు యేమి చర్చ చేయాలన్నా మెకంజీయే శరణ్యమయ్యేవాడు. 1816లో కాంబెల్ తన తెలుగు గ్రామర్‌లో కృష్ణదేవరాయల కాలాన్ని గురిం

చిన చర్చ సందర్భంలో మెకంజీ వివరణ సహాయం గూర్చి ప్రత్యేకంగా పేర్కొన్నాడు. ఆ తర్వాత వచ్చిన బ్రౌన్ కూడా యీ మెకంజీ సంచయంలోనుంచే బోలెడంత వూపిరి పీల్చుకోవల్సి వచ్చింది కదా.

మెకంజీ 'దుమ్ము-పురుగులు'

ఇక **'Transcribed out of Mackenzie Mss'** — అని బ్రౌన్ డిక్షనరీ పీఠికలో వున్నమాటను పట్టుకొని వొక విపరీతార్థం లాగాడు **చూడండి**: "వానినుండి బ్రౌన్ వ్రాయించునాటికి అవి శిథిలమై దుమ్ముకొట్టుకొని పోలేదని చక్కగా నున్నవని" దాని అర్థమట. దుమ్ము లేనట్లు చూచినట్లుగా చెప్తున్నాడు. చక్కగా నిక్షేపంలా వున్నవైతే బ్రౌన్ వాటిని మళ్లీ అంత ఖర్చుపెట్టి యెత్తి వ్రాయించవల్సిన అవసరం యేమివచ్చింది? ఇంతకూ తనకు కను తగిరిన వాక్యమొక్కటే వేదవాక్యమనుకుంటే యెట్లా? ఇదే బ్రౌన్ దొర యిదే మెకంజీ సంపుటాల స్థితిగతులను గురించి పెక్కు చోట్ల యేమి వ్రాసున్నాడో సదరు నిడుదవోలు వెంకటరావుకు బొత్తిగా తెల్సినట్లే లేదు. ఉదాహరణకు పరికించండి :

నేను **చూడ**లేదని ని. వెం. రావు చెప్పే గ్రాణ్యంలో వొక భాగమైన 'మిశ్ర భాషా నిఘంటు' పీఠికలో బ్రౌన్ యేమన్నాడో **చూడ**మంటున్నాను :

"The local Records (transcribed under my orders, and at my expense) ... ...I bestowed on the Library of the Madras College : wherein are also lodged the orginal records, collected by Mackenzie. Many of his volumes are perishing : being written with English ink (which soon fades) on country paper which the worms repidly destory. But the copies made under my directions, and at my cost, are written on English paper with country ink : which being made with lamp black dces not fade."

పురుగులు తినిపోతున్న మెకంజీ సంపుటాలను తాను చదవడంలో పడ్డ యిబ్బందులనుగూర్చి బ్రౌన్ తన స్వీయచరిత్ర (వ్రాత ప్రతి, 1854) **లో** ఇట్లా హాస్య గంభీరంగాకూడా వ్రాశాడు :

"The book-worm first attacks the oldest and driest books, in their hardest parts. And being a book-worm I never take cordially to any pursuit unless it is hard, dry and tasteless. At last by a patient perusal of some volumes I began to perceive paths through the wilderness."

ఇంకా కావాలంటే, మరొకచోట కూడా యిట్లా వ్రాసుకున్నాడు బ్రౌన్.

"The Historical records collected by Mackenzie are chiefly written on flimsy country paper, which the worms are rapidly destroying; ... ... this fades rapidly, and the [writing in many places is nearly illegible. I therefore caused copies to be made on English paper with country ink."

(Carnatic Chronology, C. P. Brown, London, 1863)

ఇంతకూ అసలు పుస్తకాన్ని వదిలి యిట్లా పక్కదారిలో బడి మూర్ఖ విమర్శకు దిగడం ఆయనకు రివాజు. ఆ అధ్యాయంలో అన్ని పేజీలు దండుగ, యీ అధ్యాయంలో 3 పేజీల్లో చెప్పతగింది 8 పేజీలైందనీ, అదనీ యిదనీ అసలు అధ్యాయాల గురించి 'కట్టె కొట్టె తెచ్చె ధోరణిలో' తేల్చి వేశాడు. ఆయన సమీక్ష మాత్రం పదిపేజీల బారున వుండాలి కాబోలు !

బ్రౌన్ మహాభారత ముద్రణలు

నా గ్రంథంలోని 'మహాభారత సంశోధిత ముద్రణకు అంకురార్పణ చేసింది బ్రౌనే' అనే అధ్యాయం గూర్చి ని. వెం. రావు చేసిన తీర్పు **చూడండి**: "తొలి సారిగా మహా భారత ముద్రణకే గాక, సంశోధిత ముద్రణకు బ్రౌను ప్రారంభకుడని యీ శీర్షిక తెలుపు చున్నది. ఉస్మానియా విశ్వవిద్యాలయంవారు బ్రౌను సంశోధిత ప్రతిని నుపయోగించినారు. 3 పుటలలో చెప్ప తగినది (యీ అధ్యాయం) 8 పుటలైనది" అని మూడు వాక్యాల్లో తేల్చి వేశాడు.

ఉస్మానియా సంశోధిత ప్రతిలోని ఘోరమైన అవకతవకల్ని గూర్చి నా వాదనను 1973 లోనే 'బ్రౌన్ జాబులు ... ' అనే గ్రంథంలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పాను. ఇప్పుడీ పుస్తకంలో నేను చెప్పిన ప్రధానమైన విషయమల్లా — మహాభారత పద్యాలకు ౧ం ప్రథమంగా 1829 లోనే ముద్రణ భాగ్యం కల్పించిన బ్రౌన్ పాఠాలలో యే వొక్కదాన్నీ ఆ ఉస్మానియా సంశోధిత ప్రతి స్వాములు గుర్తించలేదనీ, బ్రౌన్ వేటినైతే శుద్ధ పాఠాలుగా స్వీకరించాడో వాటిని కనీసం పాఠభేదాలుగానైనా వీరు **చూప**లేక పోయారనీ, సాక్ష్యాధారాలతోసహా బయట పెట్టాను. ఉదాహరణకు సభా పర్వంలోని 'యిమ్ముగ ధర్మజుతో జూద మ్మాడగ వలయు' అనే పద్యాన్ని వుటంకించి, బ్రౌన్ సంశోధిత ముద్రణ విషయంలో అనుసరించిన ప్రతిభావంతమైన శాస్త్రీయ పంథాను **చూపుతూ** ఉస్మానియా సంశోధకుల బండారాన్ని విస్పష్టంగానే బయట పెట్టాను (చూ. పేజి 35) నిజానికి 18 పుటలలో చెప్పవలసిన విషయాలను 8 పేజీలలోనే కుదించి చెప్పానని పాఠకులకు నివేదించుకొంటున్నాను. ఇట్లా అడుగడుగునా న్యాయంగా బంగారేకి 'క్రెడిట్' యివ్వవల్సిన ఘట్టాలను తొక్కిపెట్టి వక్రీకరించి పాఠకులను తప్పదారి పట్టించడం సంస్కారమున్న విమర్శకుని లక్షణమేనా ? ఇటువంటి 'సాహిత్య నీచులను' యేమనాలి ?

వేమనపద్యాలు : బ్రౌన్ తంటాలు

'వేమన పద్యాల పరిష్కరణకు బ్రౌన్ పడ్డ తంటాలు' అనే అధ్యాయం గురించి కూడా యింతే. క్యాటలాగుల్ని పట్టుకొని వేమన పద్యాల యెంగిలి లెక్కలు యిచ్చుకుంటూ యిటువంటి అంగలార్పు మాటల్నే వ్రాశాడు. క్యాటలాగ్‌లనుదాటి అనంతకోటి పాఠభేదాలతో అక్షర సామ్రాజ్యంలా కనపడే బ్రౌన్ సేకరించిన అసలు వేమన పద్యాల్లోకి ప్రవేశిస్తేనేగానీ అసలు సమస్యలు సాక్షాత్కారం కావని ఆధారాలతో సహా చూపుతూ, బ్రౌన్‌కంటే నూరేళ్ళ క్రితమే 'ఫాదర్ లెగాక్' అనే ఫ్రెంచి మిషనరీ అనంతపురం ప్రాంతంనుంచి సేకరించి ఫ్రాన్సులోని కింగ్స్ లైబ్రరీకి 1731 జూలై 30వ తేదీన పంపిన వేమన పద్య ప్రతి మైనాన్ని తొలిసారిగా తెలుగు పాఠకుల దృష్టికి నేను తెచ్చిన దానిలో నూతన విషయ ప్రతిపాదన లేదంటే, సమీక్షకుడికి అంధత్వం ఆపాదించడం తప్ప కాదనుకుంటాను.

వసుచరిత్ర మొదటి ముద్రణ

వసుచరిత్ర మొదటి ముద్రణ అధ్యాయంలో బంగోరె చెప్పిన "విషయములన్నియు 1954 వావిళ్ళ చతుర్థ ముద్రణ పీఠికలో నే నిచ్చి వున్నాను" అని దబాయిస్తున్నాడు. పాఠకులే రెండింటినీ పోల్చి ఆయనేమి యిచ్చాడో, బంగోరె యేమి యిచ్చాడో చూడమని మనవి. ని. వెం. రావు వంటి వాళ్ళు కలలోకూడా వూహించలేని విషయాలను బంగోరె విగ్గుదేర్చి యివ్వ గలిగాడని పాఠకులకు నేరుగా వినమ్రంగా విన్నవించుకోక తప్పడంలేదు.

బుకాయింపుల రివాజు

అందులో, ఇందులోవున్న అంశాలు నేను యెప్పుడో చెప్పేసి వున్నానని అనడం ఆయనకు రివాజు. ఇట్లాంటి బుకాయింపులతోనే ఆయన బ్రతుకుతున్నాడు. లోగడ పేర్కొన్న 'భారతి' (1976 మార్చి) వ్యాసంలో "కావలి సోదరులను గురించిన సంపూర్ణ వివరములున్న వ్యాసమును" 1962లోనే ఆయన వ్రాసి వున్నట్లు బుకాయించాడు. మెడమీద తలకాయ వున్నవాడెవడూ యింతవరకూ యే పరిశోధన విషయాన్ని గూర్చి కూడా సంపూర్ణంగా వ్రాసి వుండలేదన్న ప్రాథమిక సత్యాన్ని విస్మరించడం ఆయనకే చెల్లును. పరిశోధన అనేది యెప్పుడు కూడా వొకడితోనే ప్రారంభమై అతడితోనే అంతమయ్యేదికాదుగదా. ఇంతకూ అందులో ఆయన సంపూర్ణ వివరాలు కాదుగదా ప్రాథమికమైన వివరాలైనా యివ్వలేదన్న సంగతి చెప్పవలసిన పన్లేదు. కనీసం కావలి సోదరులు ముద్రించిన గ్రంథాల వ్యాసాల వివరమైనా సమగ్రంగా కాదుగదా యిచ్చినంత వరకైనా సక్రమంగా లేదన్న గుర్తింపు ఆయనకు లేకపోవడం శోచనీయం.

బ్రౌన్ నిఘంటువు

'తెలుగు నిఘంటు శాస్త్ర పారంగతుడుగా బ్రౌన్' అనే 34 పేజీల అధ్యాయంలో నేను చెప్పిన విషయాలను "5–6 పుటలలో వివరించి" వుంటే సరిపోతుందని వ్రాకుచ్చాడు ని. వెం. రావు. "బ్రౌన్ నిఘంటువును సూర్యరాయాంధ్ర నిఘంటు నిర్మాతలే ప్రామాణికముగా గ్రహించి నపుడిన్ని పుటలు దానిని గురించి వ్రాయ నావశ్యకత లేదు"—అని వొక తోక తగిలించాడు, ఆ సూ. ని. నిర్మాతలు పెద్ద ప్రామాణికులైనట్లు. ఎవరండీ ఆ సూ. ని. స్వాములు? వాళ్లకేమైనా కొమ్ములు వచ్చాయా? బ్రౌణ్యాన్ని వారు యేపాటి ప్రామాణికంగా గ్రహించారో మరి? అంత ప్రామాణికంగా గ్రహించా రన్నప్పుడు అన్ని కూటకరణాలు యెందుకు చేశారు ఆ సూ. ని. నిర్మాతలు? ఇంతగా యితగాడు సొమ్మసిలిపోయే ఆ సూ. ని.ని గురించి యీ గ్రంథంలో నేనేమి వ్రాసున్నానో చూడలేదా? చూడదల్చుకోలేదా? "డజన్లకొద్దీ పండితులు పోగై, సంవత్సరాల తరబడి కాలం ఖర్చుచేసి ఎట్లాగో వెలువరించామనిపించిన సూ. ని. సంపుటాలు సైతం అర్థ నిర్ణయంలో బ్రౌణ్యం ముందర వెలవెలపోతాయి" అని నేను వ్రాసిన మాటను పట్టించుకో దల్చుకో లేదన్నమాట. ఎందుకూ యీ దాటవేసే పద్ధతులు?

బ్రౌన్ నిఘంటువుల విషయమై ప్రాథమికమైనవే అయినా యింతవరకూ తెలుగు పండితుల దృష్టికి రాని కొన్ని కీలకమైన కొత్త విషయాలు ఆంధ్రపాఠకులముందుకు తెచ్చింది బంగోరేయే నని, విషయమొచ్చింది గనుక వినమ్రంగా చెప్పకోవడంలో తప్ప లేదనుకొంటాను.

విష్ణ్వాంధ్రం-శివాంధ్రం : చమత్కారం

ఇక విష్ణ్వాంధ్రం—శివాంధ్రం నిఘంటువులను గురించికూడా అనవసరమైన చర్చకు లంఘించుకొన్నాడు: "ఈ నిఘంటువులనగా నెట్టివి? ఆ పేరులతో నింతవరకు నిఘంటువులు తెలియరాలేదు. ఇంతవరకు నెవ్వరును వీని నుదహరింపలేదు. సూ. ని. వారును వీనిని గూర్చి తెలుపలేదు" అని వ్రాశాడు. ఆ పేర్లు ని. వెం. రావుకూ, ఆ బాపతు పండిత జాతికీ తెలియకపోతే అది వారి అజ్ఞానాన్ని వెల్లడిస్తుందిగానీ, తప్పు నాది కాదుగదా.

"బ్రౌన్ చమత్కారముగా ప్రసిద్ధమైన సాంబనిఘంటువుకు శివాంధ్రమనీ, వెంకటేశాంధ్రమునకు విష్ణ్వాంధ్రమనీ పేర్లు పెట్టినాడు. గ్రంథకర్తయు వానినట్లే అనువదించినాడు"— అని తానే వొక వివరణ వూహించుకొన్నాడు.

ఈ చమత్కార వాదన పస లేనిది. ఆ నాడు వాటిని ఆ పేర్లతోనే వ్యవహరించేవారు. అందువల్లనే ఆ నాటి ప్రభుత్వ వుత్తర ప్రత్యుత్తరాల్లోకికూడా ఆ పేర్లే యెక్కాయి. అంతేకానీ బ్రౌన్ చమత్కారంగా పెట్టుకొన్నవనడం కేవలం దురూహ. అయోధ్యాపురం కృష్ణారెడ్డి కడపనుంచి బ్రౌన్‌కు వ్రాసిన లేఖలో

(చూ. పేజి 109) కూడా ఆ పేర్లనే వాడాడు. వాటికి ఆ తర్వాత సాంబ నిఘంటువనీ, మరోకటినీ పేర్లు పెట్టిన అంబ పూజారు లెవరైతే నాకేమికానీ, నేనూ ఆ 'ఒరిజినల్' పేర్లనే వుపయోగించాను. లేదు, బ్రౌన్ చమత్కారంగా వాడాడని అంటే, నేనూ డబుల్ చమత్కారంకోసమే నాడా నంటున్నాను— వాటి తర్వాతనే 'ఇత్యాదయః' అని కూడా వ్రాసున్నాను కాబట్టి. ఇందులో ని. వెం. రావు అబ్బ సొమ్మేం పోయిందో మరి!

ఇండెక్స్ : పరిజ్ఞానం

అట్లాగే, ఇండెక్స్‌లో—వ్యక్తుల, స్థలాల పేర్లు మాత్రమే యిస్తున్నాననీ, పుస్తకాలు తదితరాల పేర్లు గ్రంథ విస్తరణ భీతి చేత చేర్చలేదనీ బంగోరె స్పష్టంగా వ్రాసున్నప్పుడు, దానికి 'నామ సూచి' అని పేరు పెట్టినప్పుడు—చేర్చక పోవడానికి కారణం అది కాదు, తెలుగు కావ్యాల పరిజ్ఞానం లేనందువల్లనే చేర్చలేదని లేనిపోని 'మోటివ్స్' ను బంగోరెకు ఆపాదించడం విమర్శలో మూర్ఖపద్ధతే అవుతుంది. నేను ఇండెక్స్ ఆమాత్రమైనాయిచ్చాను. ఈ పరిశోధన పరమేశ్వర బిరుదాంకితుడు లోగడ మద్రాసు యూనివర్సిటీ తరఫునా, ఆ తర్వాతా ప్రకటించి దేశం మీద వదలిన యే పుస్తకంలోనూ అసలు ఇండెక్స్ అనేది లేదేమి? దీన్ని బట్టి యీాయన వాదం ప్రకారమే యీ సదరు పరిశోధన పరమేశ్వరుడికి యెందులోనూ పరిజ్ఞానం లేదనేనా ఆయన చెప్పకోదల్చుకొన్నది.

బంగోరె తప్పులు

ఇక 'బంగోరె' తప్పులంటారా? ఉన్నవి. లేకేమి? ని. వెం. రావు యెత్తి చూపినట్లు 'సరస్వతి' పత్రిక (1923–24) విషయంలో బంగోరె బిబ్లియాగ్రఫీ పేజీల్లో యిచ్చింది వాస్తవ విరుద్ధమే గనుక తప్పగా వొప్పుకుంటున్నాను. అయితే వొక మినహాయింపు. లోగడ నేను ప్రకటించిన "బ్రౌన్ జాబులు..." గ్రంథం (1973)లో 'సరస్వతి' పత్రిక (ముక్త్యాల) 1923–24 అని కరెక్టుగానే వ్రాశాను. ఇందులో మాత్రం రాజమండ్రి అని తప్పు దొర్లింది. 'ప్రమాదోధీమతామపి' అని కదా మన పండితులు చెపుతుంటారు. ని. వెం. రావు చూపినవాటిల్లో నా తప్పగా దీన్ని వొక్కదాన్నే వప్పుకొంటున్నాను.

కావ్యాల పట్టీయేనా చరిత్ర ?

ఇక సాహిత్య చరిత్ర అంటే యేదో కావ్యాల పట్టీ, వాటి ముద్రణల జాబితా యిచ్చి కూర్చోవడమనే దుర్భ్రమలో వున్నాడు ని. వెం. రావు. సాహిత్య చరిత్రకానీ, మరో చరిత్రకానీ వివిధ దశల్లోని సామాజిక శక్తుల ప్రభావాల్లో, సంఘర్షణల్లో వుద్భవించేదే నన్న ఆధునికమైన అవగాహనతోనే యీ గ్రంథానికి "బ్రౌన్ లేఖలు: ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర శకలాలు" అనే పేరు పెట్టడం జరిగింది. 'చరిత్ర'పట్ల యీ అవగాహన ఆయనలో లేక పోవడానికి బాధ్యుణ్ణి నేను మాత్రంకాదు.

ఈయన తరచు వల్లించే దిక్కుమాలిన శుష్కమైన క్యాటలాగ్ పాండిత్యాన్ని బంగోరె ప్రదర్శించుకోలేదని కాబోలు 'గ్రంథకర్త ఆంధ్రసాహిత్య చారిత్రక పరిజ్ఞానమును శంకింపవలసి వస్తున్నది'— అని అన్నాడు.

ఆధునికాంధ్రసాహిత్య చరిత్ర : నా అవగాహన

ఆధునికాంధ్ర సాహిత్య చరిత్ర మూలాలుపట్ల నాకు గల పై అవగాహనతోనే, నే నెన్నుకొన్న యితివృత్తాన్ని అనుసరించి యీ గ్రంథాన్ని యెందుకట్లా ప్రారంభించానో, కొన్ని విషయాలను గ్రంథాంతంలోకి యెందుకు తీసుకుపోయానో నా 'ముందుమాటల్లో' వివరించే వున్నాను. వివాద గ్రస్తమైన విషయాలని తెల్సికూడా తెలుగు పాఠకుల్లో కొత్త ఆలోచనలను రేకెత్తించాలనే వుద్దేశంతోనే అట్లా వ్రాశానని చెప్పకొన్నాను. విషయం వచ్చింది గనుక మక్కీసరిగా 'కోట్' చేస్తున్నాను.

"ఈ పుస్తకాన్ని...యీ అధ్యాయంతో ప్రారంభించడంలో కూడా వొకకారణం లేక పోలేదు. మన సాహిత్య సాంస్కృతిక పునరుజ్జీవనం (రెనైజాన్స్) పందొమ్మిదో శతాబ్దిలోనుంచి ప్రారంభమైనట్లు స్థూలంగా చెప్పకొంటున్నాం. ఆ రెనైజాన్స్ ఏ వీరేశలింగంతోనో, గురజాడతోనో లేదా వెనక్కు వెళ్ళి ఏ చిన్నయసూరి తోనో ప్రారంభమైనట్లు చెప్పకొంటున్నాం. అయితే ఏ చారిత్రక శక్తుల ఆసరాతో ఆధారంతో ఈ ఆధునికత ఆవిర్భవించిందో, మన చరిత్రకారులు ఇంకా సరిగా అంచనా కట్టలేదనే నా విశ్వాసం. తెలుగు రెనైజాన్స్‌కు నిజమైన జన్మకాలాన్నీ, జన్మ స్థానాన్నీ, దాని స్వరూపస్వభావాలనూ అర్థంచేసుకోవాలంటే ఇంకా ముందుకు వెళ్ళి చూడాలని నా మతం. ఈ తెలుగు రెనైజాన్స్ పుట్టుకలో ఒక కీలకమైన ఘట్టాన్ని మనం యింతవరకూ దాటవేస్తూనే వస్తున్నాం. మన తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవనానికి...ఎంత వరకు దోహదం చేసిందన్న విషయాన్ని మరింత లోతుకు వెళ్ళి చరిత్రాధారాలతో పరిశీలించాలన్న అవసరాన్ని నొక్కి చెప్పడానికే ఈ గ్రంధాన్ని ఈ అధ్యాయంతోనే ప్రారంభించాల్సి వచ్చింది. అంతే కాదు. తెలుగు సాహిత్య రంగంలో బ్రౌన్ చేసిన మార్గదర్శకమైన కృషిని గురించి, తెలుగుభాషనూ సాహిత్యాన్నీ ఆధునికీకరణం చేయడంలో ఆయన నిర్వహించిన భూమికను ఈ దృష్ట్యా అవగాహనకు తెచ్చుకోవాలనే ఆశయంతోనే ఇట్లా ఆరంభించాల్సి వచ్చింది.'— అని నా రచనా ప్రణాళికను గూర్చి చెప్పకునే వున్నాను. ఈ విషయాన్ని పట్టించుకోకుండానే, ప్రస్తావించకుండానే నా గ్రంథ రచనా ప్రణాళికపై యీాయన మరేదో శుష్కప్రణాళికను బోర్లించ బూనడం యేమి సబబో పాఠకులే గమనించ గలరు.

ముద్దాయిగా ని. వెం. రావు

ఇక ని. వెం. రావు ప్రత్యేకంగా సంజాయిషీ చెప్పుకోవల్సిన ఘట్టాలు యీ పుస్తకంలో కొన్ని వున్నాయి; ఉదాహరణకు — చిన్నయ సూరికి సీమనుంచి తెప్పించిన బంగారు కడియ బహూకరణం, సూరి 'సుజన రంజని' పత్రిక సంపాదకత్వం వొట్టి గ్యాస్ అన్నాను. (కడకు యీ ని. వెం. రావు అచ్చువేసిన చి. సూ. బొమ్మ సైతం బోగస్‌దని యిటీవలనే వొక పత్రికలో ఆయన్ను ముద్దాయిగా కూర్చోబెట్టి వున్నాను. ఇంతవరకూ సంజాయిషీ యివ్వలేదాయన. అది వేరే విషయమనుకోండి.) అట్లాగే రావిపాటి గురుమూర్తి శాస్త్రి కాలం గురించి మన వాళ్ళు చెప్తూ వస్తున్న చిలకపలుకులనుగురించి, శ. ర. నిఘంటు ముద్రణల విషయంలో దాని లేటెస్ట్ పరిష్కర్తగా యీ ని. వెం. రావు దాటవేసిన వొక కీలకమైన విషయంగురించీ కొన్ని ప్రశ్నలను నేరుగా లేవదీశాను యీ 'బ్రౌన్ లేఖలు' గ్రంథంలో. ఈ తప్పుడు విషయాలను ప్రచారంలోకి తేవడంలో ని. వెం. రావు పాత్ర విశేషంగానే వుంది. వీటిలో దేనికీ ఆయన సమాధానం గాకపోయినా, కనీసం వాటి ప్రస్తావనైనా చేయకుండానే పూర్తిగా దాటవేసి తన సమీక్షా రథాన్ని అడ్డదారి మళ్ళించడం ఆ 'సాహిత్య ధీరుడి' కే సరి.

ఇటువంటి అడ్డుధోరణిలో సాగినదే సమీక్ష అయితే — ఒక తెలుగు పుస్తకాన్ని యెట్లా రివ్యూ చేయాలో యోగ్యతున్న వ్యక్తి నా యెరుకలో యెవడూ లేడు—అని షుమారు 70 యేళ్ళక్రితమే చెప్పిపోయిన గురజాడలో యెంత ముందుచూపు వుందా అని పిస్తుంది.

ఈ గ్రంథం "బ్రౌన్ చేసిన అసామాన్య సాహిత్యసేవను యెట్లు వెల్లడించినదో విశ్వవిద్యాలయమువారే తెలుపుదురు గాక—" అని ముగించాడు ని. వెం. రావు.

ఇట్లాంటి అవక తవక వ్రాతలతో, అక్కసు వెళ్ళబోసుకునే పాక్షిక విమర్శలతో బ్రతుకుతూ, వొకప్పుడు విశ్వవిద్యాలయాలను పావనం చేసిన యీ ప్రబుద్ధుడికిగల 'పరిశోధన పరమేశ్వర, విద్యారత్న, కళాప్రపూర్ణా'ది బిరుదులకు అర్థాలేమిటో ఆంధ్రపాఠకులే తేల్చుకొందురుగాక—అని ముగిస్తున్నాను.

సమాధానం చెప్తారా?

ఈ వ్యాసంలో నేను చెప్పిన పలు విషయాల్లో తప్పులేమైనా వుంటే ని. వెం. రావు నిర్మొగమాటంగా సూచించవచ్చు. విమర్శలో వ్యక్తిగత వైరాలకన్నా సత్యప్రతిపాదనేకదా ముఖ్యం.

[షరా : శ్రీ నిడుదవోలు వెంకటరావుగారంటే నాకు వ్యక్తిగత వైరమేమిలేదు. వీరు పొందవల్సిన గౌరవం పొందదగిన సందర్భాల్లో నా నుంచి పొందే వున్నారు. దయచేసి చూడండి: 'మొట్టమొదటి కన్యాశుల్కం'లో బంగోరె ముందుమాటలు—'నిడుదవోలు వెంకటరావుగారికి వొక నివాళి, వొక కృతజ్ఞత'—పేజీలు 57–9]

—బంగోరె

బంగోరె నా సమాధానం కోరుతూ వ్రాసినది చదవగా విన్నాను. దానిని నాకు పంపమని కోరిన బంగోరెకి, పంపిన మీకూ నా కృతజ్ఞత. విషయ ప్రధానంగా నాలుగు మాటలు వరుసగా డిక్టేటు చేశాను. దయచేసి వారి సమాధానంతోపాటు వీలుంటే ప్రచురించవలసినదిగా కోరుతున్నాను.

1. 'బ్రౌన్' శబ్దంలో హలంతం ఆధునిక భాషాశాస్త్రవేత్తలకీ, ఆధునిక ప్రామాణిక భాషకూ సమ్మతం. తెలుగుకి అజంతం సహజం.

2. బ్రౌను లేఖల లెక్క నేనడగలేదు. తనవి 10 సంపుటాలని బ్రౌనే రాశాడు. బ్రౌను జాబుల్లో సమాధానకర్త 16 అన్నాడు. నేడు బ్రౌను లేఖలు ప్రచురిస్తూ 20 అంటున్నాడు. ఎందుకిలా రాయడం? బ్రౌను పరిశోధకుడుగా బ్రౌను డిక్షనరీ చూసి ఉంటే 10, 16, 20 సంఖ్యల్లో ఏదో నిర్ణయం అయ్యేది. అదీ కాలేదు. లేఖల లెక్కకూడా నిర్ణయం చేయటం కష్టమని అంటున్నారు. ఇంకేం చెప్పమంటారు.

3. బ్రౌను జాబుల్లో 16 సంపుటాలు ఆం. ప్ర. సా. అకాడమీ కాపీ చేయించిందని, దానికి 4–5 వేల రూపాయలు ఖర్చు అయిందని స. క నిజం తెలుసుకోకుండా రాస్తే నేను వాస్తవ విషయాన్ని కప్పిపుచ్చకుండా తెల్పాను.

4. మెకంజీ సాహిత్యంకంటె దేశచరిత్రకు కావలసిన సాధన సామగ్రిని సమకూర్చాడు. అట్లాగే బ్రౌను దేశచరిత్రకంటె సాహిత్యాభివృద్ధికి తోడ్పడ్డాడు.

5. 'వందలాది లోకల్ రికార్డు వాల్యూములు స. క. అంటే బ్రౌనే 48 సంపుటాలని అంటున్నాడని రాశాను.

6. సంశోధిత మహాభారత ముద్రణపై వ్యాసాన్ని కుదిస్తే బాగుంటుందన్నాను. వారేదో రాసుకోవాలని పెంచుకొన్నారు పేజీలు.

7. వేమన పద్యసంఖ్య విషయం నేనడిగితే ఆయన అది తేల్చక మరేదో రాసుకొన్నాడు.

8. నా వసుచరిత్ర పీఠికలో వఠ్యంవారి గొడవలేదు. ఆ నాటికి నాకు తెలిసిన విషయాలు అన్నీ ఉన్నాయి.

9, కావలి వారినిగూర్చి కూడా అంతే.

10. సూ. ని. విషయం కూడా 5–6 పుటల్లో కుదిస్తేచాలు—సరిపోయేది అన్నాను. అంతే సూ. ని. పండితుల విషయం, వారిపై రిమార్కులు స. క. సృష్టించినవే.

11. విష్ణ్వాంధ్రం విషయంలో స. కర్తే చెప్పారు.

12. మద్రాసు విశ్వవిద్యాలయం తరఫున ఆ తర్వాతా దేశంమీద వదలిన ఏ పుస్తకంలోను ఇండెక్సు లేదన్నారు. దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయం ద్వితీయ ముద్రణకు ఇండెక్సు ఉందే. మరి స. క. చూశారో లేదో!

13. బంగోరె తప్పులు ఒప్పుకొన్నందుకు సంతోషం.

14, 15, ఎవరి అభిప్రాయాలు వారివి.

16. చిన్నయసూరి విషయంలో నా కందిన వివరాలను అందించాను. చిన్నయసూరి చిత్రం ఊహించి వేసిందే. నన్ను 'ముద్దాయి'గా 'బోను'లోకి ఎక్కించారు. తోచినవి చెప్పాను. వ్యక్తిగత కోణంనుండి దీన్ని వ్రాయలేదంటూ, వ్యక్తిగత వైరాలకన్నా సత్యప్రతిపాదనేకదా ముఖ్యం అంటూ వారు వ్రాసిన సమాధానంలో సత్యం ఎంతమట్టుకు ఉందో సాహితీ బంధువర్గం తేలుస్తుంది.

శ్రీ వేంకటరావు

1977 జనవరినెల 'భారతి'లో శ్రీ పి. వి. కృష్ణమాచార్యులుగారి "ఒక సందేహము" నందలి విషయమును — దానికి సమాధానముగా 1977 ఏప్రియలు నెల 'భారతి'లో శ్రీ వంతరాం రామకృష్ణారావుగారు వ్రాసిన విషయమును పరిశీలించిన పిమ్మట నా అభిప్రాయమును కూడ పత్రికాముఖమున ప్రకటించుట అవసరమని భావించి ఈ లేఖ వ్రాయుచున్నాను.

చింతామణి నన్నపార్య విరచితమనియే ఆచార్యులవారు విశ్వసించి దేశ్యపదములలో హ కారముపై తమకు కలిగిన సందేహమును తీర్చవలసినదిగా పండితలోకమును కోరినారు. కాని శ్రీ రావుగారి సమాధానము మాత్రమే చదివినవారికి ఆచార్యులవారు చింతామణి కర్తృత్వమునుకూడ శంకించినట్లు అనుమానము కల్గును. అది విచార్యము.

నన్నయగారు తమ చింతామణిలో తత్సమ తద్భవ దేశ్య గ్రామ్యములను ప్రత్యేకముగా "తజ్జా సమాచ దేశ్యాచ గ్రామ్యాచేయం చతుర్విధా భవతి" అని నాలుగు విధములుగా పేర్కొనిరి. వానిలో దేశ్యములకు చేసిన వర్ణ పరిగణనలో 'హ' కారము కూడ చేరుటలోని—ఔచిత్యమును గూర్చి ఆచార్యులవారు సందేహము వెలిబుచ్చినారు. వారి సందేహము తప్పక పండితలోకము ఆలోచించదగినది. సాహిత్యవేత్తలు, భాషా పరిశోధకులు, లాక్షణికులు ఆ వైపు దృష్టి మళ్ళించదగిన అంశమది. శ్రీ రామకృష్ణారావుగారు ఇచ్చిన సమాధానమునుగురించి కొంత యోచించుదము. నన్నయ కాలమునాటికి హ కార ఘటితములైన అచ్చ తెలుగు పదములు గలవని పేర్కొనుచు శ్రీ రావుగారు అందులకు నన్నయ భారతము నందలి ఓహో తక్షక (ఆది–2–234) ఓహో చాలు (అరణ్య–3–344) హనుమ కనుజుండనియెన్ (అరణ్య–3–345) అనెడి ప్రయోగముల నుదాహరించినారు. పై ప్రయోగములలో ఓహో—హనుమ—అను రెండు పదములను గురించి వారు ప్రస్తావించినారు. కాని ఓహో అను పదము సుఖాద్యతిశయద్యోతకమైన ధ్వని సంకేతము. హో అనునది ఆమ్రేడితమై తెలుగు జాతీయత ననుసరించి మొదటి అక్షరములో అచ్చు మాత్రమే మిగిలి ఒహో అగునని భాషా శాస్త్రానుసార మూహింపవచ్చును. రెండవ హల్లు కూడ తొలగినచో నామరూపాధికే భంగము వాటిల్లును కనుక ఓహో అనియే నిలచినది. అట్లే హో అనునదికూడ ఆ హో అనియు — ఆ హో అనియు రూపములతో నిలిచినట్లు తెలియుచున్నది. ఇక హనుమ శబ్దమును గూర్చి వివరించుచు హనుమాన్ — సంస్కృతము హనుమా ప్రాకృతము—హనుమ ప్రాకృత సమము—ప్రాకృత సమమన్నను ప్రాకృత భవమన్నను అచ్చ తెనుగే అగును అని రావుగారు పేర్కొనిరి. ఈ అభిప్రాయము బాలవ్యాకరణ సూత్రము ననుసరించి చెప్పబడినట్లు స్పష్టము. కాని ప్రాకృత సమములగు పదములైనను ఆంధ్ర వర్ణ ఘటితములై తెలుగున ప్రవేశించవలసినదే. అనగా అచ్చ తెలుగు వర్ణములకు లోబడియే అవి తెలుగున ప్రవేశించుట కవి పండిత సంప్రదాయము. కనుకనే హ కారము తొలిగిన అనుమ—అనుమంతుడు అను పదములు తద్భవములుగా నిఘంటుకారులచే గుర్తించబడినవి. అనిదం పూర్వముగా తద్భవ లక్షణమును వివరింప బూనిన శ్రీ అడిదము సూరకవి అచ్చతెలుగు వర్ణమాలలో "యరలవల్ సా గూడన్" అనుచు హ కారమును గ్రహింపకుండుట గమనార్హము. అందులకు తగినట్లుగా ఆయన చెప్పిన తద్భవ ప్రక్రియలో హ కారమును తొలగించుటయే కనిపించుచున్నది. శ్రీ వజ్ఝలవారును తమ వైయాకరణ పారిజాతమున అడిదము సూరకవి పద్యములను వ్యాఖ్యానించుచు హనుమ అను పదమునకు అనుమ అను పదమును తద్భవముగా చూపినారు. దీనిని బట్టి వారి దృష్టిలో గూడ 'హనుమ' అనునది తద్భవము కాదు. కనుక రావుగారిచ్చిన రెండుపదములలో ఓహో అనునది ధ్వని సంకేతము. హనుమ అనునది తద్భవము కాదు. కనుక ఆ రెండు పదములు ఆచార్యులవారి సందేహమును సమాధాన పరచుటకు తోడ్పడవు. చింతామణి సూత్రములో వివరించబడిన హ కారము ప్రక్షిప్తమే అనుటకు అవకాశ మెక్కువగానున్నది. రావుగారు పేర్కొనినట్లు తమిళ, కన్నడ పదములలో, హ కారము కనిపించదు. కన్నడములో మాత్రము కలదు. తమిళమున హ కారము లేదు. "నారాయణభట్టునకు సహాధ్యాయియగు నన్నయ అచ్చతెలుగు వర్ణ సమామ్నాయమున హ కారము చెప్పియుండుట సంభావ్యమే" అను ఊహ ప్రామాణికము కాజాలదు. మరియు హ కారము తెలుగు వర్ణమాలలో ఉండుట ఉచితమే అయినచో వైకృతపదములలో అది యెందులకు తొలగిపోవుచున్నది? నన్నయ కాలము తరువాత హ కార ఘటితములైన కన్నడ పదములు తెలుగులో ఎన్నియో చేరినను వానికి హ కార రహితములగు రూపాంతరములు వాఙ్మయమున ఎందులకు ఏర్పడినవి? వీనిని బట్టి

ఆలోచించినచో మహా ప్రాణవర్ణమైన హ కారము దేశ్యవర్ణ సమామ్నాయములో చింతామణి సూత్రములో చేర్చబడి యుండుట చర్చనీయాంశమే అగుచున్నది. అది ప్రక్షిప్తమనియే అనిపించు చున్నది. పండితులీ విషయమై పరిశీలింతురుగాక.

శ్రీ దేవి దీక్షితులు

నిడుదవోలువారి విమర్శా పద్ధతి

జూన్ సంచికలో బంగోరె సంశోధిత 'బ్రౌన్ లేఖలు' గురించి శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు చేసిన విమర్శ ఆ పేరుకే తగదు. కవికోకిల దువ్వూరి రామిరెడ్డి రచించిన 'పండిత ప్రతిజ్ఞ' అనే ఖండకావ్యంలో "పాండితి చెత్తగుంట" అనే మాటలు గుర్తు వచ్చేలా, నిడుదవోలువారు గ్రంథనిర్మాణం, పేరు, హలంత అజంత ప్రస్తావన వగైరా వగైరా అంశాలతో తమ రచనను నింపివేసి ఇదే విమర్శనమని అనుకొమ్మన్నట్లుందిగాని, ప్రధానంగా అది రంధ్రాన్వేషణా తత్పరమైనదే. దీనికి కారణం, నిడుదవోలు వారిని వేరొక సందర్భంలో మరొక పత్రికలో (ఆంధ్రజ్యోతి దినపత్రిక) బంగోరె దుయ్యబట్టడమే ననుకోవాలి. 'త్వమ్ శుంఠ' కు జవాబు 'త్వమ్ శుంఠ' మాత్రమే అయితే, విమర్శ తన వస్తువును విడిచి, రచయిత ప్రీత్యప్రీతులనే ఆశ్రయించవలసి వస్తుంది. ఇది దుష్ట సంప్రదాయమని మాత్రమే నేను నివేదింపదలచుకొన్నాను.

బంగోరె గ్రంథం సర్వసమగ్రమనిగానీ, లోపరహితమని గానీ నేననుకోను. అట్లాగే అది భ్రష్ట రచన అనిగానీ, తప్పుల తడిక అనిగానీ మరొకరు అనుకోగూడదు. గ్రంథహృదయ పదార్థం భవ్యమైనదని అనక తప్పదు. తొందరపాటులో దొర్లిన ఒకటి రెండు పెద్ద తప్పులను (ఉదా॥ 'సరస్వతి' పత్రిక విషయం) నిడుదవోలు వారు ఎత్తిచూపడం సరిగానే ఉంది. అయితే, బ్రౌను డిక్షనరీని బంగోరె తెరిచి చూడనేలేదనడం వంటి విసుర్లు వాస్తవ దూరమైనవేగాక, అనాలోచితమైనవి. ఇంతకూ, బంగోరెమీద కన్నెర్రజేసి ఉన్నారు గనకనే నిడుదవోలువారికి తమ అక్కసుతో ఉచితానుచితాలు కూడా తెలియడంలేదని అనుకోవలసి వస్తుంది.

'బ్రౌన్' అని హలంతంగా గాక, 'బ్రౌను' అని అజంతంగా వాడవలెనని నిడుదవోలువారు అనుశాసనం చేస్తున్నారు. దాన్ని పాటించేవారు పాటించవచ్చు. లేనివారు లేదు. వెనకటిలా అన్యభాషా శబ్దాలకు తెలుగులో డుమువులు తగిలించమనలేదు (ఉదా॥ అలక సుందరుడు) నయం! లేఖకు ముందుగాక, దాని తర్వాతనే 'గచ్ఛద్వ్యాఖ్య' ఉండవలెననడం, గ్రంథకర్త స్థానాన్ని విమర్శకుడు తాను దురాక్రమింపడమే. గ్రంథకర్త ప్రణాళిక గ్రంథకర్తది. ఒక లేఖకుగల పూర్వాపరాలను, సందర్భాన్ని, ఉపక్రమణప్రాయంగా చెప్పడం, తర్వాత లేఖను ఉటంకించి, లేఖాగతాంశాలను సమీక్షించడం మంచి పద్ధతి. నిడుదవోలువారే ఈ గ్రంథాన్ని రచించవలసివస్తే మరోవిధంగా, తమకు ఒప్పని తోచినట్లుగా, రచించడానికి ఎవరి అభ్యంతరమూ ఉండదు.

అణుసన్నిభమైన అంశాన్ని అజాండప్రాయంగా—అంటే, అతివిస్తరంగా—చూపి అమూల్యమైన ముద్రణాస్థలాన్ని 'దుర్వ్యయం' చేశారని బంగోరెని విమర్శించిన నిడుదవోలువారు, మూడుముక్కల్లో ఆ గ్రంథాన్ని కొట్టిపారవేసి ఉండవచ్చు. ఆయన రచన సారాంశం, ఇది ఉత్కృష్టమైన గ్రంథంకాదని మాత్రమే గదా! అలాంటప్పుడు, ఒకటి రెండు పుటలలో చెప్పదగిఉన్న ఈ ఖండనకు 'భారతి'వంటి అమూల్య పత్రికలో అన్ని పేజీలను నింపడం నిడుదవోలువారికి ఉచితమా?

'ఆంధ్రసాహిత్య చరిత్ర శకలాలు' అనే ఉపనామధేయాన్ని కూడా వదలక, ఇందులో చరిత్ర ఏమున్నదనే ధోరణిలో 'తుస్కారించడం', నిడుదవోలువారి పూర్వరచనలదృష్ట్యా, పొసగనిమాట. సాహిత్య చరిత్ర అంటే ఒకరాజు,అతని ఆస్థాన కవులు, కావ్యనామం, కవి బిరుదులు, శైలి, ఇత్యాదులే అయితే, బంగోరె రచన సాహిత్య చరిత్ర పేరుకు తగదు. అయితే సాహిత్య చరిత్ర సమాజ చరిత్రలో అంతర్భాగమే ననుకుంటే, బ్రౌనూ అతని ఆశ్రిత పండితులూ చేసిన కృషి, ఆనాటి సామాజిక, సాహిత్యక చరిత్రాంశాలతో నిండిన మేలి రచనగా బంగోరె గ్రంథాన్ని ఎంచవచ్చు. ఎవరి కొలమానాలు వారివి.

గ్రంథసమీక్షలలో, వ్యక్తిగత అభిమాన దురభిమానాలు చొరబారి, విమర్శను ఖండనకు పర్యాయపదం చేసిన రోజులు గతానికి చెందినవి లెమ్మని ఉపేక్షించనీయనివిధంగా, నిడుదవోలు వేంకటరావుగారు ఈ సమీక్షను ఆద్యంతాలుగా సాగించడం విచారకరం. ఈ సంప్రదాయానికి 'భారతి'లో నవోదయం కావడం శోచనీయం.

శ్రీ కె. వి. రమణారెడ్డి

ఫిబ్రవరి 'భారతి'లోని శ్రీ తి. మోహనరావుగారి లేఖపై యేప్రియల్ సంచికలో యిరువురు మిత్రులు విరుచుకు పడటం చూచి కొంపతీసి వీరే ఆ పాఠ్య పుస్తకపు కర్తలేమో ననిపించింది. నూతన పదపరిచయం నిమిత్తమే రెండవ తరగతి పిల్లలకు 'కులాలుడు, రజకుడు' అనే పదాల్ని పరిచయం చేశారా! 5 సం॥ల వయసు గల పిల్లలకు కుండలు చేయువాడు కుమ్మరి అనీ, బట్టలు ఉతికి యిచ్చువాడు చాకలి అనీ తెలియును కనుక వారికా పదముతో పరిచయ మవసరము లేదా! బాగుంది. అయితే మొదటి తరగతిలో మొట్టమొదటి సారిగా 'అమ్మ', 'ఆవు'లతో పదపరిచయం చేస్తారెందుకు? పుట్టగానే 'అమ్మా' అని నేర్చుకునే పిల్లల కయిదేళ్ళు గడిచాక మళ్ళీ 'అమ్మ' అనే పదం పరిచయం చేయడం అనవసరమే కదా వీరి దృష్టిలో! ఒకటి రెండు తరగతులలో నూతనంగా పిల్లలను చదువుకు పరిచయం చేయాల్సి వుంటుంది. వారికి తెలిసిన పదాలతోనే కల్పింపబడిన రకరకాల కూర్పులతో 'వ్రాయడం చదవడం' మీద వారి కిష్టం కల్పించడం ఆ వయస్సులో వారి కుపాధ్యాయులు చేయవలసిన కృషి. అంతేకాని క్రొత్త పదాల సమూహాంతంగా వారిపై రుద్ది వారి నయోమయంలో పడవేయడం

కాదు కర్తవ్యం. పిల్లల మనస్తత్వాన్నవగతం చేసుకోవడానికి ప్రయత్నించక, తమ పాండిత్యాన్ని ప్రదర్శించడానికి కాకపోతే మొదటి తరగతిలోనైనా కనీసం 'కుమ్మరి, చాకలి' పదాల్ని పరిచయం చేయకుండా ఒక్కసారే రెండవ తరగతిలో నూతన పదపరిచయమంటూ మారుమూల పదాల్ని పరిచయం చేయడమెందుకు చెప్పండి?

ఇలాంటి పదపరిచయంలోని అసలు కిటుకు వేరు. మాల, మాదిగ మొదలగు కులాల వాళ్ళనా పేళ్ళతో పిలిస్తే తమనేదో తక్కువచేసి పిలిచినట్లు వారు బాధపడతారు. హరిజనులనిపిలిస్తే యేదో కిరీటం పెట్టినట్లు సంతోషిస్తారు. ఏ పేరుతో పిలిచినా తమ స్థానం మారలేదనే విషయాన్ని గుర్తించరు...మూడవతరగతి పెట్టెలమీద మూడు నిలువు గీతలలో ఒక గీత చెరిపివేయబడిన రైలు పెట్టెలో యెక్కి మేం రెండవ తరగతిలో ప్రయాణం చేస్తున్నామని తృప్తిపడే సామాన్యులలా. అలాగే కుమ్మరి, చాకలి మున్నగు కులాలవారి నా యా పేళ్ళతో పరిచయం చేయడం వారి నేదో తక్కువ చేసినట్లవుతుందని, ప్రభుత్వం వారిని సముచితమైన గౌరవ నామాలతో పరిచయం చేసి గౌరవిస్తున్నదని తెలియజేయడం యిందుగల యంతరార్థం. కుల మత రహితమైన వ్యవస్థ కావాలనుకుంటూ తక్కువ కులాల వారమనుకోబడే వారిని తమ పాండితీ నైపుణితో మరో భాషా (సంస్కృత) పదాలతో వ్రేలెత్తి చూపడమెంతవరకు సమంజసం? ఇందు నిజానికి పండితుల ననవలసిన పని లేదు. ఇవి ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కాబట్టి ఇందలి తప్పొప్పులకు ప్రభుత్వానిదే బాధ్యత. ప్రభుత్వాన్ని గాక మరెవర్ని నిందిస్తాం? అసలే తక్కువ కులాలవాళ్ళమయ్యామని బాధపడేవారిని పసిప్రాయమందు పాఠ్యపుస్తకాలలో వ్రేలెత్తి చూపించి, పెద్దయ్యాక యేదైనా ఉద్యోగానికి దరఖాస్తు పూర్తి చేద్దామనుకుంటే అందులో మళ్ళీ 'నీదే కులం?' అంటూ వ్రేలుచూపి అడగడం...ఇదంతా నిజానికి వారి హృదయాలకెంతటి అంపపు కోతో ఆలోచించండి.

పోనీ యీ విషయాలన్నీ ప్రక్కకు నెట్టి పై మిత్రుల యభిప్రాయానుసారం 'కులాల' 'రజక' ప్రయోగాలు నూతన పద పరిచయార్థమే ననుకొందాం. 6వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలోని 'రామ తీర్థ స్వామి' అనే పాఠంలో రామతీర్థస్వామి గూర్చి చెప్తూ 'భార్య పదునాలుగేండ్ల వయసులో ఉన్నది. అతడు ఇక సకల సుఖములను పడయదగు తరుణము వచ్చినది' అని వ్రాశారు. అంటే 6వ తరగతిలోని పది పదకొండేండ్లపిల్లలకు భవిష్యత్తులో అవసరం కదాని పడకగది శృంగారాన్ని పరిచయం చేయడం పాఠ్య పుస్తకకారుల లక్ష్యమా? ఉషా పరిణయాలు చదువుకొనదగిన వయసా వారిది? పైగా చక్కని కథలు, కబుర్లద్వారా భాషా బోధన జరుగవలసిన తెలుగు పుస్తకంలో నిజానికి మొత్తం పదునేడు పాఠాలకుగాను పన్నెండు పాఠాలా ప్రయోజనాన్ని సాధింపవే? 'కొరిలేషన్' పేరుతో తెలుగు పండితులకే శాస్త్ర పాఠాలు నేర్పడమా వీరి ధ్యేయం ? అదైనా యెంత సొంపుగా ఉందంటే ... 6వ తరగతి హిందీ పాఠ్య పుస్తకంలో 13వ శతాబ్దిలో నన్నయ, తిక్కన, యెఱ్ఱాప్రెగ్గడ అనే ముప్పురు కవులు మహాభారతం వ్రాశారని వుంది. ఇంతకంటే శాస్త్రపరమైన తప్పు మరొకటి ఉంటుందా? పోనీ యీ తరగతులకు పరీక్షల ప్రాధాన్యత లేదుకదాని తృప్తి పడదాం. 7వ తరగతి లెక్కల పుస్తకం తీసుకొండి. లెక్కల్లో తప్పులు, జవాబుల్లో తప్పులు. ఉపాధ్యాయుడొక 'మాదిరి లెక్క' చేయించి చూపిస్తే విద్యార్థు లింటివద్ద అభ్యాసం కొరకు చేసికొనే లెక్కలిలా తప్పుల తడిక లయితే, యింక వారెలా బాగుపడతారు? ఇలా విమర్శించుకుంటూ పోతే యీ ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలోని లోపాలకొక పెద్ద గ్రంథం చాలదు. ఇన్ని అవక తవకలున్న పాఠ్యపుస్తకాల్ని, వాటి ప్రణాళికలని, తత్కర్తల్ని యెవరైనా విమర్శిస్తే వాటిని సహృదయంతో స్వీకరించాలికాని తిరిగి వారిని దుయ్యబట్టడం మన పిల్లల్ని మనమే పాడుచేసు కున్నట్లవుతుంది.

శ్రీ చింతలపూడి వెంకటేశ్వర్లు

హిరణ్యకశిపుని భార్య పేరేమి ?

ఏప్రియల్ నెల "భారతి"లో శ్రీ పణతుల రామేశ్వర శర్మ గారు లీలావతి హిరణ్య కశిపుని భార్యపేరు కాదంటూ, మహాకవి బమ్మెర పోతన తన భాగవతమందు—

"లీలోద్యాన లతావితానములలో
లీలావతీయుక్తుఁడై".

ఇచట లీలావతీ శబ్దము యువతిపరమైన విశేషణము మాత్రమేనని, దీనిని ఆధారంగా తీసికొన్నారు ఆ తరువాతి వచన భాగవత రచయితలు, నాటక కర్తలు అన్నారు. విశేషించి తొమ్మిదవ తరగతి వాచకంలోని "భక్తరక్షణ" నాటికలో పాటిబండ మాధవశర్మగారు లీలావతి హిరణ్య కశిపుని భార్యగనే పాత్ర చిత్రణ గావించియున్నారని, ఈ పేరు వినుటకు యింపుగ, పిలుచుటకు సొంపుగ నున్నందున దీనికే ప్రాముర్యము లభించినదిగాని, రాక్షస రాజు పత్ని "దత్త" అని, ఆమె జంభాసురుని కుమార్తె అని పేర్కొన్నారు కాని పద్మపురాణమునందలి ఉత్తర ఖండమునగల నలువది నాలుగవ అధ్యాయాన్నిబట్టి ఆమె "ఉత్తాన పాదుని దుహిత, కళ్యాణి నామధేయురాలు" అని తెలుస్తోంది.

"తస్యైవ కింకరాస్సర్వే, దేవగంధర్వ దానవాః,
యక్షాశ్చనాగాసిద్ధాశ్చ వర్తతే వశవర్తినః
ఉత్తానపాదస్య సుతాం, కల్యాణీ నామ కన్యకాం
ఉపయేమే విధానేన దైత్యరాజో మహాబలః
తస్యాం జాతో మహాతేజాః ప్రహ్లాదో నామదైత్య రాట్
అనురక్తో హృషీకేశే గర్భదాసోస్య వైహరేః".

ఈలాగే తదితర పురాణాలలో కూడ పరిశీలించి చూస్తే నామ భేదాలు ఉండినను ఉండవచ్చు. ఏమైనప్పటికి ఆమె అసుర నాయకుని పత్ని అయినను పరమసాధ్వి, భక్తాగ్రేసరుడైన ప్రహ్లాదునికి మాతృదేవత, మనకందరికీ ప్రాతః స్మరణీయ.

శ్రీ ఓలేటి పంచముఖేశ్వరరావు

'భారతి', మార్చి 1977 మాసపత్రికలో కావలి వెంకట రామస్వామిగారి "**Biographical sketches of the Dekkan Poets**, గూర్చి శ్రీ నిడుదవోలువారు ప్రస్తావిస్తూ 'ఇటికెల తిమ్మయ్య' 'వైశ్యుడు' అని పేర్కొనుట జూచి శ్రీ పాయసం సుబ్రమణ్యంగారు 'అతడు (తిమ్మయ) వైశ్యుడు అనలేము' అనుచు 'అతడు ఏ కులమువాడైతేనేమి? కులము ప్రస్తావన యింకానా?' అని తమ లేఖలో ఏప్రియల్ 1977 'భారతి' మాస పత్రికలో వ్రాసినారు.

నాదొక మాట: జిజ్ఞాస లేనిదే పరిశీలన, పరిశోధన లేవు కదా. సాహిత్య రంగములో కృషిచేసి విశిష్టత గాంచిన ఏ వ్యక్తి గూర్చి అయినను, అతనెవరు? అతనే ప్రాంతపువాడు? అతనేమి చేయుచుండెడివాడు అను తహతహతో అతని గూర్చి తెలిసికొని తెలియజెప్పుటలో కులమును పేర్కొనుటలో తప్పేమున్నది? అతని కులము సరియైనది కావచ్చును, కాకపోవచ్చును. అది మరియొక విషయము. ఈ పరిశోధన ఇచ్చటితో ఆగునదికాదుకదా! పరిశోధనలలో వెలుగునకు వచ్చిన ఏ చిన్న నిజమైనను, పరిశోధకులకు, తమ తమ పరిశోధనలో ఎంతగ ఉపకరించునో ఎవరికైనను తెలియని విషయము కాదుకదా! శ్రీ సుబ్రమణ్యంగారు అన్యథా భావించరని భావించెదను.

శ్రీ జయంతి వెంకటరమణ

కులాలుడు-రజకుడు

1977 ఫిబ్రవరి 'భారతి'లో కులాలుడు, రజకుడు అన్న పదాలపై మోహనరావుగారి లేఖను దానికి ఏప్రిల్ సంచికలో శ్రీ ప్రసాద్, శ్రీ సత్యనారాయణగార్ల సమాధానాలను చదివాను. మొత్తంమీద అందరూ సమస్యను సక్రమంగా అవగాహన చేసుకోలేదని తెలుస్తున్నది.

మోహనరావుగారు కులాలుడు, రజకుడు అన్న పదాలకు బదులు కుమ్మరి, చాకలి అనే నిత్య వ్యవహారంలోని పదాలు పాఠ్య పుస్తకాలలో ఉండడం మంచిది అన్నంతవరకూ బాగానే వుంది. కానీ ఆ పదాలను ప్రస్తుతం చేర్చినదానికి కల మూల కారణాలను ఆయన గమనించలేదు. ఒక విధంగా ప్రభుత్వం అంగీకారంతోనే ఆ పదాలు చేర్చబడ్డాయి. ఇటీవలకాలంలో మన రాష్ట్రంలో 'కుల సంఘాలు' ఎక్కువయి పోయాయి. ఎప్పుడైతే సంఘాలు ఏర్పడ్డాయో వాళ్ళు సమాజంలో ఇంతవరకూ తమని ఏ కులం పేర్లతో తక్కువగా చూశారో ఆ పేర్లని తీసివేసి కొత్త పేర్లతో పిలవాలని ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడం ప్రారంభించారు. ఆర్థిక సామాజిక పరిస్థితులలో మార్పు రాకుండానే పేర్లు మార్చినంత మాత్రాన తమకు సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుందని వాళ్ళు భ్రమపడటం ఇందుకు కారణం. ఫలితంగా నిత్యవ్యవహారంలో ఎక్కువ వ్యాప్తిలో ఉన్నా, పుస్తకాలలో మాత్రం కుమ్మరి, చాకలి అన్న పదాలకు బదులు కులాలుడు, రజకుడు, అనేవి పాఠ్య పుస్తకాల్లో చోటు చేసుకొన్నాయి. ఈ నేపథ్యాన్ని అర్థం చేసుకొన్నప్పుడు పండితులనీ నిందించాల్సిన అవసరముండదు.

ఇక ఈ సమస్యకు ప్రసాద్, సత్యనారాయణగార లిచ్చిన సమాధానాలుకూడా సరైనవి కావు. అంచలంచలుగా భాషా పరిజ్ఞానాన్ని పిల్లలకు కలిగించాల్సిన మాట నిజమే అయినా అంత చిన్న వయసులోనే (రెండవ తరగతి) కొత్త కొత్త పదాలను తెచ్చి వాళ్ళని కంగారు పెట్టడం భావ్యం కాదు. ఒక విషయాన్ని సులభంగా తెలియ పరచడమే భాష ప్రయోజనం. మరి నిత్య వ్యవహారంలో ఉన్న పదాన్ని వదిలి నిఘంటువులలోని మారుమూల పదాలను వాడడంవల్ల విషయం దురవగాహమై భాష ప్రయోజనమే దెబ్బతింటుంది.

సత్యనారాయణగారు మరొక వితండవాదంచేశారు. కులాలుడు రజకుడు, అన్న పదాలు కుమ్మరి, చాకలి అన్న పదాలకంటే ఉచ్చారణకు, వ్రాతకు సులభమట. మరి ఆ పదాల్లో ఏం సౌలభ్యముందో తల ఎంత బద్దలుకొట్టుకున్నా నా కర్థం కావడం లేదు! ఒక విధంగా మాత్రా సంఖ్య పెరగడంవల్ల సౌలభ్యం తగ్గిందనే చెప్పాలి. ఏ ఆధారాలతో ఈ మాట అన్నారో ఆయన తెలిపితే మంచిది. ఒక విషయాన్ని ప్రతిపాదించేటప్పుడు జాగ్రత్తగా ముందు వెనుకలు ఆలోచించి ప్రతిపాదించాలి.

భాషపట్ల శాస్త్రీయమైన అవగాహనని పెంచుకొంటేతప్ప ఇలాంటి సమస్యలు పరిష్కరింపబడవు.

శ్రీ ఎమ్ వి. రమణయ్య



గ్రంథ విమర్శలు

అక్షయతూణీరము :

[డాక్టర్ అన్నపురెడ్డి శ్రీరామరెడ్డి (ఎం. ఎ.; పి. హెచ్‌డి) క్రౌన్ 1/16 పారటలు 110; వెల రు 5/ ప్రతులకు : ఎ. భారతీదేవి; బి. ఏ; శ్రీనివాసా పబ్లికేషన్సు; కందుకూరివారి వీధి; రామనగర్ పోస్టాఫీసు బజారు ; నిడదవోలు; ప. గో.]

డాక్టర్ శ్రీ రామరెడ్డి భాషాసవ్యసాచి. హిందీ ఆంధ్రము లలో లోతుపరపుగల పాండిత్యం. ఇంగ్లీషు చదువు తక్కువైనది గాదు. దాక్షిణాత్యులు హిందీ రచయితలుగా అంగీకరింపబడుట అరుదు. (ఇంగ్లీషులో ఇండియనులవలె) అట్లాయికూడ, ఈయన హిందీలో గణనీయమైన రచయిత. వీటికి మెరుగుబెట్టే విమర్శక శక్తి నిశితమైనది. ఇన్ని బాణాలున్న ఈయన భాషాతూణీరం అక్ష యంగాక ఏమవుతుంది? అందుచేత ఈ సంకలనానికి "అక్షయ తూణీరం" అని పేరు బెట్టడం— ఒక సౌకుమార్యమైన ఔచిత్యం. శైలి ప్రౌఢంగా ఉన్నా ప్రాణంతో ముచ్చటగా నడుస్తున్నది. చెప్ప వలె ననుకొన్నది సూటిగా చెపుతారు.

ఈ పుస్తకం—ఆకాశవాణి భాషణాల, పత్రికల వ్యాసాల సంపుటీకరణం. ఎక్కువగా హిందీ అనువాదాలు. తిలక్, దాశరథి, నారాయణరెడ్డిగారల రచనల సహృదయ సమీక్షలలో, వారి వారి వెలమదింపులు బాగా చేయబడి ఉన్నవి. నారాయణరెడ్డిగారి రామప్ప దేవాలయ రూపకల్పన ప్రత్యేక ప్రశంసకు పాత్రీకరింపబడి ఉన్నది. నిర్మాతల భక్తిభావ వివరణం మంచిగా ఉన్నది.

"అందం గంధంలాంటిది" అన్న వ్యాసంలో, రచయిత సౌందర్యోపాసకుడై, పై మెరుగులను లోపలి కాంతులను బాగా వేరు చేసినాడు. విషయం బాగా చదివి వ్రాసిన వ్రాత. కవి—తాను అనుభవించిన రసానుభూతిని వ్రాస్తే చదివిన వానికి అదే అను భూతి కలగవలె—అదే శిల్పం అన్న భావాన్ని ఈ రచయిత : "కవులు సౌందర్యావృతమైన ప్రకృతి పులకరింపును తమ హృదయ ఫలకాలపై రికార్డుచేసి, వైయుక్తిక సమగీతానికి ప్రతిరూపమైన రికార్డును తిరిగి సహృదయ సామాజికులకు కర్ణపేయంగా మార్చి వినిపించిన కల్పనాశక్తికి ఆలంబనాలు" అని నేటి యాంత్రికయుగ పరిభాషలో చెపుతున్నారు.

సమన్వయవాదమంటే — ఉన్న మంచినే స్వీకరించడం అంటాడు; తలఊచి ఆమోదించవలసిన మాటగానే ఉన్నది. సమ న్వయవాది కళాకారులు—కబీరు, వేమన అని పోల్చిచెప్పిన వ్యాసానికి కాస్త విషయ గురుత్వం తగ్గిఉన్నది. వేమన పద్యాలను గూడ ఎత్తి చూపి ఉంటే బాగుండేది. హిందీ పాఠకులకు పొటట్టి పైపైన పోయినట్లున్నది. ఇంకా లోతుకు దిగి, పోల్చిచెప్పి ఉంటే వేమనను హిందీవారు తెలుసుకోగలిగి ఉండేవారు.

నవత

[సచిత్ర త్రైమాసపత్రిక; చేతివ్రాత సైక్లోస్టయిల్, సంక్రాంతి సంచిక 1/4 క్యాప్. వెల 60 పై. నటరాజనికేతన్, కమాన్‌రోడ్, కరీంనగర్.]

కవితలు, కథలు, సూక్తులు, విమర్శనలు, విసరులు గల వ్రాతపత్రిక ఇది. అడ్వర్‌టైజ్‌మెంట్లు గూడ సచిత్రాలే! నిర్మా తల ఓపిక చూడండి—ముఖచిత్రం రంగురంగులది. అంటే—డబ్బు లేకపోయినా వ్రాసినది ప్రచురించాలనే స్వచ్ఛయౌవనోత్సాహానికి ఈ పత్రిక ప్రశంసనీయ చిహ్నం. ఓపిక తగ్గేలోపల ఈ ప్రొడక్షన్ పూర్తిగా అచ్చుకెక్కించే ప్రయత్నం చేయడం వాంఛనీయం. ఎందు కంటే—ఇది మంచి మాడెల్‌లో ఉన్నది. అచ్చువేసి వెలువరిస్తే— కార్యనిర్వాహకులకు కృతకృత్యత, రచయితలకు తృప్తి, పాఠకులకు ఆనందం.

చాలావరకు వ్యంగ్యం ఎత్తిపొడుపు ధోరణిలోనే ఉన్నది—రచ నలు—హాస్య నిరాశా జీవన రథానికి కందెనవంటిది గదా.

ఉదాహరింపబడిన పెద్దల సూక్తులు బాగున్నవి. కార్ టూనులు (11. వ. పేజి) అర్థవంతంగా ఉన్నవి.

"ఉక్కు తీగలు పాడుతున్నవి; ఉత్త వెదురుపొదలు పాడు తున్నవి; పాడలేనిది ఒక్కటే—పరుషబుద్ధి హృదయం" అన్న— డాక్టర్. సి. నారాయణరెడ్డి తునక కళాస్వరూపం, శిల్పాకృతి. ఇట్టి వాటిని ఏరగలిగిన సంపాదకుల సంస్కారం మెచ్చదగినది.

శ్రీ మరుపూరు కోదండరామరెడ్డి

"ఆంధ్రరత్న" శ్రీ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జీవితచరిత్రము

[రచన : శ్రీ కార్యంపూడి నాగేంద్రుడు బి. ఏ., బి. ఇడి ప్రచురణ :బహూత్తమ పబ్లికేషన్స్. పేరాల, చీరాల. ప్రకాశం జిల్లా వెల : పది రూపాయలు.]

"ఏ జాతి చరిత్ర అయినా, ఆ జాతిని దిద్ది తీర్చే కృషిలో పాల్గొన్న వ్యక్తుల జీవిత చరిత్రయే" నని ఒక చరిత్రకారుని అభిప్రాయం. ఆ దృష్టితో పరిశీలిస్తే శ్రీ నాగేంద్రుడు ప్రయో జనకర కృషిచేస్తున్నారనడం నిర్వివాదాంశం. జాతీయ నాయకుల జీవిత విశేషాలు, వివరాలు ఈ తరం యువతీ యువకులలో చాలా మందికి తెలియవు. విద్యావంతులుగా వినుతికెక్కిన వారిలో చాలా మందికి కూడా "దేశోద్ధారక" కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారి జీవిత విశేషాలూ, "దేశ భక్త" కొండా వెంకటప్పయ్య జీవిత వివరాలు తెలియకపోవడాన్ని ఏమనాలి ?

విజయవాడలోని ('ఆంధ్ర రత్న') రాష్ట్ర కాంగ్రెస్ భవనంలో 'ఆంధ్రరత్న' శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చిత్ర పటాన్ని అమర్చే విషయం ఆ మధ్య చర్చకు వచ్చింది. "అయ్యో ఆయన చిత్రపటం మాకు దొరకలేదు. మీరు ఇస్తే తప్పక పెడ్తాం" అని ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు ఒకరు చెప్పారు. దాని మీదట ఒక జర్నలిస్ట్ తన తండ్రిపేరిట 'ఆంధ్ర రత్న' చిత్రపటాన్ని బహూక రించగా, దాన్ని ఆ భవనంలో అలంకరించారు.

ఇదంతా ఎందుకు ప్రస్తావించ వలసి వచ్చినదంటే, శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి రాజకీయ కార్య కలాపాలు, తాత్త్వికచింతన కవిత్వం నేటి రాజకీయ వాదులకు, కవులకు అంతగా నచ్చక పోవచ్చుగాని, ఆంధ్రదేశంలో ఒకనాడు బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించిన వ్యక్తి, మేధావీ ఆయన.

ఆయన జీవితం గురించి సమగ్రంగా కాకపోయినా, కొంత పరిచయ మేర్పరచుకొనడానికి ఈ పుస్తకం సహాయపడుతుందన డంలో సందేహం లేదు. అయితే శ్రీ నాగేంద్రుడుగారంతటి వ్యక్తి భాషలోని లోపాలను ఎంచడం లక్ష్యం కాదుగాని, భాష గురించి అంత శ్రద్ధ వహించలేదేమోనని అనిపిస్తుంది. అందుకు కొన్ని ఉదాహరణలు : 121వ పుటలో "కావున మానవ దృష్ట్యా మహా త్ముని చర్యలో నెట్టిదోషము లేదని నా యభిప్రాయము." ఇక్కడ మానవతా దృష్టి అని అనో మరేదో వుండాలి. 116వ పుటలో "చౌరీచౌరా" అనబడు ఒక ఊరు కలదు అనే వాక్యంలో అనబడు అనవసరం. 'చౌరీచౌరా' అనే ఊరు కలదు అంటే చాలు. అలాగే 171వ పుటలో **"There is a transition in my character and content"** అని ఇంగ్లీషులో ఇచ్చి, తెలుగులో "నా స్వభావము లోను తృప్తిలోను మార్పు వచ్చుచున్నది" అని వ్రాశారు. **contentment** అనగా తృప్తి. **content** అనగా ఒక వ్యక్తి సహజగుణం. దాన్నే పదకోశంలో తృప్తి అని వ్రాశారు గదా అని అలాగే ప్రయోగిస్తే సరసంగా వుండదు. ఔచిత్యం దెబ్బతింటుంది. ఇలాంటి వాటికేమిగాని మొత్తంమీద మంచి పుస్తకాలలో ఇదొకటి.

అఖిలభారత కాంగ్రెసుకు ప్రధాన కార్యదర్శిఅయిన మొదటి వ్యక్తి శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య. చీరాల—పేరాల ఉద్యమం నడిపించి తెల్లదొరలను ఒక్క ఊపు ఊపిన తెలుగుబిడ్డ ఆయన.

గుంటూరు మండల మహాసభలో ఆంధ్రరత్న బిరుదుకు ఆయనను సత్కరించడం జరిగింది. శ్రీ గోపాలకృష్ణయ్య జీవిత చరిత్ర గురించి ప్రస్తావించేప్పుడు కాకినాడ కాంగ్రెసు మహాసభ సంగతి, రామదండు సంగతి తప్పక చెప్పాలి.

సంస్కృతాంధ్రములలో శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మంచికవి. ఉదాహరణకు ఈ శ్లోకాన్ని చూడండి—

కదా కావేరీ విమల సలిల ప్రాజ్ఞాణనట
చ్చు భాజ్జం శ్రీ వజ్జం తమిళహృదయ ధ్వాన్త దళనమ్
తనోత్యాతిథ్యం, మేనిజ సదసిబన్ధ నచ్యుతియులే
ముహూర్తే త్యాక్రోశ న్నిమిష మివనేష్యామి దేవసాచ్
(102వ పుట)

రాజకీయ స్వాతంత్ర్యంతోపాటు వ్యక్తి తాత్విక వికాసానికి సాంఘికోన్నతికై పరితపించిన జిజ్ఞాసి శ్రీ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య. ఆ తపన ఫలితంగానే రాజకీయాలకు విసిగి ఇతర కార్య క్రమాలను ఆయన ప్రారంభించడం జరిగింది.

ఆంగ్లంలో 'సాధన' అనే పత్రికను ప్రచురించిన సంపాదకుడు ఆయన.

ఆయనలో హాస్యదృష్టి ఎక్కువ. దాని ఫలితంగానే రాజ కీయాలలో ఆయనకు శత్రువు లెక్కువైనారు.

బింకాలు పలుకు బందరు
కుంకల ఫీంకార మెల్ల గీడ్వడ సేయన్
శంకరుడె మహా నందిని
సుంకర కొండయ యాయె జోద్యం బేల

అన్నాడట ఒక సందర్భంలో.

మరొక పద్యంలో ఆయన తనను ఇలా వర్ణించు కున్నాడు:

"వేదాంతములతోడ వెక్కిరింతలతోడ
లెక్చర్లు సాధించు లీల నెవడు"

ఇందులో ఆయన ఆత్మచింతన ద్యోతక మవుతుంది.

"గాంధి దేవుని రాక కంచు ఢక్కల గాక"

అన్న ఆయన పద్యం ఆ రోజులలో పలువుర నాకర్షించింది.

'విశ్వదాత' శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు గారిని గురించి శ్రీ గోపాలకృష్ణయ్య ఇలా వర్ణించాడు :

"ఆంధ్ర పత్రికతోడ నమృతాంజనం బిచ్చి
తల నొప్పి బాపెడి ధన్యు డెవడు
లక్షలాదిగ డబ్బు దీక్షతో సమకూర్చి
భిక్షకోటిని గాచు దక్షు డెవడు
ప్రతి కాన్ఫరెన్సుకు గతి నీవె యని వేడ
ప్రెసిడెంటుగా నేలు రసికు డెవడు
మితవాది హితుడౌచు నతివాది గతుడౌచు
నందునిందును జేరుడె—డెవడు
అట్టి కాశీనాధుని నాగయాహ్వయందు
పుట్టకుండిన నాంధ్రంబు పుట్టి మునిగి
గిట్టకుండునె యేనాడొ యట్టె నీల్గి
రామ నగరీ నగరేంద్ర! శ్రీరామ చంద్ర".

ఆయన రామ భక్తుడు. రామదాసుగా తనను ఆయన వర్ణించుకొన్నాడు.

దేశ రాజకీయాలలో, ఆంధ్రలో శ్రీ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య నిర్వహించిన పాత్రగురించి భిన్నాభిప్రాయాలున్నయ్. మేధావి అని కొందరనగా పెడసరపు మనిషి అని కొందరన్నారు. ఆంధ్రలోని అగ్రశ్రేణి నాయకుడయిన శ్రీ దుగ్గిరాల గోపాల కృష్ణయ్య జీవితాన్ని పరిచయంచేసే యీ గ్రంథంలో చదివి ఆలోచించవలసిన విషయాలనేకానేకం కలవు.

శ్రీ వి. యస్. అవధాని.

బీహార్ : జానపదగాథలు

[ఆంగ్లమూలం పి. సి. రాయ్‌చౌధురీ. తెలుగుసేత : పాలగుమ్మి పద్మరాజు ప్రచురణ : సాహిత్య అకాడెమీ – న్యూఢిల్లీ. పుటలు : 146; వెల రు 8–00]

ఈ పుస్తకం మున్నుడిలో చెప్పినట్లుగా, "జానపద సాహిత్యం ప్రజలయొక్క ప్రాచీన సంస్కృతికీ, ఆచార వ్యవహారాలకు నిస్సంశయమైన సూచిక." టి. బెన్‌ఫే సిద్ధాంతం ప్రకారం వివిధ ప్రాంతాల జానపద గాథలకూ మూలపీఠం భారతదేశం. మాలినవాస్కీ, రాడ్‌క్లిఫ్, బ్రౌన్ మొదలైన విమర్శకులు అన్ని జానపద గాథల్లోనూ, దేవతలు, దయ్యాలు, జంతువులు, అతిలోక వాతావరణం, మానవత్వం, ఉద్రిక్తత, నీతి, ప్రాంతీయమైన ఆచార వ్యవహారాల వర్ణన, సమానంగా చోటు చేసుకోవడాన్ని గమనించారు.

పి. సి. రాయ్ చౌధురీకి బీహారులోని జిల్లా గెజిటీర్లు కొత్తవి తయారుచేసే సందర్భంలో బీహారు జానపద గాథలంటే గాఢమైన ఆసక్తి కలిగింది. చోటానాగపూర్, సంతాల్ పరగణాలనుండి కొన్ని కథలను సేకరించి సంపుటీకరించాడు. భారతదేశంలోని ఇతర ప్రాంతాల ఆదిమవాసుల కథలకూ, ఈ కథలకూ ఎంతో సామ్యం కనిపిస్తుంది.

ఈ కథలన్నింటిలోనూ ఒకానొక అర్థం అంతర్వాహినిగా వున్నది. ఒక్కొక్కచోట హాస్యప్రవృత్తి. వేరొచోట లోకజ్ఞత. ఇంకొకచోట ఆ జనపదుల ఆచార వ్యవహారాలు. కొన్ని కథల్లో ఆ ప్రాంత చరిత్రతో సంబంధం. మరికొన్ని కథల్లో మానవ స్వభావానికి 'సాంకేతిక వివరణం.' ఈ కథకులు, కథల్లో పాత్రలు గతాన్ని గూర్చి మురిసిపోరు. వాళ్ళ రాజులు కూడా సామాన్యంగా జీవిస్తారు, సహజంగా ప్రవర్తిస్తారు. వేటాడడం వారికి వినోదక్రీడ. పిట్టల పెంపకం ఒక పెద్ద వరం.

బీహార్, విహార భూమి. విద్యాపతి కవితాకేంద్రం. అక్కడి గంగా, సోన్ నదులు ఔత్తరాహులకు పాపహరాలు, జీవన ప్రదాలు. అన్ని మతాల కథలనూ బీహార్ జానపదులు తమ స్వంతం చేసుకుని, తమకు అనుగుణంగా మల్చుకున్నారు. ఉదాహరణకు "ప్రపంచకం ఎలా పుట్టింది?" అన్న గాథలో అన్నాచెల్లెళ్ళ "అనుబంధాన్ని మరచిపోయేటట్టు చేసి, వాళ్ళని దేవదంపతులు అనుగ్రహించారు. ఆ జంటే నేటి మానవలోకానికి ఆదిమానవులు" అన్నప్పుడు బైబిలులో వున్న ఆడం—ఈవ్‌ల కథ జ్ఞాపకం వస్తుంది. ఆ కథలోనే హయగ్రీవుడూ, పార్వతీ పరమేశ్వరులూ, సృష్టివినాశనం మొదలైన విషయాలు కూడా చోటు చేసుకుంటాయి. "భూమీ సముద్రం విడిపోడం" ముండా జానపదుల అమాయకమైన ఆలోచనకు రమణీయమైన రూపకల్పన. "మొదట నాగలి ఎలా తయారైంది?" అన్న కథలో నాగలి తయారు కావడమేకాదు, భగవంతుడు భార్య చేతిలో వోడిపోవడం, ఆ కోపంలో అవమానంలో భార్యపై ఆంక్షవిహించడంవర్ణించబడింది. స్త్రీజాతి తెలివితేటలకూ, మగవాడి ఔద్ధత్యానికీ ఇది ప్రతీక. ఈ పుస్తకంలోవున్న డెబ్బయ్యెనిమిది చిన్న కథలూ ఇట్లాగే చిత్రంగా వుంటాయి.

సాహిత్య సంస్థల అశ్రద్ధ, తొందర తొందరగా రూపాంతరం చెందుతున్న పట్టణాలు, పారిశ్రామిక ప్రభావం, ఈ అగాధంలోపడి జానపద సాహిత్యం లుప్తం కాకుండా, కేంద్ర సాహిత్య అకాడెమీ ఇటువంటి పుస్తకాలు ప్రచురించడం ప్రశంసనీయం. ఒక్క బీహారే గాదు, అన్ని ప్రాంతాల జానపదగాథల్నీ అది ప్రచురించాలి. అప్పుడే అది కేంద్రసాహిత్య అకాడెమీ అన్న పదానికి అర్హతను సంపాదించుకొంటుంది.

ఈ కథల్ని తెలుగు చేసిన పాలగుమ్మి పద్మరాజుగారు కథా జగమెరిగిన తెలుగు బ్రాహ్మణులు. సాహిత్య అకాడెమీతో ఘనిష్ట సంబంధమున్నవారు. అనువాదం మరింత వ్యవహారికంగా సాగితే బావుండేది. ఉదాహరణకు మొదటి కథ "సారంగ—సదాబ్రిజ్"లో మొదటి వాక్యాలు:

"సదా బ్రిజ్ యువరాజు. సారంగ ఒక వైశ్యుని కుమార్తె. ఒక పల్లెటూరి బడిలో ఇద్దరూ సహాధ్యాయులు. వారి చిన్ననాటి చెలిమి కాలక్రమాన ప్రణయంగా రూపొందింది."

'సహాధ్యాయులు' అనడం కన్నా 'కలిసి చదువుకున్నారు' అంటే బావుండదూ? 'చెలిమి' కన్నా 'స్నేహం' ఇంకా దగ్గరి మాట 'ప్రణయంగా రూపొందింది' అనడాన్ని 'ప్రేమగా మారింది' అనడం అందంగా వుంటుంది. అట్లాగే 'పెండ్లి యాడడం' అనగానే గ్రాంధిక ప్రయోగ వాసన వేస్తుంది. 'పరిణయ మాడడం' అని రాయడంకన్నా 'పెళ్ళి చేసుకోవడం' అని రాస్తే చదువుకోడానికి హాయిగా వుంటుంది.

అనువాదం మొత్తంమీద బాగానే వున్నా, ఇంకా బాగా వుండడానికి ఆస్కారముంది. అకాడెమీవారు తమ కార్య కలాపాలకు ఏ కొందరిమీదనో ఆధారపడడం తగ్గిస్తే, వారి మంచి పనులు మరింతగా రాణిస్తాయి. పుస్తకాన్ని అందంగా ముద్రించినవారు, సుమారు నూట యాభై పేజీలున్న తమ ప్రచురణకు ఎనిమిది రూపాయల ధర పెట్టడం, ఏ కారణంచేతకూడా క్షంతవ్యులుకారు. ప్రభుత్వానికి సాహిత్యరంగంలోకూడా వ్యాపారదృష్టే అయితే, సమాజాభివృద్ధికి అది ఏమాత్రమూ ఆరోగ్యకరం కాదు.

శ్రీ కొండముది శ్రీరామచంద్రమూర్తి

భారతీయ సాహిత్య నిర్మాతలు :

శ్రీ అరవిందులు

[రచన : మనోజ్‌దాస్. అనువాదము : అమరేంద్ర. (డాక్టర్ చతుర్వేదుల నరసింహశాస్త్రి) ప్రచురణ: సాహిత్య అకాడెమీ—న్యూ ఢిల్లీ. డెమ్మీ 95 పుటలు. వెల రూ. 2–50. వలయువారు—సాహిత్య అకాడెమీ, రవీంద్ర భవన్—న్యూఢిల్లీ—1. మద్రాసు—6. కలకత్తా—29. బొంబాయి—14.]

''నలుగురి కళ్ళకూ ఎదరుగా కనబడే బాహ్య సన్నివేశాలు నా జీవితంలో ప్రధానమైనవి కావు. కాబట్టి నా జీవిత చరిత్రను ఎవరూ రచించలేరు'' అని శ్రీ అరవిందులు అనేవారు. అంటే స్థూలదృష్టికి గోచరించే విషయాలకన్నా, సూక్ష్మదృష్టితో పరిశీలించ వలసిన ప్రముఖమైన సంఘటనలెన్నో ఆయన జీవిత చరిత్రలో ఉన్నాయన్నమాట.

నిజమే మరి! భారత స్వాతంత్ర్య సమరనేత, మహా కావ్య నిర్మాత, భవిష్యత్కవితా నిర్ణేత, ఆదర్శోపాధ్యాయుడు, మానవ చైతన్య రథసారథి, మహాత్యాగి, కర్మయోగి అయిన శ్రీ అరవిందుల విశ్వరూపాన్ని ఒకచోట ప్రదర్శించడం కష్టసాధ్యమే! అందుకే ఆలీపూరు కుట్రకేసు విచారణ సందర్భంగా వాదిస్తూ చిత్తరంజన్ అరవిందులను దేశభక్త ప్రబోధక కవి అనీ, జాతీయవాద ప్రవక్త అనీ, మానవహితవాది అనీ కొనియాడిన మూడు విషయాలను మాత్రమే ఆధారం చేసుకొని శ్రీ మనోజ్‌దాస్ ఆంగ్లంలో సంగ్రహంగా ఒక జీవితచరిత్ర వ్రాశారు. సంస్కృతాంధ్రాంగ్లాది బహుభాషాకోవిదులు, ఆంగ్లోపన్యాసకులు, పండితులు, సద్విమర్శకులు అయిన శ్రీ అమరేంద్ర దానిని తెలుగులోనికి అనువదించారు.

శ్రీ అరవిందులను గూర్చి ఆంగ్లంలో పెక్కు గ్రంథాలున్నాయి కాని తెలుగులో ఎక్కువగా లేవు. ఇప్పుడిప్పుడే ప్రఖ్యాత రచయితలు ఆ కొరత తీర్చడానికి ప్రయత్నిస్తున్నారు. అటువంటి వారిని సాహిత్య అకాడెమీవంటి సంస్థలు ప్రోత్సహించడం ముదావహం.

ఈ చిన్నపుస్తకంలో మొత్తం పదకొండు ప్రకరణలున్నాయి. అరవిందుని విద్యాభ్యాసం గూర్చి 'శైశవం' లోను, ఐర్లండు దేశ స్వాతంత్ర్య సమర ప్రభావంతో ఆయన రచించిన 'సాంగ్సు టూ మిర్టిలా' వంటివి సోదాహరణంగా 'తొలినాళ్ళ ప్రేరణల' లోను వివరించబడినాయి.

1893 లో భారత భూభాగంపై అడుగిడటంతో అరవిందునకు 'సాహిత్య ఆధ్యాత్మిక రంగాలలో సాధనారంభ' మయింది. బరోడా కళాశాలలో ఆంగ్లాచార్యవృత్తి, బొంబాయినుంచి వెలువడే 'ఇందు ప్రకాశ పత్రిక'లో పేరు లేకుండా 'పాత దివ్వెలకు బదులు కొత్త దీపాలు' అనే మకుటంలో కాంగ్రెసువంటి సంస్థలను విమర్శిస్తూ వ్రాసిన వ్యాసాలు, 1903 లో శంకరాచార్య శృంగం దర్శించినపుడు కలిగిన సమాధిస్థితి. 1904లో అరవిందుని యోగాభ్యాస ప్రారంభం మొదలైన విషయాలు ప్రస్తావించబడినాయి. తరవాత సావిత్రి మహాకావ్యానికి బీజారోపణ, వంగ, మైథిలీ కవుల రచనలనూ, కాళిదాసుని మేఘదూత, విక్రమోర్వశీయం, భర్తృహరి నీతి శతకాలకు చేసిన ఆంగ్లానువాదాలు, ఊర్వశి, ప్రణయం—మరణం అనే కావ్యాలు, ముక్తిదాత పెరేస్యూస్ అనే నాటకం గూర్చి వివరించబడింది ఇందులో. కాళిదాసు ప్రేరణతో వ్రాసింది 'ఊర్వశి.' మానవ నాయికా నాయకు లిద్దరు సాధించిన ప్రణయ విజయమే రెండో కావ్యం. 'శక్తిమంతులైన దేవతలు మానవులను పాలించే శాసనాలకు అతీతులుగా వుంటార'నే అంతరార్థాన్ని ప్రబోధించేది నాటకం. అరేబియన్ నైట్స్ కథల్లో ఒక దానికిది నాటకీకరణం.

తరవాతి ప్రకరణం 'దేశభక్తి ప్రబోధక కవి'గా అరవిందుని పాత్ర ఏమిటో పట్టి చూపుతుంది. అరవిందుడు తన భార్య మృణాళినీదేవికి వ్రాసిన లేఖా సారాంశం, దేశంలో ఏర్పడిన రహస్య సంఘాలు.

''స్వార్థపు నల్ల ముసుగులు చీల్చండి
చుట్టూ లేచిన అలసత్వము గోడలు కూలదోయండి.
మీకు తోచిన విధంగా జననికి సాయపడండి'' (35 పే)

అంటూ సోదర ప్రజలను ప్రబోధిస్తూ వ్రాసిన 'భవానీ మందిరం,' ముక్త ఛందస్సులో 'ఉక్కువలె మొక్కలోని ఆత్మబలం అలవరచుకోవాలి' అని వ్రాసిన 'బాజీప్రభు' అనే కావ్యం, 'ఉదాత్త కార్యాచరణకు వెనుదీయకు, నీచ కృత్యాలకు పాల్పడకు' (37 పే) అంటూ సంజయుని నిరాశా నిస్పృహలకు స్వస్తి చెప్పిన 'విదుల' అనే కవితలో అరవిందుడు చేసిన భారతమాత ప్రబోధం — ఇత్యాదులనుగూర్చి ఇందులో విపులంగా వివరించడం జరిగింది.

'జాతీయవాద ప్రవక్త' అనే భాగంలో డాక్టరు పట్టాభి అన్నట్లు అరవిందుని ప్రతిభ ఉల్కవలె ఆసేతు హిమాచలపర్యంతం ఎట్లా మెరిసిందో వివరించబడింది. స్వదేశీ పరిశ్రమల ప్రోత్సాహం, జాతీయ విద్యావిధానం, ప్రభుత్వ సంస్థలతో సంపూర్ణ సహాయ నిరాకరణం, కార్యదీక్షాదక్షమైన స్వచ్ఛంద సేవకదళం అనేవి భారత

దేశంలో బ్రిటిషువారి పాలనను అంతమొందించడానికి అరవిందుడు వేసిన ప్రణాళిక, పత్రికా రచనలద్వారా చేసిన స్వాతంత్ర్య ప్రబోధం, అలీపూరు జైల్లో రచించిన 'ఆహ్వానగీతం' ఉదాహరించాడు గ్రంథకర్త.

మానవ స్వభావంలో అంతర్గతమైన శక్తుల నుద్దీపింప జేయడానికి ఆంగ్లంలో 'అంగయోగిన్', వంగభాషలో 'ధర్మ' అనే పత్రికలను వెలువరించి, ఆధ్యాత్మికశక్తిని పెంపొందించడానికి అరవిందుడు పుదుచ్చేరి చేరిన విషయాలు 'మానవ హితవాది'లో వివరించబడినాయి.

విముక్తిదాత పెర్స్యూస్, వాసవదత్త, రోడోగున్, బసోరా వజీరులు, ఎరిక్ అనే నాటకాలు సంపూర్ణంగాను, బట్వంశం, మిల్లులో కన్య, ఎడూార్ అనేవి అసంపూర్ణంగాను రచించారు అరవిందులు. మానవుని ఈశ్వరుని ప్రేమతత్వం, నిజమైన ప్రేమ మహిమా వైభవం ఇత్యాది విషయాలు కలది 'ప్రణయం—ప్రభాతం.'

''వేదం విశ్వంలో ప్రథమ పవిత్ర గ్రంథంగా విరాజిల్లు తున్నది. మానవుని గురించీ, ఈశ్వరుని గురించీ, విశ్వమును గురించీ వివరించటానికి జరిగిన మొట్టమొదటి ప్రయత్నం వేదం అంటూ 'భారతీయ సంస్కృతికి పునాదులు' అనే పుస్తకంలోను, ''జాతినీ, సంస్కృతినీ పునరుద్ధరించి పునర్నిర్మాణంచేసే ఉద్యమం గీతా ప్రబోధంనుంచి చాలా ప్రోత్సాహం పొందింది'' అంటూ గీతా ప్రాముఖ్యాన్ని 'వేదమును గురించి' అనే గ్రంథంలోను వివరించారు అరవిందులు. ఈ విషయాలన్నీ 'పూర్వభారత వైభవ ఆవిష్కరణ'కు సంబంధించినవి.

'దివ్యజీవన'మనే గద్య మహా కావ్యంలో మానవ చైతన్య స్వభావ పరిణామాలను పరిశీలించి ''బుద్ధికీ అతిమానసానికీ నడుమ వంతెన కట్టాలి—పూడిపోయిన దారులు సరిచేయాలి'' అనే సందేశం అందిస్తారు అరవిందులు.

'ఉత్తమకళ ఆత్మద్వారాలను తెరుస్తుంది. ఉత్తేజితమైన విషయబోధకమైన రూపాలను వినియోగిస్తుంది' అంటారు అరవిందులు.

మనస్సుకూ బుద్ధికీ అతీతమైన స్థాయినుంచి సౌందర్య మీమాంస సాగించటం సాధ్యమవుతుందనే విషయాన్నే అరవిందులు ఉన్నత మానస స్థితి అంటారు.

మానవుని గురించీ, ప్రకృతి గురించీ, జీవితాన్ని గురించీ నూతనమైన, మహత్తరమైన ఆత్మదృష్టివెలసి భావమూ జీవనమూ దానితో నిండి తొణికిసలాడాలి. అదే అరవిందుని భవిష్యత్కవితా లక్షణం.

ఇవన్నీ 'కవిత్వమూ—భవిష్యత్తు'లో సౌందర్య మీమాంస'లో ప్రస్తావించబడినాయి.

చిట్టచివరి ప్రకరణంలో 'మానవ భవితవ్య సూచక మహాకావ్య'మైన అరవిందుని సావిత్రిని గూర్చి వివరించాడు రచయిత. సావిత్రి అరవిందుని 'ఉన్నత మనోభూమిక మంచి ప్రేరణ పొందిన రచన.' దానిని అర్థం చేసుకోడానికి పఠితకు 'ఒక ప్రాతిపదిక, విశ్వజనీన రసచేతన, ఉత్తేజిత దర్శన, శ్రవణ భావనా శక్తులూ కావాలి'. ఆంగ్లభాషలో ఇంత పెద్దకావ్యం నభూతో నభవిష్యతి. నిష్కళంకమైన ప్రేమద్వారా మృత్యువును కూడా జయించవచ్చుననే నిత్యానత్యాన్ని ఈ కథ ప్రబోధిస్తుంది, నిరూపిస్తుంది. సమస్త మానవ భవితవ్యపు ఆవిష్కరణమే సావిత్రి కావ్యంలో ప్రధానమైన కేంద్రబిందువు.

'మహాకావ్యములోని ఆశ్వాసములను చదువుతూపోయినప్పుడు అశ్వపతితో అంధకారపూరిత అధోలోకాలలోనూ, జ్యోతిర్మయమైన ఊర్ధ్వలోకాలలోనూ సంచరిస్తాము. సావిత్రివెంట మనోమయ, హృదయమయ, ఆత్మమయ అంతర్లోకాలలో సాహసయాత్ర చేస్తాము. శక్తీ, విషాదమూ, తేజస్సూ అనే త్రిపుటి మనకు తారసిల్లుతుంది... ఉత్తేజపరుస్తవి' అని డాక్టరు కె. ఆర్. శ్రీనివాస అయ్యంగార్ అన్న పలుకులు అనుభవైకవేద్యాలు. (82పే)

'శ్రీ అరవిందులు ఆధునికులలో ఆధునికులు. మనోభూమిక నుంచి అతిమానస తత్వాభిముఖంగా మానవుల సమిష్టి చైతన్యం గూఢంగా సాగిస్తున్న పురోగమనాన్ని భావించిన ద్రష్ట ఆయన. సాంఘిక రాజకీయ దౌర్జన్య శృంఖలాలతోపాటు అవిద్యా బంధనములను పటాపంచలు చేస్తూ సమస్త విశ్వమూ భగవంతుని దశకు పరిణామయాత్ర సాగిస్తున్నదని దర్శించారు. ఒక దివ్యమైన ప్రజాస్వామ్య ధర్మం మానవులకు విముక్తి ప్రసాదించటమే అరవిందులు ఆశించిన పరమలక్ష్యం. ఈ ఆశయమే సావిత్రి నోట'ఏకాంతమైన స్వాతంత్ర్యం సంతృప్తి నీయదు...అందరి స్వేచ్ఛకోసమే నాఆత్మకు స్వేచ్ఛ' అని (85 పే) పలికించారని శ్రీ కె. డి. సేత్నా మాటలతో ఈ ప్రకరణం ముగుస్తుంది.

చివరి అనుబంధాలలో అరవిందుల దివ్యమూర్తి, పాషాణి, దివ్యముహూర్తం, స్వాతంత్రదినోత్సవ సందేశం కూర్చబడినాయి. తరవాత శ్రీ అరవిందుని జీవితంలో ప్రముఖ సంఘటనలు క్రమానుగతంగా ఈయబడినాయి.

చతుర్వేదులవారి అనువాదం నిర్దుష్టంగా, సరళంగా, శిష్టవ్యవహారికంలో ప్రశాంతంగా సాగే ఒక స్రవంతిలాగ నడిచింది. అరవిందుని పద్యగద్యాలకు వారి అనువాదం ఎంతో హృద్యంగా, అనవద్యంగా ఉంది. నిజంగా ఒక భాషలో ఉన్న జిగినీ, బిగినీ, మరో భాషలో అందించడం అసిధారా వ్రతమే అయినా అమరేంద్ర సిద్ధహస్తు లనిపించుకున్నారు. 'వెల్డన్ ప్రెస్' వారు పేరు సార్థక పరచుకున్నా 'ఆ కాలానికి దిచెంవ (22 పే), పాముకరించి (25 పే), పత్రికలు వచ్చేది (41 పే), పూర్ణయోగతత్వము (51 పే) వంటి దోషాలు తప్పలేదు.

అరవిందుని గూర్చి సంక్షిప్తంగా తెలుసుకోవాలనే వారికీ పుస్తక మొక అవకాశం. అవసరం.

శ్రీ శివలెంక ప్రకాశరావు

Printed and Published for Nageswara Rao Estate (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.